*MadhumeetaSanam is a recent graduate of the Wayne State University Irvin D. Reid Honors College. Currently, she is working at the Karmanos Cancer Institute in Detroit and will be attending medical school in the near future. In her free time, Madhumeeta enjoys dancing (especially Bharatanatyam), reading historical fiction texts, and spending time with her family.*

THE LAW FIRM OF
SIM, PARVATHANENI, & BROWN, PLLC

www.spblawfirm.com



- IMMIGRATION
- BUSINESS LAW
- PERSONAL INJURY

3010 LBJ Freeway, Suite 130
Dallas, Texas 75234

1901 Central Dr. 508
Bedford, Texas 76021
(By appointment only)

email: law@spblawfirm.com

Call: 214-997 4H1B / 214-997 4412, 817-500 5553



*Bird in flight*

*Photography by Ramana Murthy*

# These are our Photographers...

## Venkata Muktesh Nandigama



*Venkat Muktesh Farmington Hills, MI. He is interested in literature, arts and photography. He loves to capture the candid moment and the true heart in everyone through his photography. Portraits, landscapes and dance photography are his specialization.*

## Annapurna



*Annapurna Vishnubhotla is a 22 year old student at Wayne State University pursuing a career in nursing. She is a student of Kuchipudi dance and Carnatic music. Annapurna is a self taught photographer who bought her camera purely out of interest and looks forward to exploring what the field of photography has to offer.*

## Sreedhar Yadlapati



*Sreedhar Yadlapati is a freelance travel photographer, very much passionate about shooting beautiful landscapes,wild life, macro and classic car images.*
*He had more than 6000 stunning pictures online up for royalty downloads.*

## Sri Atluri



శ్రీ అట్లూరి నివాసం ఫిలడెల్ఫియా. సినిమా రంగంతో బాగా పరిచయం ఉన్న శ్రీ అట్లూరికి పుస్తకాలు చదవడం హాబీ. హాబీగా మొదలైన ఫోటోగ్రఫీ దాదాపు వ్యాపకంగా మారింది.

## Sekhar Manne



*Name: Sekhar Manne is a Software Architect, lives in Plymouth MN USA. Painting, Photography, walking and hiking are his passion. He is still a novice photographer studying aspects of photography. Held and participated many art shows in india and in US. Landscapes, seasons ( Fall and Spring particularly), old Barns and sun sets are his interests in photography.*

## Suni Koneru



*Sunil Koneru is working as lead designer in automotive industry and has passion for photography and art. He is doing event photography, landscape photography and lives in commerce township with wife Sravana and two daughters Teju and Sindhu. Playing tennis, chess, and volleyball are his hobbies.*

## Ramana Murthy



*రమణమూర్తి, గత 13 సంవత్సరాలుగా ఫ్లోరిడాలో జాక్సన్ విల్‌లో భార్య అపర్ణ, పిల్లలు స్ఫూర్తి, ఆద్యాతో నివాసం, ముద్రా స్టూడియో పేరుతో ఫోటోలూ తియ్యడం, ఊళ్ళో వున్న ఇండిపెండెంట్ సినిమాలు తీసేవాళ్ళూ, స్టూడెంట్స్‌తో వాళ్ళ ప్రోజక్ట్‌లకి స్వచ్ఛందంగా చేతనైనంత సహాయం చేస్తుంటారు.*

## Vamsi Mohan Maganti



మాగంటి వంశీమోహన్ ఔత్సాహిక ఛాయాగ్రాహకుడు. నేషనల్ జియోగ్రాఫిక్కు డెయిలీ డజను శీర్షికలో తన చిత్రం ఒకటి ఉందని చెప్పుకునే అల్పసంతోషి. అప్పుడప్పుడు తీరిక చిక్కించుకుని చిత్రకళలో ప్రవేశించి పెయింటింగులు అవీ వేస్తూ ఉంటారు.

## Imam Nethrapalli



*Imam Nethrapalli, hails from Ananthapuram, grew up in Hyderabad, is a Life Scientist living in New Jersey. His interests include photography, traveling, nature, wildlife, Indian heritage.*

## Rytham KM



*Rytham KM lives in the Bay Area and she has been freelance photographer for the last 5 years, specializing in portrait photography. She went to school to study microbiology and have used photography as a way of not just self expression but supporting herself throughout undergrad and grad school.*



*Detroit-Canada Sunset*

***Photography by Vekata Muktesh Nandigama***



*Photography by Shekhar Manne*



*Photography by Sreedhar Yedlapati*



**Photography by Sunil Koneru**

**Night Time Lakeside**



*Photography by Sri Atluri*



Two States - One Language

*Photography by Imam Nethrapalli*



*Photography by Vamsi Maganti*



*Photography by Rhythm KM*




*Photography by Shekhar Manne*


IMM LAWS
immigration law services
Immigration MATTERS for you
That's All we do!
PASSPORT
PASSEPORT
... H1B, Green Card, and other Employment Based Cases
Immigration Law Services
3910 Telegraph Road, Suite 205
Bloomfield Hills, MI 48302-1420
248-562-7734
Email: info@immlaws.com

# Congratulations Tana 2015
## From Injeti Family




**Proud Owners of the THE UPS STORE**
**in Farmington Hills, MI, USA**

**Printing :Shipping : Notary**

**Low Prices Guaranteed!**
**Call us @ 248-477-6112 for quote.**
**http://www.upsstoreprint.com/0093**


We Proudly support TANA
&
DETROIT Telugu families
KURRYS
Indian Cuisine
AND
SWAGATH
INDIAN GROCERIES
24351 HALSTED RD, FARMINGTON HILLS, MI 48335

# ప్రవాస మనోగతం



*Photography by Venkata Muktesh Nandigama*


LAW OFFICES
OF AMARNATH GOWDA
YOUR IMMIGRATION IS OUR PRIORITY
We Expertly Handle Immigration Matters for:
• FAMILY • EMPLOYMENT • HOSPITAL / HEALTH CARE PROFESSIONALS
ELLIS ISLAND
ELLIS
www.gowda.com
• H-1B Visa • J-1 Visa • O-1 & P-3 Visa
• PERM Labor Certification • B-1 & B-2
& other legal matters
Tel: (248) 932-0630
amarnath@gowda.com
32871, Middlebelt Road, Suite 100
Farmington Hills, MI 48334, USA



కథ

# సర్‌ప్రైజు సంతోషం

రాధిక నోరి

రాత్రంతా నిద్ర పట్టలేదు పరాగ్‌కి. ఆరోజు సాయంత్రం జరిగిన 'సర్‌ప్రైజ్ పార్టీ'లోని విశేషాలన్నీ మాటిమాటికీ గుర్తొచ్చి నిద్ర దూరం అయింది అతనికి. వాళ్ల స్నేహితులొకరి అబ్బాయి హైస్కూల్ గ్రాడ్యుయేషన్ పార్టీ అది. కానీ ఆ పార్టీ హైలైట్ అంతా వాళ్లు తమ కొడుక్కి ఇచ్చిన సర్‌ప్రైజ్ గిఫ్ట్‌లో ఉంది. హైస్కూల్ అయిన తర్వాత ఆ అబ్బాయి డైరెక్టుగా 7 ఇయర్ మెడికల్ పిజిఎమ్‌లో అడ్మిషన్ వచ్చింది. ఆ సంతోషంలో వాళ్ల అబ్బాయి కోసం ఒక మంచి కారు గ్రాడ్యుయేషన్ గిఫ్ట్‌గా ఇచ్చారు. ఆ విషయం ఆ అబ్బాయికి తెలీదు. అది ఒక సర్‌ప్రైజ్ అతనికి. దాన్ని చూడగానే ఆ అబ్బాయిలో కలిగిన ఆశ్చర్యం, సంతోషం, ఆ కళ్లల్లో మెరిసిన మెరుపులు, వెలుగులు పరాగ్‌కి ఎంత ప్రయత్నించినా మరుపుకి రావటంలేదు. అసలు సర్‌ప్రైజ్ లాగా ఇవ్వటం వల్లనే ఆ గిఫ్ట్‌కి వాల్యూ ఎక్కువైందని, ఆ ఆనందం పదింతలుగా పెరిగిందని పరాగ్‌కి అర్థం అయిపోయింది. అసలు కిటుకంతా గిఫ్ట్‌లో కంటే అదిచ్చిన సర్‌ప్రైజ్‌లోనే ఉందని పదేపదే అనుకున్నాడు అతను మనసులో. కలత నిద్రలో మెళుకువ వచ్చినప్పుడల్లా పక్కన తిరిగి చూస్తే సరాగ ప్రశాంతంగా నిద్రపోతూ కనిపించింది. ఏమైనా

సరే, తను కూడా ఏదన్నా చేసి సరాగని సర్‌ప్రైజ్ చేయాలి. తనివ్వ బోయే గిఫ్ట్ కంటే కూడా ఆ సర్‌ప్రైజ్ వల్లనే సరాగకి ఎక్కువ ఆనందం కలగాలి. ఆ ఆనందంలో తను తలమునకలవ్వాలి. సరాగ ఆనందమే తన ఆనందం. ఇలా ఆలోచించిన తర్వాత మనసు లోని అలజడి తగ్గి కాస్త కునుకు పట్టింది పరాగ్‌కి.

మరుసటి ఉదయం లేచినప్పటి నుండి ఆలోచిస్తున్నాడు పరాగ్ సరాగకి ఏం సర్‌ప్రైజ్ ఇవ్వాలి, ఎలా ఇవ్వాలి అని. ఏవేవో ఆలోచనలు వస్తున్నాయి, పోతున్నాయి. కానీ ఒక్కటీ నచ్చడం లేదు. అబ్బే, అదికాదు, అది సరాగని సర్‌ప్రైజు చెయ్యదు, అబ్బే ఇది కాదు, సరాగ అతి తేలికగా దీన్ని వూహించేస్తుంది, ఇది పనికిరాదు అని అనుకొంటున్నాడు ఏ ఆలోచన వచ్చినా. రెండు రోజులు ఎడతెరిపి లేకుండా ఆలోచించిన తర్వాత చివరికి ఒక నిర్ణయానికి వచ్చాడు.

పరాగ్ ఆరోజు ఆఫీసు నుండి ఎంతో ఉత్సాహంగా ఇంటికి వచ్చేసరికి సరాగ వంటపని పూర్తి చేసుకుని సోఫాలో కూర్చుని ఏదో పుస్తకం చదువుకుంటోంది. చేతిలో వున్న పాకెట్టు అక్కడ పెట్టి అతను బట్టలు మార్చుకుని వచ్చేసరికి సరాగ వేడి వేడి కాఫీ రెడీ చేసింది.

''సరూ, నీకోసం ఏం తెచ్చానో తెలుసా?'' సరాగకి ఎంతో ఇష్టమైన రంగులో తను కొన్న చీరని చూడగానే ఆమె ముఖంలో కనిపించబోయే ఆశ్చర్యం, సంతోషాన్ని ఊహించుకుంటూ ఎంతో హుషారుగా అడిగాడు పరాగ్. సర్‌ప్రైజుకి మొదటి మెట్టు అదివ్వ బోయే ముందు ఎదుటివారిని బాగా వూరించటమే అని పరాగ్‌కి తెలిసిపోయింది.

''తెలుసు, సిల్క్ పాలెస్‌లోంచి ఒక మంచి చీర తీసు కొచ్చారు. అవునా?'' అంది సరాగ.

''నీకు... నీకు... నీకెలా తెలుసు?'' అప్పుడు ఆశ్చర్యపో వటం పరాగ్ వంతయింది.

''ఎలా తెలుసేమిటండీ? ఇక్కడ పెట్టిన పాకెట్టు మీద లేబిల్ అత పెద్దగా, స్పష్టంగా కనిపిస్తుంటేనూ!'' పాకెట్టు విప్పి చీరను బైటికి తీస్తూ అంది సరాగ. ''చీర చాలా బాగుంది. నాకిష్ట మైన రంగులో చీర కొన్నందుకు చాలా చాలా థేంక్స్. కానీ ఇదే రంగులో నాకు ఆల్రెడీ చీర ఉందిగా! అయినా హఠాత్తుగా నాకు చీర కొనాలనే కోరిక మీకెందుకు కలిగిందబ్బా!'' సరాగ ప్రశ్నల వర్షం కురిపిస్తోంది. తను ఇవ్వదల్చుకున్న సర్‌ప్రైజ్ ఇలా ఫెయిల్ అవటంతో పరాగ్‌కి చాలా ఆశాభంగం అనిపించింది. అతనేమీ సమాధానం చెప్పలేదు. కొంచెం జాగ్రత్తగా ఉండాల్సింది. పొరపా టయిపోయింది అనుకుంటూ మనసు చిన్న బుచ్చుకుని మౌనం గా అక్కడి నుండి వెళ్ళిపోయాడు.

కానీ మొదటి ప్రయత్నం ఏదో ఇలా విఫలమయిందని సరాగకి సర్‌ప్రైజ్ ఇవ్వాలన్న కోరిక మాత్రం అతను మర్చిపోలేదు. రెండు రోజుల తర్వాత వీకెండు మొదలైంది. ఎప్పటిలాగా శని వారం కొంచెం ఆలస్యంగా నిద్రలేచింది సరాగ.

''సరూ, మై డార్లింగ్, సుప్రభాతం డియర్. నీకోసం వేడి వేడిగా ఏం ఎదురుచూస్తోందో ఒక్కసారి చూడు,'' సరాగని ఊరిస్తూ మంచం మీద కూర్చుంటూ అన్నాడు పరాగ్.

''చూడక్కరలేదు, చూడకుండానే చెప్పేస్తాను. ఉప్మా. నాకంటే ముందు లేచి బ్రేక్‌ఫాస్ట్‌కి ఉప్మా చేశారు. అవునా?'' అంది సరాగ ఇంకా కళ్ళు మూసుకునే.

పరాగ్ ఒక్కసారి షాకు తిన్నట్లు అయ్యాడు. ''అవును... కానీ నీకెలా తెలుసు?'' ఉత్సాహం పూర్తిగా చప్పబడగా అడిగాడు పరాగ్.



"అదేం ప్రశ్నండీ? నా ముక్కేమన్నా పనిచేయటం లేదను కుంటున్నారా? ఉల్లిపాయలు, కరివేపాకు వాసనలు అంత ఘాటుగా వస్తుంటే. ఇంత పొద్దున్నే ఉల్లిపాయలు, కరివేపాకు లతో చేసే వంటకం ఉప్మా కాక ఇంకేం వుంటుంది?" లేస్తూ అంది సరాగ. "అయినా మీకు చేతకాని వంట నేర్చుకుని మరీ ఉప్మా చేయాలని సడెన్‌గా ఎందుకనిపించింది మీకు?" సరాగ ప్రశ్నకి సమాధానం చెప్పే మూడ్‌లో లేడు పరాగ్. "ఏమైనా మీ ఉప్మాకు చాలా చాలా థేంక్స్. ఒక్క పది నిమిషాలు టైము ఇవ్వండి. లాగిస్తాను," బాత్రూంలోకి వెళ్తూ అంటోంది సరాగ. పరాగ్ చెవుల్లో ఆ మాటలేవీ పడటంలేదు. యూట్యూబ్‌లో ఉప్మా ఎలా చేయాలో చూసి నేర్చుకుని, జీడిపప్పులతో సహా అన్నీ సిద్ధం చేసుకుని, సరాగకి ఏమాత్రం తెలియకూడదని వీకెండ్ అయినా చూడకుండా ముందుగా లేచి తను పడ్డ శ్రమ అంతా అతనికి గుర్తొస్తోంది. కానీ ఇప్పుడు ఆ శ్రమంతా వృధా అయిపో యింది. అయినాసరే, ఇలాంటి ఆటంకాలకు తను ఏమాత్రం నిరుత్సాహపడకూడదు. ఇలాంటి చిన్నచిన్న అడ్డంకులు తన గట్టి నిర్ణయాన్ని ఏమాత్రం మార్చలేవు. ఏదన్నా మంచి పని చెయ్యా లంటే సవాలక్ష అడ్డంకులు రావటం సహజమే కదా అనుకున్నాడు పరాగ్ రెట్టింపు పట్టుదలగా. అందుకే నెక్స్ట్ సర్‌ప్రైజ్ ఎలా ప్లాను చెయ్యాలా అని ఆలోచించటం మాత్రం అతను మానలేదు. మళ్లీ అతని మెదడులో మంథన మొదలయింది.

రెండు మూడురోజుల తర్వాత ఒకరాత్రి భోజనం అయిన తర్వాత సరాగ మెల్లిగా పరాగ్ పక్కకి చేరింది. "ఏమండీ, సీక్రెట్ గా నాకోసం కొన్న విక్టోరియా సీక్రెట్ ఎక్కడ దాచారు? ఇంకా ఇవ్వరేం?" అని అడిగింది ముద్దుగా. పక్కనే బాంబు పడ్డట్టుగా ఒక్కసారి ఉలిక్కిపడ్డాడు పరాగ్. "విక్టోరియా సీక్రెటా? నీకెలా తెలుసు?" అని అడిగాడు అయోమయంగా. రాత్రి పడుకో బోయే ముందు పక్కమీద ఎంతో రొమాంటిక్‌గా ఇద్దామనుకున్నాడు సరాగకి ఎంతో ఇష్టమైన పెర్ఫ్యూమ్. పాకెట్టు ఏదీ కనిపించ కుండా, పెర్ఫ్యూమ్ వాసనలేవీ లీక్ కాకుండా, తను ఇదివరకు చేసిన తప్పులేవీ మళ్లీ చేయకుండా చాలా జాగ్రత్తపడ్డాడు. మరి అయినా ఈ విషయం సరాగకి ఎలా తెలిసింది? ఎంత ఆలోచించి తల బద్దలు కొట్టుకున్నా పరాగ్‌కి ఏమీ అంతుబట్టటం లేదు. ప్రశ్నార్థకంగా ఆమెవైపు చూస్తూ వుండటం తప్ప ఏదీ అడగటానికి కూడా అతని నోరు పెగలటం లేదు.

"బిల్లు కడదామని స్టేట్‌మెంట్ కోసం అమెరికన్ ఎక్స్‌ప్రెస్ వెబ్‌సైట్‌కి వెళ్తే ఈ విక్టోరియా సీక్రెట్ ఎక్స్‌పెన్స్ కనిపించింది," అంది సరాగ మెల్లిగా. "అయినా ఏమయిందండీ మీకు, ఈ మధ్య ఒకటే గిఫ్ట్‌ల మీద గిఫ్ట్‌లు ఇచ్చేస్తున్నారు నాకు? ఏమన్నా కాకా పడుతున్నారా? ఏం కావాలి మీకు? ఏమిటి కథ?" కళ్లెగరేస్తూ దబాయించింది సరాగ. పరాగ్ ఏమనలేకపోయాడు. అతని మెదడు మొద్దుబారి ఆలోచించే శక్తి కోల్పోయినట్లుగా అనిపి స్తోంది. హెల్ప్‌లెస్‌గా చూశాడు సరాగ వైపు. సరాగకి సర్ ప్రైజ్ ఇద్దామని తను చేస్తున్న ప్రయత్నాలన్నీ ఏదో ఒక కారణం వలన ఫెయిల్ అయిపోతున్నాయి, అదేం ఖర్మమో! అన్నీ ముందే తెలిసి పోతున్నాయి సరాగకి. దీనికి కారణం సరాగ తెలివితేటలా? తన తెలివితక్కువతనమా? లేక పరిస్థితులా? ఏమైనాసరే, ఈ ప్రయత్నాన్ని మాత్రం తనిలా మధ్యలో వదిలేయడు. ఎలాగైనా సరే, తన ప్రయత్నంలో విజయం సాధిస్తాడు. సరాగ ముఖంలో ఆశ్చర్యాన్నీ, ఆనందాన్నీ చూస్తే తప్ప తన కోరిక తీరదు. తన మనసు నిండదు. దానికోసం తను ఏ పనైనా సరే, చెయ్యటానికి సిద్ధంగా వున్నాడు.

ఆలోచనలలో మునిగిపోయిన పరాగ్ సరాగ కుదుపు తుంటే ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చాడు. "ఏదండీ నా విక్టో రియా సీక్రెట్? ఇంకా ఎప్పుడిస్తారు? ఏమిటి ఆలోచిస్తున్నారు?" అంటోంది సరాగ. ఇంక చేసేదేమీ లేక మౌనంగా లేచి ఆ పాకెట్టు తీసి ఇచ్చాడు సరాగకి. ఈ సర్‌ప్రైజు సంగతి ఏమీ తెలియని సరాగ సంబరంగా అందుకుంది ఆ పాకెట్టుని. పరాగ్ ఆలోచించటం మొదలెట్టాడు. ఈ సర్‌ప్రైజ్‌ల ప్రోగ్రాం ఇంట్లో పెడితే సరాగ వూహించేస్తోంది. ఆమె కళ్లు కప్పటం, ఆమె వూహల్ని ఆపటం తన వల్లకావటం లేదు. అందుకని ఈసారి తను బయట ఏదో ఒకటి ప్లాను చేస్తాడు. ఆ సంగతి వూహించటానికి ఏమాత్రం అవకాశం ఇవ్వడు సరాగకి. ఇలా ఒక నిర్ణయానికి వచ్చిన తర్వాత ఇంక మనశ్శాంతిగా నిద్ర పోయాడు పరాగ్.

ఇంకో వారంరోజుల తర్వాత తన పథకం ప్రకారం లాంగ్ డ్రైవ్‌కి వెళదామంటూ ఒకరోజు సరాగని బయటకు తీసుకు వెళ్లటానికి ప్లాన్ వేశాడు పరాగ్. అతని అసలు ప్లాన్ ఏమిటంటే వాళ్ల ఊరికి 30 మైళ్ల దూరంలో లవర్స్ కార్నర్ అని ఒక మంచి రిసార్ట్ ఉంది. మంచి పార్కులు, బోట్ రైడ్స్ కోసం ఒక పెద్ద పాండ్, ఓవర్‌నైట్ స్టే కోసం మంచి హోటల్ సదుపాయాలు, మంచి రెస్టారెంట్‌లు అన్నీ వున్నాయి అక్కడ. అక్కడికి తీసుకు వెళితే సరాగ తప్పకుండా సర్‌ప్రైజ్ అవుతుంది. అప్పుడు ఆమె కళ్లల్లో మెరుపులు, ముఖంలో వెలుగులు, మనసులో ఆనందం ఇవన్నీ చూసి ఉక్కిరిబిక్కిరి అయిపోతాడు తను. క్షణక్షణానికీ అతనిలో ఉత్సాహం ఉరకలు వేస్తోంది. ఇలా ఆలోచనలలో మునిగిపోయిన పరాగ్, "ఇంకా ఎంత దూరమండీ? మరీ ఇంత లాంగ్‌డ్రైవా? ఇంతకీ అసలు ఎక్కడికి వెళ్తున్నాం మనం?" అంటున్న సరాగ ప్రశ్నలతో ఈలోకంలోకి వచ్చిపడ్డాడు.

"ఇదిగో వచ్చేశాం. చూడు నిన్ను ఎక్కడికి తీసుకు వచ్చానో," అంటూ కారు పార్క్ చేశాడు. సరాగ రియాక్షన్ చూడాలని ఆతు రతతో కారు దిగిన పరాగ్, "హ్యాపీ యానివర్సరీ," అంటూ చుట్టు ముట్టిన స్నేహబృందాన్ని చూసి ఒక్కసారి ఖంగుతిన్నాడు. అతని మెదడుకి షాకు తగిలినట్లయి అసలు ఏం జరుగుతోందో అర్థం కావటంలేదు. అనుకోని ఈ పెద్ద సర్‌ప్రైజ్‌లో పూర్తిగా మునిగి

పోయిన పరాగ్, "కంగ్రాట్యులేషన్స్ గురూ," "మెనీ హ్యాపీ రిటర్న్స్ ఆఫ్ ద హ్యాపీ డే," అంటూ విష్ చేస్తున్న స్నేహితుల గొడవకి మళ్లీ ఈలోకంలోకి వచ్చాడు. "థాంక్ యూ, థాంక్ యూ," అంటున్నాడే కాని అసలు ఇదంతా ఎలా సంభవమైందో తల బద్దలు కొట్టుకున్నా అతని ఊహకి అందటంలేదు.

సరాగ నవ్వుతూ ముందుకు వచ్చింది. "థాంక్ యూ, థాంక్ యూ ఎవ్రీవన్. నా ఇన్విటేషన్ మన్నించి ఇంత దూరం డ్రైవ్ చేసుకుని వచ్చి మా ఆనందంలో పాలు పంచుకున్నందుకు, ముఖ్యంగా మా ఆయనకోసం నేను ప్లాన్ చేసిన ఈ సర్ ప్రైజ్‌ని ఇంత బాగా సక్సెస్ చేసిన మీ అందరికీ నా హృదయపూర్వక ధన్య వాదాలు," అంది నవ్వుతూ అందరినీ ఉద్దేశించి.

పరాగ్ ప్రశ్నార్థకంగా చూశాడు సరాగ వైపు. "మై డియర్ స్వీట్ హజ్బెండ్, అంత ఆశ్చర్యంగా నావైపు చూడకండి. ఈ లవర్స్ కార్నర్ వివరాలు మీరు స్నేహితులకి ఫోన్ చేసి కనుక్కోవటం నేను విన్నాను. మనం బయలుదేరే ముందు జిపిఎస్‌లో మీరు ఇక్కడి అడ్రెసు నేను చూడకుండా రహస్యంగా ఎంటర్ చేయటం కూడా నేను గమనించాను. కానీ మనం ఇక్కడకు వస్తున్నట్లు నాకు తెలుసు అన్న సంగతి మీకు తెలీదు. మన వెడ్డింగ్ యాని వర్సరీ సంగతి కూడా మీకు గుర్తులేదు అన్న సంగతి కూడా నాకు తెలిసిపోయింది. అందుకే నేనే ఇనీషియేటివ్ తీసుకుని ఈ సర్‌ప్రైజ్ ప్లాను చేశాను. మీరెటూ నన్ను ఇక్కడికి తీసుకువద్దా మనుకున్నారు. హఠాత్తుగా మీకు ఆ ఆలోచన ఎందుకు వచ్చిందో నాకు తెలీదు. కానీ నేను మాత్రం ఆ ట్రిప్‌కి ఒక అకేషన్‌ని, ఇంకో సర్‌ప్రైజ్‌ని జోడించి మన స్నేహితులందరినీ కూడా పిలిచి ఒక సర్‌ప్రైజ్ పార్టీలాగా అరేంజ్ చేశాను. సంతోషం ఎంత పంచు కుంటే అంత పెరుగుతుంది కదా! అదీగాక ఇది సెలబ్రేట్ చేయాల్సిన అకేషన్ కూడాను," అంటూ విపులంగా వివరించింది సరాగ.

పరాగ్ ఒక్కక్షణం దిగ్భ్రమ చెందాడు. ఏమనాలో తెలీక తికమకపడ్డాడు. తను సరాగని సర్‌ప్రైజ్ చేసి ఆమె ఆనందన్నీ, ఆశ్చర్యాన్ని అనుభవించాలనుకున్నాడు. కానీ తెలివైన సరాగ తనివ్వబోయే సర్‌ప్రైజ్‌లన్నిటినీ ముందుగానే వూహించేసి తన ప్లాన్‌లను తలక్రిందులు చేసింది. కానీ తను ఇవ్వదల్చుకున్న సర్‌ప్రైజ్‌ను తనకు తెలీకుండానే తనకే ఇచ్చేసి ఇంకోరకమైన ఆనందాన్ని తను అనుభవించేలా చేసింది సరాగ. పోనీలే, తను ఇవ్వదల్చుకున్న సర్‌ప్రైజ్ తను తీసుకుంటున్నాడు ఇప్పుడు. ఏదైతేనేం? సర్‌ప్రైజ్ కలిగించే సంతోషం ఇచ్చినా, పుచ్చుకున్నా కూడా ఆనందదాయకమే కదా! అనుకున్నాడు మనసులో. అతని మనసు ఇంకా ఉక్కిరిబిక్కిరిలోంచి తేరుకోలేదు. అయినా తను ఈ సర్‌ప్రైజ్ ఆలోచనలలో పడి తమ యాన్నివరీ సంగతి మర్చి పోయిన సంగతి నిజమే! లక్కీగా సరాగ గుర్తుపెట్టుకుంది. అయినా సరాగ ఎంత మంచిదో! తనమీద ఏ మాత్రం కోపంలేదు, తాపం లేదు. నిందలు, నిష్ఠూరాలు లేవు. మూతిముడుపులు, సాధింపులు లేవు. ఇద్దరిలో ఒకరు మర్చిపోతే మాత్రమేం, వేరొ కరికి గుర్తుంటే చాలు కదా అన్న మంచి సూత్రాన్ని పాటించింది. ఇంతమంది స్నేహితులతో పెద్ద పార్టీ అరేంజ్ చేసి తనకి మంచి సర్‌ప్రైజ్‌ని అందించింది. తన ఆనందాన్ని వేయింతలు చేసింది. ఇంకొకరైతే యాన్నివర్సరీని మర్చిపోయినందుకు ఎంత గొడవ చేసేవారో. నిజంగా తన అదృష్టం కొద్దీ తనకి ఇంత మంచి భార్య దొరికింది అనుకుని సంతోష పడిపోయాడు పరాగ్.

"సరూ, ఆలోచనలలోనూ, ఆచరణలలోనూ కూడా నువ్వెప్పుడూ నాకంటే ఒకడుగు ముందుగానే ఉంటావు," అన్నాడు మనస్ఫూర్తిగా, గర్వంగా.

సరాగ కూడా నవ్వేసింది. "హ్యాపీ యానివర్సరీ డియర్," అంది మెల్లిగా, మెత్తగా పరాగ్ దగ్గరికి జరుగుతూ. పరాగ్ ప్రేమగా సరాగని దగ్గరకు తీసుకోబోయాడు.

ఇంతలో, "సర్‌ప్రైజ్ అయ్యావా గురూ? ఎలా ఉంది ఈ సర్‌ప్రైజ్? నీకు నచ్చిందా?" అంటూ ప్రశ్నల వర్షం కురిపించటం మొదలెట్టారు స్నేహబృందం అంతా.

"బ్రహ్మాండంగా ఉంది ఈ ప్లెజెంట్ సర్‌ప్రైజ్. నచ్చిందా, సర్‌ప్రైజ్ అయ్యావా అని విడిగా నన్నడగాలా? నా ముఖం చూస్తే తెలియటంలేదూ? దిమ్మ తిరిగిపోతేనూ," అంటున్నాడు పరాగ్ నవ్వుతూ.

అందరూ నవ్వుకుంటూ బోట్ రైడ్ కోసం పాండ్ వైపు నడిచారు. వారందరి నవ్వులతో ఆ ప్రదేశం అంతా ప్రతిధ్వనించింది. ✻



రాధికా నోరి వృత్తి కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయినా ప్రవృత్తి రచనలు చేయడం, పాటలు పాడడం. ఎన్నో కథలు రాశారు. కొన్ని కథలకు అవార్డులు కూడా లభించాయి. మంచి గాయనిగా ఇంటా బయటా గొప్ప పేరు తెచ్చుకున్నారు. పాటలు పోటీలకు జడ్జిగా ఉన్నారు. ప్రస్తుతం ఫ్లోరిడా రాజధాని టల్లహాసిలో రవాణా శాఖలో కంప్యూటర్ విభాగంలో పనిచేస్తున్నారు.

# మాయమైన పేజీ

## పాలపర్తి ఇంద్రాణి

మారిపోయిన
నీ మొహం చూసి
కొంత కళవళ పడ్డాక
గుమ్మం దాటి
లోపలికొస్తాను.

ఇంతలో
నీ ధర్మపత్ని
ఇందుమూలంగా
తన సర్వహక్కులూ
ప్రకటిస్తూ
యజమానురాలి పాత్ర
పోషించడానికి
సిద్ధం అవుతుంది.

నీ ఇంటి వైభవాన్నీ
దాని గోడల మీద
పటం కట్టిన
నీ జీవిత శకలాలనీ
చూస్తూ
ఆడ అతిథుల్లో
కలిసిపోతాను.

కాలం నేర్పిన
లౌక్యం మాటలు
నీ డాలరు లెక్కల
గొప్పల చప్పుళ్ళు
వింటూ
అబ్బో
అనుకుంటూ

ఖాళీ టీ కప్పు
పక్కన పెడతాను

చీకట్లు ముసిరి
ఆతిధ్యం ముగిసి
వీడ్కోలు తీసుకుని
ఇక వాహనాన్ని
నా సంసారనౌక వైపుకి
దౌడు తీయించాలని
బయలుదేరబోతాను
గానీ
అప్పుడెప్పుడో
ఆ దేశంలో
గతజన్మలాంటి
ఆరోజుల్లో



మెరిసిన జంట కళ్ళు
సమోసాల్లా కరకరలాడిన
కాంటిన్ కబుర్లు
కలిసి
చదువుకున్న
పాఠాలు
కంగారుపెట్టిన
పరీక్షలు
ప్రమాదవశాత్తూ
రాసుకున్న భుజాలు
ఇచ్చి పుచ్చుకున్న
గ్రీటింగ్ కార్డులు
ఇంకా
అలాంటివే
ఏవేవో
కలుపుకుని
ఆలంబన లేని
ఊహలేవో అల్లుకున్న
ఆ పల్లెటూరి కన్నెపిల్ల

అప్పటి నీ రూపాన్ని
కౌగిలించుకుని
రోదిస్తూ

కారెక్కమని
ఎంతకసిరినా
అక్కణ్ణించి
కదిలిరాదు.



అమెరికాలో ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్‌లో మాస్టర్స్ డిగ్రీ చేసిన పాలపర్తి ఇంద్రాణి 'వానకు తడిసిన పువ్వొకటి', 'అడవి దారిలో గాలిపాట' కవితా సంకలనాలు, 'అ' నవల ప్రచురించారు. ప్రస్తుత నివాసం మారిస్‌విల్లే, నార్త్ కరోలినా.

# కుటుంబం

## రవి వీరెల్లి



మట్టిచీరను మోకాళ్ళ వరకు మలిచి
మెత్తటి తన కాళ్ళపై
సముద్రాన్ని బోర్లా పడుకోబెట్టుకుని
నలుగు పెడుతుంది
భూమి.

కుదురుగా ఉండనే ఉండదు
అల్లరి సముద్రం.

పొంగినా పొర్లినా
ఆఖరికి హద్దుమీరినా
అన్నీ మరిచి హత్తుకునే తీరం
మా అమ్మ వొడి.

భూదేవి నా తల్లి.
సముద్రం నా తోబుట్టువు.

ఓ క్షణం ఉరిమి
మెరుపు బరిగెతో అరిచేతిపై ఒక్కటిచ్చి
వెంటనే వర్షంలా దిగొచ్చి
వొళ్ళంతా ప్రేమగా తడిమే ఆకాశం
మా నాన్న.

ఏ దిక్కూ లేని
నాలుగు దిక్కులు
నా నేస్తాలు.



రవి వీరెల్లి పుట్టింది కరీంనగర్ జిల్లాలోని ఆముదాలపల్లి గ్రామం. 2012లో 'దూప' కవితాసంకలనాన్ని ప్రచురించారు. వాకిలి అంతర్జాల పత్రిక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం వర్జీనియాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పనిచేస్తున్నారు.

# వసంతం

## మమత

శిశిర పక్షుల వీడ్కోలు పాట వింటూ
గుబురు చెట్ల కింద గుంటలో
పండుటాకులను వెచ్చగా పరుస్తోంది
బరువెక్కిన పొట్టతో నిట్టూరుస్తూ
తల్లి జింక ఒకటి

గూడు కట్టుకోడానికి తననొక రాబిన్ ఎంచుకుందని
పుక్కిలింతలవుతున్న ఆనందాన్ని అదిమిపట్టి
అటుపక్కగా వెళ్లిన నల్లపిల్లిని
గంభీరంగా చూస్తోంది ఫర్ చెట్టు
ఆ నారింజ బొజ్జ పిట్టను
పచ్చని తన నిండు కొమ్మల్లో దాచేస్తూ
సందడి సందడిగా

చెట్టూ చేమా కొత్త ప్రాణం పోసుకుంటున్న వేళ
వెళ్లిపోబోతున్నదల్లా హఠాత్తుగా ఆగి
చివరొక్కసారి ఆడుకోవాలనో
లేక వసంతబాలను
తానూ ఆర్భాటంగా స్వాగతించాలనో
లోకమంతా మంచుపూలను దట్టంగా పరిచేసింది
హిమబాల

చుక్కలు లేని ఆనాటి రాత్రి
అమ్మ ఎద మీద తలవాల్చి
తియ్యని కలలు కంటున్న చిట్టితల్లి
చిరునవ్వు పై ప్రతిఫలిస్తోంది
కొండాకోనల్ని కప్పేసిన
స్వచ్ఛమైన తెల్లని తెలుపు

ఆ ప్రశాంత ఉద్విగ్న నిశ్శబ్దంలో
నిదుర రాని అమ్మ మీద
సువాసనల్ని మత్తుగా చల్లింది
పూగుచ్ఛంలో ముడుచుకొని ఉన్న
మిగతా మూడు పువ్వులనూ మెత్తగా విప్పార్చి
కిటికీలో హాయసింత్





హైదరాబాద్‌లో పుట్టి, న్యూజెర్సీలో ఉద్యోగం చేస్తున్న మమత కొడిదెల ఇటీవలే కవితా సంపుటాన్ని ప్రచురించారు. గత సంవత్సరం ఇస్మాయిల్ సాహితీ పురస్కారాన్ని అందుకున్నారు. వీరి తండ్రి హెచ్చార్కె, తల్లి జయ- ఇద్దరూ కథకులు, కవులు.

# స్వేచ్ఛాకుమారుడు

## కొత్తపకాయ

ఆ జ్ఞాపకాలింకా నవనవలాడుతూనే ఉన్నాయి. కాల యంత్రాన్ని అలవోకగా వెనుకకు తిప్పి... ఆనాటి పచ్చిదనాన్ని మనోయవనికపై నిలుపుతున్నాయి. మక్కువ తీరక దాచుకున్న మొగలిపొత్తిలా మందసంలో దాగి, దరి తెలియని దారుల నడిచి నడిచి వేసారిన వేళల... జీవనసౌందర్యాన్ని గుర్తుచేసి సాంత్వన పరుస్తూనే వున్నాయి. 'జిలుగు పవడపు మబ్బు తెరలో తళుకుమనే నెలబాలుడి,' పరిచయమెలా జరిగిందంటే... గుర్తుచేసుకోడమెంత సౌఖ్యమో, జ్ఞాపకాలను ప్రోదిచేసి అక్షరాల ననలొత్తడం ఎంత కష్టమనీ...

❖

*ఏడుగడ శ్రీరామచరణం..తోడువడ శ్రీరామచరణం...*
*మాకుచాలును ముక్తిసౌధ ప్రాంగణం... శ్రీరామచరణం...*
*మేలుకో శ్రీకృష్ణ... మేలుకొనవేమీ...*
*చాలు బడిగల దేవ..మేలొసగు స్వామీ...*



రాముడూ, కృష్ణుడూ తెలిసినవారే. మరి ముద్దుముద్దుగా, జాజిమొగ్గల్లా పరిమళిస్తూ, చిరుమువ్వల్లా చెంగలించే ఈపదాలేవిటనీ! 'అలేఖ్యతనూ విలాసుడని...' పెద్దన ఆ ప్రవరుడి రూపలావణ్యాన్ని రేఖల్లో ఒదిగింప లేమన్నాడు. మరి రూపమే లేని చేతస్సును కుదిపివేసే భావకవితకు ప్రాణం పోసే శక్తి కోసం, ఓ కృష్ణశాస్త్రి ఏ అమృతధారను పుక్కిట పట్టాడో!

❖

పాటికి పోతున్న 'శబ్దార్థచంద్రిక' పరిచయమవడానికి కారణం ఈ రామ చరణమే! వేలికొనతో రాసి కనుగొన్న కొత్త అర్థాలతో, చాలుబడి గల శ్రీకృష్ణ స్వామిని కనుగొన్నాను! అక్కడితో ఆగేనా... తెలుపూ నలుపు బొమ్మల టెలివిజన్ ఇంటికొచ్చిన కొత్తలో, బిళ్ళగన్నేరు పూవుల నేపథ్యంలో... అల్లంత దూరాన కోవెలకు పోవాలని రెప్పలల్లారుస్తూ ద్వారం వారమ్మాయి, 'పూవులేరి తేవే చెలి...' అని రాగం తీస్తూంటే, ఆ సంగీతానికి వన్నెలద్దిన అక్షరాలు ఎవరివనీ! కృష్ణశాస్త్రివి! కొనలు సాగు బాల్యానికి సుకుమారములూ, సుందరములూ అయిన ఊహల నవమంజరులల్లడం మప్పినవవే! దవ్వుల వేణువు సవ్వడీ, మల్లిమనసు పాటా వినిపించినవీ అవే!

రోజులు నిమ్మళంగా నడిచిపోతే అది జీవిత మెందుకవుతుందీ... నావను కుదిపి పారేసినవెన్నో చాలవన్నట్టూ వచ్చిపడిన యవ్వనమొకటి. కొత్త ఊరికి తరలి వెళ్ళాల్సిన పరిస్థితి. కుదురుకుంటున్న రోజుల్లో... ఎప్పట్లానే కాలేజీలో తురాయిచెట్టు కింద తిన్నెపై కూర్చుని తుదీమొదలూ లేని ఆలోచనలేవో చేస్తూ పొద్దుబుచ్చనివ్వకుండా, ఆ పూట అడుగులు ఓ పక్కగా ఉన్న

నాచుగోడల గదివైపు మళ్ళాయి. తలుచుకుంటే గరి పొడుస్తుందీ నాటికీ! పెద్దగా అలికిడి లేని, అదో లాంటి వాసనొచ్చే బీరువాల గది... గ్రంథాలయమది! తోచీ తోచనట్టూ ఈ పుస్తకమే చేతికి చిక్కడమేవిటీ... మెలమెల్లన ఆ మత్తు రోజులూ, వారాల్లో నసాళాని కంటడమేవిటీ..!!

నా తరణికి ఒడ్డు 'కృష్ణపక్ష'మయ్యింది. అయోమయపు యవ్వన ఘోషని అణచిపెట్టి, ఇంతకు మించినదేదో ముందుం దనే ఆశను కలిగించి నాకు ఆప్యాయమయ్యింది. 'ఆకులో ఆకునై, పూవులో పూవునై...' అరే... ఈ పాట తెలుసే!! పచ్చ రంగు తేలిపోతూ ఒసిలిపోతున్న పుస్తకంలో అర్థమయ్యీ అవని అక్షరాలతో నన్ను కావలించుకున్న పాట. తొలిప్రొద్దు పొడుపు రేకుల పైడిదారుల ఏరులౌ మంచు కన్నీరుపాట! పావురా యుయ్యాల పక్షాల యంచుల జాలులౌ గాలినీలాల పాట!







*ఎలదేటి చిరుపాట సెలయేటి కెరటాల*
*బడిపోవు విరికన్నె వలపువోలె*
*తీయని మల్లెపూదేనె సోనలపైని*
*తూగాడు తలిరాకు దోనెవోలె...*

రాగమేవిటో తెలియాలా? గొంతువిచ్చి పాడడమే రావాలా? జాలువారే మాధుర్యాన్ని ఇంకించుకునే ఆర్తిలో నిత్యపారాయణమే చేశానో! నిద్దురలోనూ కలవరించానో!! బాల్యచేష్టలు దాటాక మల్లెలకాలం కోసం ఎదురుచూసిందీ అదే తొలిసారేమో!! ఎందుకు? ఎదలోపలి యెదలో, నెమ్మదిలో... అనంతాంబరపు నీలినీడలు కమ్ముకున్న కళ్ళలో... తరచి చూసే ప్రేమమూర్తి కోసం అన్వేషణ? దైనందిన జీవితానికి ఓ రహస్యపుటర ఉన్నట్టూ.. ఏదో ఒక సమయంలో దానిని పలకరించగానే, చేయి పట్టుకుని ప్రాయంపువాకిళుల వలపు సిగ్గుదొంతరలకు నన్ను సిద్ధపరుస్తున్నట్టుండే అక్షరాలవి. ప్రాయమూ, ప్రణయమూ, చలువ పిసాళి గాలి చక్కిలిగింతలూ మాత్రమేనా? ఉహూ... గొంతు జీరబోయినట్టు, కనుకొలకుల దాచిన భాష్పకణపు వేడిసెగలు 'నేనూ ఎరుగుదు'నన్నట్టూ... ఎడతెగని యాత్ర ఏదో సాగిస్తూంటే అద్దారినే, మునుపెన్నడో నడిచిన పాంథుడెవడో విడిచి వెళ్ళిన గురుతులేవో కనుపట్టి ఊరడించినట్టూ...

*తావకీన పదసరోజ దళములందు*
*నిలువనిమ్మొక వేడి కన్నీటిచుక్క*

*మలిన భాష్పమౌక్తికమ్ము*
*మిలమిల నీ కనుల నిలువ*
*తళతళమని తారలు నటియించునురా పాపీ!*

ఒడుదుడుకుల కారణాలేవైనా గానీ... అక్కున చేర్చు కుందీ కవిత! కృష్ణశాస్త్రి కవిత. ప్రభావితమైన పసి హృదయాన్ని కొసాకి కాపాడుకొచ్చింది. ఓ విషయం చెప్ప మరిచాను. అపచారం!! పుట్టి పెరిగిన ఊరు విడిచివెళ్ళాకే నాకు మా ఊరి గొప్పదనం తెలిసింది.

*గుత్తునా యని జాతిముత్యాల్*
*గుచ్చినాడే మేలిసరముల*
*ఇత్తునా యని తెలుఁగుఁదల్లికి*
*ఇచ్చినాడే భక్తితో*

అని మహాకవి గురజాడ గీతశీకరాలను, కృష్ణశాస్త్రి పరిచయం చేస్తే కానీ ఆ గొప్ప ఏమిటన్నదీ అర్థం కాలేదు. 'ముత్యాల సరాలు' వెతుక్కుని శ్రద్ధగా చదివినప్పుడే. అందుకే విజయనగరం నా తల్లి. కాకినాడ- నా ఉనికి, ఊతమూ అయిన ఈ అక్షరాలను దిద్దించిన గురువు.

❖

తనకు ముందు పాతిక సంవత్సరాల తెలుగు కవిత్వం గురించి దాదాపు ఏభైఏళ్ళ క్రితం చెప్తూ, "నేను... దేవులపల్లి కృష్ణశాస్త్రిని. పిఠాపురం దగ్గర కూచిమంచి తిమ్మకవి చంద్రంపాలెం మా ఊరు. పిఠాపుర సంస్థానానికి సన్నిహితుణ్ణవడం చేత, జీవితంలో భోగమూ, బద్ధకమూ ఎక్కువై కృషి తక్కువ," అని చెప్పుకున్నారు. చటుక్కున శ్రీరమణ పేరడీల్లో రైలు ప్రయాణంలో పై బెర్తుమీదెక్కి కూర్చుని రెండు టికెట్లకు దూదితో అత్తరు రాస్తున్న కృష్ణశాస్త్రి... వెండి జులపాలతో తీర్చిన ప్రశాంతమైన ముఖమొకటి, "రెండో టికెట్టు ఊర్వశికి" అన్న మాటా గుర్తొచ్చి ఫకాలున నవ్వొచ్చింది. బంగారు అడ్డల పల్లకీ పంపారట పిఠాపురం రాజావారు కృష్ణశాస్త్రి పెళ్ళికి. అలాంటి భోగి, కాకినాడలో వెంకటరత్నంనాయుడుగారి శిష్యుడై, మత సంఘ సంస్కరణోద్యమాల ప్రభావంలోనూ, హరిజనోద్యమం, కళావంతుల

వివాహోద్యమంలోనూ విస్తృతంగా పాల్గొని అదే రాజావారి ఆగ్రహం పాలై, దేవిడీ మన్నాకి గురయ్యారట కూడా.. "నా జీవితంలో తీవ్రమైన వేదనా, ఆవేశమూ కలిగించే గొప్ప అనుభవాలు కొన్ని వచ్చాయి. నా తరువాతి కవులు చాలామంది మీద నా ప్రభావం కొన్ని యేళ్ళపాటు ఉందని అంటారు. కొంతకాలం నా మీద ప్రసరించిన దూషణభూషణలు నవ్యకవుల్లో మరెవ్వరి మీదా లేదు," అని చెప్పు కున్నారాయన. 'కృష్ణపక్షాన్ని' కవిత్వమే కాదనీ, అస్పష్ట భావనలకు ఆలవాలమనీ విమర్శకులు దూషించి, 'శుక్లపక్షం' విడుదలచేస్తే, కృష్ణశాస్త్రి ప్రశాంతంగా... 'పద్యాలు రాసుకుంటూ పోవడమే దీనికి జవాబు,' అన్నారట. అదిగో... అలా పండింది మన పంట! వాడవాడలా తిరుగుతూ, గొంతెత్తి పాడుతూ, ప్రసంగిస్తూ తిరిగిన కృష్ణశాస్త్రి, ఆకాశవాణి మన ఇంటి ముంగిట చేర్చిన ఆయన కవితావాణి. ఆపై ప్రతీ మాధ్యమంలోనూ పయనించి, పిపాసి హృదయాన్ని మోహన మురళీ రవమై ఉరకలెత్తించిన ఆ రసఝరి... కేవలం మన భాగ్యవశాన దక్కిందనడం అతిశయోక్తి ఎంతమాత్రమూ కాదు.

"కృష్ణశాస్త్రిగారు పాట రాస్తున్నప్పుడు, సంగీతం ఇచ్చే విశ్వనాథంగారో, రజనిగారో పక్కనుండేవారు. పల్లవి రాస్తే దానికి ట్యూన్‌చేసి వినిపిస్తూ ఉంటే అప్పుడు మూడ్లోకి వచ్చి అనుపల్లవి రాయడం, చరణం చేసేవారు. అప్పుడు కూడా ఆ పాటలో ఒక్క మాట సరిగా పడలేదనిపించినా, చాలా చికాకు అయిపోయేవారు. అలా అయీ అయీ చివరకు సరైన మాట సాధించేవారు. అప్పుడు చిరునవ్వు ముఖంలోకి వచ్చి స్థిమితపడేవారు. ఈ తాపత్రయం వల్లనే ఏదైనా రాసేందుకు ఆయన టైమ్ తీసుకునేవారు," అని చెప్తారు శారదా శ్రీనివాసన్, తన 'రేడియో అనుభవాలూ జ్ఞాపకాల్లో.'

కురిసిన తేటతేనియలకున్ చిరుకాల్వలు వేసి
నేలపై తొరసిన పూపరాగమును దోసిట
కుప్పలు వోసి పల్లవోత్కరములతో
ప్రసూనములు తొరిచి దామములల్లి
చంద్రపుష్కరిణి జలము వానిపై జల్లి
ఇటన్గొని తెత్తు వేకువన్

అని విప్రనారాయణుని ఒప్పించి వీట చేరిన దేవదేవి అల్లిన పూలమాలల సోయగం మన అనుభవానికి తేవడం వేరెవరికి సాధ్యం!

❖

*సిరి కూడా వలచే నీ దొరతనమూ, దోర్వీర్యము*
*పరవశమున పాడిపాడి విరహమెల్ల మరతుము*
*పరవాద్యము కరుణింపుమూ...*
*పరమానంద మొసగుమూ...*

అనిగొల్లెతలు పాడిన తిరుప్పావై పాశురాలను తేట తెనుగులో అందించినది కృష్ణశాస్త్రి.

*ఏలాగు నీ మేఘవేళ ఒంటరి రేల*
*ప్రాణేశ్వరు ప్రవాసి బాసియనుచు*



*విరహాన వేగే శృంగారనాయికలనూ, వారి దిగుళ్ళనూ మనవిగా చేసినదీ కృష్ణశాస్త్రే!*

'కష్టపడి కొబ్బరిలౌజుని చేసుకుని రుచి చూడాలా!' అని పించేలా మాత్రమే రాయలేదీయన. నాగసారాన్ని, పడుచు పైటనీ, పల్లె పచ్చదనాలనూ, సంకురాతిరి వెలుగులనూ, మదురు మీద నుంచి మెడజాపి చూసే మావిచిగురునూ... దేనినీ విడిచిపెట్ట లేదీయన.  బావొచ్చే వేళకి కొండ మీంచి దివ్వెలొచ్చి మరదలి కళ్ళలో ఎలా వెలుగుతాయో, పగలైతే దొర - రేయికి రాజెలా అవుతాడో, ప్రతీ రాత్రీ వసంతరాత్రెలా అవుతుందో... అన్ని గుట్లూ తెలుసాయనకి.

పైరగాలీ పడుసుపైట పడగలేసి ఆడేను
గుండెపైని గుళ్ళపేరు ఉండలేక ఊగేను
తోపుయెనక రాసకొడక తొంగిసూసే వెందుకో..

❖

నాన్న ఒడే బడిగా పెరిగిన అదృష్టవంతుడు, కృష్ణశాస్త్రిగారి 'బుజ్జాయి' చెప్పిన కబురొకటి ప్రస్తావించాలి. ఒకచోట సభ జరుగుతోందట. పెద్దాయనొకరు ప్రసంగిస్తూ, "తెలుగువారికి 1897 చాలా గొప్ప సంవత్సరం. ఎందుచేతనంటే ఆ సంవత్సరమే గురజాడ 'కన్యాశుల్కం ' పుట్టింది," అన్నారట. జనం చప్పట్లు. సభలో కూర్చున్నవారిలో ఒకాయన లేచి, "అవును చాలా గొప్ప సంవత్సరం. నేనూ ఆ సంవత్సరమే పుట్టాను," అన్నారట. జనం మళ్ళీ చప్పట్లు, నవ్వులూను. ఆ అన్నది హాస్యబ్రహ్మ భమిడిపాటి కామేశ్వరరావుగారు. మరొకాయన లేచి, "ముమ్మాటికీ చాలా చాలా గొప్ప సంవత్సరం. నేనూ అప్పుడే పుట్టాను," అన్నారట. జనం మళ్ళీ చప్పట్లు. ఈసారి అన్నది మన కృష్ణశాస్త్రి. చాలా చాలా చాలా గొప్ప సంవత్సరం కాదా మరీ!

కృష్ణశాస్త్రి మీద ప్రేమ పుట్టినట్టే, కన్యాశుల్కం మీదా పుట్టింది. కన్యాశుల్కమంటే మధురమైనందుకూ... కృష్ణశాస్త్రి కవితంటే మాధుర్యమైనందుకూ! చాన్నాళ్ళకి నేను పుట్టి పెరిగిన నేలని చూసి వస్తూంటే, కృష్ణశాస్త్రి పుట్టిన నేల చూడాలని మనసు

పుట్టింది. తూర్పుగోదావరి జిల్లా, పిఠాపురం దగ్గరలో, కూచిమంచి తిమ్మకవి చంద్రంపాలెం దగ్గర పడుతూంటే ఓ ఉద్వేగం. సహజమే కదా!

పాఠశాలగా మారిన ఇల్లు. ఇంటి ముందు భావకవితా చక్రవర్తి, ఆంధ్రాషెల్లీ 'దేవులపల్లి కృష్ణశాస్త్రి' విగ్రహం! ఇంటి వెనుక బావీ, పక్కసందులో కిటికీ... నాపరాళ్ళు పరిచిన గది. చూసి వెను తిరిగాక ఠక్కున ఒంటి మీద స్పృహ వచ్చింది. నేను చూసినది 'కృష్ణశాస్త్రి' ఇంటిని!

*ఏ సీమల ఏమైతివో*
*ఏకాకివో నా ప్రియా...*
*ఈ సఖి నను ఎడబాసి*
*ప్రవాసివై ప్రియా ప్రియా...*

ఎన్ని పాటలు... ఎన్నెన్ని పూలపులకలు! కళ్ళలో ప్రాణమంతా నింపుకుని వేచే రాధవలపు, విరహం. చక్కగా, తేనె తెలుగులో... ఒడిసిపట్టి అందించిన కవిత!

తీయతేనియ బరువుమోయలేదీ బ్రతుకు! మోయింపకోయ్

*మురళి పాటకు రగిలి*
*మరుగు నీ వెన్నెలలు!*
*సొగయు నా ఎదకేల*
*తగని సౌఖ్యజ్వాల? మోయింపకోయ్*

సౌఖ్యజ్వాల... ఇది అనుభవంలోకి వచ్చిందంటే, ఇక పరవా లేదు. ఆ 'గగనపథ విహారవిహంగమపతి... ఆ స్వేచ్ఛా కుమారుని' కవిత్వం నరాల్లోకి ఎక్కుతున్నట్టే! జన్మకి వీడిపోయే సుగంధం కాదది!

*బ్రదుకంతా ఎదురుచూచు పట్టున రానేరావు -*
*ఎదుర రయనివేళ వచ్చి ఇట్టే మాయమౌతావు!*

ఇక్షుసాగరాన్ని ఇలా అక్షరాల్లోనూ, పేజీల్లోనూ కొలిచి వర్ణించడం సాధ్యమయ్యే పనేనా! నా దుస్సాహసం కాకపోతే...

*http://kothavakaya.blogspot.com*

కొత్తావకాయ అనే కలం పేరుతో రాస్తున్న వర్ధమాన అమెరికా తెలుగు రచయిత్రి అదే పేరుతో అయిదేళ్లుగా తెలుగు బ్లాగు నిర్వహిస్తున్నారు. *గాలి సంకెళ్లు* అనే నవల కౌముది అంతర్జాల పత్రికలో ధారావాహికంగా వెలువడింది. వృత్తిరీత్యా సాఫ్ట్‌వేర్ నిపుణులు. *తరంగ* ఆన్‌లైన్ రేడియోలో తెలుగు సాహిత్య కార్యక్రమం నిర్వహిస్తున్నారు.


*The Bharatiya Temple community salutes TANA on your 20th Conference and welcomes you to Detroit!*





The Bharatiya Temple of Metropolitan Detroit is the region's oldest and largest Hindu religious, educational and cultural institution. We are proud to welcome the North American Telugu community to the Detroit area, and invite you to visit our newly expanded temple in nearby Troy, Michigan.

For more information, please visit bharatiya-temple.org, or call 248 879 2552.

THE BHARATIYA TEMPLE
OF METROPOLITAN DETROIT

6850 N. Adams Road, Troy MI 48098
*Take I-75N to Exit 74. Turn left. Proceed 0.7 mile.*

service

# GIFT OF MY LIFE!

*Dr. Madhav Durbha*

Recently I had the great fortune of being a stem cell donor for a young adult with Leukemia. It was quite an intense and involved process, both physically and emotionally. It took nearly 5 months since Be The Match registry first contacted me, culminating in an out of the state trip from Georgia to complete the donation process. But I am glad it all went through fine and I hope the recipient will be able to continue on to a long and healthy life! I do not know my recipient's identity, other than the recipient's gender and age.

Several well-wishers asked me one of these two questions "What is your motivation for going through this intense process for a complete stranger?",or "What are the steps involved in donating?"

I tried to capture my experience and also explain the steps involved in this brief article.

**Step-1: Registering with Be The Match:** Back in 2005, I was with my daughter at MIT for some academic contests for school children. Some volunteers from Be The Match had a booth and were soliciting registrations. It was a very simple 10 minute process. They do a cheek swab and then you share your contact info to register.



**Step-2: Contact by Be The Match notifying a preliminary match and the decision to proceed:** Nothing happened for 9 years and I completely forgot about it. Then in May 2014, I was contacted by Be The Match organization, saying my name bubbled up in the preliminary search by a recipient's doctor and if I can undergo further tests to see if I am a close match. My answer was an affirmative "Yes." Be The Match (which has been great all through the process) said that this will require considerable time commitment and asked me to first discuss with my family. Incidentally, they contacted me on the same day my father who was living with us was diagnosed with lung cancer (he passed away on September 1st). My wife Aparna started her own private Pediatric practice less than a month before the date of contact and was needing good amount of support from me during the startup phase. I am a very busy professional myself and my job requires extensive travel. Aparna and I debated over the next 24 hours from the phone call if it was even feasible for us to commit to this. We did some research on what was involved (A good resource http://bethematch.org/Transplant-Basics).

After understanding that this is very involved, Aparna asked me if I was concerned about any risks, as this was all very new and unfamiliar to us. My philosophy is that the element of risk is highly overrated in life. Knowingly or unknowingly we subject ourselves to risks in everything we do. Even when we get in our car every morning, there is risk involved. So why should I

be overly concerned about this? I shared this thinking with her. Then we talked about how we will handle my dad's treatment, my mother's health (she has Parkinson's Disease and has limited mobility), my work travel, Aparna's new practice, etc. We figured we cannot plan everything in life. We had the faith that, as we are helping another human, the good karma will get us through this phase. At this stage,we made a firm decision to move ahead with the process.

**Step-3: Lab tests to narrow down the match:** At this stage, I was only a preliminary match as recommended by the database. To establish close match, I needed to go through further lab tests that would determine if there is a Human Leukocyte Antigen (HLA) match between me and the recipient. Once I finished my lab visit, there was an 8-week wait period (which I heard was typical).By the way, Be The Match covers all the expenses associated with donor lab tests and travel expenses during donation process, so the donors need not worry about any financial commitments.

**Step-4: Confirmed match, further testing and scheduling donation:** At the end of the wait period Be The Match contacted me confirming a positive match. They said I needed to donate through a process called PBSC (Peripheral Blood Stem Cell) donation. But before proceeding further they ordered two more lab tests. One was for the Infectious Disease Markers (just so I don't carry any infections that could be detrimental to the patient) and the other was a complete physical to ensure that I am physically fit to donate and can withstand the actual donation process which can be physically intense.

**Step-5a: Recipient preparation:** About a week before the transplant was to take place, the recipient went through "Prep" for accepting this transplant. This involves very high doses of intense chemotherapy and possibly radiation therapy wherein the diseased cells in the patient's body are completely destroyed. This preparation also significantly weakens recipient's immune system. This is intentional just so the patient cannot reject the transplant once they receive my stem cells. I, as a donor, could have backed out at any step in this process. However, pulling back after the recipient prep begins will endanger the recipient as the immunity system is at a low ebb.

**Step-5b: Donor Preparation:** Starting 5 days prior to the donation day, I had to get 2 shots a day of Neupogen. These are generally given to cancer patients to help improve their blood counts. In donor's case, these are given to multiply the stem cells in donor's body so they can be harvested on day 5. I experienced significant muscle pain, back pain, and bone pain (this is similar to growing pains as more stem cells are produced in my body due to the injections). The pain was intense at times but extra strength Tylenol did help. I reminded myself that many cancer patients across the world (my dad included) had to take these injections and put up with the side effects. So, my discomfort seemed minor. In show of her complete commitment and support to this cause, Aparna was giving me the daily shots (Be The Match allowed her to administer the shots as she was a physician).

**Step-6: Travel to the transplant location and Donation day:** On day 4 evening I set out to the transplant location out of state, accompanied by my dear friend Phani Dokka. On the day of the donation, I was given my last Neupogen shots, and then was put on an apheresis machine which essentially takes my blood out of my body in batches and churns out stem cells which are collected in a bag and rest of blood is pumped back into my body. For me the process took about 5 hours after which I was completely exhausted but felt a great sense of accomplishment. After some recovery and observation period, we were sent home.

**Step-7: Transporting stem cells andtransplant into the patient:** A courier hand carries the stem cells to wherever in the world the patient is and delivers in person.The transplant is given to the patient within 2 days of the donation. With new stem cells the patient's body immediately starts producing healthy blood cells, rebuilds the immunity, starts fighting the disease and hopefully should result in full recovery. One interesting fact I learned was that the patient's blood group changes to mine regardless of whatever their blood group was prior to transplant!

**Step-8: Donor/Recipient Direct communication:** The transplant center may allow direct communication between the donor and recipient after one year gap or longer, assuming parties consent. From what I understand, these rules vary by the administering transplant center and I may never know who the recipient is. Hence this should not be an expectation.

## *In conclusion*

We all have busy lives. But time has this phenomenal elastic property which always accommodates our interests and passions! Yes. The whole process was time consuming, and I had to make tradeIoffs. Trading off TV time, entertainment time, and sadly at times, family time (which is where family support is important) to go through the process. But in the end, it was a great experience. Having gone through the process, if I were asked to go through this all over again, I will have no hesitation. I encourage you and challenge you to do the same! Sincere thanks to all my family, friends, and well-wishers for supporting me through this process. ❋



***Madhav has been residing in the USA for the past 22 years. He currently lives in Suwanee,Georgia with his wife Dr.Aparna and two beautiful children. His hobbies include reading, writing, distance running, and watching movies. He holds a B.Tech. in Chemical Engineering from IIT Madras and Ph.D. from University of Florida.***



కథ

# గమనమే నా గమ్యం

మధు పెమ్మరాజు

యుటికాకి అర్జెంటుగా వెళ్లమని కంపెనీ నుండి ఫోనొచ్చింది. రాత్రంతా ఎయిర్‌పోర్ట్ డ్యూటీ చేసి అలిసిపోవడంతో వెళ్లాలనిపించలేదు. అయినా విసుక్కుంటూ బయలుదేరాను. ఒకేలా ఉన్న వీధులు ఒక్కొక్కటి దాటుతూ కంపెనీ చెప్పిన అడ్రెస్‌కి చేరుకున్నాను. వీధిలో పెద్దగా జనసంచారం లేదు. చెట్ల పై నుండి రంగు మారిన ఆకులు ఎవరో వెదజల్లినట్లు, వరుసగా రాలుతున్నాయి. కార్‌ని రోడ్డుకో పక్కగా ఆపి కిటికీ కిందికి దించగానే శరత్కాల పవనాలు మొహాన్ని తాకుతూ విసుగుని దూరం చేసే ప్రయత్నం చేస్తున్నాయి.

సవారీకి నేనొచ్చినట్లు చెప్పాలని మెల్లిగా హార్న్ కొట్టాను. ఏ అలికిడి వినిపించలేదు. కాసేపు ఎదురుచూసి తిరిగి హార్న్ కొట్టినా, ఏ మార్పు కనపడలేదు. ఇక వచ్చిన పని అయిపో యింది వెళ్లిపోదామనిపించింది. ఎందుకో మనసొప్పక కార్ దిగి గోడపై అడ్రస్ ఖరారు చేసుకుని కాలింగ్ బెల్ కొట్టాను.

“ఒక్క నిమిషం ఉండు,” అనో గొంతు పీలగా వినిపించింది.

ఆ వ్యక్తి ఏదో వస్తువు బలవంతంగా ఈడుస్తూ, మధ్య మధ్యలో ఆగుతూ తలుపు వైపు వస్తున్నట్లు తెలుస్తోంది. పసుప్పచ్చ రేకు బోర్డుపై 'మిసెస్ జెమీ ఆండర్సన్' అని అక్షరాలు బాగా వెలిసిపోయాయి. పాత తలుపు చప్పుడు చేసుకుంటూ తెరుచుకోగానే సన్నగా, కాస్త కురచగా ఉన్న వృద్ధురాలు ఆయాస పడుతూ నిలబడి ఉంది. ముడతలని బట్టి తొంభై ఏళ్లు ఉండచ్చనుకున్నాను. గులాబిరంగు ఫ్రాక్, తెల్లటి టోపి, అందమైన పర్సుతో దొరసానిలా ముస్తాబయ్యింది. ఈడ్చుకొచ్చిన నైలాన్ పెట్టె పక్కనుంది. ఆవిడ బందోబస్తు చూసి ఏదో ముఖ్యమైన ప్రయాణానికి సిద్ధమయినట్లుగా ఉంది. లోపలికి చూస్తే ఆ ఇంట్లో ఏళ్ల తరబడిగా ఎవ్వరూ ఉన్నట్లుగా లేరు. సోఫాకి, కుర్చీలకి ప్లాస్టిక్ కవర్లు అలానే ఉన్నాయి. గోడపై గడియారం లేదు. వంటింటి గట్టుపై గిన్నెలు లేవు. గదిలో మూల ఫోటోఫ్రేములు, గాజు సామాగ్రి సర్దిన డబ్బా మూత తెరిచి ఉంది.

"హలో మిసెస్ జేమీ," అనగానే ఆవిడ పలకరింపుగా నవ్వింది.

"కాస్త సూట్‌కేసు కారులో పెట్టు బాబు," అని మర్యాదగా అడిగింది.

"తప్పకుండా, మీరిక్కడే ఉండండి," అని పెట్టి ట్రంక్‌లో పెట్టి గుమ్మందాకా తిరిగొచ్చాను. చెయ్యి పట్టుకుని ఒక్కొక్క మెట్టు మెల్లిగా దింపి కారు దాకా చేర్చాను. అడుగడుక్కీ మెచ్చుకుంటుంటే ఇబ్బందిగా అనిపించి, "చూడండి, మా అమ్మ టాక్సీ ఎక్కితే, ఆ డ్రైవర్ మా అమ్మనెలా చూడాలనుకుంటానో, నేను నా సవారీని అలానే చూసుకుంటాను," అని నా వృత్తి ధర్మాన్ని చెప్పాను.

"చాలా మంచబ్బాయివి," అని కార్లో కూర్చుంది.

కాస్త స్థిమితపడ్డాక చేతికొక అడ్రసిచ్చి, "సన్నీసైడ్ మీదుగా తీసుకెళ్లు," అని అడిగింది.

"మేడం అదసలు రూటే కాదు."

నేనా మాట అంటానని ఊహించినట్లు ఉంది. తడుముకోకుండా, "బాబూ! నేను వెళ్లేచోటికి ఎప్పుడు వెళ్లినా పర్వాలేదు. నాకోసం ఎవ్వరూ ఎదురుచూడట్లేదు," అని చెప్పింది.

"అంటే బాగా చుట్టు తిరిగి వెళతాము. కనీసం మూడు నాలుగు గంటలు పట్టేస్తుంది," అని సర్ది చెప్పాను.

"నావాళ్లు ఒక్కొక్కరూ వెళ్లిపోయారు, నేను ఎక్కువ రోజులు ఉండనని డాక్టర్ చెప్పారు," అంది.

ఆ మాటల్లో విషాదం లేదు, వాస్తవం ఇంకిన మాటలు. అప్రయత్నంగా నా చేతులు టాక్సీ మీటర్ని ఆపేశాయి.

"ఎటు తీసుకెళ్లమంటారు?"

"రూస్వెల్ట్ నుండి తీసుకెళ్లు."

"తప్పకుండా," అని చెప్పి కారు స్టార్ట్ చేశాను.

❖

రూస్వెల్ట్ రహదారిపై ట్రాఫిక్ కాస్త తక్కువగా ఉండడంతో వేగంగా డ్రైవ్ చేస్తున్నాను. ఈస్ట్ రివర్ నుండి వీస్తున్న గాలులు రివ్వుమని కారుని తాకుతున్నాయి. కిటికీ కాస్త కిందికి దించి నడుపుతున్నానేమో ఒకటే హోరు. వెనుక నుండి మాటలు కాస్త ముక్క ముక్కలుగా వినిపించినా శ్రద్ధ పెట్టలేదు. ఓ అర నిముషానికి మిసెస్ జేమీ మాట్లాడుతోందని, ఆ మాటలు సగం గాలిలో కలిసిపోతున్నాయని అర్థమయింది.

అద్దం పూర్తిగా పైకెత్తి, "క్షమించండి! మీరు చెప్పిన మాటలు సరిగ్గా వినబడలేదు," అన్నాను.

"ఏదో ముసలావిడ సణుగుడు, నువ్వే పట్టించుకోకు బాబు," అని నిట్టూర్చింది. రేర్ వ్యూ అద్దంలోంచి చూడగానే ఆవిడ బయటికి చూస్తూ ఏదో వెతుకుతున్నట్లు అనిపించింది. మొదట ఆవిడ మాటలు సరిగ్గా వినలేదని కాస్త గిల్టీగా అనిపించి, "పర్వాలేదు చెప్పండి," అని అడిగాను.

"ఇందాకా జమైకా దగ్గర ఎలిమెంటరీ స్కూలు దాటాము, చూశావా?" అని అడిగింది.

"ఏదీ స్టీవెన్సన్ గురించి అడుగుతున్నారా? రోజూ తిరిగే దార్లే కదా మేడం, అడుగడుగు పరిచయమే."

"అవును, నేనక్కడే చదువుకున్నాను."

"అవునా?"

తెలుసని చెప్పగానే ఆవిడ మాటల్లో ఉత్సాహం పుంజుకుంది. గొంతులో కాస్త వణుకున్నా మాటలు స్పష్టంగా అర్థమవుతున్నాయి.

"నేను, నా స్నేహితులు పై అంతస్తు కిటికీలోంచి వచ్చే పోయే జనాలని వింత పేర్లతో పిలిచి దాక్కునేవాళ్లం. ఓరోజు ఒకాయనికి చిర్రెత్తుకొచ్చి ప్రిన్సిపాల్‌కి ఫిర్యాదు చేశాడు. వెంటనే ప్రిన్సిపాల్ మా నాన్నకి మెమో పంపించడం, ఆయన నన్ను చెడామడా తిట్లు తిట్టడంతో మా అల్లరికి కళ్లెం పడింది," అని మొహమాటంగా నవ్వింది.

ఆట పట్టించాలని, "ఆ తరువాత ఇంకెవరికైనా పేర్లు పెట్టారా?" అని అడిగాను.

"లేదు నాయనా, మా పిల్లలకి తప్ప మళ్లీ ఎవ్వరికీ పేర్లు పెట్టలేదు," అని తగ్గట్టుగా సమాధానమిచ్చింది.

"ఇంకా మీ స్కూల్ విశేషాలేమైనా గుర్తున్నాయా మేడం?"

"స్కూల్‌కి కొద్ది దూరంలో ఓ సిమెటరీ ఉండేది. అప్పుడప్పుడు జనం ఊరేగింపుగా వెళుతూ కనబడేవారు. వాళ్లెవరో? ఎందుకొచ్చేవారో? ఎక్కడికెళ్లేవారో? ఎంతకీ అంతుపట్టేది కాదు. మా మావయ్య పోయాక నా ప్రశ్నలకి జవాబుల అవసరం లేకుండా పోయింది. సిమెటరీ పక్కగా వెళ్లిన ప్రతిసారీ మావయ్య గుర్తొచ్చి ఏడ్చేదాన్ని," అని నిట్టూర్చింది.

దారిలో ఉండగానే ఈస్ట్ ఎండ్ కూడలి దగ్గర కాసేపు ఆపమని అడిగింది. అక్కడకి చేరుకున్నాక సరైన పార్కింగ్ దొరక్క

ఓ రెండు, మూడు రౌండ్లు తిరగాల్సి వచ్చింది. రేర్ వ్యూ అద్దం లోంచి చూడగానే మిసెస్ జేమీ చూపులు పరిసరాలని ఆప్యాయంగా తడుముతున్నాయి. ఆవిడ బాల్యం అక్కడ గడిచిందని తెలియడంతో ఏమాత్రం తొందర పెట్ట కుండా కారు ఆపుకుని, ఆవిడకి ఒక వాటర్ బాటిల్ ఇచ్చి ఓ పక్కగా నిలబడ్డాను.

ఓ పెద్ద భవంతిని చూపించి, "ఎదురుగా చూశావా?" అని అడిగింది.

"ఏదో ఫర్నిచర్ దుకాణంలా ఉంది మేడమ్," అన్నాను.

"నాకు నా డాన్స్ స్కూల్ కనిపిస్తోంది. మిసెస్ ఆండ్రూ డాన్సు పాఠాలకోసం దూరదూరాల నుండి పిల్లలు వచ్చేవాళ్లు. అమ్మ రోజూ చెయ్యి పట్టుకుని బాలెట్ క్లాసులకి తీసు కొచ్చేది. ఆవిడకి నేనే ప్రపంచం..." అని ఆగిపోయింది. జ్ఞాపకాలకి గొంతు జీరబోయింది.

కాలగమనంలో రోజూ మారే మజిలీలు, పెరిగే బాధ్యతల మధ్య వయసొక కదిలే అంకెగా మారిపోతుంది. వీటికి దూరంగా, ఏదీ తాకలేని రహస్య ప్రదేశం ఒకటుంటుంది. మిసెస్ జేమీ అక్కడికి చేరుకుంది. తన రాక కోసం వేచి ఉన్న అమ్మ, దారి చూపించిన నాన్న, గోలగోలగా అల్లరి చేస్తున్న స్నేహితులు అక్కడే ఉన్నట్లు ఇష్టంగా చూసుకుంది. బావిలో చంద్రబింబంలా తొణికిసలాడే జ్ఞాపకాలని తనివితీరా తలుచుకుంది.

చిరు చినుకులు మొదలవ్వగానే రహదారిపై ట్రాఫిక్ పెరిగింది. అనుకున్న సమయం కంటే ఆలస్యంగా మెట్రోపాలిటన్ బిల్డింగ్ చేరుకున్నాం. ఆ భవనాన్ని చూపిస్తూ, "ఇక్కడే నా మొదటి ఉద్యోగం, స్మిత్ అండ్ కంపెనీ ఛైర్మన్ దగ్గర పర్సనల్ అసిస్టెంట్‌గా దాదాపు ఇరవై ఏళ్లు పనిచేశాను," అని చెప్పింది.

గుమ్మం ముందో గిరజాల జుట్టు గార్డ్ కాస్త వంగి నడుస్తున్నాడు. మిసెస్ జేమీ అతన్ని పట్టి, పట్టి కాసేపు చూసి, "కాస్త ఆ అబ్బాయిని పిలుస్తావా?" అని అడిగింది. ఆ వ్యక్తిని వెంట తీసుకురాగానే, "నువ్వు పరిచయమైన వ్యక్తిలా అనిపిస్తున్నావు?" అని అడిగింది.




పని భంగపడిందన్న భావం గార్డ్ మొహంలో స్పష్టంగా తెలుస్తోంది. అయినా మర్యాద కూడగట్టుకుని, "క్షమించండి, నేను మిమ్మల్ని ఎప్పుడు చూడలేదు," అన్నాడు.

గార్డ్ దగ్గరికి రావడంతో మిసెస్ జేమీ అతని మొహం సరిగ్గా చూడగలిగింది. "నువ్వు రిక్ కొడుకువా?" అని అడిగింది.

ఏదో పిలవమంటే పిలిచాను కాని, ఇంత సూటి ప్రశ్నని ఊహించలేదు. ఇక గార్డ్ ఎలా స్పందిస్తాడో అని చూస్తుంటే, అతను, "అవును మా నాన్నే, ఆ విషయం మీకెలా తెలుసు?" అని ఇంకాస్త దగ్గరకొచ్చాడు.

"మీ నాన్నతో ఇరవై ఏళ్లు పనిచేశాను. ఆ మాత్రం పోల్చుకోలేనా? ఈమధ్య ఎవరో పాత పరిచయం నువ్విక్కడ పని చేస్తున్నావని చెప్పారు," అంది.

ఇద్దరూ ఓ అరగంట ఆప్యాయంగా మాట్లాడుకున్నారు. గార్డ్ వాళ్ల నాన్న పదిహేనేళ్ల క్రితం పోయాడని, తనపై బోలెడన్ని బరువు బాధ్యతలు ఉన్నాయని, రిటైర్మెంట్ కలతో సమానమని చెప్పాడు. మిసెస్ జేమీ బయలుదేరే ముందు గార్డ్ చేతిలో కవరు పెడుతూ, "ఊరికే ఇవ్వట్లేదు, మీ నాన్న దగ్గర తీసుకున్న అప్పు," అని నవ్వుతూ చెప్పింది. గార్డ్ ఆశ్చర్యంగా చూస్తూ నిలబడ్డాడు.

❖

సన్నీసైడ్ చేరుకునేసరికి ఎండ తగ్గుముఖం పట్టింది. మిసెస్ జేమీ చెప్పిన కొండ గుర్తులతో ఎంత వెతికినా వారి పాత ఇల్లు దొరకలేదు. సున్నా చుట్టినట్లు చూసిన వీధులే మళ్లీ తిరుగుతుంటే అదంతా వృధాప్రయాస అనిపించింది.

నా అసహనాన్ని పసికట్టి, "ఈ పరిసరాలని వదిలి చాలా ఏళ్లయింది. ఇప్పుడు కొత్తగా వచ్చిన కట్టడాల మధ్య పోల్చుకోలేక పోతున్నాను. ఇంకొక్కసారి ప్రయత్నించి వెళ్లిపోదాము," అని సముదాయించింది. ఆ మాట నాలో పట్టుదలని పెంచింది. దారిలో కనపడిన వారిని వాకబు చేస్తుంటే పెంపుడు కుక్కతో వెళుతున్న ఓ పెద్దావిడ చిక్కుముడిని విప్పింది. "నువ్వు అడిగిన ఇల్లు నీ ఎదురుగా ఉంది. రీమోడల్ చేశాక స్వరూపం మారిపోయింది," అని నవ్వుతూ వెళ్లిపోయింది.

ఇంటి ముందు కారు పార్క్ చేసి, మిసెస్ జేమీని నడిపించుకుంటూ గుమ్మందాకా తీసుకెళ్లాను. ఆవిడ చేత్తో కాలింగ్ బెల్ కొట్టగానే యజమాని బయటికి వచ్చాడు.

"ఇక్కడ కుర్చీలో కాసేపు కూర్చోవచ్చా?" అని అడిగింది. యజమాని ఈ అనామకులకు మర్యాద లేదా అని కాస్త ఇబ్బందిగా చూశాడు.

"నేను, నా భర్త చార్లీ ఈ ఇంట్లో ముప్పైఏళ్లు ఉన్నాము," అని చెమర్చిన కళ్లతో చెప్పగానే, యజమాని, "తప్పకుండా కూర్చోండి," అని చెప్పి లోపలికి వెళ్లాడు.

మిసెస్ జేమీ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుంది. "నేను కడుపుతో ఉన్నపుడు చార్లీ ఓ సాయంత్రం మంచి రెస్టారెంట్‌కి రమ్మన్నాడు. అక్కడికి చేరుకునేసరికి ముఖ్యమైన స్నేహితులంతా

గుమిగూడి ఉన్నారు. ఎందుకు పిలిచాడో కారణం తెలీదు. పార్టీ చివరన ప్రమోషన్ వచ్చిందని ఒక్కసారిగా ప్రకటించాడు. వచ్చిన వారంతా అభినందనలతో ముంచెత్తారు. ఇద్దరం పెరిగే ఖర్చులకి తగ్గట్టుగా జీతం పెరుగుతుందని సంతోషించాము. వారం తిరక్కుండా రిసెషన్ మహమ్మారిలా న్యూయార్క్ అంతా పాకిపోవడం, మా ఉద్యోగాలు వెంట వెంటనే పోవడం జరిగింది."

"అయ్యో, మరేం చేశారు!"

"మా జీవితం సొంతింటికి మారాలనే కల నుండి ఫుడ్ స్టాంపుల స్థితికి మారిపోయింది. అందరికీ చార్లీ ఆత్మాభిమానం సంగతి బాగా తెలుసు. అందుకే పుట్టే పిల్లాడికి బహుమతి అంటూ మా అమ్మ డబ్బులు ఇచ్చేది. పిజ్జా పార్టీలంటూ ఇరుగు పొరుగు పరోక్షంగా సహాయం చేసేవారు. అప్పట్లో అది కష్టమని తెలీదు. ధైర్యంగా ముందుకి సాగిపోవడం... ఇరుగు పొరుగుతో కష్టాన్ని పంచుకోవడమే తెలుసు."

నీరెండ న్యూయార్క్ భవనాలను నింపాదిగా తాకుతోంది. మిసెస్ జేమీ చూపులు లేత చీకట్లలో చిక్కుకున్నాయి.  ఓపిక లేకపోయినా ఉగ్గబట్టుకుని కూర్చుంది. వడలిపోయిన మొహంతో, "బాగా అలసిపోయాను. కాస్త నేనిచ్చిన అడ్రస్‌కి తీసుకెళ్లు బాబు," అని అడిగింది. మాటల కంటే మౌనంగా సాగే సంభాషణ విస్తృతి ఎక్కువ. వాటికి పరిధులు లేవు. మిగిలిన ప్రయాణం ఇంచు మించు మౌనంగా సాగింది.

బ్రూక్లిన్ రెండు మైళ్లు దాటగానే, 'హ్యూవిట్ స్వస్థత కేంద్రం' అనే పాత భవనం చేరుకున్నాం. వెలుతురు తక్కువగా ఉన్న పోర్టికో కింద కారు మాత్రమే పట్టే సన్నటి దారిలో కాస్త ముందుకి వెళ్లి ఆపాను. కారు శబ్దం విని ఇద్దరు నర్సులు యాంత్రికంగా వీల్‌ఛైర్ పట్టుకుని బయటికి వచ్చారు. వారి మొహంలో ఎప్పుడో చెప్పి ఇప్పుడా రావడం అన్నట్లుగా ఉంది.

ట్రంక్ తెరిచి పెట్టె తీసి బయట పెడుతుంటే నర్సులు మిస్ జేమీని వీల్ ఛైర్‌లో కూర్చోబెట్టారు. నర్స్ చేతికి పెట్టె ఇస్తుంటే, "బాబు నీ పేరు అడగలేదు, ఏమీ అనుకోకు," అంది. ఆ మాటల్లో ఆత్మీయతతో పాటు కాస్త అపరాధ భావన.

"నా పేరు డేవిడ్," అని చెప్పాను.

"చాలా శ్రమపడి ఓపిగ్గా తిప్పావు, ఎంతివ్వాలో చెప్పు," అని హ్యాండ్ బాగ్ తీసింది.

"మీరు ఇవ్వాల్సిన దానికంటే ఎక్కువ ఇచ్చారు," అని నవ్వాను.

"తప్పు అలా అనకూడదు, నీకిదే జీవనాధారం. ఎంతివ్వాలో చెప్పు."

"మిసెస్ జేమీ! నాకు రోజూ మీటర్ గిరాకీలు దొరుకుతాయి. మీరు లెక్కలకందని అనుభవం ఇచ్చారు," అని ఆవిడని దగ్గరగా హత్తుకున్నాను.

"ఈ ముసలిదానికి కొన్ని ఘడియల సంతోషాన్నిచ్చావు. గాడ్ బ్లెస్ యు మై ఛైల్డ్," అని నర్సుల కేసి చూసింది.

"థాంక్స్," అని చెయ్యి నిమిరి, చెమ్మగిల్లిన కళ్లతో చూస్తూ నిలబడ్డాను. వీల్ ఛైర్ పోర్టికో వెలుతురు దాటి చీకటిలోకి మెల్లిగా కలిసిపోయింది. తలుపు మూసుకున్న చప్పుడు వినగానే జీవితపు పుటల్లో ఒక పేజీ తిరిగిపోయింది.

నన్నేదో వెలితి చుట్టుముట్టింది. ఎవరితో మాట్లాడాలనిపించలేదు. రాత్రంతా ఏ గిరాకీని ఎక్కించుకోకుండా వీధుల్లో తిరుగుతూనే ఉన్నాను. ఎన్నో ప్రశ్నలు- నా బదులు వేరే కోపిష్టి డ్రైవర్ వచ్చి ఉంటే? నేను హారన్ కొట్టి విసుక్కుని వెళ్లిపోయుంటే? అసలు నా గమ్యం ఏమిటి? ఎన్నో ప్రశ్నలు... జవాబులు దొరకవని తెలుసు.

భలే మంచి సవారీ దొరికింది. ఇప్పటిదాకా ఇంతకంటే గొప్ప పని మరోటి చెయ్యలేదు. చెయ్యనేమో కూడా. మలుపు తిప్పే అనుభవాలు, ఆత్మని తాకే అనుభూతులు కబురు పెట్టి రావు. అనుకోని అతిథుల వలె తలుపు తడతాయి. అవే తలుపు తెరుచుకుని మనలో కలిసిపోతాయి.

ఓ న్యూయార్క్ టాక్సీ డ్రైవర్‌గా నా ప్రపంచం వీధులు, వాటిని కలిపే కూడలులు, వాటిపై నుండి సాగే వంతెనలు చుట్టూ తిరుగుతుంది. నా దృష్టిలో అవి చలనం లేని సదుపాయాలు మాత్రమే! మిస్ జేమీ వలన నా దృక్పథం మారిపోయింది. ఇప్పుడవి జనం నింపుకున్న స్వరూపాల వలె కనిపిస్తు న్నాయి. నిత్యం తాము చూసిన కథలని చెప్పాలని తాపత్రయ పడు తున్నాయి. కథలలో ఒక పాత్రగా పోత పోసుకున్నాయి... అవి సజీవ జ్ఞాపికలు!!

ఇకపై నేను తిరిగే ప్రతిదారి కొత్తగా కనిపిస్తుంది. ఎక్కే ప్రతి సవారీ ఆత్మీయుడులా కనిపిస్తాడు. గమనమే నా గమ్యం!! *



మధు పెమ్మరాజు కథలు, కవితలు రాస్తారు. సాహిత్య కార్యక్రమాలు ఉత్సాహంగా నిర్వహిస్తారు. తానాపత్రిక, కౌముది, కినిగె లాంటి పత్రికల్లో వీరి రచనలు అచ్చయ్యాయి. నివాసం హ్యూస్టన్ దగ్గర్లోని కేటీ నగరం.

# దేవదత్తం

డొక్కా ఫణి

నా చందమామలో నవ్వేటి అవ్వ,
నీ చంద్రగోళాన నల్లనిదిబ్బ
నా గగనతల్పాన తారక సుమమాల,
నీ పాలపుంతలో నిలిచి కాలే చుక్క
నా నింగి పొంగించు కోటివెన్నెల సుధలు,
నీ మిన్ను కురిపించు నుల్కలూ, శకలాలు
నా రేయి దరిజేరు నవవధువు బోలు,
నీ రాత్రి పడగెత్తి కాటేయజాలు
దినకర మయూఖాలు, తిమిరాంతకాశ్వాలు,
దివిజసుర దీవెనై దిగివచ్చు హరివిల్లు,
మలయమారుత గతులు ప్రణవనాద శృతులు,
పులకరించిన మొయిలు పుడమి నమృతము జల్లు
పంచభూతాలు నా నేస్తాలు, చుట్టాలు,
ప్రకృతి నా పుట్టిల్లు, కవిత ఆనవాలు
భానుతాపము గొల్చునొక పరికరమ్ము,
కాంతిఖండన సేయు నొక పట్టకమ్ము,
గాలిమర తిరిగేను గాలివాటమ్ము,
మేఘమన్నది నీకు జలకణ సమూహమ్ము
విస్తరించుచు పోవుననిశమ్ము విశ్వమ్ము,
నీవు నేర్చెడి విద్య నిత్యం సశేషమ్ము!!
సత్యంబు బరువైన జ్ఞానమొక శిక్ష,
అనుభూతి కరువైన అవని ఒక శిక్ష
అజ్ఞానమే నాకు శ్రీరామరక్ష
ఆనందమే నాకు దైవమిచ్చిన భిక్ష!!!





డొక్కా శ్రీనివాస ఫణికుమార్ అట్లాంటా వాస్తవ్యులు. వృత్తికి సాఫ్ట్‌వేర్ నిపుణులు. కవితలు, కథలు రాస్తున్నారు. కౌముది జాలపత్రికలో కాలమ్ నిర్వహించారు. పల్లకి అనే పేరిట వీరు నిర్మించిన లఘుచిత్రం విమర్శకుల మన్ననలు పొందింది.

# శ్రీ తానా సుందరి

దండకం

సరోజ కొమరవోలు

అమెరికాలో నువ్వు పుట్టి పసిపాపవై మెలిగి... బాలికవై
చెలరేగి బంతులాడి, ముచ్చటలు గొలుపు ముద్దుగుమ్మవై
నవయవ్వన పరిమళ నవోహనాంగివై, నవరత్న మాలిక
శ్వేతాంబరధారివై, మృదుమధుర వీణాపాణివై
సుజ్ఞాన అక్షరనిధివై, అష్టలక్ష్మివై, మమ్ము కరుణించు కల్పవల్లివై

ఆధ్యాత్మిక అరుణరాగమై, సాంస్కృతిక ప్రియులకు సౌభాగ్య
ప్రదాయినివై
కవిజనులకు మధుర మంగళ మంజులవాణివై, అవధాన
సరస్వతివై
అందరన్ అద్భుత ఆనందానందిస్తున్న అపూర్వ శక్తివై,
కనువిందు చేయు తేజోరాశివై
భోజన ప్రియులకు మృష్టాన్న భోజన మొడ్డించు మోహినీదేవివై
ఇంతింతై పెరిగి పెరిగి నవవధువువై యున్న
నిన్ను తిలకించు భాగ్యంబు మాకందరికి దక్కెన్

దయాశాలివై నువ్వు దాతలన్ కొనియాడి తదితరులన్ దీవించి
డిట్రాయిట్ నగరంబున్ మన్మథనామ సంవత్సరంబందు
చిరునవ్వుతో నిలచి
తెలుగు జనుల హృదయాలు రంజింప చేస్తున్న పాలమీగడ
వంటి నీ హృదయ వైశాల్యం
పొగడగ నెంతదానన్, తాన
తరతరాలకు తెలుగు భాషాభావంబు అర్థంబు వ్యర్థంబు
కాకుండ, నీ చల్లని కరస్పర్శతో
అభయహస్తమునిచ్చి, ఆశీర్వదించి ధన్యులను చేయుమమ్మ
క్షీరసాగర సంపన్న లక్ష్మీ, నమస్తే! నమస్తే!
ఉత్తర అమెరికా ఖండ తెలుగు చైతన్య కళాస్రవంతి
నమస్తే నమస్తే నమః





*సరోజ కొమరవోలు 1983లో కెనడా వచ్చారు. 1986-96 మధ్య వనితాజ్యోతి పత్రికకు విలేఖరిగా పనిచేశారు. 40 ఏళ్లుగా రెండు వందల కథలు, కొన్ని నవలలు రాశారు. 2009 లో టొరాంటోలో తెలుగువాహిని సాహితీ సంస్థను స్థాపించి నిర్వహిస్తున్నారు.*

# AN ILLUSTRATED GATEWAY TO INDIA

*Padma Kuppa*

The first time I remember seeing an Amar Chitra Katha (ACK) was on a visit with my parents to the newly built Ganesh Temple in Flushing, NY in 1977. I had already been amazed by the sea of brown people at the temple's consecration over the July 4th weekend a few months prior, having no idea that so many of us from India were now making the United States our home. When I saw something that looked like a comic book but with a demure and attractive Indian damsel on the cover, I was fascinated. My father was an English professor and a writer, and I knew he probably would buy it for me if I asked really nicely. They were graduate students at that time, part of the wave of immigrants that came to the US in the 60s and 70s, seeking higher studies leaving friends and family behind. I was also seeking a connection to the world we had left behind, one that was not much more than a few vague memories by the time the temple was built.

Fortunately, both my parents were enthusiastic and bought a few titles for me, and thus began of my love of ACKs. Shakuntala was the first in a collection that increased with each trip to the temple. These Amar Chitra Kathas… from the love story of Shakuntala and Dushyant with its twists and turns, various anecdotes from the Ramayana and Mahabharata to true life stories of Swami Vivekananda and Adi Shankaracharya… all became a substitute for the traditional story telling that would be done by a grand parent or other elder in the family. It was a substitute I so desperately needed as an only child with no relatives in the area. Even though we had a few family friends, they were not familiar with the stories of my ancestors, of people who looked and sounded like me and my parents, or who shared the same stories.




Fast forward about 25 years. I was a young mother in Michigan, raising my own family. My husband and I are engineers, and metro Detroit seemed like a great place to raise our daughter and son, with a temple nearby and jobs that were suitable for our educational background. But I was raising my kids without grandparents nearby - my in-laws were in India, and health issues prohibited them from coming and staying with us beyond a one-time trip. My parents had become disillusioned with the US and returned to their homeland nearly 30 years ago, and refused to come stay with us beyond my mother's occasional visits. So I turned to ACKs to help me teach and connect them with the stories I knew were critical to connect them with our glorious Hindu and Indian heritage.

While I didn't always feel comfortable with the "Indian English" or the angle from which a story was told, the images and the general outline of the story were always fascinating. I used the ACK to narrate my own version of the story, with a combination of Telugu, English and Tenglish, weaving in the Sanskrit shlokas they learned at the temple. My daughter's dance teacher had the children enact some of the tales during




summer camps, leveraging the ACKs in our collection. The static images of the ACK became live movements under her tutelage - Srirama stringing a bow or Srikrishna stealing butter. The biannual trips to India to visit both sets of grandparents in Hyderabad became a way for our collection to increase - my parents loved the opportunity to take the children to the bookstore and buy them whatever they wanted.

The ACKs served as a way to reinforce our Indian and specifically Telugu heritage: one summer, I had the driver take me and the kids down Tank Bund, starting at the Secunderabad end and stopping at each statue all the way to other end, taking pictures. We realized there were a few stories I didn't know and went hunting for the ACKs that were missing in our collection. We even identified a few things that discomfited my Telugu pride: that Tyagaraja was listed as a poet saint from Tamil Nadu, that there were no ACKs about Rani Rudrama Devi - one of the few ruling queens in India's history, or Annammayya - forefather to the great Carnatic composers who came after him, and especially loved in our family because he wrote his spiritually strong, bhakti-filled compositions in the Telugu of the common man. There was also an opportunity for my mother-in-law to explain to the children that Vijayanagara empire was different from where they live in Hyderabad's Vijayanagar Colony, a confusion that had to be disentangled amidst peals of laughter. ACKs even played a role in keeping the bond between grandchild and grandparent across the oceans: during one "March is Reading Month" school assignment, I found, on returning from work, that my son had skyped my father-in-law. Each square on the calendar had an assignment - something related to reading; one activity was to read to a senior citizen. My son - now a few years older - opened up a laptop one day during their spring break, and read my father his current favorite ACK!

But it was when my daughter was in middle school, and came home from school frustrated with her history book's depiction of Hinduism that the value of the ACK was brought home very strongly. Her 7th grade social studies book told her that Hindus perceived women as inferior to men, and that caste and intrinsic inequality of people is built into Hinduism. She knew that this wasn't true, but didn't have something that could help her make sense of the stereotypes and clear up the misconceptions that were in the mainstream. On the cover of the ACK entitled AdiShankara, is the picture of the famous debate between the Hindu saint AdiShankara and Mandana Mishra. Ubhaya Bharati is also depicted moderating the debate: she was the equal of both great scholars, and able to be impartial even as she was married to Mishra. She also debated the great sage in a clever effort to support her husband who was on the verge of losing. But it was the explanation of how Shankara met a chandala - and when he composed the Manisha Panchakam extempore - that allowed me to explain that caste is different from jati, varna and kula. We acknowledged, as Telugus, as Hindus, as Indian-Americans, we do believe that all people are equal, as each of us contains a spark of the divine within us. How thankful I am to ACKs for being with me through the years of being parented and part of my own parenting journey! ❋



***Padma Kuppa is an IT project manager and a community leader. A mechanical engineer from REC Warangal, she returned to the US as a foreign student over 25 years ago. She is currently on the City of Troy Planning Commission and is involved with many interfaith and diversity initiatives, including Troy-area Interfaith Group, Michigan Roundtable for Diversity and Inclusion, and is an Advisory Board member of WISDOM, a women's interfaith organization.***

# ఘంటసాల.ఇన్ఫో చరిత్ర

జొన్నవిత్తుల శ్రీనాథ్

ఘంటసాల పేరు వినని తెలుగువారుండరంటే అది అతిశయోక్తి కాదు. 1947లో స్వర్గసీమ చిత్రంతో మొదలయిన ఆయన సినీరంగ వీరవిహారం 1974లో ఆయన మరణంతోనే ముగిసింది. ఈ పాతికేళ్ళలో తన గంధర్వగానంతో తెలుగువారినే గాక దక్షినాది ప్రజలనందరినీ మంత్రముగ్ధుల్ని చేశారు. గాయకులుగానే గాక గొప్ప సంగీత దర్శకులుగా గూడా తన ప్రతిభని ప్రదర్శించారు. ఆయన గతించి నలభైయేళ్ళయినా ఆయన గానం ఇంకా మన హృదయాలలో మారుమ్రోగుతునే వుంది. బాపూగారు చెప్పినట్టు, “గొంతు కంచు ఘంటలీల, అసలు పేరు గానలోల, మారుపేరు ఘంటసాల.”

మన తెలుగువారు సంగీతప్రియులే కాక సాంకేతిక నిపుణులు కూడాను. ముఖ్యంగా ITలో మనవాళ్ళ ప్రభావం చాలా ఎక్కువ. మైక్రోసాఫ్ట్ సీఈవో నాదెళ్ళ సత్యనారాయణగారి పేరు అందరూ ఎలాగో యెరుగుదురు కానీ లక్షలాదిమంది తెలుగు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, ప్రోగ్రామర్లు అమెరికాలోనేగాక ప్రపంచమంతటా వున్నారు. మరందుకేనేమొ, తెలుగువారి కత్యంత ప్రియమైన ఘంటసాలగారి మీద పేజీలు ఇంటర్‌నెట్ నిండా వ్యాపించి వున్నాయి. గూగుల్లో ఘంటసాల పేరు వెదికితే 440,000కి పైగా లింకులు దొరుకుతాయి! ఘంటసాల పాటలు, వీడియోలు, తలచుకుంటే చాలు, ఎక్కడో అక్కడ వెంటనే వెతికి కనిపెట్టి విని సంతోషించవచ్చు.



కానీ ఇదంతా ఇప్పుడు. ఒకప్పుడు ఇలా వుండేది కాదు.ఆ గూగుల్ లిస్టులో చూడండి. మొదటి లింక్ ghantasala.info వస్తుంది. ఎంతోమంది ఘంటసాల భక్తులు ప్రేమతో చేకూర్చి గానగంధర్వునికి సమర్పించిన పూజాపుష్పమిది. దీని కథే ఇప్పుడు మీకు వివరిస్తాను.

20వ శతాబ్దపు చివరి సంవత్సరాలలో అమెరికాలో ఇంటర్నెట్ వాడుక నెమ్మదిగా పెరగడం మొదలైంది. కాకబోతే పెద్దసంస్థలలోగాని, విశ్వవిద్యాలయాలలోగాని తప్పిస్తే మిగతాచోట్ల పెద్దగా వాడుకలో వుండేదిగాదు. అక్కడ కూడా bandwidth ఎక్కువగా వుండేది కాదు. ఈ పరిస్థితులలో గ్రాడ్యుయేట్ విద్యార్థులు (ముఖ్యంగా) ‘న్యూస్‌గ్రూప్స్’ ద్వారా చర్చించడం మొదలుబెట్టారు. నాకు తెలిసిన మొట్టమొదటిది 1992లో మొదలైన "soc.culture.indian.telugu". ఘంటసాల చర్చలకని ప్రత్యేకంగా గ్రాడ్యుయేట్ విద్యార్థులు పరుచూరి శ్రీనివాస్, బసవరాజు శ్రీధర్, శొంఠి రత్నాకర్ తదితరులు కలిసి 1995లో ఒక ‘ఘంటసాల మెయిలింగ్ లిస్ట్’ స్థాపించారు. వీటిలో కేవలం ఆంగ్లభాషలో చర్చలు మాత్రం సాధ్యమయ్యేవి. తెలుగు వ్రాయాలంటే వీలయ్యేది కాదు. అయినా చాలా హుషారుగా చర్చలు జరిగేవి! మొదటి టాపిక్ ఘంటసాలగారి అష్టపదుల మీద చర్చ ఇలా మొదలైంది:

... suggests G's "ashTapadi-s as the begining topic. I hope that others also would come up with their suggestions, comments, ..how this small mailing group should proceed.

I am sure that I won't be exaggerating in saying that, every one has heard "ashTapadi-s" and liked them. These were recorded in his last days, just before he recorded "bhagavadgIta", to my knowledge. He composed the music and set beautiful tunes (rAdhikA kRshNA rAdhikA in rAga darbAr, ramatE yamunA puLinavanE in pIlu, dhIra samIrE in bhUp and praviSa rAdhE in yaman kalyAN). Its a greta delight to listen to these great melodies.

He did sing a few other ashTapadi-s in the film "bhakta jayadEva" (the author of gIta gOvinda), but IMHO they don't match these 4. Also, a few other stalwarts of yesteryears (both men and women: nAgayya, sUryakumAri, bhAnumati,..) sang them, but there is no comparision with G's version.

ఇలా మొదలయిన మెయిలింగ్ లిస్టు విస్కాన్సిన్ యూనివర్సిటీ పుణ్యమాని కొన్నేళ్ళు నడిచింది. 2000లో దీనిని egroups.comకి మార్చారు (మరికొన్నేళ్ళ తరవాతై yahoo groupsగా మారాయి). మొదటిచర్చ ఇలా మొదలయింది

Just would like to inform you both that RPG came out with a 8 CD pack called Millenium Collection. Has some very old songs. The series was credited to the compilation by Sri VAK Ranga Rao garu and Nemani Seetharam. I got only one new (not known to me) song for ghanTasAla, a song from yOgi vEmana, sung with M.V. rAjamma, "AparAni tApamayerA" . Another song I heard for the first time is the song, "prEmayE janana maraNa leela" from Ahuti. The one thing that I would like to mention is that in the first three CD's of the 8 pack a total of nearly 150 minutes were songs verses from movies dating 1936 to 1950 sung by Nagaiah, Gaggiah, MS Rama Rao, kamala chandrababu, pushpavalli, bezawada rajaratnam, Rishyendramani to name a few.

ఆ రోజులలో కాసెట్ టేపులతోనే చాలామటుకు సరిపెట్టుకునేవారు. అప్పుడప్పుడే CDలు రావడం మొదలయ్యాయి కానీ చాలా ఖరీదుగా వుండేవి. MP3ల ప్రవాహం ఇంకా మొదలవ్వలేదు. ఇటువంటి పరిస్థితులలో పాటల గురించి మాటలే గాని ఆ పాటలు ఒకరికొకరు పంచుకునే వ్యవస్థ పెద్దగా లేదు. అయినా కూడా కొన్ని తెలుగుపాటల వెబ్‌సైట్లు రావడం మొదలయ్యాయి. ప్రత్యేకించి ఘంటసాల పాటలే వున్న వెబ్‌సైట్లు వేలమూరి రాజా, కందాడి కృష్ణ తదితరులు కొన్నాళ్ళు నడిపారు. బండి శ్రీకాంత్ మరియు పరుచూరి శ్రీనివాస్ కలిసి 'తెలుగు ఫిల్మ్ సర్వర్' (telugu film server) అన్న ఒక వెబ్‌సైట్ కొన్నాళ్ళు నడిపారు. ఇవన్నీ యూనివర్సిటీ కంప్యూటర్ల మీదగాని, ఉచిత 'వెభోస్టింగ్' సైట్లమీదగాని నడపడం వల్ల స్థిరత్వం లేకపోయింది. ఇవికాక కొన్ని కమర్షియల్ సైట్స్ కూడా కొన్ని ఘంటసాల పాటలు సమర్పించేవి. కొన్ని ఇంకాఉన్నా, ఇప్పుడు మూతబడిపోయినవి చాలా ఉండేవి - megacinema.com, telugubiz.com.

ఇలా వుండగా ఘంటసాల యాహూగ్రూపులో కొంతమంది ఘంటసాల వీరాభిమానులు ఘంటసాలగారికే అంకితమైన ఒక క్రొత్త వెబ్‌సైట్ ఉంటే బాగుండుననే కలలు కనటం మొదలుబెట్టారు. ఇంతకుముందు ఈ ప్రసక్తి చాలాసార్లు వచ్చినా, 2001లో పరుచూరి శ్రీనివాస్‌గారి ఈ పోస్టుతో నిప్పు రాసుకుంది.

What we need is synergies! There are people who are highly knowledgable about old films, about Ghantasala, have data etc. etc., But lack the needed IT skills. If you are computer/web savvy person, why not come up with a concrete web site design. I am sure that many people on this list'd help you in providing the data.

అలా వేసిన ఛాలెంజ్ నందుకొంది ఒక క్రొత్త జట్టు! తీవ్రంగా చర్చలు మొదలయ్యాయి. ఘంటసాల పాటల మీద కన్నా వెబ్‌సైటు గురించి చర్చలు పెరిగిపోతుంటే అక్టోబర్ 11, 2001న నేను ఒక క్రొత్త యాహూ గ్రూప్ స్థాపించాను. ఈ Project Ghantasala గ్రూప్‌లో మొదటి మెసేజి ఒక "mission statement" అనుకోవచ్చును!

అక్టోబర్ 11, 2001

Welcome, everyone, to Project Ghantasala.

The goal of this project is to build up a web based database of information about ALL of Ghantasala's songs. Web based because we can then tap into the vast knowledge base (Gnyanasaagaram) out there. If each visitor can browse through the database, and add in anything they find missing, the data would grow exponentially. We can start with some of the excellent data out there in the ghantasala group files section.

అలా మొదలైన ఈ ప్రాజెక్టు పెట్టగానే పరుగులు తీయడం మొదలెట్టింది. శ్రీధర్‌గారు, నేను, మరికొందరు మిత్రులు database design గురించి చర్చలు జరుపుతుండగా, పాణినిగారు, శ్రీనివాస్‌గారు, మరికొందరు మిత్రులు చాలా ఉత్సాహంగా వారి దగ్గరున్న ఘంటసాల వారి వివరాలు, ఫోటోలు, పాటల వివరాలు వగైరా పోవుజేయడం మొదలుబెట్టారు. ఈ విషయంలో మాకు బాగా సహాయపడిన వ్యక్తి హైదరాబాద్ వాసి డా. వేణుగోపాల రావుగారు. ఆయన పంచుకొన్న ఫోటోలు, ఆడియో క్లిప్స్, ఘంటసాలగారి మీద క్విజ్‌లు, పత్రికల్లో ప్రచురమైన ఆర్టికల్స్ ఇప్పటికీ ఈ వెబ్‌సైట్‌కి ఒక ప్రత్యేక అలంకారం.

వెబ్‌సైట్‌కి ప్రత్యేక ఆకర్షణగా ఒక Ghantasala Song Database తయారుచేయవలనని మా తొలి సంకల్పం. పూర్వం రాజశేఖర్‌గారు సమకూర్చిన ఒక పాటల వివరాల లిస్ట్‌ని శంఖవరం పాణినిగారు RTSలో టైపు చేయగా దానితో ప్రారంభించాము. (ఆరోజుల్లో ఇంకా యూనికోడ్ రాలేదు- అందుకని తెలుగుని ఆంగ్లంలో టైప్ చేసి దాన్ని తెలుగు ఫాంట్సుకి మార్చేవాళ్ళం). పాటల వివరాలు ఉంచడానికి ఒక database design కొంతమంది చర్చించి తయారుచేసారు. ఆ తరువాత కొన్ని మార్పులతో దీనినే ఒక file based designగా మార్చి నేను implement చేసాను. ఈ పాటల వివరాలు వెతికేందుకు ఒక search engine కూడా ప్రత్యేకంగా తయారుచేయవలసి వచ్చింది. ఎందుకంటే తెలుగు

పదాలను ఆంగ్లంలో వ్రాస్తే చాలావిధాలుగా వ్రాయచ్చు. ఉదాహరణకి "vaataapi gaNapatiM bhaje" అన్నా "vAtApi gaNapatiM Baje" అన్నా తెలుగులిపిలో ఒకేలా వస్తుంది కాబట్టి ఈ రెండు search terms తోను పాట దొరకాలి. ఇంకొక కిటుకేమిటంటే తెలుగులో పదవిభజన చాలారకాలుగా చేయవచ్చు. 'గణపతింభజె' అన్నా 'గణపతింభజే' అన్నా ఇదే పాట దొరకాలి. ఇవన్నీ పాటించేలా ఒక fuzzy search తయారుచేసి ప్రయోగించాను. దీనితో అనుకున్న పాట దొరకడం చాలా తేలిక!

పాట పల్లవులే కాక పూర్తి సాహిత్యం కూడా ఇదే వెబ్‌సైట్లో దొరికితే బాగుంటుందని ఒక Lyrics Database కూడా మొదలుబెట్టాము. శ్రీనివాస్‌గారు, పాణినిగారు ఇంతకుముందే వ్రాసి వుంచిన పాట సాహిత్యాలతో దీనిని మొదలుబెట్టాము. మిగతా పాటల సాహిత్యాన్ని సమకూర్చడానికి అందరూ సహాయబడేందుకు ఒక lyrics submission page పెట్టాము. వెబ్‌సైట్‌కి వచ్చిన ఎవరైనా పాట సాహిత్యం ఇందులో వ్రాస్తే వెంటనే అందరికీ కనబడుతుంది. దీనినే ఇప్పుడు "crowd sourcing" అంటారు!

పాటల గురించి వివరాలు సరే ... మరి పాటలో? అసలు ఘంటసాల పాటలు వినడానికేగా అందరూ ఈ వెబ్‌సైటుకి వచ్చేది! ఇప్పుడైతే యూట్యూబ్‌లో ఏ పాట కావాలన్నా దొరుకుతుంది గాని ఆ రోజుల్లో పెద్దగా తెలుగు పాటలు వుండేవికావు. కాకబోతే పాటలన్నీ వెబ్‌సైటులో పెట్టడానికి కాపీరైట్స్ చట్టం ఒప్పుకోదు. ఇవన్నీ ఆలోచించి 1960కి ముందుగా వచ్చిన పాటలు మాత్రమే పెట్టే నిర్ణయం తీసుకున్నాము. ఏడొందలకు పైగా పాటలు, 150కి పైగా పద్యాలు మా వెబ్‌సైట్‌లో పెట్టాము.

పాటలు, వాటి గురించిన వివరాలు, సాహిత్యం, ఘంటసాలగారి చరిత్ర, ఆయన మాటలు, ఆయన మీద వ్రాయబడిన వ్యాసాలు, ఆయన ఫోటోలు... ఇవన్నీ వుంటే చాలా? ఇంకా ఇంకా కావాలనే ఆశతో క్రొత్త ప్రయోగాలు మొదలుబెట్టాము. ఘంటసాల అభిమానులందరూ కలసుకొని సరదాగా ఆడుకునేందుకు ఒక "Fun and Games" పేజీ ప్రారంభించాము. కొన్ని క్విజ్జులతోమొదలైన ఈ పేజీలో మొట్టమొదట పెట్టిన ఆట అందరికీ తెలిసిన అంత్యాక్షరి. పార్టీలలోను, ఇళ్ళల్లోను ఆడుకునే ఈ ఆటకు ఇంటర్నెట్లో ఆడడానికి సాఫ్ట్‌వేర్ కూడా నేనే వ్రాసాను. ఒకరు పోస్టు చేసిన పాట పల్లవి అంతిమ అక్షరంతో మొదలయ్యే పల్లవి వెరెవరైనా పోస్ట్ చేయవచ్చు. పాట పల్లవి మాత్రమే పోస్ట్ చేస్తే ఒకపాయింటు, మిగతా వివరాలు కూడా పోస్ట్ చేస్తే రెండు పాయింటులూ ఆటోమాటిక్‌గా వచ్చేస్తాయి. "Top Scorers" క్రింద 10 మంది పేర్లు పేజీపైన ఎప్పుడూ కనబడుతుంటాయి. పోస్ట్ చేసిన పాటలో ఏమైనా లోపాలుంటే (ఇంతకుముందే వచ్చిన పాట, పల్లవిలో తప్పులు వగైరా) ఎవరైనా దానిని చాలెంజ్ చేయవచ్చు. ఆలా చాలెంజ్ చేయబడిన పాటలను డిస్‌క్వాలిఫై చేయడానికి జడ్జీలని కూడా నిర్మించాము. ఓ తొమ్మిదివందల పాటలకు పైగా ఈ ఆట నడిచింది!

అంత్యాక్షరి తరువాత 'ఒకమాట' అనే ఓ క్రొత్త ఆట ప్రారంభించాము. ప్రతివారం ఒక 'Magic Word' వుంటుంది. ఉదాహరణకి 'చందమామ' అనుకోండి. ఈ పదం సాహిత్యంలో ఎక్కడైనా వున్న పాటలను పోస్ట్ చెయ్యాలి. అంత్యాక్షరిలాగా పల్లవి మాత్రమే కాకుండా పూర్తి సాహిత్యం తెలిసుండాలి ఈ ఆట ఆడడానికి! ఇచ్చిన పదమేగాక అదే అర్థం వచ్చే పదాలు కూడా వాడచ్చు. ఉదాహరణకి 'కానరార కైలాసనివాసా, బాలేంధుధరా జటాధరా' కూడా సరిపోతుంది! అంత్యాక్షరిలోలాగానే అధికంగా పాయింట్సు వచ్చిన వారి పేర్లు పేజీ పైన చూపించబడి వుంటాయి. దీనితో కాంపిటీషన్ చాలా తీవ్రంగా నడిచేది. వారం అవ్వగానే విజేతలను ప్రకటించి పదం మార్చేవాళ్ళం. ఒక వారంలో గెలిచినవారు వచ్చే వారం 'Magic Word'ని నిశ్చయించేవారు. ఇలా చాలా నెలలు ఈ ఆట సాగింది.

గత ఎనిమిదేళ్ళకు పైగా నడుస్తున్న 'Song of the Week' శీర్షికని హైదరాబాదు నివాసి నూకల ప్రభాకర్‌గారు ప్రారంభించారు. ప్రతివారం ఒక మంచిపాట, వీలయితే చాలామందికి 'క్రొత్త' పాట, వెతికి తెచ్చి ప్రచారం చేస్తూ వచ్చారు.

ఆరేళ్ళ క్రితం Song of the Week తో బాటు Video of the Week కూడా ప్రారంభించారు నూకలగారు. చాలా సినిమాల పాటలు మనకు దొరికినా వాటి సినిమా ప్రింటులు మిగలలేదు. కాని అదృష్టంకొద్దీ వీటిలో కొన్ని సినిమాలు ఇతర భాషలలో 'డబ్' చేయబడడం వలన ఆ పరభాష వీడియోలు దొరుకుతాయి. అలాంటి వీడియోలు సంపాయించి, ఆ పరభాష పాటని తీసేసి తెలుగు పాటను తగిలించి సృష్టించిన వీడియోలు ఈ పేజీలో పెట్టడం మొదలుబెట్టారు. ఇవేకాక చాలా మంచి పాటల వీడియోలు కూడా వారం వారం ప్రచారం చేస్తునే వున్నారు.

తలచిన దానికంటే ఎన్నోరెట్లు గొప్పగా కుదిరిన మా ఈ వెబ్‌సైటు చూస్తుంటే చాలా సంతోషంగానూ గర్వంగాను వుంది. కానీ ఒకవిధంగా బాధ కూడా కలుగుతుంది- వేరే పనుల వత్తిడిలో పడి ఈ వెబ్‌సైట్ maintainenceకి సమయం కుదరక కొంచెం పాత మొఖం పట్టింది. దీనిని బాగుచేసి వచ్చే తరాలకి, ముఖ్యంగా మన యువతరానికి సమర్పించాలని ఆశ. ఎంత నెరవేర్తుందో కాలమే చెప్పాలి! *



వృత్తిరీత్యా మెకానికల్ ఇంజనీర్ అయినా డా॥ శ్రీనాథ్ జొన్నవిత్తుల తెలుగు సాహితీ, సాంస్కృతిక రంగాలకు విలువైన సేవలను అందిస్తున్నారు. శృతిలయ అకాడెమిని స్థాపించి అనేక సంగీత, సాహిత్య కార్యక్రమాలు న్యూయార్క్‌లో నిర్వహిస్తున్నారు. తెలుగు మాటలతో ఆటలను సృష్టించారు. కథలు, వ్యాసాలు రాస్తారు. పాత తెలుగు సినిమా పాటలు, ముఖ్యంగా ఘంటసాల పాటలపై విరివిగా కృషి చేశారు.



కథ

# భామాకలాపం

శ్రీనిధి యల్లల

బాల్కనీ పిట్టగోడ పై చేతులు పెట్టుకుని కాఫీ తాగుతూ దీర్ఘంగా ఆలోచిస్తోంది ప్రియ. ఇప్పటికి ఇది నాలుగో కాఫీ. ఏదైనా సమస్య వచ్చినప్పుడు ఇలా కప్పులు కప్పులు కాఫీ తాగడం ప్రియ నైజం. ప్రియ అందం, తెలివి, చదువు, లౌక్యం, ఇలా ఒక్క మాటలో చెప్పాలంటే జీన్సు వేసుకున్న నేటి తరం పదహారణాల తెలుగు పిల్ల. ముంజేతి వరకు పెట్టుకున్న మెహంది డిజైన్, ప్రియ కొత్తపెళ్లి కూతురు అనే హోదాని గుర్తు చేస్తూ, ఇప్పుడిప్పుడే వెలసిపోతోంది. పెళ్ళైన వారానికే ఉద్యోగం వదిలి, సగటు తెలుగు అమ్మాయిలాగా, భర్త కార్తీక్‌తో కలిసి 'అమెరికా కాపురానికి', వచ్చింది.

తన సెల్‌ఫోన్ మోగడంతో, యధాలాపంగా చేతిలోకి తీసుకుని ఆన్ చేసిన ప్రియకి తెలియకుండానే భ్రుకుటి ముడిపడింది. కారణం, ఎంతో ఇష్టపడి, విశాల భావాలు గలవాడని కోరి మరీ చేసుకున్న మొగుడిగారి ఫేస్‌బుక్ పిచ్చి వల్ల. నిమిషానికో పేజిని లైక్ కొట్టడం, పది నిమిషాలకోసారి స్నేహితుల ఫోటోలపై కామెంట్లు చెయ్యడం, అరగంటకోసారి ఏదో ఒక పనికిమాలిన విషయాన్ని షేర్ చెయ్యడం ఇది అతగాడి వ్యసనం.

తన పేజిలో ఏం చేసుకున్నా ప్రియా పట్టించుకునేది కాదు. అసలు బాధంతా ఎందుకంటే, ప్రియ స్నేహితులని కూడా తన లిస్టులో ఆడ్ చేసేసుకుని, ఏదో వాళ్ళందరినీ ముక్కు కారే వయసు నుండి ఎరుగుదును అన్న చందంగా కామెంట్లు పెట్టుం టాడు.తన స్నేహితులంతా, "ఏంటి ప్రియా, నువ్వు మీ ఆయనకి రెండో భార్యవట కదా, ఫేస్‌బుక్‌ని నీకన్నా ముందే పెళ్లి చేసేసు కున్నాడట, నిజమేనా?' అని గేలి చేస్తుంటే ఒళ్ళు మండిపోతోంది ప్రియకి.

మొన్న ఎంతో సంతోషంగా తన ఫేవరేట్ హీరో సినిమాకి వెళ్లారు ఇద్దరూ. లైట్లు ఆర్పెయ్యగానే కార్తీక్ చేతిని పెన వేసుకుని, చక్కగా అతని భుజంపై తలవాల్చి ప్రేమగా ఏదో చెప్పబోతున్న ప్రియకి, నోటిఫికేషన్ వచ్చింది, ఏంటా అని చూస్తే, కార్తీక్ స్టేటస్ అప్‌డేట్. అది చూడగానే గాలి తీసేసిన బెలూన్‌లాగా నీరస పడిపోయింది. అప్పటి మొదలు సినిమా స్టార్ట్ అయ్యాక 'ఫీలింగ్ ఎక్సైటెడ్' అని, కాసేపయ్యాక పేర్లు పడేటప్పుడు ఒక సేల్ఫీ, సినిమా మొదలయ్యాక ఎలా వుందని ఒకటి, 'ఇంటర్వెల్ బ్యాంగ్' అంటూ ఒకటి, 'సెకండ్ హాఫ్,' అని ఒకటి, 'క్లైమాక్స్' అని ఒకటి ఇలా ఏదో ఒకటి పోస్ట్ చేస్తూనే వున్నాడు. సినిమా అయ్యేసరికి ఇంకోసారి కార్తీక్‌తో సినిమాకి రాకూడదు, ఒకవేళ వస్తే అయితే ఫేసుబుక్ అయినా రావాలి లేదా తానైనా రావాలి అనే నిర్ణయానికి వచ్చేసింది.

శని ఆదివారాలు సరదాగా చుట్టుపక్కల వున్న అందమైన ప్రదేశాలకు వెళ్ళేవారు కార్తీక్, ప్రియా. చక్కగా కబుర్లు చెప్పు కుంటూ ప్రకృతిని చూస్తూ ఇద్దరూ లోకాన్ని మర్చిపోవాలి అనేది ప్రియా ఆలోచన. ఏ అందాన్ని అయినా, ఆనందాన్ని అయినా కళ్ళతో ఆనందించి మనసులో భద్రపరుచుకే మనస్తత్వం ప్రియది. తాము ఫలానా ప్రదేశాలని చూస్తున్నామని లోకానికి అంతటికీ ఎంత త్వరగా చెప్పాలా, అని ఉబలాటపడే మన స్తత్వం కార్తీక్‌ది. జీవితంలోని ప్రతీ ఒక్క క్షణాన్ని కెమెరాకంటితో చూసి ఫేస్‌బుక్‌లో మిత్రులతో పంచుకుని ఆనందించే నేటితరం యువకుడు కార్తీక్.

ఇలాంటివే చెప్పేంత పెద్దవీ, మర్చిపోయేంత చిన్నవీ కాని బాధలు ప్రియవి. చెప్పులో రాయిలాగా కలవరపెడ్తున్నాయి. వెన్నెల్లో కూర్చుని కబుర్లు చెప్పుకోవాలని తన కోరిక. ఇంటి కొచ్చే టప్పటికి అలసిపోయి వచ్చే కార్తీక్ ఎంచక్కా చందమామ, వెన్నెల వున్న ఒక ఫోటోనీ ఫేసుబుక్కులో ఎక్కించి తనని ట్యాగ్ చేసే వాడు. నవ్వాలో ఏడవాలో అర్థం అయ్యేది కాదు ప్రియకి. పోనీ కాస్త మెల్లిగా అర్థం అయ్యేలా చెప్దామంటే, 'ఇంత చక్కగా చూసు కుంటున్నా నీకు నచ్చట్లేదా, నేనంటే ఇష్టంలేదా ప్రియా?' అని బిక్కమొహం వేసే కార్తీక్‌ని చూసి కరిగిపోతుంది. దాని కన్నా కూడా అలా అన్న ప్రతిసారీ 'ఫీలింగ్ స్యాడ్', 'ఫీలింగ్ లోన్లీ' అని ఎక్కడ ఫేసుబుక్కులో అప్‌డేట్ చేసి పరువు తీస్తాడేమో అనే భయం లేకపోలేదు.

పోనీ తన గోడంతా అమ్మకి చెప్పుకుందామంటే, "పిచ్చి మొహమా, బంగారంలాంటి పిల్లోడు. ఒక చెడు అలవాటులేదు, ఇంటిరుచి తప్పించి ఇంక ఏ రుచి నచ్చనివాడు, ఇంతకన్నా ఏం కావాలే. ఈకాలం ఆడపిల్లలకి మరీ సుఖాలు ఎక్కువై పోయాయే. మాకున్నన్ని కష్టాలు మీకు ఉన్నుంటే ఏమయ్యేవాళ్ళో. అనవసరం గా చిన్నచిన్న విషయాలని భూతద్దంలో చూసి కొడిగుడ్డు పై ఈకలు పీకమాక," అని ఎంచక్కా ఫోనులోనే తలంటు పోసింది.

ఇక ఏదో ఒక విషయంలో సర్దుకుపోవడం తప్పదు అను కుని చూసిచూడనట్లు వదిలేసింది. ఇక్కడే అసలు చిక్కు వచ్చింది. పెళ్లి కుదిరిన తరువాత మాటల మధ్యలో తను కాలేజిలో ఉన్నప్పుడు ప్రేమించిన అమ్మాయిని గురించి చెప్పాడు కార్తీక్. తను ఎంతనిజాయితీగా ప్రేమించిందీ, ఎలా ఆ అమ్మాయి వాళ్ళ నాన్న గుండెజబ్బుకూ, తన ప్రేమకు ముడివేసి తన ప్రేమను తుంచేసి ఇంకొకరిని పెళ్ళి చేసుకున్నదీ... అంతా వివరం గా చెప్పాడు. పెళ్ళికి ముందే అన్ని విషయాలు చెప్పేసిన కార్తీక్ పై ఇంకా ఇష్టం పెరిగింది ప్రియకి. పైగా ఇలాంటి విషయాలు ఈరోజుల్లో మామూలేనని, తాను చాలా స్పోర్టివ్ అని కార్తీక్‌తో చెప్పింది. ఇప్పుడు మళ్ళీ ఆ అమ్మాయితో ఫేస్‌బుక్ స్నేహం మొదలైంది. పోనీ ఏమైనా తెలియకుండా చాటుగా మాట్లాడు తున్నాడా అంటే, అదీలేదు. ఆ అమ్మాయి ఆడ్ రిక్వెస్టు పంపించిన దగ్గర నుండి, తను ఏం మెసేజి చేసింది వరకు అన్ని చెప్పే చేస్తాడు. ఇది మరీ పుండు మీద కారం చల్లినట్టు ఉంది ప్రియకి.

ఆ అమ్మాయి ఫొటోలకి ఈయనగారు లైకులు కొట్టడం, తమ ఇద్దరము ఉన్న ఫొటోకి ఆవిడగారు కామెంట్లు పెట్టడం ఇవన్నీ చూస్తుంటే అరికాలి మంట నెత్తికెక్కుతోంది ప్రియకి. పెళ్ళికి ముందు ఇలాంటి విషయాలు తేలిగ్గా తీసుకున్నా, తన మొగుడి దగ్గరికి వచ్చేసరికి మాత్రం, ఏడుమల్లెల ఎత్తు తెలుగు తనం సహించలేకపోతోంది. రోజుకోసారి ఆ అమ్మాయి ప్రొఫైలుని గూఢచారిలా చూడడం, ఆ అమ్మాయి తనకంటే బాగుందా లేదా అని తనలో తనే బేరీజు వేసుకోవడం, ఇదో వ్యసనంలా తయా రయ్యింది ప్రియకి. ఎలాగైనా ఇందులోంచి తనని, కార్తీక్‌నీ బయటపడెయ్యాలని నిర్ణయించుకుంది.

దెబ్బలాడి, భయపెట్టి, అలిగి పనులు చేయించుకునే మనస్తత్వం కాదు ప్రియది. ఇప్పుడిప్పుడే కట్టుకుంటున్న తమ గూడు ప్రేమ, నమ్మకంతో గట్టిగా పెనవేసుకుని ఉండాలే కానీ, బలవంతపు కాపురం కాకూడదని ప్రియా అభిప్రాయం. అందుకే తన బాధని ఎప్పటికీ మరచిపోని విధంగా కార్తీక్‌కి తెలియ జెయ్యాలి అని ఒక నిర్ణయానికి వచ్చి, ఇంట్లోకి వెళ్ళింది ప్రియ.

❖

ఎప్పుడూ బెల్లు కొట్టీకొట్టగానే నవ్వుతూ ఎదురొచ్చే ప్రియా, ఎంతసేపటికీ తలుపు తెరవకపోవడంతో తన దగ్గర వున్న తాళంతో తలుపు తెరుచుకుని వచ్చాడు కార్తీక్. బెడ్‌రూమ్‌లో బోర్లా పడుకుని ఐపాడ్‌లో ఫేస్‌బుక్ చూసుకుంటోంది ప్రియా.

"హాయ్ ప్రియా, ఏంటోయ్ అంత బిజీ?" అంటూ ప్రియనీ మీదికి లాక్కున్నాడు కార్తీక్.

"ప్లీజ్ కార్తీక్, మా కజిన్‌తో చాట్ చేస్తున్నాను.కాఫీ నువ్వే పెట్టుకుని తాగేసేయ్" అని మళ్ళీ చాటింగ్‌లో మునిగిపోయింది ప్రియ.

"ఓకే నో ప్రాబ్లం," అనేసి ఫ్రెష్‌అప్ అయ్యి కాఫీ చేసుకుని తాగి, తన పనిలో పడిపోయాడు కార్తీక్.

కాసేపటికి ప్రియ వంటింట్లోకి వచ్చి డిన్నర్ రెడీ చేస్తూ వుంది. మధ్య మధ్యలో తన ఫోన్ పిల్లికూతలు కుయ్యడం, వాటిని చూస్తూ ప్రియ తనలో తనే నవ్వుకోడం ఇవన్నీ కార్తీక్ గమనిస్తూనే వున్నాడు.

రోజూ తన పని చెడగొడుతూ, ఎప్పుడు తన చుట్టూ తిరుగుతూ, ఏదోటి మాట్లాడే ప్రియ అలా మౌనంగా తన పని తను చేసుకోవడం అస్సలు నచ్చట్లేదు కార్తీక్‌కి. ఇంట్లో ఉన్నాం అనే కంటే లైబ్రరీలో ఉన్నామేమో అనిపిస్తోంది వాతావరణం. భోజనం చేసేటప్పుడు కూడా పోటీలు పడి మోగుతున్నాయి ఇద్దరి సెల్ ఫోన్లు.

ఇలా రెండురోజులు గడిచేసరికి జీవితం నరకంలా కనపడసాగింది కార్తీక్‌కి. రోజూ తనతో చెప్పే కబుర్లన్నీ ఇప్పుడు ఫేస్ బుక్‌లో పెడుతోంది. పైగా ప్రియా వాళ్ళ కజిన్‌గాడు తెగ డిస్టర్బ్ చేస్తున్నాడు కార్తీక్‌ని. ప్రియా పెట్టిన పోస్టులన్నిటికి లైకులు కొట్టడం, చనువుగా కామెంట్లు పెట్టడం, ప్రియ చిన్నప్పటి ముద్దు పేర్లతో ఏడిపించడం, ఇవన్నీ కార్తీక్‌కి చిరాకు తెప్పిస్తున్నాయి.

ఆరోజు ఆఫీస్ నుండి బయలుదేరుతూ, 'ఫీలింగ్ కన్ఫ్యూస్డ్' అని స్టేటస్ అప్‌డేట్ చేసి, సెల్లు సైలెంట్‌లో పెట్టేసాడు. సాయంత్రం కాస్త తొందరగా ఇంటికి వచ్చాడు. అప్పటికి మొక్కలకి నీళ్ళు పోద్దామని బాల్కనిలో వుంది ప్రియ. తన వెనగ్గా వెళ్లి కళ్ళు మూశాడు కార్తీక్.

"చెప్పుకో చూద్దాం," అని కార్తీక్ అంటే,

"ఈ ఇంట్లో దొంగైనా, దొరైనా ఇంకెవరు, కార్తీక్ సారే," అంటూ నవ్వుతూ కార్తీక్ చేతులని విడిపించుకుని చెట్లకినీళ్ళు పోస్తూ సెల్ఫీ తీసుకోవడం మొదలెట్టింది ప్రియా.

కార్తీక్ వెంటనే ప్రియ సెల్ లాగేసుకుని ఇంట్లో పడేసి వచ్చాడు.

"ఫేసుబుక్‌లో అందరికీ చెప్పే కబుర్లు ముందు నాకు చెప్పు. తర్వాతే మిగతా వాళ్ళకి, సరేనా?" అని చిరుకోపంతో ప్రియని కసిరాడు.

"నువ్వే కదా సోషల్‌గా మూవ్ అవ్వాలి. ప్రపంచంతో ఎప్పుడూ టచ్‌లో ఉండాలి అన్నావు, అందుకే ఇలా చేస్తు న్నాను," అంటూ వచ్చే నవ్వుని ఆపుకుంటూ అమాయకంగా చెప్పింది ప్రియ.

"అంటే,అదంతా పెళ్ళికి ముందు. ఇప్పుడు మనకి మనమే ముఖ్యం. ముందు మనం, తరువాతే మిగతా ప్రపంచం," అన్నాడు కార్తీక్ చిన్నపిల్లాడు మొండికేసినట్టు.

తరువాత ఇద్దరూ కలిసి మొక్కలకి నీళ్ళు పోశారు. ఏ కుండీలో ఏ మొక్క ఉందో, ఏ చెట్టు ఎప్పుడు పూస్తుందో ప్రియ చెపుతూ వుంటే అలా వింటూనే వున్నాడు కార్తీక్. రెండు రోజుల మౌనం తర్వాత వినేసరికి మొక్కల పెంపకం కూడా తనకి ఎంతో ఇష్టమైన ఎకానమీ న్యూస్‌లాగ వినపడుతోంది కార్తీక్‌కి.

ఆ రోజంతా ప్రియ చుట్టూనే వున్నాడు కార్తీక్. తను వంట చేస్తుంటే పక్కనే వుండి మాట్లాడిస్తూ, కావలసినవి అందిస్తూ వున్నాడు. తర్వాత ఇద్దరూ కలిసి కబుర్లు చెప్పుకుంటూ బాల్కనీలో భోజనం చేశారు.

ఆ సాయంత్రమే కార్తీక్ ఇద్దరి ఫోన్లు సైలెంట్ మోడ్‌లో పెట్టడం ప్రియ చూసి కూడా గమనించనట్టే ఉర్కుంది.

రాత్రి ప్రియ పక్కన చేరి చిన్నిపిల్లాడిలా ముడుచుకుని పడుకున్నాడు కార్తీక్. కార్తీక్ జుట్టుతో ఆడుతోంది ప్రియ.

"ప్రియా, నేనో విషయం అడగనా?" అని గోముగా అడిగాడు కార్తీక్.

"ఊ అడుగు," అంది ప్రియ కార్తీక్ జుట్టుని చెరిపేస్తూ సరిచేస్తూ.

"మీ కజిన్ గురించి నాకు చెప్పనేలేదు నువ్వు. పరిచయం చెయ్యవూ?"

"ఎవరి గురించి?" ఏమి తెలియనట్టు అడిగింది ప్రియ.

"అదే రోజూ ఫేస్‌బుక్‌లో నిన్ను ఫాలో చేస్తాడే ఆ అబ్బాయి."

"ఓ వాడా? వాడు మా అత్తా వాళ్ళ అక్కకొడుకు. వరసకి బావ అవుతాడు. చిన్నప్పుడు వేసవి సెలవుల్లో కలిసేవాళ్ళం. బాగా ఆడుకునేవాళ్ళం. నాకు ఐస్‌క్రీములు, చాక్లెట్లు కొనిచ్చేవాడు."

"ఏడిచాడు వెధవ. వాడు కొనిస్తే మాత్రం నువ్వు తీసేసుకుంటావా. వద్దనలేకపోయావా?" ఉడుక్కుంటూ అన్నాడు కార్తీక్.

"అయ్యో అప్పుడు నేను చిన్నపిల్లని, అందరూ ముద్దుచేస్తారు కదా. అయినా ఇలా మధ్యలో ఆపేస్తే నేను చెప్పను అంతే పో," అని కార్తీక్‌ని తోసేసి అటు తిరిగి పడు కుంది ప్రియ, వచ్చే నవ్వుని ఆపుకుంటూ.

"సరే ఆపనులే చెప్పు చెప్పు. ఇంతకీ వాడి పేరేంటో?," కసిగా అడిగాడు కార్తీక్.

"ఫణిభూషణ్, ఫణి అని పిలిచేవాళ్ళం," అంది ప్రియా మళ్ళీ కార్తీక్‌ని తనవైపు లాక్కుంటూ.

"అదేం పేరు. ఏమి బాగోలేదు. నా పేరే బాగుంది," అని చెప్దామనుకుని మళ్ళీ ఎక్కడ తోసేస్తుందోనని అలానే గట్టిగా పట్టుకుని పడుకున్నాడు.

"నేనంటే చిన్నప్పటి నుండి వాడికి ఎంతో ఇష్టం. నన్ను ప్రత్యేకంగా చూసేవాడు. ఆటలో నేను దొంగయితే నా బదులు వాడే దొంగయ్యేవాడు. నన్ను గెలిపించేవాడు. సెలవుల్లో అన్ని సినిమాలకి తీసుకెళ్ళేవాడు."

"నువ్వెందుకు వెళ్ళావ్ అసలు. నేను తీసుకెళ్తాను, ప్రపంచంలో వున్న అన్ని భాషల్లోని అన్ని సినిమాలకి నేనే తీసుకెళ్తాను," అని పట్టు ఇంకాస్త బిగించాడు కార్తీక్.

"అయ్యో, నేనొక్కద్దాన్నేనా ఏంటి? మా అక్క, వాళ్ళ అక్క,

బాబాయ్ పిల్లలు ఇలా పదిమంది ఉండేవాళ్ళం. వాడు పెద్దవాడు కాబట్టి వాడిదే పెత్తనం," అని చెప్పింది ప్రియ.

'పుచ్చువెధవ, వీడి మొహానికి మళ్ళీ సినియారిటి ఒకటి,' అని మనసులో అనుకుని, "మరి అంత గొప్ప స్నేహితుడు మన పెళ్ళికి ఎందుకని రాలేదో?" అని అడిగాడు కార్తీక్.

"అదంతా పెద్ద కథలే. వాడికి నాకూ గొడవైంది. పెళ్ళికి నేను పిలవలేదు. పిలిచినా వచ్చేవాడు కాదులే," అంది ప్రియ.

"అబ్బో ఎందుకో గొడవ," అన్నాడు కార్తీక్.

"కాస్త పెద్దయ్యాక ఎవరి చదువుల్లో వాళ్ళం బిజీ అయి పోయాము. ఎక్కువగా కలిసేవాళ్ళం కాదు. నేను థర్డ్ ఇయర్‌లో వున్నప్పుడు అమ్మమ్మ వాళ్ళ ఊరిలో కలిశాము. అప్పటికే తను జాబ్ చేస్తున్నాడు. నన్ను పెళ్లి చేసుకుంటావా అని అడిగాడు?"

"అడిగాడా? ఎందుకు అడగడు? రాస్కెల్," అని దిగ్గున లేచి కూర్చున్నాడు కార్తీక్.

"విను మరీ. నాకు ఇష్టం లేదని చెప్పాను. వేరు వేరుగా వెతుక్కోవడం ఎందుకూ, ఎంచక్కా మనమే పెళ్లి చేసేసు కుంటే, సంబంధాలు వెతుక్కునే బాధంతా వుండదు కదా," అని నసపెట్టేవాడు. నాకా ఉద్దేశ్యం లేదు అని ఎంతో చెప్పాను. అయినా వినిపించుకోకుండా ఫోన్ చేసి విసిగించేవాడు. దాంతో పెద్ద గొడవైంది. జీవితంలో మళ్ళీ నాతో మాట్లాడవద్దని చెప్పేసా. అది మొదలు మళ్ళీ ఇప్పుడు మన పెళ్లి అయ్యాక ఫేస్‌బుక్ ద్వారానే కలవడం. అలా ఫూలిష్‌గా ప్రవర్తించి నందుకు సారీ చెప్పాడు."

"నువ్వు నమ్మేసావా?" అన్నాడు వ్యంగ్యంగా కార్తీక్.

"నువ్వేకదా విశాలభావాలు వుండాలి అన్నావు," అంది ప్రియా అమాయకంగా.

"అంటే అన్నానులే. నువ్వు మాట్లాడొద్దు ఆ పాము గాడితో. నాకిష్టం లేదు. ఇంకెవరితో అయినా మాట్లాడు, వాడితో మాత్రం వద్దు. నాకు మంట."

"పాముగాడు కాదు, ఫణి," అంది ప్రియ నవ్వుని ముని పంటితో నొక్కిపెడుతూ.

"నేనన్నది అదే," అన్నాడు కార్తీక్ కచ్చిగా.

"అబ్బో ఎందుకంత రోషం. ఇవన్నీ ఎప్పుడో జరిగిపోయి నవి. స్పోర్టివ్‌గా తీసుకోవాలి అంతేకదూ," అని నవ్వుతూ అంది ప్రియ.

తన మాటలు తనకే చెప్పడంతో మొదట కోపం వచ్చింది కార్తీక్‌కి, కానీ మంచంపై పడి నవ్వుతూ వున్న ప్రియని చూస్తే ఏదో గుర్తొచ్చినట్టు ఆగిపోయాడు. తను కూడా ఇలాగే ప్రియ వద్దు అంటున్నా వినకుండా ఏదో గొప్ప ఘనకార్యంలాగా తను ప్రేమలో వున్న రోజుల గురించి, చేసిన పనుల గురించి చెప్పే వాడు. ప్రియ చిన్నబుచ్చుకుంటే స్పోర్టివ్‌గా ఉండాలి అని చెప్పి నవ్వేసేవాడు. ఇప్పుడు తన బాణం తిరిగి తనవైపే ఎక్కుపెట్టిం దన్నమాట మాట ఈ అభినవ సత్యభామ అని అర్థం అయిపో యింది కార్తీక్‌కి.

ఒక్కసారిగా ప్రియని లాగి ఒళ్లో కూర్చోపెట్టుకుని, "ఏయ్ దొంగ నిజం చెప్పు, అసలు ఆ పాముగాడు లేడు కదూ, నన్ను ఆట పట్టిస్తున్నావ్ కదూ," అని అడిగాడు చక్కలిగింతలు పెడుతూ.

"అబ్బ ప్లీజ్ కార్తీక్ వదులు. ఇక నవ్వలేను," అంటూ గింజుకుంటోంది ప్రియ.

"అయితే చెప్పు నిజం," అన్నాడు.

"మరి ఎన్నిసార్లు చెప్పినా మీరు వింటేగా. మీ ప్రేమ యాత్రలు విన్నప్పుడల్లా నాకు ఎంత కడుపుమంటగా ఉండేదో తెలుసా. అమాంతం ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళ్ళిపోయి మీ పక్క నుండి దాన్ని లాగేసి, దాని చెంపలు ఏడాపెడా వాయించేసి, మిమ్మల్ని ఎత్తుకెళ్ళిపోవాలి అనిపించేది. మాములుగా చెపితే వినరు కదా. అందుకే ఈ 'రివర్స్ ఇంజనీరింగ్,' అన్నమాట," అంది ప్రియ.

"రాక్షసి... నిన్నూ," అంటూ ప్రియని ఇక కదలనివ్వలేదు కార్తీక్.

"మరి నా బంగారుపుట్టలో వేలు పెడితే కుట్టనా ఏంటి?" అని నవ్వింది ప్రియ.

"సరే మరి. ఇక మన పుట్టలో మనిద్దరమే . ఇంకెవరు వద్దు. అవును ఇంతకి ఆ పాముగాడు ఎవడు ఫేసుబుక్‌లో?" అని అడిగాడు కార్తీక్.

"హమ్... ఇంకా అడగలేదేంటి అనుకుంటున్నా. తను నాతో పాటూ పనిచేసిన కొలీగ్. మంచి ఫ్రెండ్, ఇలా హెల్ప్ కావాలి అంటే సరే అన్నాడు. అది సంగతి."

"అమ్మో ఇంత మోసమా, చెప్తానుండు నీ పని," అంటూ ప్రియని ఆక్రమించేసుకున్నాడు కార్తీక్.

❖

రాత్రి గెలుపోటముల మధ్య అలసిపోయిన ప్రియ బద్ధకంగా లేచి ఒళ్లు విరుచుకుంది.

మూగబోయిన సెల్లుని చూసుకుందామని తెరిచేసరికి, 'ఫీలింగ్ హ్యాపీ' అని కార్తీక్ స్టేటస్ శుభోదయం తెలిపింది. ✻



శ్రీనిధి యల్లల స్వస్థలం చిత్తూరు జిల్లా పీలేరు. కథలు, వ్యాసాలు రాసే వీరు సాయంకాలం కబుర్లు అనే బ్లాగు నిర్వహిస్తున్నారు. భర్తతో కాలిఫోర్నియాలో నివాసం.

# భారతావతరణము

## డా॥ తిరుమల కృష్ణ దేశికాచార్యులు



చిత్రం: వడ్డాది పాపయ్య

'సంస్కృత వాఙ్మయమునకు వాల్మీకిమహర్షి యెట్టివాఁడో తెలుఁగువాఙ్మయమునకు నన్నయభట్టారకుఁ డట్టివాఁడు. గత 11 శతాబ్దముల నుండి సాగిన మహత్తరాంధ్ర సాహితీ వ్యవసాయమునకు ఆ మహానుభావుఁడు అంకురార్పణము చేసి, దిశానిర్దేశము చేసినాఁడు. దీనికై రాజరాజనరేంద్రుఁ డా మహాత్ముని ప్రేరేఁచిన ఘట్టము ఆంధ్రసాంస్కృతిక చరిత్రలో అద్వితీయము, అజరామరమైనది. దీనిని స్మరించుకొనుట ఆంధ్రులందఱి కర్తవ్యం.

చ. అది యొక కౌముదీమహితయామిని, ఆకలశాబ్ధివీచికా
సదమలతాయుతప్రచురచంద్రికయందున నేను గౌతమీ
నదికడ సైకతమ్మున ఘనంబగువేడ్కఁ
జరించుచుండఁగాఁ
బొదలెను నూర్మికాకృతిని పూర్వకథాస్మృతు లెవ్వియో
మదిన్

మ. అదిగో! విశ్రిత రాణ్మహేంద్రపురవర్యం, బాపురీంద్రోజ్జ్వల
త్సదనాంతస్థితదీపమాలికలు శ్రీచాళుక్యభూనాథసం
సదలంకారకపండితప్రకరవిజ్ఞానాంకురంబుల్ బలెన్
హృదయాహ్లాదము గొల్పుచున్న వదిగో, ఈనాటికిన్
వెల్గుచున్

తే. ఔను! ఇది గౌతమీతీర మదియె రాజ
రాజనరపతి కొలువైన రమ్యనగరి;
కట్టినారట వాణికిఁ దొట్టతొలిగ
ననుపమాంధ్రకావ్యంపుహర్మ్యంబు నచట

కం. ఆకథ నామనమున న
స్తోకాబ్ధితరంగగతిని సుప్రచలితమై
ఈకవితారూపంబునఁ
బ్రాకట్యము నందుచుండె రసభరితముగన్.

సీ. పురహరుశిరసునం బూవై వెలుంగు శు
భ్రాంశుఁ డేఱేనికిన్ వంశకర్త,
సంస్కృతాంధ్రకవీంద్రసంచయంబుల కేధ
రావరుకొల్వు కేళీవనంబు,
పరమపౌరాణికపండితౌఘంబుల
కేనరేంద్రునిగోష్ఠి యింద్రగోష్ఠి,
నటనటీగాయకపటలంబు కెవ్వాని
పోషణం బమృతంపు ప్రేషణంబు,

తే. అతఁడు సర్వలోకాశ్రయుం,డన్యగండ
భైరవుండును, రాజకంఠీరవుండు,
విష్ణువర్ధనోర్వీశుండు, వేంగిరాజ్య
పట్టభద్రుండు, కూండవాంబాసుతుండు.

ఉ. చేతులఁ జామరంబుఁ గొని సేవిక లల్లన వీచుచుండఁగన్
కౌతుకమొప్పఁ జెంత నధికారులు, మంత్రులు గొల్చు
చుండఁగన్
భూతలమేలఁగా భువినిఁ బుట్టిన స్వర్భువనేశ్వరుండనం
బ్రీతిగ నొక్కనాఁడు బుధవేష్టితుఁడై కొలువుండె
నాతఁడున్.

సీ. జయ రాజరాజేంద్ర! సద్రక్షణోపేంద్ర!
పరగండభైరవ! పార్థివేంద్ర!
జయ రాజమార్తాండ! జయ రాజపరమేశ!
కూండవాంబాపుణ్యభాండరూప!
జయ భానుసమధామ! చాళుక్యకులసోమ!
భక్త్యాశయాలానబద్ధభీమ!
జయ విమలాదిత్యసత్పుత్ర! బుధజన
స్తుతిపాత్ర! సజ్జనస్తోమమిత్ర!

తే. విష్ణువర్ధనమహిపాల! విమలచరిత!
త్రిభువనాంకుశబిరుదాంక! త్రిదశవిభవ!
సకలభువనాశ్రయా! వేంగిసార్వభౌమ!
జయము రాజకంఠీరవా! జయము! జయము!

తే. అనుచు సుశ్రావ్యసంగీతఫణితిఁ బూని
వందిమాగధుల్ జయములు వల్కుచుండ
సకలసభ్యు లుత్తిష్ఠులై సంతసమున
నతి యొనర్చి కూర్చుండిరి పతికి నపుడు.

సీ. శబ్దశాస్త్రంబుల సారంబు నెఱిఁగిన
వైయాకరణసార్వభౌము లొకట,
తొలుమిన్కులం బల్కు నలువలో యన మీఱు
ఛాందసప్రవరులబృంద మొకట,
బహుపురాణోద్యానవాహ్యాళిపరులైన
పౌరాణికుల పరివార మొకట,
లాస్యసంగీతకలాతిలోత్తమ లైన
సారసాస్యల సమాజంబు లొకట,

తే. సారగీర్వాణవిద్యావిహారులైన
పండితోత్తము లొక్కచో, ప్రాజ్ఞు లాంధ్ర
వాగ్విదాంవరు లొక్కచో వఱలుచుండఁ
దనరె నాసభ సాక్షాత్సుధర్మకరణి

సీ. బ్రహ్మతేజము గల్గు ఫాలభాగమునందు
భసితరేఖలు చెలువారుచుండ,
శ్రోత్రయుగ్మమునందు శోభిల్లు మణికుండ
లమ్ములు తారాద్వయమ్ముఁ బోల,
ప్రవిశాలవక్షంబు వలయించు జందెంబు
మెఱుపుచందము మిఱుమిట్లు గొలుప,
అరుణంపుక్రొంబట్టుసరిగంచుసాలువ
ఉత్తరార్ధంబుపై నత్తమిల్ల,

తే. మల్లెపూవులకాంతిచే నుల్లసిల్లు
తెల్లదోవతివెన్నెలల్ చల్ల దెసల,
నయనతర్పణమొనరించె నన్నయాఖ్యుఁ
డాంధ్రకవితల్లజుం డాసభాంతరమున.

ఉ. నిండుమనంబు నవ్యనవనీతసమానము, సత్యవాక్కులా
ఖండలశస్త్రతీక్ష్ణములు, కావ్యపురాణచయార్థనిర్ణయా
ఖండితపాండితీగరిమ కాంచనగర్భసుధీద్విరుక్త మా
యండజవాహవంశమణియై తగు నన్నయభట్టసూరికిన్.

చ. అతఁ డతిహృద్యపద్యనిలయంబుల సుందరశబ్దశింజిత
ప్రతిరవముల్ రహింప, రసరమ్యముగా వివిధంబులౌ
నలం
కృతుల ధరించి నాట్యమొనరింపఁగ నాంధ్రవచోవ
ధూటికా
ప్రతతికి నేర్పినట్టి గురువర్యుఁడు ప్రప్రథమంబుగన్
భువిన్

కం. సతతజపహోమనిష్ఠా
యుతుఁ డాపస్తంబసూత్రుఁ డుజ్జ్వలమతియున్,
వితరణశీలుం డాతఁడు
క్షితితలమున కవతరిలిన గీష్పతిసముఁడున్

చ. అతులితసంస్కృతార్ణవము నంతయుఁ జిల్కి సుశబ్ద
రత్నసం
తతుల గ్రహించి తన్మణిశతంబుల నాంధ్రవచోంగనంబరి
ష్కృత నొనరించి, యార్యజనసేవ్యనుగా వెలయించి
మించెఁబో
యతఁడు తెనుంగుబాసకు మహాజనకుంబలె నిజ్జగంబు
నన్

కం. ఈవిధిఁ దత్పండితసభ
కావాహితులైనవిప్రు లతిశయవిద్యా
ప్రావీణ్యముఁ బ్రకటించిరి
వేవిధముల శాస్త్రవాదవిహృతిం దగుచున్.

ఉ. సారములైనవాదముల సంస్కృతకావ్యచయార్థ
మర్మముల్,
వారిజగర్భసన్నిభుఁడు వ్యాసుఁడు లోకహితార్థమై మహా
భారతవాక్పుటంబుల నిబద్ధమొనర్చిన ధర్మసూక్ష్మసం
భారములున్ సమగ్రముగ వ్యక్తమొనర్చిరి వార
లచ్చటన్

ఉ. పావనయామినీశకులవారిధిచంద్రములై సమస్తలో
కావనదక్షులై భరతఖండము నేలిన యట్టి పాండుధా
త్రీవరపుత్త్రవర్యులచరిత్రము లింపును గూర్చ, రాజరా
జావనినాథుఁ డిట్లనియె నాదరమొప్పఁగ నన్నపార్యుతోన్

మ. ఇవి యేనున్ సతతంబునాయెడగరంబిష్టంబులై యుండుఁ - బా
యవు భూదేవకులాభి తర్పణమహీయఃప్రీతియున్, భారత
శ్రవణాసక్తియుఁ, బార్వతీపతిపదాబ్జధ్యానపూజామహో త్సవమున్,
సంతతదానశీలతయు, శశ్వత్సాధుసాంగత్యమున్

చ. కులమునయందు మాన్యులయి కుంభిని నెల్లను నేలినట్టి ని
ర్మలగుణులైన వారల చిరంతనపూజ్యపవిత్రవర్తనల్
దెలుఁగునఁ గూర్చి యిమ్ముఁక సుధీవర! తీర్చుకొనంగ నెంతు నా
కులమున జన్మమందుటను గూడిన భూరిఋణంబు నీగతిన్

చ. హిమకరుదొట్టి పూరుభరతేశకురుప్రభుపాండుభూపతుల్
క్రమమున వంశకర్తలనగా మహినొప్పిన యస్మదీయవం
శమునఁ బ్రసిద్ధులై విమలసద్గుణశోభితులైన పాండవో
త్తముల చరిత్రనాకు సతతంబు వినంగనభీష్టమెంత యున్

చ. అమలసువర్ణశృంగఖురమై కపిలంబగు గోశతంబు ను
త్తమబహువేదవిప్రులకు దానము సేసిన తత్ఫలంబు త
థ్యమ సమకూరు భారతకథాశ్రవణాభిరతిన్ మదీయచి
త్తము ననిశంబు భారతకథాశ్రవణప్రవణంబ కావునన్.

కం. జననుత కృష్ణద్వైపా
యనమునివృషభాభిహితమహాభారత బ
ద్ధనిరూపితార్థ మేర్పడఁ
దెనుఁగున రచియింపు మధికధీయుక్తిమెయిన్.

తే. ఐన విద్వజ్జనానుగ్రహంబువలనఁ
దెలిసినంతగ నీపూన్కిఁ దీర్పఁదగిన
యత్నమొనరింతు నింక రయంబుగాను
రమ్యగుణసాంద్ర!చాళుక్యరాజచంద్ర!




కం. జనపతి యిటు లర్థింపఁగ
ఘనపండితుఁడయ్యును, కవిగణశేఖరుఁ డ
య్యును వచియించెను నన్నయ
వినయం బుట్టిపడఁగ నరవిభునకు నిటులన్

చ. అమలినతారకాసముదయంబుల నెన్నను, సర్వవేదశా
స్త్రముల యశేషసారము ముదంబునఁ బొందను, బుద్ధి బాహువి
క్రమమున దుర్గమార్థజలగౌరవభారతభారతీసము
ద్రముఁ దఱియంగ నీఁదను విధాతృనకైనను నేరఁబోలునే?

తే. విశ్వవీథుల విహరింప వేడ్కమీర
ఆంధ్రభారతి కట్లతఁ డనుపమాన
భారతప్రబంధంబను తేరునొకటి
సిద్ధమొనరింపసాగెఁ బ్రసిద్ధముగను.

ఉ. పాయక పాకశాసనికి భారతఘోరరణంబునందు నా
రాయణునట్లు వానసధరామరవంశవిభూషణుండు నా
రాయణభట్టు వాఙ్మయధురంధరుఁడుం దన కిష్టుఁడున్ సహా
ధ్యాయుఁడు నైనవాఁ డభిమతంబుగఁ దోడయి నిర్వహింపఁగన్

ఉ. సారమతిం గవీంద్రులు ప్రసన్నకథాకలితార్థయుక్తి లో
నారసి మేలునా నితరు లక్షరరమ్యత నాదరింప నా
నారుచిరార్థసూక్తినిధి నన్నయభట్టు తెనుంగునన్ మహా
భారతసంహితారచనబంధురుఁ డయ్యె జగద్ధితంబుగన్.

*నన్నయగారి భారతంలోని పద్యాలు*

*శ్రీమాన్ తిరుమల కృష్ణదేశికాచార్యులు మహబూబ్‌నగర్ జిల్లాలో జన్మించారు. అనేక పద్యకావ్యాలు, వైదిక సంస్కార గ్రంథాలను రచించారు. చాలాకాలంగా కంప్యూటర్ పై తెలుగు లిపిని రూపొందించటానికి కృషి చేసి శ్రీనాథ, పోతన లిపి తయారుచేశారు. ఇవి బహుధా ఉపయోగంలో ఉన్నాయి.*



కథ

# బడుద్ధాయ్

ఆర్. శర్మ దంతూర్తి

తలుపు చప్పుడవుతూంటే విమల అరిచింది, “కల్పనా వెళ్ళి తలుపు తీయ్, ఎవరో కొడుతున్నారు. కాలింగ్ బెల్ పని చేయట్లేదులా ఉంది.”

లేచి చాలాసేపైనా స్నానం చేయకుండా టివి చూస్తోన్న కల్పన విసుక్కుంటూ తలుపు తీసింది. ఎదురుగా ఎవరో అబ్బాయ్ టై కట్టుకుని డ్రెస్ షూస్‌తో ఆఫీస్‌కి వెళ్ళడానికి రడీగా ఉన్నట్టున్నాడు - “నమస్తే” అన్నాడు.

ఒక్కసారి తలమీదకి చేయి పోనిచ్చి జుట్టు సర్దుకుంటూ, “ఆ! ఆ!! ఎవరు కావాలి?” అంది కల్పన కంగారుగా.

“నిన్న రాత్రి మేము ఈ ఎదుటి అపార్ట్‌మెంట్లో దిగాము. ఇంకా ఏమీ సరుకులు, వెచ్చాలు పూర్తిగా తెచ్చుకోలేదు, ఏమనుకోకపోతే కాస్త కప్పు పంచదార ఇస్తారా? సాయంకాలం తెచ్చి ఇచ్చేస్తాను,” నవ్వుతూ అన్నాడు కేశవ్.

ఈలోపు విమల బయటకొచ్చి చూసింది మగ గొంతుక వినిపిస్తే ఎవరా అని. కల్పన వాళ్ళమ్మగారు విమలతో తానడిగినది చెప్తూ ఉంటే కేశవ్ విని చివర్లో చెప్పేడు కొంచెం బతిమాలు తున్నట్టూ మొహం పెట్టి, "మా మామ్మకి పొద్దున్నే కాఫీ నోట్లో పడకపోతే తోచదండి. అందుకే..."

విమల నవ్వుకుంటూ లోపలకెళ్ళి పంచదార తెచ్చి ఇచ్చింది. కేశవ్ వెనక్కి వెళ్తుంటే విమల కల్పన మీద అరవడం వినిపించింది, "ఇప్పుడర్థం అయిందా పొద్దున్నే లేచి స్నానం కూడా చేయకుండా కూర్చోకూడదో?" కేశవ్ నవ్వుకుంటూ తన అపార్ట్‌మెంట్‌లోకి వెళ్ళేడు మామ్మకి పంచదార ఇవ్వడానికి.

సాయంత్రం ఆఫీస్ నుంచి వచ్చేటప్పుడు మర్చిపోకుండా పంచదార కొని పట్టుకొచ్చి మళ్ళీ విమల ఇంటి తలుపు తట్టేడు కేశవ్. అప్పటికే ఏడు అవుతోంది. బాంబే మహానగరంలో అయిదింటికి ఆఫీసులు మూసేస్తే ఏడింటికి కళ్యాణ్‌లో ఉన్న అపార్ట్‌మెంట్‌కి చేరుకోవడంలో పెద్ద గొప్ప వింతేమీలేదు. విమలే తలుపు తెరిచింది ఈసారి కేశవ్‌కి. చెప్పినట్టు పంచదార పట్టుకొచ్చిన కేశవ్‌ని చూసి నవ్వుతూ అంది, "దీని కోసమేనా? కప్పు పంచదార ఇవ్వకపోయినా ఫర్వాలేదు."

"మీకు ఫర్వాలేకపోయినా మామ్మ నన్ను కూచోనివ్వదులెండి ఇచ్చేదాకా," చెప్పేడు కేశవ్.

విమల కొంచెం తలుపు తీసి, "రండి లోపలకి. ఈయన మావారు గౌతం." దాదాపు యాభై ఉండొచ్చేమో గౌతంకి, తీరిగ్గా కూర్చుని టివి చూస్తున్నట్టున్నాడు.

"నమస్తే," లోపలకొచ్చి గౌతంకి చేయి కలుపుతూ చెప్పేడు కేశవ్.

"ఏం చేస్తూ ఉంటారు?" గౌతం అడిగేరు కేశవ్‌ని.

"ఇక్కడే ఇండియన్ ఆయిల్ కంపెనీలో కెమికల్ ఇంజినీర్‌గా చేరానండి ఏడాది క్రితం. ఈ ఉద్యోగంలో జేరినప్ప ట్నుంచి గాలిస్తే మొత్తానికి ఈ అపార్ట్‌మెంట్ దొరికింది. మా మామ్మని తీసుకొచ్చి నిన్ననే దిగాం ఇక్కడ."

"మీ ఆఫీస్ దగ్గిరేనా ఇక్కడికి?"

"ఆఫీస్ దగ్గిరే. కానీ నేను పనిచేసేది రిఫైనరీలో. అంచేత రోజుకో చోటకి వెళ్తూ ఉండాలి. అదృష్టం ఏమిటంటే ఇప్పటి దాకా రాత్రి డ్యూటీల్లేవు. కొంతలో కొంత నయమే"

"ఎక్కడ్నుంచి వచ్చారు?"

"మాది ఆంధ్రాలో విశాఖపట్నం. నేను అక్కడే చదువుకున్నాను."

"అవునా? నేను పనిచేసేది ఇండియన్ రైల్వేస్‌లో. ఉద్యోగం చర్చ్‌గేట్ స్టేషన్ లోపల. ఎప్పుడైనా అలా వస్తే లోపల కొచ్చి గౌతం జోషి అని అడగండి," ఇంక వెళ్ళొచ్చన్నట్టూ చెప్పేడు.

"సరే, వెళ్తానండి. మళ్ళీ కలుద్దాం."

❖

వారం గడిచేక ఓ ఆదివారం కేశవ్ అపార్ట్‌మెంట్ బిల్డింగ్ మెట్లు దిగుతూంటే గౌతం, విమలా, కల్పనా, పైకొస్తూ ఎదుర య్యేరు, చేతులనిండా సామాను మోస్తూ. కేశవ్ చొరవగా "రెండు సంచులిలా ఇవ్వండి," అంటూ అందుకుని పైకి తీసు కొచ్చేడు. సామాను పెట్టేసి వెళ్ళబోతూంటే విమలే చెప్పింది, "ఓ క్షణం కూర్చోండి, చాయ్ పెడుతున్నా." సామాను లోపల పెట్టి బయట కొచ్చి కూర్చుంటూ గౌతం కబుర్లు మొదలుపెట్టేడు, "ఉద్యోగం బావుందా?" అంటూ.

"ఫర్లేదండి. ఇది రెండో ఏడు కదా, అలా మెల్లిగా అలవాటవుతోంది."

"మీ మామ్మగారు ఉన్నారా? చూసినట్టు లేదు."

"ఇంట్లోనే ఉన్నారండి. ఆవిడకి మడీ, ఆచారం ఎక్కువ కానీ మిగతా విషయాల్లో నాకన్నా ఉదార స్వభావం ఆవిడది," నవ్వేడు కేశవ్.

"మరి మీ తల్లితండ్రులూ, కుటుంబం ఎక్కడున్నారు?"

ఈ లోపుల టీతో వచ్చింది కల్పన. టీ తీసుకొచ్చిన కల్పన అక్కడే కూర్చుని వీళ్ళ మాటలు వినడం సాగించింది. బాంబే లాంటి మహానగరంలో ఇళ్ళు ఎలా ఉంటాయో తెల్సిందే. ఓ బెడ్రూమ్, హాల్, కిచెన్. "థేంక్స్," అని ఓ కప్పు అందుకుని తాగుతూ చెప్పడం మొదలుపెట్టేడు కేశవ్

"నా తల్లీ, తండ్రీ చిన్నప్పుడే పోయారండి. మామ్మే నన్నూ చెల్లెల్నీ పెంచింది. చెల్లెల్ని విశాఖపట్నంలోనే ఇచ్చాము. అక్కడే ఉంటోంది. మామ్మకి నేనూ, నాకు మామ్మా తప్ప ఇంకెవరూ లేరు."

"అయ్యో," అప్రయత్నంగా అంది విమల.

"ఎందుకండీ అయ్యో అన్నారు?"

"తల్లీ, తండ్రీ లేరంటేనూ..."

"అలవాటైపోయిందండి. అసలు అమ్మా, నాన్నా ఎలా వుంటారో కూడా తెలియదు నాకు. చాలా చిన్నప్పుడే పోయా రుట. ఇప్పుడు మామ్మ తప్ప ఇంకెవరూ లేరు."

"మీ మామ్మగారు మిమ్మల్ని ఎలా పెంచారో ఒక్క రూను."

"మామ్మ అంటే పాతతరం మామ్మ అనుకుంటున్నారా? మా మామ్మ ఇంగ్లీష్, హిందీ, తెలుగు అనర్గళంగా మాట్లాడ గలదు. ఈ మధ్యనే హిందీ టీచర్‌గా రిటైర్ అయింది. వీలున్నప్పుడు ఇక్కడికోసారి తీసుకొస్తాను లెండి. మడీ ఆచారం అంటుంది కానీ, నాకు చదువూ, సంధ్యా అన్నీ నేర్పింది మా మామ్మే. అవసరం అయితే రిక్షావాడికైనా సరే కాళ్ళు ఒత్తి సేవ చేయగలదు."

కల్పనా, విమలా నవ్వుతూంటే, గౌతం తానూ శృతి కలిపేడు.

"తెలుగువాళ్ళంటే కులం అనీ, శాఖలనీ పట్టింపు ఎక్కువంటారే?" గౌతం అడిగేడు.

"ఒకప్పుడలా ఉండేదేమో, కానీ ఇప్పుడు మారుతున్నా

రండి. మరీ అంత ఇదిగా లేదు పరిస్థితి. కానీ చిన్నప్పట్నుండీ కష్టపడ్డామేమో, మాకంత పట్టింపు లేదు. మా మడీ, ఆచారం అవీ మా ఇంట్లోనే."

"మా ఆఫీసులో ఉండే తెలుగాయన విపరీతమైన కారం తింటాడు. ఎలా హరాయించుకుంటాడో మరి," గౌతం అన్నాడు.

"మాకు ఆవకాయ లేకపోతే ముద్ద దిగదండి. గోంగూర పచ్చడీ, ఆవకాయ ఉంటే చాలు," టీ కప్పు బల్లమీద పెట్టి లేచేడు, "మళ్ళీ కలుద్దామండి, చిన్న పనిమీద బయటకెళు తున్నాను."

"ఈసారి మీ మామ్మగార్ని తీసుకుని రా," విమల చెప్పింది వెళ్తుంటే.

❖

ఆ పై వారంలో ఓ శెలవు రోజు మామ్మతో కలిసి మళ్ళీ గౌతం ఇంటి తలుపు తట్టేడు కేశవ్.

తలుపు తీసిన గౌతం, "రండి, రండి," అంటూ లోపలకి తీసుకెళ్ళి, "విమలా," అంటూ కేక వేసేడు. లోపల్నుంచి విమలా, కల్పనా ఇద్దరూ ఒకేసారి వచ్చేరు. పరిచయాలయ్యేక మామ్మ తనకూడా తెచ్చిన ఆవకాయా, గోగూర పచ్చడీ విమల కిచ్చి చెప్పింది, "మీకోసం ఇవి చేశాను. కారం ఎక్కువ వేయ లేదు లెండి. చూడండి మీకు నచ్చుతుందేమో?"

చాయ్ తాగుతూంటే గౌతం అన్నాడు మామ్మతో, "ఏమైనా మీ గుండె ధైర్యం మెచ్చుకోవాల్సిందే, ఇద్దరు చిన్నపిల్లల్ని ఒక్కరూ పెంచగలిగేరంటే."

"గుండె ధైర్యమా? భలేవారే, నాకు వేరే దిక్కు లేక అలా బతుకు ఈడ్చాను కానీ. ఎన్నిరోజులు ఒక్కద్దాన్నీ వీళ్ళు లేకుండా చూసి ఏడిచానో. ఇప్పుడైతే అలవాటు అయిపోయింది కానీ కొత్తలో భయంకరమైన కలలొచ్చేవి. మొండి ధైర్యంతో అలా రోజులు లెక్కపెట్టుకుంటూ గడిపేశాము."

"ఏదైనా మామ్మగారు హిందీ కేశవ్ కన్నా బాగా మాట్లాడు తున్నారు," కల్పనే అంది సరదాగా. కేశవ్ చురుగ్గా నవ్వుతూ చూసేడు బుంగమూతి పెట్టి కల్పన కేసి.

"నేను హిందీ టీచర్‌నమ్మా. దాదాపు ముప్పై ఏళ్ళు పిల్లలకి హిందీ నేర్పాను. వీడికీ వచ్చు. ఇలా బాంబే హిందీలో పడి ఏదో మాట్లాడతాడు కానీ, వాడూ హిందీ విశారద పరీక్షల దాకా చదువుకున్నవాడే."

కాస్సేప్పోయేక మామ్మ అంది, "మిమ్మల్ని చూసి మొదట్లో తెలుగువాళ్లనుకున్నాంస్మీ."

"అదెలా?" విమల అడిగింది

కేశవ్ చెప్పేడు, "మీ మరాఠీ వాళ్ళు పెట్టుకున్నట్టే మా తెలుగువాళ్ళు కూడా నుదిటి మీద బొట్టు పెట్టుకుంటారండి. ఇక్కడ బాంబేలో అందరూ పెట్టుకోరు కానీ, బొట్టు పెట్టుకున్న ఆడవాళ్ళు అచ్చు తెలుగువాళ్ళలా ఉంటారు."

కాసేపు కూర్చుని లేచేరు, కేశవ్, "మళ్ళీ కలుద్దాం," అని చెప్పేక.

ఇంట్లోకి రాగానే మామ్మ చెప్పింది, "కల్పన బాగుంది కదరా కేశవ్?"

"ఏమిటంటున్నావ్ మామ్మా?" అర్థం కానట్టు అడిగేడు కేశవ్.

"ఏమీ లేదులే, అమ్మాయిని చిదిమి దీపం పెట్టుకోవచ్చు. పెళ్ళైందో లేదో?"

"ఆ మధ్యనోసారి చర్చ్ గేట్ స్టేషన్‌కి వెళ్తే గౌతంగార్ని కలిశాను అక్కడే. చర్చ్ గేట్ బయటకొచ్చి ఓ చోట భేల్‌పూరి ఇప్పించాడు ఆయన. మాటల్లో తనకి ఇద్దరమ్మాయిలనీ మొదటి అమ్మాయిని ఢిల్లీ అబ్బాయికిచ్చారనీ, రెండో అమ్మాయి కల్పన పెళ్ళి అయిపోతే తనకి బాధ్యత తీరిపోయినట్టేననీ అన్నారు. సంబంధాలు వెతుకుతున్నారుట. ఒకటి ఖాయం అవ్వొచ్చు అన్నారు."

"అమ్మాయ్ ఏం చదువుకుంది?"

"బి.కాం. పాసై ఉద్యోగం కోసం చూస్తోందిట. బేంక్ పరీక్షలు రాస్తోందని చెప్పారు. అయినా ఇవన్నీ మనకెందుకు మామ్మా?"

"ఎందుకా? ఇంట్లో వంద కోతులుంటేనూ."

"వంద కోతులా?"

"అవునురా బ్రహ్మచారీ శతమర్కటః"

ఒక్క ఉదుటున దగ్గిరకొచ్చి తనచేత్తో మామ్మ నోరు మూసి చెప్పేడు కేశవ్ కంగారుగా, "మామ్మా వాళ్ళు మరాఠీ వాళ్ళు, చిత్ పవన్ బ్రాహ్మలుట. మనం నియోగులంటే వాళ్ళకి నచ్చుతుందో, అర్థం అవుతుందో తెలియదు. గట్టిగా అన్నావంటే వాళ్లకి వినపడొచ్చు. మళ్లీ ఈ మాటెత్తకు. సరేనా?"

"సరేలేరా వాళ్ళకి తెలుగు అర్థం కాదుకదా? అయినా నేను ఊరికినే అన్నానులే."

❖

తర్వాత్తర్వాత అప్పుడప్పుడూ కలుస్తూ ఉన్నా ఆఫీస్ పనిలో పడి తీరికలేకుండా పోయింది కేశవ్‌కి. ఆడవాళ్ళు మాత్రం కలుస్తూనే ఉన్నరు మగాళ్ళిద్దరూ ఆఫీసులకి వెళ్ళినప్పుడు. మామ్మ ద్వారా కేశవ్ ఒక్కో విషయం వింటూనే ఉన్నాడు. ఓసారి కల్పనకి స్టేట్ బేంక్‌లో ఉద్యోగం వచ్చిందనీ, ఇంకోసారి వాళ్ళ పెద్దమ్మాయికి మొగపిల్లవాడు పుట్టాడనీను. రోజులు గడుస్తు న్నాయ్. ఓ రాత్రి ఎనిమిదవుతూంటే గౌతం, విమలా కేశవ్ అపార్ట్ మెంట్ తలుపు తట్టేరు.

ఇద్దర్నీ లోపలకి ఆహ్వానించేడు కేశవ్. కేశవ్ మామ్మ లేవ బోతూంటే, విమలే చెప్పింది, "కూచోండి మామ్మగారు, ఇప్పుడే భోజనం చేశాం. మీరేమీ శ్రమపడొద్దు."

గౌతం మొదలుపెట్టాడు, "మా అమ్మాయ్ కల్పనకి పెళ్ళి

నిశ్చయం అయింది, వచ్చే నెల నాలుగున కల్యాణ్‌లోనే గుడి మండపంలో అనుకున్నాం. మీరు వచ్చి ఓ చేయి వెయ్యాలి సహాయానికి.''

''తప్పకుండా. నేను నాల్రోజులు శెలవు పెట్టి మీరేం చేయ మంటే అది చేయడానికి సిద్ధం,'' చెప్పేడు కేశవ్. మామ్మ కొంచెం విషాదంగా చూసింది గౌతం కేసి, తమ చేతిలో తిను బండారం ఆయనేదో లాగేసుకున్నట్టూ. ''పెళ్ళికొడుకు ఏం ఉద్యోగం?'' కూపీ లాగడం మొదలుపెట్టింది.

''ఆయనకి ఓ బట్టల బిజినెస్ ఉంది డొంబివాలిలో. తమ్ముళ్ళతో పాటు రెండు మూడు షాపులు చూసుకుంటు న్నారు.''

కాసేపు కూర్చుని వాళ్ళు వెళ్ళాక మామ్మ, ''కాస్త ఒంట్లో నలతగా ఉందిరా,'' అని పడుకుంది. మర్నాటి నుంచీ గౌతం ఇంట్లో పెళ్ళికళ మొదలైంది. పెళ్ళి నాలుగురోజులుందనగా కేశవ్ శెలవు తీసుకున్నాడు.

మాటవరసలో ఓసారి మామ్మ చెప్పింది, ''కట్నం పది లక్షలు అడిగాడుట పెళ్ళికొడుకు, ఐదు ఇచ్చారు; మిగతా ఐదూ పెళ్ళినాడిస్తామని చెప్పారుట.''

పెళ్ళిరోజున మామ్మతోపాటు, మండపంలో అడుగు పెడుతూంటే ఎవరో అడిగేరు కేశవ్‌ని, ''ఎవరబ్బాయ్ నువ్వు? ఇక్కడ తిరుగుతున్నావ్? ఇది మరాఠీ వాళ్ళ పెళ్ళి తెలుసా?''

''తెలుసండి. నేను కల్పనావాళ్ళు ఉండే ఎదురు అపార్ట్ మెంట్లోనే ఉండేది. వాళ్ళ నాన్నగారు అడిగితే ఇలా సహాయం చేయడానికొచ్చాను,'' ఏమనుకున్నాడో అడిగినాయన మళ్ళీ మాట్లాడలేదు.

ముహూర్తం దగ్గిర పడుతూంటే వెనక నుంచి ఏవో మాటలు వినపడుతున్నాయ్. మామ్మకి ఎవరో ఏడుస్తున్నట్టూ వినిపిస్తే కేశవ్‌తో చెప్పి అటువేపు వెళ్ళింది. లోపల గదిలో అందరి మొహాలు ఏదో పోగొట్టుకున్నట్టున్నాయ్ తప్ప కళలేదు. విమల మెల్లిగా ఏడుస్తున్నట్టు పైకే తెలుస్తోన్న విషయం. కల్పనని వేరే గదిలో ముస్తాబు చేస్తున్నట్టున్నారు.

మెల్లిగా తెల్సిన విషయం ఏమిటంటే ఐదు లక్షల కట్నం డబ్బు ఇవ్వడానికి ఓ బేగ్‌లో పెట్టారు. అ బేగ్ ఇప్పుడు కనిపిం చడం లేదు, ఎంతచూసినా. ఎవరో కొట్టేశారని అనుమానం. ఇవ్వకపోతే పెళ్ళికొడుకు తాళి కట్టడుట. ఈ డబ్బులన్నీ పెట్టి బిజినెస్‌లో పెడదామనుకుంటున్నాడు ప్రబుద్ధుడు. ఒక్కసారి ఇవి రాకపోయేసరికి అమ్మాయ్ అక్కర్లేదని గొడవ. పెళ్ళి చేసు కునేది అమ్మాయినా, డబ్బుల్నా? బయటకి తీసుకొచ్చి గౌతం గారితో చెప్పింది కేశవ్ మామ్మ, ''చూడండి, ఈ కట్నం ఐదు లక్షలూ మా అబ్బాయ్ సర్దగలడు కానీ ఇది ఇచ్చాక మీ అమ్మాయ్ సుఖ పడుతుందని మీరనుకుంటున్నారా?''

దీనికాయన దగ్గిర సమాధానం లేదు. మామ్మే అంది మళ్ళీ.

''మీ అమ్మాయ్ బేంక్‌లో ఉద్యోగం చేస్తోంది. ఇలాంటి




కట్నపిశాచిని చేసుకోవాల్సిన అవసరంలేదు. పొమ్మనండి.''

''ఇది తప్పిపోతే....'' నీళ్ళు నానుస్తున్నట్టున్నాడు గౌతం.

''దీని తాతలాంటి సంబంధం మరోటి వస్తుంది. పొమ్మ నండి బయటకి. మహా అయితే గియితే మీకూ ఈ మండపం ఖర్చులు పోతాయ్ అంతేకదా? అమ్మాయ్ బతుక్కన్నా ఇదెక్కువా?''

ఏమీ మాట్లాడాకుండా లోపలకి నడిచేడు ఆయన, విమల తోటీ, బంధువులతోటీ చెప్తాడేమో.

కాసేపటికి బయటకొచ్చిన విమల, ''మామ్మగారూ మీర న్నట్టు మీ అబ్బాయ్ డబ్బులు సర్దగలరా?''

విషయమంతా తెల్సిన కేశవ్ చెప్పేడు, ''సర్దగలను కానీ కల్పనని అడుగుదాం ఏమంటుందో.''

కేశవ్, మామ్మ చెప్పినదంతా విని కల్పన తన ముస్తా బంతా తీసి పారేసి చెప్పింది, ''నేను ఈ పెళ్ళి చేసుకోను. అసలు ఇలా కట్నం గురించి గొడవ అవుతుందని నాకు తెలియకుండా దాచారా?''

నెలరోజులు రోజూ ఎదురుచూసిన పెళ్ళి సంబరం అంతా గంటలో ముగిసిపోయింది. మండపం అద్దె డబ్బులిచ్చేసి గౌతం, విమలా పిల్లల్ని వెంటబెట్టుకుని ఇంటి కెళ్ళిపోయేరు.

❖

ఇంటికొచ్చిన విమలకి కాలూ చెయ్యీ ఆడలేదు. ఇంత వరకు వచ్చాక ఇప్పుడు అందర్లో తలెత్తుకోవడం ఎలా? రెండ్రో జులు పోయాక బట్టల కోసం బీరువాలో చూస్తూంటే అక్కడ కనబ డిందో సంచి. అది ఐదు లక్షలు కట్నం డబ్బున్న సంచి. ఇక్కడ మర్చిపోయేరన్నమాట. హతోస్మి.

సాయంకాలం గౌతం వచ్చాక చెప్పింది విమల డబ్బుల సంగతి. డబ్బుల సంచి ఇంట్లోకెలా వచ్చిందో గౌతంకి ఎంత బుర్ర బద్దలుకొట్టుకున్నా అర్థం కాలేదు.

ఓ వారంరోజులు కేశవ్‌కీ మామ్మగారికీ వాళ్ళని పలకరించ డానికి మనసొప్పలేదు. ఓరోజు బయట కెళ్ళడానికి బట్టలేసు

కుంటూంటే తలుపు తీసుకుని లోపలకొచ్చింది కల్పన, "మామ్మ గారున్నారా?" అంటూ

"రావమ్మా, మహాలక్ష్మిలా ఉన్నావు ఇవాళ, అసలే ఈ రోజు లక్ష్మివారం కూడాను," మామ్మ పలకరించింది.

"మిమ్మల్ని చాలారోజులు పలకరించలేదని ఇది ఇమ్మని అమ్మ పంపించింది," శ్రీఖండ్ ఉన్న గిన్నె అందిస్తూ చెప్పింది కల్పన.

కల్పనని బయటకెళ్ళనిచ్చి అంది మామ్మ, "ఒరే నీకిష్టం ఉంటే చెప్పు, నేను మాట్లాడతా వీళ్ళతోటి. ఇంతకన్న మంచి అమ్మాయి మనకి ఎక్కడ దొరుకుతుందిరా?"

"మామ్మా," అరిచేడు కేశవ్.

"నేను మాటవరసకి అయినా కనుక్కుని తీరుతా. నీకూ కల్పనకీ మంచి ఈడూజోడూ. ఎవరో దిక్కుమాలిన బట్టలషాపు ఓనర్ కంటే నువ్వు నయం కాదూ?" మామ్మ అనేది వినిపించు కోకుండా బయటకెళ్ళిపోయేడు కేశవ్.

ఇక్కడిలా ఉంటే అక్కడ కల్పన ఇంట్లో మరోలా ఉంది. మామ్మగారి రాయబారం కల్పనకి తెలుస్తూనే ఉంది. డబ్బులు దొరికాయి కనక, "మళ్ళీ మరోసారి పెళ్ళికొడుకుతో మాట్లాడ తారా?" గౌతంతో అంది విమల.

అక్కడే ఉండి ఇదంతా వింటున్న కల్పన విసురుగా అంది, "వాడినా? నేను చేసుకోను. అంతకంటే మామ్మగారి మనవడు కోటి రెట్లు బెటర్."

రెండ్రోజులు పోయేక మామ్మే ఉప్పందించింది కేశవ్ కి, "నేను అడిగాన్రా వాళ్ళని. అవునూ కాదూ అన్నట్టు ఊరు కున్నారు కానీ వాళ్ళకి ఇష్టమే అని పైకి తెలుస్తోంది. మళ్ళీ అడిగి చూస్తాను."

ఏడుపుమొహం పెట్టేడు కేశవ్. వాళ్ళకి కులం శాఖా అనేవి పట్టింపులుండొచ్చు. తాను ఎంత బుద్ధిగా చేతులు కట్టుకు కూర్చున్నా పరిధి దాటితే- కమలములు నీట బాసిన కమలాప్తుని రశ్మితోడ కమలిన భంగిన్, తమ తమ నెలవులు తప్పితే రేప్పొద్దున్న వీళ్ళు తన మొహం చూస్తారా మళ్ళీ?

❖

ఎక్కడైనా గౌతం కనిపిస్తారేమో, కాలర్ పుచ్చుకుని తిడ తారేమో అనుకుంటూ రోజులు గడుపుతున్నాడు కేశవ్. అక్కడికీ ఓరోజు కల్పన ఎదురుపడితే మొహమాటంగా పలకరించి వెళ్ళి పోతూంటే కల్పన చిన్నగా నవ్వడం తెలిసింది. అదే అడిగేడు, "ఎందుకండీ అలా నవ్వుతున్నారు?"

"మీరేదో తప్పుచేసినట్టు భయపడిపోతూంటే నవ్వొ స్తోంది."

గతుక్కుమన్నాడు కేశవ్. వడివడిగా కదిలిపోయేడు.

ఓరోజు ఆఫీసు నుంచి ఇంటికొస్తూ ఉంటే బయట కని పించేరు గౌతం. పక్కనో ఇద్దరు స్నేహితులున్నట్టున్నారు. కొంచెం భయం వేసిన మాట నిజం. కేశవ్‌ని దగ్గరకి రానిచ్చి గౌతం చెప్పేడు, "మీరు ఓసారి చర్చ్‌గేట్ స్టేషన్‌కి రాగలరా రేపు?"

"అలాగే," ముందుకి కదిలిపోయేడు భయంగా వెనక్కి చూసుకుంటూ. వెనక నుంచి వాళ్ళ నవ్వులు వినిపిస్తూనే వున్నాయ్.

మర్నాడు చర్చ్ గేట్ స్టేషన్‌లో కలిసేక గౌతం చెప్పేడు, "మీ మామ్మగారు మా దగ్గిరకొచ్చి అడిగారు..." ఆయన ఇంకా ఏదో చెప్పబోతూంటే కేశవ్ అందుకున్నాడు, "సార్, మా మామ్మ అనేది పట్టించుకోకండి. ఆవిడంతా చాదస్తం. ఊసుపోక ఏదో అంటూ ఉంటుంది. మీకంత కష్టంగా ఉంటే వేరే ఇల్లు చూసు కుంటాం కానీ ఏమీ అనుకోకండి. నేను నా స్నేహితుల్తో చెప్పి ఉంచాను కూడా..."

గడగడా వాగుతున్న కేశవ్‌ని చూస్తూ అన్నారాయన, "అయితే మీకిష్టం లేదా?"

"ఏమిటిష్టం లేదా?"

"కల్పనని చేసుకోవడం. మీ మామ్మగారు చెప్పడం ప్రకారం మీకిష్టమే అనుకున్నాం మేము."

ఒక్కసారి గొప్ప బరువు దిగిపోయిన ఫీలింగ్! హమ్మయ్యా ఈయన తనని తన్నించడానిక్కాదన్నమాట ఇక్కడకి పిలిచింది, "సరే చెప్పండి నన్నెందుకు పిలిచేరు?"

"నేను మీ గురించి కల్పనతోటీ, మా పెద్దమ్మాయ్‌తోటీ మాట్లాడేను. వాళ్లకిష్టమే. మీరు ఒప్పుకుంటే."

చేతిలో టీ గ్లాసు వొలికి మీద పడేదాకా కేశవ్‌కి ఆయన ఏం మాట్లాడుతున్నాడో అర్థం కాలేదు.

"మిమ్మల్ని ఇక్కడికి పిల్చింది ..." ఆయన చెప్పుకు పోతున్నాడు.

ఇది జరిగిన సరిగ్గా రెండు వారాలకి కల్పన కేశవ్ ఇంట్లో అడుగుపెట్టింది మెడలో మంగళసూత్రంతో. మామ్మ సంతోషం చెప్పనలవి కాదు. ఎప్పటిలాగే, "మహాలక్ష్మి వచ్చిందిరా," అంటూ లోపలకి తీసుకొచ్చింది కల్పనని. తన రిటైర్‌మెంట్ డబ్బుల్లో ఓ పాతికవేలు తీసి చేతిలో పెట్టి చెప్పింది మామ్మ, "ఇద్దరూ వెళ్ళి లోనావలా, మహాబలేశ్వర్ అన్నీ తిరిగి రండి. ఇది మీకు నేనిచ్చే పెళ్ళికానుక."

❖

లోనావాలాలో హోటల్ గదిలో ఉండగా కబుర్లలో కల్పన అంది కేశవ్ తోటి, "నా పెళ్ళి తప్పిపోవడం, మిమ్మల్ని చేసుకో వడం అంతా ఒక కలలా లేదూ?"

"అంతా పంచదార మహిమ."

"పంచదార మహిమా? అదేమిటి?"

"మొదటిసారి నేను మీ ఇంటికొచ్చినప్పుడు కప్పు పంచదార అడిగేను కదా?"

"అయితే?"

"అలా రాణీగార్ని వలలో వేశాను కదా?"

"దానికీ దీనికీ ఏమిటి సంబంధం?"

"నేను అపార్ట్‌మెంట్లు వెతుకుతుంటే కిందన అద్భుతమైన సుందరి కనిపించింది. మాట్లాడితే ఏమంటుందో తెలియదు.

చెప్పు తీసుక్కొట్టదు కదా? అనుకుంటూ పైకొచ్చాను. అక్కడే మీ మామయ్య కొడుకు కనిపించేడు. వాడు నేనూ పనిచేసేది ఒక ఆఫీసులోనే. కాని అది మీకు తెలియకుండా జాగ్రత్త పడ్డాము. వాడికి నా గురించి అన్నీ తెలుసు. మీ నాన్నగారితో చెప్తే ఏమంటారో తెలియదు. అందుకుని చివరిదాకా చూశాం."

"ఏమిటీ ఇదంతా మీరూ వాడూ ఆడిన నాటకమా? ఎంతకి తెగించారు? మరి నాకూ ఆ డోంబివిలి పెళ్ళికొడుక్కీ పెళ్ళైపోయుంటే?"

"ఎలా అవుతుంది? ఆ బట్టల షాపువాడు డబ్బు కోసం నిన్ను పెళ్ళి చేసుకుంటున్నాడని నిరూపించడానికి ఐదు లక్షల బేగ్ నేనూ మీ మావయ్య కొడుకూ దాచేం కదా? ఒక్కసారి వాడు కట్నం లేకపోతే పెళ్ళిచేసుకోననేసరికి వాడి అసలు రూపం బయటపడింది. తర్వాత మీ నాన్నగారి డబ్బులు మీ ఇంట్లోనే పెట్టేశాం. మీ డబ్బులు మీకూ, నా రాణీ నాకూ," కల్పనని దగ్గిరకి లాక్కుంటూ చెప్పేడు కేశవ్, "తర్వాత మామ్మతో కూడా రాయబారం నడిచింది కదా? మరి నాకు నచ్చిన అమ్మాయి కోసం అంత కష్టపడద్దా?"

"ముందే నాతో ఎందుకు చెప్పలేదు?" చిరుకోపంగా అడిగింది

"మీకు ఆంధ్రా అంటే నచ్చుతుందో లేదో అని మా భయం. అయినా నేను నీకు నచ్చాలి కదా?"

"నాతో చెప్తే పది నిముషాల్లో పనైపోయి ఉండేదోయ్ బడుద్ధాయ్. ఇంటి ఎదురుగా ఉన్న ఇంజినీర్‌ని కాదని ఎవరో బట్టలషాపు ఓనర్ని చేసుకోమన్నందుకు నాకెంత ఏడుపొచ్చిందో?"

"అవునా, మరి ఎందుకు చెప్పలేదు నాతో?"

"చెప్పానుగా? నువ్వో బడుద్ధాయ్‌వనీ, మామ్మ కూచి వనీ?"

"హేయ్, మామ్మనేం అనకూ, ఈ ట్రిప్ ఆవిడ ధర్మమే, నువ్విప్పుడు మా ఇంటి మహాలక్ష్మివి," మరోమాట రానివ్వ కుండా కల్పనని చుట్టేసాడు కేశవ్. *

*శర్మ దంతుర్తి స్వస్థలం కాకినాడ, సామర్లకోట. ఈమాట, కౌముది, సుజనరంజని మొదలైన అంతర్జాల పత్రికలలో ముప్పై దాకా కవితలు, కథలు రాశారు. వీరి రచనలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు వచ్చాయి. కౌముది అంతర్జాల పత్రికలో పోతన భాగవతంలో రసగుళికలు ప్రస్తుతం ధారావాహికంగా వస్తోంది. నివాసం కెంటకీ.*


*With*
*Best Compliments*
*From*



## Stage Whispers

*Yashodar Punati*

Identifying Krishna was easy! Obviously he was the one with the blue body and trademark gold crown with peacock feathers. By association, I assumed that it was Arjuna standing next to Krishna.They were both dressed in their mythological finery with gold crowns, assorted jewelry, silk costumes and gaudy, garish makeup! I was about 10 years old and this incredible (and indelible) scene played out near my house in SVR Colony in Hyderabad. It was part of the Rama Navami celebrations in our colony - which used to be celebrated with much pomp and ceremony, on a grand scale, over several days! There was a huge shamiana (tent of bright colored cloth) and a stage setup on our street in front of Sriram Murthy Uncle's house. Earlier in the day there were elaborate poojas and other traditional rituals (Seeta-Rama Kalyanam) on that stage, which was beautifully decorated with garlands of chrysanthemum and jasmine as well as mango leaf thoranams.The rituals ended with the distribution of yummy prasadam, which was always the highlight of my day! Each night, there were wonderful cultural programs on the stage that regaled us late into the night. The highlight for that particular evening was a mythological drama - an episode from the Mahabharata. While everyone was waiting patiently for the drama to start, a few of us sneaked back stage - which was really the road in front of Chandraiah uncle's house! We just stood there wide eyed - gawking at these larger than life actors! When I saw the Arjuna take a couple of puffs on a cigarette, it just blew me away! That image has been burned into the 10 year old's memory forever! Before we could recover, a couple of aunties from the colony stopped by to do haarathi for the actors. They spotted us and yelled at us to go back and sit with the rest of the audience.

That night's performance was my first significant exposure to actors and acting and it made quite an impression on me (along with the incongruous 'Smoking Arjuna', of course)! Those guys did a superb job of conveying the story through sung poems and powerful dialog. It did not matter that they had minimal set decoration or musical accompaniment (just a harmonium) to work with. I was totally mesmerized and transported to a different world altogether. Such was the power of their acting and storytelling! Right then and there I decided that I wanted to be an actor.



### *This should be Child's play, right?*

I got my first shot at acting the following year on that same stage - thanks to Smt. Ganga Bhavani - who used to run the colony's Baalananda Sangham. She was a kind-hearted and patient lady. She probably saw something in me (or was it a case of affirmative action - and mediocre kids needed to be represented as well)! I was given a role with a grand total of 2 lines. I was extremely thrilled. I practiced these lines over and over again. The play was called "Inii mandu sonthi kashaayam". On the D-day, when it was my big moment - I clearly remember taking one look at the audience and panicking! I totally froze and barely whispered the lines! Luckily for the play and the rest of the cast, it turned out that my lines were inconsequential anyway!

### *Radio Times*

In spite of my less than stellar debut, Ganga Bhavani aunty did not give up on me! She gave me yet another acting role - in fact several of them - in a serial Radio Drama that our Baalananda Sangham performed on the Baalanandam radio

program (with Nyayapati Raghava Rao and Nyayapati Kameshwari as Radio Annayya and Akkayya) at All India Radio, Hyderabad! This drama aired on several Sundays and I went around boasting to everyone that I was a star on the radio. It didn't matter that I was only playing bit roles - as a servant of the side-kick or part of crowd scenes! That's how all big stars got their start anyway… right?

### *Theater Junkie!*

During school days, final exam time meant three things - scheduled power cuts, Rama Navami celebrations in the colony and drama competitions at Dad's office (AG's office). Telugu Nataka Samithi was the cultural organization at AG's office and they had their annual drama competitions almost always in April. I was so addicted to these that even during exams, I would walk all the way to the office (about 2 miles), watch every single play and then walk back home late at night (even if no one from the family came along). I have fond memories of many wonderful performances that I experienced in that open air auditorium. I got a chance to watch amateur thespians as well as seasoned veterans perform on that stage. Paruchuri Venkateshwara Rao - who went on to make his mark as a writer in the movie industry was from AG's office and was a regular at these competitions. I saw multiple performances by Rallapalli, before he became a successful movie actor. I saw gripping and hilarious performances of "Kanyasulkam" by J.V.Ramanamurthy (as Gireesham) and J.V.Somayajulu (before his successful crossover into the movie industry via "Sankarabharanam") twice in that year - once at AG's office auditorium and again at Ravindra Bharati. I was so obsessed with this performance that I used to go around repeating the funny dialogs from Kanayasulkam for weeks!

### *Breaking a leg (again)!*

When I was in 8th grade or so, I found out that they were looking for actors for the school play! I jumped at the opportunity! Once again, I got a role with barely a few lines. I guess my notoriety of excelling at such minimal roles had spread far and wide by then! This Hindi play called "Mrityu Mantri" was to be performed at the school Annual day function. It was an off campus event - at Indira Priyadarshini Auditorium in Public Gardens. Back then it was the second most impressive stage in Hyderabad (after Ravindra Bharati)! So, as you can imagine, it was a fairly big deal! During rehearsals, I received compliments from our Hindi teacher (who was the director of the play).

Obviously he had high expectations - because he had heard (mostly from me) about my amazing performance on the radio drama! On the day of the performance my entire extended family was there to show support! Some of them helped me with my makeup! From backstage, I could hear the bursts of laughter from the audience! Finally it was my turn to make a grand entrance - for which I got a couple of laughs (as expected)! When I turned to face the audience to deliver my precious dialog - my knees started shaking! I froze and just mumbled my lines. The other guy on stage had to repeat my lines! Luckily, it was publicized beforehand that this was a rip-roaring comedy! So, the audience thought all this - including my incoherent mumbling - was part of the play and roared with laughter all through.

I was beginning to see a pattern. Maybe acting wasn't really my forte! While I loved being a theater junkie - I had decided that I should look elsewhere for better career (and even hobby) options!

### *My Regards to Broadway!*

Then, many years later I came to the US, and I saw the "Radio City Christmas Spectacular" in New York. It was a mind blowing experience! The scale of the performance - the number of performers involved, the amazing split-second set changes from a street scene to ornate palace to an ice skating rink were nothing short of miraculous. The entire live orchestra (pit band) of about 30 performers moves from below the stage to the stage and then is moved 6 feet above the stage - all the while continuing to play music (without missing a beat)! A few years later, we experienced the magic of musical theater - when we saw "Thoroughly Modern Millie" - a Tony award winning musical on Broadway! I wish, if at all possible, that everyone who is in the vicinity could experience at least one Broadway show! It will be an experience that you will never forget!

If you are in the US, there is an easier and cheaper way to experience 'almost' Broadway - by checking out your local high school performances! Our local high school, where both of my daughters graduated from, has a wonderful theater program and they put on amazing plays, twice a year. They spend months planning these shows. There are a couple of rounds of auditions to pick the cast. Other than a few guiding theater staff - the entire show is by the students - including set decoration, costumes, music, choreography etc. I had the opportunity to experience the following amazing performances over the past few years - Music Man, Sound of Music, Beauty and the Beast, Crucible, Children of Eden and Brigadoon. For $10 you get to sample almost Broadway like shows, which in NY would end up costing you ~$200 and up!

While a career in the performing arts did not work out for me, I am still crazy about the theater and do hold stage performers in very high regard! Each year, I sit down with chips, salsa and other assorted unhealthy snacks to enjoy the Tony awards show on TV, the way most people do for Super Bowl! When I watch those amazing live performances, after I applaud and admire the actors - I always end up with self-pity - "if it weren't for the crippling stage fright, lack of any discernible talent or a face which was meant for radio - that could easily have been me on that stage!!" ❋



***When I am not being the Best-audience-member at concerts & plays, I have been writing - nostalgia-centric vignettes for my blog www.recoveringnostalgic.wordpress.com. Someday I do hope to go back to my original love - Tabla or put more effort into my recent love - Golf! I have been living in the Philadelphia area with my lovely wife Uma since 1988.***

ACSON
Insurance Services Inc.

Phone: 248-269-9900; Fax: 248-269-9889, 248-269-9964
Email: services@acsoninc.com; Website: www.acsoninc.com

- Your Road to Dependable Insurance Coverage!!!
- Provider of Health Insurance……...
- Affordable Care Act Compliance.
- Specialize in Group Employee Benefits Packages for Information Technology, Engineering Companies & Small Business anywhere in the US.
- Whether you're a large employer, a small business or a start-up company looking for affordable Employee Benefits, Acson can fulfill your Insurance needs.
- Access to the latest information.
- Nationwide coverage.
- Continuous support……..

**Our Mission:**

To enrich our clients with Insurance coverage while minimizing their premium dollars.

W. Big Beaver Rd, Ste 305, Troy, MI 48084.

# 'త''న'తో తానా

సుజన పాలూరి

నీతో, నాతో నూతన తతినౌతానన్న తానా
నీతను నను తేనెను తిన నేతౌనను నా తానా
నా తెన్నున నేనున్నను నాతో తానున్న తానా
తనను తన్ను తన్నిననూ నెత్తిన నిన్నెత్తు తానా!

తానాతో నున్నానా? నా నాన్నతోనున్నానా?
తాత నత్తను, నాన్నను నాతో తానా తేనా?
నితత తంతి తాననతో నేనే తానన్న తానా
నీ తానా, నా తానా, తానే నేనా? నేనే తానా?

తానా సంఘం గురించి కేవలం 'త', 'న' అన్న రెండే అక్షరాలు వాడి రాసిన మినీ కవిత





కథ

# రంగు బలే రాంచిలక

ఎన్నెల

'ఏం తిన్నావమ్మా, పిల్ల ఇలా వెన్నలాగ పుట్టిందీ,' అని నర్సులు అనగానే మా వెర్రితల్లి బోల్డు సంబరపడిపొయ్యి మా నాన్నతో నరుసమ్మలందరికీ ఘనంగా ఈనాము లిప్పించింది. పాపం ఆ పొగడ్త ఈనాముల కోసమే అనికానీ, పుట్టిన ప్రతి బుజ్జాయి గురించీ నరుసమ్మలు అదే డైలాగ్ కొడతారనికానీ కనిపెట్టలేకపొయ్యింది. నేను చెపుదామని నోరు తెరిచేలోగా, 'నా తల్లి ఏడవకు' అని దగ్గరికి తీసేసుకుంది. స్వతాహా తల్లిప్రేమ వల్లనో, నరుసమ్మల మాట బలమో, మా అమ్మ కళ్ళకి నేను వెన్నరంగులో ఆనేసాను. ఇంకేముందీ ఎన్నెలని పేరు కూడా అప్పటికప్పుడు పెట్టేసి నామకరణం తాలూకు ఖర్చుల్ని బ్యాంకీలో పడేసింది.

అమ్మకు తొందరెక్కువని చుట్టాలందరూ ఆడిపోసు కుంటారు.

రాగా రాగా 'ఎన్నెల-నల్లగా ఉంటుందీ' అని ట్యాగ్ లైన్ నా పేరుతో సెటిల్ అయిపోయింది. ఏమే కళా, ఒక్కళ్ళకయినా తగ్గ పేరు పెట్టలేదు. గుణాలంటే పెద్దయ్యేవరకూ తెలియవు కానీ రంగు పుట్టగానే తెలుస్తుందిగా. అంటూ చుట్టాలందరూ క్లాసులు పీకేవారు. 'పుట్టగానే వెన్నలాగే ఉంది వదినా' అని అమ్మ సంజాయిషీ ఇస్తూ ఉండేది. శ్యామలక్క పేరు గతం గతహా కాబట్టిన్నీ, నా పేరు ఇంకా

గతంలోకి వెళ్ళలేదు కాబట్టీన్నీ నాకు ఎలాగయిన అమ్మనొప్పించి 'బొగ్గో' 'కొరివో' అని పేరు పెట్టించేసి నన్ను 'సార్థక నామధేయురాల్ని' చేయ్యడానికి ఆరాట పడుతున్న బంధుగణాన్ని తోసిరాజని అమ్మ నన్ను తన దోవలో 'సార్థక నామధేయురాలను' చేయు పనికి తాను కంకణం కట్టు కుంది...

పసుపు, చందనం ,పాలూ, పళ్ళూ మాత్రమే కాకుండా ఇసుకా ఇటుకా కచికా గరికా యేవి దొరికితే వాటితో నన్ను తోమెయ్యడం మొదలుపెట్టింది. అమ్మ బాధ అమ్మది. అబ్బ పేరుకి తగ్గట్టు ఎన్నెల్లా ఎంత తెల్లగా ఉందో అనిపిం చెయ్యాలని అమ్మ తాపత్రయం. అలా తోమితోమి అలసి నన్ను మా (అ)శాంతక్క చేతిలో పెట్టేసేది. మా అక్కేమో నా చుట్టూ పవుడరు మేఘాల్ని సృష్టించేసి కొంచెం పవుడర్ని ముక్కుల్లోకీ నోట్లోకీ కూడా పోసేసి నన్ను ఉక్కిరిబిక్కిరి చేసి తన శాంతి కపోతాన్ని ఎగుర వేసేది.

పక్కింటిలో కొలువయి ఉన్న గురువుగారి సలహా మేరకు నాన్న తెచ్చిన విభూదిని క్రమం తప్పకుండా ఎవరో ఒకరు వంద గ్రాములు కొబ్బరినూనెలో కలిపి పై పూతగానున్నూ, వంద గ్రాములు పాలల్లో కలిపి లోపలికిన్నీ డోసు ప్రకారము పగలు పదిమార్లున్నూ, రాత్రి (నా దురదృష్టం బాగుండీ గుర్తుంటే) రెండుమార్లున్ను వేసెడివారు. అమ్మ దిల్ మళ్ళీ 'ఖుష్‌నగర్' వయిపు దారితీసింది. ఆ విభూతిపూత చూసుకుని అమ్మ గొప్ప నమ్మకంతో ఉండేది.

యీలోపు కలర్ మ్యాచ్ అయ్యిందని ఒకమాటు బాల కృష్ణుడి వేషం, ఒకమాటు చిన్నికృష్ణుడి వేషం వేసేసి ఫుటోలు తీయించేసి 'అచ్చం కృష్ణుడిలా ఉంది కదూ' అని అమ్మ మురిసి పోయింది కూడా. స్కూలుకి వెళ్ళడం మొదలుపెట్టాక డాన్సుల్లో రాక్షసుల వేషాలకీ, చిన్నచిన్న నాటకాల్లో కాకి, కోకిల వంటి వేషా లకీ బయట నుంచి సహజ నటుల్ని అద్దెకి తెప్పిచ్చే కష్టం, నష్టం మాస్టార్లకి తప్పించే భాగ్యం నాకు దక్కింది.

అలాఅలా చిన్నచిన్న వేషాల్లోంచి 'నీళా' సూక్తంలో నీలాదేవి వేషంలో 'నీలమోహన రారా, నిన్ను పిలిచే నెమలి నెరజాణా,' అన్నంత ఎదిగిపొయా. పదహారేళ్ళ వయసులో గాడిదయినా అందంగా ఉంటుందని ఒక ఆంగ్ల కొటేషన్ చదివేసిన కాన్ఫి డెన్సుతో అలరారుతూ అలరారుతూ ఉన్న తరుణంలో, నా పుట్టిన రోజున అమ్మ పట్టు పరికిణీ ఓణీ కొంది. అది వేసుకుని మా ఊరినించి వచ్చిన పిన్ని దగ్గరికెళ్ళి, 'పిన్నీ నేను అందంగా వున్నానా?' అని అడిగాను. పోనీ పుట్టినరోజు పాపాయి కదా అని వదిలెయ్యొచ్చుగా. కొంచెం మొహమాటం తక్కువయిన పిన్ని, 'అందగత్తెవూ కాదు, అనాకారివీ కాదు. సంసారపక్షం, అంత రంగు కూడా కాదుకదా!' అంటూ మహేష్‌బాబు త్రిషని కామెంటినట్టు కామెంటేసింది. అది విన్న బాబాయ్ గతుక్కుమని, 'అమ్మలూ నీకు యీ డ్రస్సు అద్దిరిందిరా,' అని నన్ను కన్‌ఫ్యూస్ చేసి కొండె క్కించేశాడు. ఆనాడు బాబాయే గనక అడ్డుపడకపొయ్యుంటే యీ లోకం ఎన్నెల్లో అమావాస్యను కాకుండా ఒక పౌర్ణమిని చూసి ఉండేది.

డ్రమ్ముల్లో పాండ్స్ స్నోలూ, డ్రీంఫ్లవర్ పౌడర్లు, ఫెయిర్ అండ్ లవ్లీలు, బ్లీచింగులు, ఫేస్ మాస్కులు - పాపం నాన్న ఆస్తిని హారతికర్పూరం చేసేశాయ్. అమ్మ మాత్రం కట్నం కోసం దాచిన డబ్బుల్ని ఇన్వెస్ట్ చేస్తే కట్నం అక్కరలేదనే అల్లుడు వచ్చేస్తాడనే ఫైనాన్షియల్ అనాలిసిస్ చేసేసి సెంట్ పర్సెంట్ వాల్యూ పాసిటివ్ అని లెక్కలేసి, ఎలాంటి రిస్కీ ఇన్వెస్ట్‌మెంట్ కయినా సిద్ధపడి పోయేది. అమ్మ ప్రార్థనలు విన్న దేవుడు అమ్మ మంచి ఫైనా న్షియల్ అనలిస్టని సర్టిఫై చేసేసి అమ్మని గెలిపించేశాడు.

అయితే అత్తగారు మాత్రం, 'ఒరే అబ్బయీ, కోడలు నలుప యితే కులం నలుపవుతుందిరా, అది ఇంకొంచెం తెల్లబడే మార్గం చూడమని,' చెపుతూనే... ఆవిడ శాయశక్తులా కచోరాలు, ఛాయపసుపు, తేనె, గంధంపొడి, అశ్విని వారి సున్ని పిండి, శెనగ పిండీ పెద్దపెద్ద డబ్బాలలో నింపి ఉంచడమే కాక అప్పుడప్పుడే మార్కెట్లొకొస్తున్న 'త్రీసులసీ'... సారీ... అప్పు తచ్చుయ్యింది... శ్రీతులసి అను లేపనమును రీజనల్ సేల్సు మానేజరుగారితో మాట్లాడి మూడు సంవత్సరముల వరకు ఆ కంపెనీ తయారు చేయు ప్రొడక్టను అంతయూ యెవరికీ అమ్మరాదనిన్నీ, ఆ ప్రొడక్టను మొత్తమూ సరాసరి మా ఇంటికి రావలెననియున్నూ, కాంట్రాక్టు పయి సంతకము పెట్టించు కొనిరి. అదియునుగాక టీవీలో ఫెయిర్ అండ్ లవ్లీ అడ్వర్టైజ్‌మెంటు వచ్చినప్పుడల్లా, 'వీళ్ళ మొహం మండ. నా కోడలు ఇరవయి సంవత్సరాలు వాడింది. కూసింత మార్పు లేదు. కంపనీ మూసుకుని అవతలకి పొండి. ఏదో నేను పూనుకోబట్టి సరిపోయిందిగానీ, లేకపోతే యీ వెర్రిమొహం మిమ్మల్ని నమ్ముకుని కాలం గడిపేసేది,' అంటూ నానా విధములయిన శాపనార్థములు పెట్టేస్తూ ఉండేవారు.

ఆవిడ చేసిన మూడు సంవత్సరముల కాంట్రాక్టు పుణ్యా మాని, నేను నలుపు అనబడు బ్రాండు నుండి చామనఛాయ యను ప్రమోషను పొందితినని అత్తయ్య ప్రగాఢ విశ్వాసము అంతియునుగాక నలుపో తెలుపో నలుగురు బిడ్డలు, ముదురో ముతకో మూడు గుడ్డలు అని చెపుతూ మావారితో వందలకొలది గుడ్డలునూ, నాతో ఇద్దరు బిడ్డలనూ రెస్పెక్టివ్లీ కొనిపించి, కని పించేశారు.

అత్తయ్య ఫిలాసఫీ అలా సాగుతుండగా మాకు అనుకో కుండా కెనడా రావడానికి పర్మనెంటు రెసిడెన్సు కార్డు వచ్చింది.

ఇది మంచు ప్రదేశము కాబట్టి మంచి రంగు వచ్చేస్తుం దనీ, మంచుదేశాల్లో ఉన్నవాళ్ళంతా యెక్కడ పుట్టి ఇక్కడ కొచ్చినా సరే దొరబాబుల్లా తెల్లగా అవుతారనీ, మనవలు దొర బాబుల్లా ఉండడానికోసం వాళ్ళని విడిచి ఉండడానికయినా ఆవిడ సిద్ధమేనని కన్నీళ్ళతో పంపించారు.

ఇక్కడకొచ్చాక మొట్టమొదట ఎయిర్‌పోర్టులో ఒక నల్ల జాతీయుడ్ని చూసినా నోరు అమాంతం వైడు ఓపెన్. ''ఏంటీ ఇక్కడ నల్లగా నాలాంటివాళ్ళు కూడాఉంటారా,'' అని అడిగాను. ''అబ్బేలేదే నువ్వు ఒక్కదానివీ ఆకాశంలోంచి ఊడిపడ్డావు కదా, అందుకని ఎవరు నీలాగాఉండరు! పద పద,'' అని మావారు బయటికి దారితీయగా అనుసరించక తప్పలేదు.

ఇక్కడకు రాగానే అందరూ సిన్‌కార్డ్ వచ్చిందా అని అడిగేవారు... ఇదేమి పాపమురా బాబూ... అని మధనపడ్డాక... సోషల్ ఇన్సూరెన్స్ కార్డ్‌ని సిన్ అందురని పాపముప శమించుకొంటిమి. ఆ దిక్కుమాలిన కార్డ్ ఏదో రాగానే కొండెక్కినంత సంబరపడిపోయి ఉద్యోగముల వేట ఆరంభించితిమి. రాజుగారి చేపలవేటలో లాగ ఏదో ఒక చేప దొరికిందని సంబరపడి ఒకరోజు పనికి వెళ్ళేవాళ్ళం. రెండవ రోజు,'ఇయ్యాల పనిలేదు ఉన్నప్పుడు పిలుస్త పో,' అనే పెద్ద మేస్తిరి గడపట్లొంచి. ఇంటికి వొయ్యి రెస్టు తీస్కో అని చెప్పేసేవాడు. మన గ్రూపులో జనాలేమో అందరు చదువుబాబులే. నేను ఇంజనీరు, నేను డాక్టరు, నేను పీహెచ్డీ, నేను ఎంఫిల్... ఇలా వెనకింటి (బ్యాక్‌హోం) కతలు చెప్పుకొని నొచ్చుకోవడమే తప్ప యేం చెయ్యాలో ఎవరికీ తెలియదు. మీ చదువులు తీసుకెళ్ళి మీ ఇంటి దగ్గరలో ఉన్న గోదారిలోనో, గంగలోనో, నర్మదలోనో, నయాగరా జలపాతములోనో కలిపెయ్యండీ. అవేవీ ఇక్కడ నాలిగ్గీసుకోడాని క్కూడా పనికిరావు. మేము ఇస్పెషల్ టంగ్ క్లీనర్లు తయారుచేసినం అని చెప్పేసరికి, నిశ్చేష్టనయిన నేను ముప్పది అయిదు సంవత్సరములు కాపాడుకున్న నా నలుపంతా విరిగిపోయి పాలిపోయి పాండువర్ణము సంతరించుకొంటిని.

ఇంక వెంటనే ఇంటికి ఫోనుచేసి, "అత్తయ్యా! రంగు పడింది," అని చెప్పేశాను. అత్తయ్య బోల్డు సంబరపడిపోయారు. "నేను చెప్పానుకదే కెనడా అంతే కెనడా అంతే," అని!

ఏతావాతా తెలుసుకున్నదేమనగా తెల్లీయులను ఆఫీసు ఉద్యోగములన్నియును వరించును. నల్లీయులు ఎక్కువ బరువులు మోయగలుగు శ్రమజీవులగుట వల్లను, హక్కుల కోసము పోరాటము సలిపి మా పెద్దక్కకు వలే ప్రపంచకంలో అశాంతి సృష్టించుదురేమోనన్న భయం వల్లను ఫ్యాక్టరీ ఉద్యోగములన్నియును ఇవ్వబడును. ఇంక మిగిలిందెవ్వరయా అంటే

అటునిటు కాని బతుకును
పటుదయిన వెఱ్రినవ్వును, మొగమాటమునన్
అటుదిరిగి పోనివాడును
ఇటు ఉంటకు జెడినవాడు బ్రవునుర సుమతీ

అని సుమతీ శతకాన్ని మార్చి చదువుకున్నా కూడా లాభం పెద్దగా కనబడలేదు. అయ్యో ఎంత పని జరిగింది! నా ఒరిజినల్ రంగు నాకుంటే చిన్నదో పెద్దదో ఉద్యోగం సంపాదించేదాన్నే!

ఛఛ, ఎంత తప్పు చేయించేశారు నాతో అమ్మ, అత్తయ్య కలిసి... నా సొంత రంగుని... ఏంటీ? నాదంటే నాదయిన సొంత రంగుని... పవుడరు డబ్బాల కంపెనీకీ, పాత సామన్లాడికీ కిలోల్లెక్కన అమ్మేసీ నాకెంత అపకారం చేసేశారు? ఛ, నాకయినా బుద్దుండక్కర్లే అక్క దగ్గరి నుంచీ అత్తయ్య వరకూ అందరూ నా కలర్ తోటి ఆడుకుంటుంటే బుజ్జి కలర్ని ఇన్నాళ్ళుగా వాళ్ళందరి చేతుల్లో పెట్టేసానా? వీల్లేదుగాక వీల్లేదు చిన్న ఉద్యోగమైనా సంపాదించాలంటే నా కలర్ నాక్కావాలంతే. అందుకే నాకు అపకారం చేసిన వాళ్ళందరితో మాట్లాడ్డం మానేసి నా రంగు తెచ్చుకునే ప్రయత్నంలో ఉన్నా. *



# ఆంధ్ర శతక సాహిత్యము, మానవ వనరుల నిర్వహణ

తుర్లపాటి ప్రసాద్

సహితానాంభావనం సాహిత్యం - సమాజ హితం కోరేదే సాహిత్యం. విశ్వశ్రేయమును కాంక్షించునదే కావ్యము. అటు వంటి సాహిత్య ప్రక్రియలలో శతక సాహిత్యం ఎన్నతగినది.

*జయన్తి తే సుకృతినో రససిద్ధాః కవిశ్వరాః*
*అస్తి తేషాం యశః కాయే జరామరణం భయం*

- భర్తృహరి సుభాషితములు

ధన్యాత్మలగు కవీశ్వరులు పుట్టుట, గిట్టుట లేని తమ కీర్తి శరీరములచే సిద్ధౌషధ సేవచే జరామరణముల నతిక్ర మించిన యోగుల వలె ఎల్లప్పుడూ ప్రకాశించుదురు. ప్రాచీన కవులు రససిద్ధులై తమ జ్ఞాన సంపదతో మనకు ఎంతో విజ్ఞానాన్ని అందించారు. సకల పురాణేతిహాస సాలభరిత అయిన మన భారతావని ఎందరో కవులు, పండితులు మరియు జ్ఞానయోగులకు ఆలవాలమయినది. వీరు తమ వివిధ గ్రంథముల ద్వారా ఎన్నో లోకోక్తులను, మానవ సంబం ధముల విశిష్టతను వారి అనుభవసారంతో క్రోడీకరించి మనకు విశదపరిచారు. ఇటువంటి సాహిత్యంలో 'శతక వాఙ్మయము' ముఖ్యమైనది. ఈ శతక వాఙ్మయమునందు పద్యము చివర గాని, చివరి పాదము పూర్తిగా కాని మకుటము ఉండుట సాంప్రదాయము.

*ఉదా:* *విశ్వదాభిరామ వినురవేమ*
*దాశరధీ కరుణాపయోనిధి*
.... .... భాస్కరా మొదలగునవి.



శతక వాఙ్మయమును రెండు విధములుగా విభజించవచ్చును.

1) నీతి శతకములు (ఉదా: వేమన, భర్తృహరి సుభాషితములు, భాస్కర శతకము మొ॥),

2) భక్తి శతకములు (ఉదా: దాశరధీ శతకము, కాళహస్తీశ్వర శతకము మొ॥).

**భక్తి శతకము ఉదాహరణ**

*(భక్తి ప్రధానంగా, భగవంతునికి సమర్పించెడు పద్య ప్రసూనాలు)*

ఉదా: *శ్రీ రఘురామ, చారు తులసీదళధామ, శమక్షమాది*
*శృంగార గుణాభిరామ, త్రిజగన్నుత శౌర్య మలాలరామ*
*దుర్వార, కబంధ రాక్షస విరామ, జగజ్జన కల్మషార్ణవో తారకనామ*
*భద్రగిరి, దాశరధీ కరుణాపయోనిధీ*

- దాశరధీ శతకము

## నీతి శతకాలు ఉదాహరణ

*(నీతి బోధించుట, సమాజానికి సందేశమిచ్చుట ప్రధా నాంశము)*

ఉదా:

*చదువది ఎంత కల్గిన, రసజ్ఞత యించుక చాలకున్న యీ*
*చదువు నిరర్థకంబు, గుణసంయుత లెవ్వరు మెచ్చరెచ్చటన్*
*బదనుగ మంచి కూర నలపాకము చేసిన యైన, నందు*
*నింపొదవెడు ఉప్పు లేక రుచి పుట్టగ నేర్చునటయ్య భాస్కరా!*

-భాస్కర శతకము

ఈ వ్యాసంలో ఎక్కువగా నీతి శతకాల ఆధారంగా మానవ వనరుల (Human Resources) నిర్వహణ గురించి చర్చిద్దాం. ఈ నీతి శతకము నందలి మౌలికాంశాలు (fundamental principles) ఎక్కువగా మానవ సంబంధాలు, మానవ వనరుల విశ్లేషణ, లక్షణములు, అధికారి-ఉద్యోగి మధ్య సంబంధముల చుట్టూ పరిభ్రమిస్తుంటాయి. ఈ విషయాలు మనకు నిత్యజీవితంలో, మానవ వనరుల నిర్వహణలో ఎలా దోహదపడతాయో పరిశీలిద్దాము.

ముఖ్యంగా ఒక సంస్థలో పనిచేసే ఉద్యోగులు విభిన్న సంస్కృతులు మరియు జాతులకు సంబంధించినవారై వుంటారు. మనకు మానవ వనరులను మానేజ్ చెయ్యాలంటే ఎంతో అనుభవము, మరియు విజ్ఞానము అవసరము. వీటి నిర్వహణకు నవీన మానేజ్‌మెంట్ పద్ధతులు ఎన్నో ఉన్నాయి. కానీ, మన పెద్దలు చెప్పిన మౌలికాంశాలు చాలా ఉపయోగ పడతాయని నాకు స్వీయానుభవం ద్వారా అవగతమయినది. అవియే ఈ వ్యాసరచనకు ప్రేరణ. ముందుగా మానవ వనరుల నిర్వహణను నిర్వచిద్దాం.

"Human Resources Management is the strategic and coherent approach for management of an organization's most valued assets, people working there, who are individually or collectively contribute to the achievement of the objectives of the business goals."

Human Resources Management లోని ఈ క్రింది అంశాలను సోదాహరణంగా పరిశీలిద్దాం.

1. పరిధి, Scope, Organization Boundaries, Limits
2. విభిన్న మనస్తత్వాలు, Behaviour Aspects
3. Learning & Development (competency, upskilling)
4. Communication Skills (Verbal and Oral)
5. Self Esteem
6. Selection of right team members
7. Risk Taking Individuals
8. Supervisor-Employee (అధికారి-ఉద్యోగి సంబంధాలు)
9. Relationships - మానవ సంబంధాలు
10. విద్య - వివేకము

### 1) పరిధి (Scope), Organisational Boundaries

ఒక వ్యక్తికి ఒక పరిధి గురించి తెలుసుకొనుట ఎంతో అవసరము. తన పరిధి తప్పితే ఒక వ్యక్తి ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కొంటాడో, ఈ క్రింది శతక పద్యములలో సోదాహరణంగా వివరించారు.

*కమలములు నీటబాసిన*
*కమలాప్తుని రశ్మి సోకి కమలిన భంగిన్*
*తమ తమ నెలవులు తప్పిన,*
*తమ మిత్రుడె శత్రులగురు తథ్యము సుమతీ*

తామరలు తమ నివాస స్థలములయిన సరస్సును వదలినచో తమకు ఆప్తుడయిన సూర్యుని వేడి కిరణముల తాకిడిచే వాడిపోతాయి. అలాగే తమ పరిధులను అతిక్రమిస్తే, తమ ఆప్తులతోనే భంగపడతారు. ఒక సంస్థలో ఉద్యోగులు తమ పరిధిని అతిక్రమిస్తే, తమకు మేలు చేసిన వారి చేతనే శిక్షింప బడతారు. నిత్యజీవితంలో కూడా ఈ సూక్తి ఎంతో వర్తిస్తుంది.

*మరియొక ఉదాహరణ*

*అనువుగాని చోట బనిగొని జూదము*
*నాడి యాడి యోడి యడవి సొంచుట*
*ఘనుని జూడ జూచి గడువుము మూర్ధిత*
*విశ్వదాభిరామ వినురవేమ*

### 2) విభిన్న మనస్తత్వాలు - Behaviour Aspects (Selecting the right individuals & hence building right teams)

ఎక్కువగా ఉద్యోగుల ఎంపికలో ముఖ్యంగా అవ గాహన (aptitude) మరియు నడవడిక (attitude)కు సంబం ధించి పరీక్షలు నిర్వహిస్తారు. ముఖ్యంగా attitude psychometric score ని అను సరించి ఉంటుంది.

ముందుగా ఎటువంటి వారిని ఎంపిక చేసుకొనకూడదు- అన్న అంశంపై ఈ క్రింది ఉదాహరణలను పరిశీలించుదాం. ఈ ఉదాహరణలు మనకు మంచి వ్యక్తులను ఎంపిక చేసుకొన డంలో, టీమ్ సెలక్షన్‌లో దోహదపడతాయి.

భర్తృహరి సుభాషితముల నుంచి-

*మకర ముఖాంతమస్తమగు మానికమున్ పెకలించవచ్చు*
*బాయక, చలదూర్మికా నికరమైన మహోదధి దాటవచ్చు*
*మస్తకమున, పూవుదండవోలె, సర్పమునన్ ధరియించవచ్చు*
*మచ్చిక ఘటియించి, మూర్ఖజన చిత్తము తెల్ప నసాధ్యము*
*యెరికిన్*

*తివిరి యిసుమున తైలంబు తీయవచ్చు*
*దవిలి మృగతృష్ణలో నీరు త్రాగవచ్చు*
*తిరిగి కుందేటి కొమ్ము సాధించవచ్చు*
*జేరి మూర్ఖుని మనస్సు రంజింపరాదు*

ఈ మూర్ఖులందరూ psychrometric analyses ద్వారా సులభంగా పట్టుబడతారు. వీరు ఎంతమాత్రము, మనకు పనికిరారు అని శతకకారులు చాలా స్పష్టంగా వివరించారు.

ఉప్పుకప్పురంబు నొక్కపోలిక నుండు
చూడ చూడ రుచుల జాడవేరు
పురుషులందు పుణ్యపురుషులు వేరయా
విశ్వదాభిరామ వినురవేమ

## 3) శిక్షణ-ఆవశ్యకత – Learning & Development

### (Competency Development and Upskilling)

సంస్థలోని ప్రతి వ్యక్తి తన నైపుణ్యతను ఎప్పటికప్పుడు పెంపొందించుకొనుట ఎంతో అవసరం. దీనివలన తన పరిస్థితి మెరుగుపడుతుంది, సంస్థ యొక్క ఉత్పాదన కూడా పెరుగుతుంది. ఈ విద్య యొక్క ఆవశ్యకతను శతకకారులు ఈ క్రింది ఉదాహరణ ద్వారా వివరించారు.

ఉ॥ విద్య నిగూఢ గుప్తమగు విత్తము, రూపము పురుషాళికిన్
విద్య యశస్సు, భోగకరి, విద్య గురుండు విదేశ బంధుడున్
విద్య విశిష్ట దైవతము, విద్యకు సాటి దైవంబు లేదిలన్
విద్య నృపాల పూజితము, విద్య నెఱుంగనివాడు మర్త్యుడే

## 4) Communications (వాక్చాతురత & సంభాషణ చాతుర్యం)

### Skills Verbal & Written Skills

ఒక సంస్థలో మనుగడకు కాని, మంచి సంబంధాలను పెంచుకొనడంలో కాని, చక్కని భావప్రకటన ఎంతో ముఖ్యం. వ్యక్తీకరించడం ఎంత ముఖ్యమో, శ్రద్ధగా వినుట కూడా అంతే ముఖ్యం.

శ్లో॥ కేయూరాణి విభూషయన్తి పురుషం హారాన చంద్రోజ్జ్వలా
నస్నానం, నవిలేపనం, నకుసుమం, నలఙ్కృతా మూర్ధజా
వాణేక్యా సమలఙ్కరోతి పురుషం, యాసంస్కృతా ధార్యతే
క్షీయన్తే ఖిల భూషణాని సతతం, వాగ్భూషణం, భూషణం

ఉ॥ భూషలు గావు మర్త్యులకు భూరి మయాంగద తార హారముల్
భూషిత కేశపాశ మృదు పుష్ప సుగంధ జలాభిషేకముల్
భూషలు గావు పూరుషుని భూషిత జేయు పవిత్రవాణి
వాగ్భూషణమే సుభూషణము, భూషణముల్ నశియించు నన్నియున్

'వాగ్భూషణమే నశించదు అని భూషణకారుని' భర్తృహరి శతకకారుని భావన.

అలాగే Listening Skills-

వినదగు నెవ్వరు చెప్పిన
వినినంతనె వేగపడక వివరింపదగున్
గనికల్ల నిజము తెలిసిన
మనుజుడెపో, నీతిపరుడు మహిలో సుమతీ

## 5) Self Esteem (మాన శౌర్యము)

మంచి టీమ్ మెంబర్స్‌కు మాన శౌర్యము ఎంతో అవ సరం. అంటే లక్ష్య నిర్ధారణలోగాని, లక్ష్యాలను చేరుకోవా లన్నా, ఈ లక్షణం ఎంతో అవసరం. ముఖ్యంగా ముఖ్య కార్య నిర్వహణాధికారులకు, సేల్స్ టీమ్‌కు, ముఖ్య పదవులు నిర్వహించువారికి.

ఉదాహరణకు- సింహము ఆకలిచే బాధలో నున్ననూ, ముదిమిచే చిక్కిననూ, కష్టస్థితిలో నున్ననూ, మదించిన ఏనుగు కుంభస్థలమును పగులగొట్టి అందలి మాంసమును తినునుకాని, ఎండుగడ్డిని తినునా? 'Goal Settings' - Think Big Leaderకి ఈ స్కిల్ ఎంతో అవసరం.

భర్తృహరి శతకకారుడు ఏమన్నాడో చూద్దాం-

ఉ॥ గ్రాసము లేక స్రుక్కి జరాకృశమైన, నా
యాసమునైన, నష్టరుచియైనను, ప్రాణభయార్తమైనని
స్త్రాస, మదేభ కుంభ పిశితాగ్రహల సశీల సాగ్రహా
గ్రేసర భాసమానమగు కేసరి, జీర్ణతృణంబు మేయునే

క॥ విదిలాప నురుకు సింగపు
గొదమయ మదమలిన గండ కుంజరములపై
నిది బలశాలికి నైజము
గద, తేజోనిధి వయసు కారణమగునే

ఈ లక్షణాలున్న వ్యక్తి తప్పనిసరిగా, తన సంస్థ నిర్ధా రించిన లక్ష్యాలను అధిగమిస్తాడనుటలో సందేహమేమీ లేదు.

## 6) Selection of Right Team Members - Team Building

ముందుగా ఎటువంటి వారిని మనము ఎంచుకోవాలి? కార్యసాధకుడి లక్షణాలు ఏమిటి? ఎటువంటి వారి మీద మనం ఆధారపడవచ్చును? అన్న అంశాలను పరిశీలిద్దాము.

ఉ॥ ఆపదలయందు ధైర్యగుణ, మంచి సంపదల యందు తాల్మియున్
భూపసభాంతరాళమున, పుష్కల వాక్చతురత్వము, ఆజి
బాహు పటుశక్తియు, యశము నందు అనురక్తియు, విద్య యందు వాంఛాపర వృద్ధియున్
ప్రకృతి సిద్ధగుణంబులు, సజ్జనాళికిన్

అనగా ధైర్యవంతుడు, ఓర్పు కలవాడు, చక్కని వాక్పటిమ కలవారు, యుద్ధమందు విజయకాంక్ష కలవారు, కీర్తి కాముకులు, ఎల్లప్పుడు తమ నైపుణ్యాన్ని పెంచుకొనువారు, ఇత్యాది లక్షణములు కలవారు మన సంస్థలో ఎప్పుడూ రాణిస్తారు మరియు వారి ఆవశ్యకత ఆ సంస్థకు, అధికారికి ఎంతో అవసరం.

అలాగే,

మ॥ తమ కార్యంబులు పరిత్యజించియు, పరార్థ ప్రాపకుల్ సజ్జనుల్
తమ కార్యంబు ఘటించుచున్, పరహితార్థ వ్యాపుతుల్, మధ్యముల్
తమకై అన్యహితార్థ ఘాతుకజనుల్ దైత్యుల్
వృథానార్థ, భంగము గావించెడు వారలు ఎవ్వరో ఎరుంగ శక్యమే యేరికిన్?

దీనివలన మనకు ఎటువంటి వ్యక్తులు తారసపడతారు, ఎటువంటివారితో ఏ విధమయిన సంబంధ బాంధవ్యాలు ఏర్పరుచుకోవాలి? వంటివాటికి ఎక్కువగా ఉపయోగపడు తుంది.

### 7) Risk Taking - Characteristics of a Committed Individuals (కార్యసాధకులు)

ఎక్కువగా leadership team selection లోగాని, crisis management లోకాని, ఇటువంటి వారి ఆవశ్యకత ఎంతైనా ఉన్నది. భర్తృహరి శతకంలో ఈ క్రింది ఉదాహరణముల ద్వారా మనకు సోదాహరణంగా వివరించుట జరిగినది.

అధములు విఘ్నములు సంభవించునని కార్యములను ఆరంభించరు. మధ్యములు ఆరంభించి, విఘ్నములు వచ్చి నప్పుడు వదులుదురు. ధీరులెన్ని పర్యాయములు ఎట్టి విఘ్నములు సంభవించిననూ తాము పట్టిన కార్యమును వీడరు. కనుక ధీరత్వము ఎంతో అవసరము.

శా॥ ఆరంభింపరు నీచమానవులు విఘ్నాయాస సంతస్తులై
ఆరంభించి పరిత్యజింతురు, విఘ్నాయాత్తులై మధ్యముల్
ధీరుల్ విఘ్న నిమన్యమానులగుచు వధ్రుత్యున్నతో త్సాములై
ప్రారబ్ధము లుజ్జగింపరు సుమీ, ప్రజ్ఞానిధుల్ గావునన్

అలాగే కార్యసాధకుల లక్షణములు-

మ॥ ఒకచో నేలపై పవ్వళించు, ఒకచో నెప్పారు పూసజ్జపై
ఒకచో శాకము లారగించు, నొకచో నుత్కృష్ట శాల్యోదను
ఒకచో బొంత ధరించు, నొక్కొక తరి, యోగాంబరశ్రేణి
లెక్కకు రానీయడు, కార్యసాధకుడు దుఃఖంబునన్, సుఖంబునన్ మదిన్

కార్యసాధకులు ఒక సంస్థ ప్రగతికి మూలస్థంభాలు.

### 8) Supervisor-Employee (అధికారి-ఉద్యోగి సంబంధాలు)

దక్షుడయిన అధికారి ఆవశ్యకతను ఈ క్రింది పద్యము ద్వారా వివరించారు శతకకారులు (భాస్కర శతకము).

ఉ॥ దక్షుడు లేని యింటికి పదార్థము వేరొకచోటు నుండి
లక్షలు వచ్చుచుండిన బలాయనమై చను, కల్లకాదు,
ప్రత్యక్షము వాగులున్, వరదలన్నియు వచ్చిన, నీరు నిల్చున్
యొక్షమయిన గండి తెగినట్టి తటాకములోన భాస్కరా!

అలానే అధికారిని ఎప్పుడు విడువవలయును-

కా॥ ఎప్పుడు తప్పులు వెదకెడు
నప్పురుషుని కొల్వకూడ, నది ఎట్లన్నన్
సర్పంబు పడగ నీడను
కప్ప వసించు విధము కదరా సుమతీ!

మొదటి పద్యములో 'వేల్పు' అంటే అధికారికి అన్వ యము.

అలాగే అధికారి కోపించెనేని, ప్రతిభావంతులయిన వారిని, తన ఆస్థానము నుండి పొమ్మనునేగాని, వారి పాండిత్య మును, ప్రతిభను పోగొట్టలేడు కదా!

### 9) Relationship Skills (సత్సంబంధాలు-ఆవశ్యకత)

స్నేహముగా ఉన్న సమయములో ఎదుటి వ్యక్తి ఏమి చేసినా అందులో ఏ దోషాలు కనపడవు. పొరపాటున ఏద యినా విషయంలో గొడవ ఏర్పడి శత్రుత్వము కలిగినప్పుడు ఎదుటివ్యక్తి చేసే ప్రతి పనిలోనూ తప్పులే కనపడును. కనుక సత్సంబంధాలు అన్నివేళలా అవసరమని సుమతీ శతకకారుడు ఈ విధంగా చెపుతున్నాడు.

క॥ కూరిమి గల దినములలో
నేరము లెన్నడును గలుగ నేరవు
మరి, యా కూరిమి విరసంబైనను
నేరములే తోచుచుండు నిక్కము సుమతీ

### 10) విద్య - వివేకము

చదువు విద్య ఎంత ఉన్ననూ వివేకము నశిస్తే ఎలా పతనమవుతారో అని చక్కని హెచ్చరికలు చేస్తున్నారు శతక కారులు (భర్తృహరి శతకము). వివేకవంతులు తమ తోటి వారితో, అధికారులతో ఎంతో సత్సంబంధాలను ఏర్పరుచు కుంటారు. విద్యతో కూడిన వివేకమే ఒక వ్యక్తి ఉన్నతికి సోపానము. విద్య, వివేకము, సమయస్ఫూర్తి ఒక చక్కని ఉ ద్యోగికి కావల్సిన ముఖ్య లక్షణములు.

ఉదాహరణ-

ఆకాశము నుండి, శంభుని శిరంబందుండి, శీతాద్రి
సుశ్లోకంబయిన హిమాద్రి నుండి, భువి భూలోకము నందుండి
యస్తోకాంభోధి పయోధి నుండి, పవనాంధాలోకమున్ చేరె
గంగా కూలంకష పెక్కుభంగులు, వివేక భ్రష్ట సంప్రాతముల్

సమయస్ఫూర్తి ఆవశ్యకత -

క॥ ఎప్పటి కెయ్యెది ప్రస్తుత
మప్పటి కా మాటలాడి, యన్యుల మనముల్
నొప్పింపక, తానొవ్వక
తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతీ

ఈ విధంగా శతకకారులు మనకు మానవ సంబంధాలు, ప్రజల లక్షణాలు, మంచి టీమ్ యొక్క ఆవశ్యకత, విద్య, వివేకము, సమయస్ఫూర్తి మొదలయిన మౌలికాంశాలు మనకు సోదహరణంగా అందించారు. ఇవి మన నిత్య జీవితంలో, ఒక సంస్థలోని మానవ వనరుల నిర్వహణలో ఎంతో దోహదపడ తాయి అని, అనుభవపూర్వకముగా నిర్ధారణ అయినది. ఈ విజ్ఞానసారాన్ని మనకందించిన సత్కవీంద్రులకు మనమెంతో రుణపడి ఉన్నాము. వారు మనకు ప్రసాదించిన ఈ జ్ఞాన సంపదను నలుదిశల వ్యాపింపజేసి, సమసమాజ స్థాపనకు, వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేద్దాం.

మన తెలుగువారి వారసత్వసంపదనూ, సార్వభౌమత్వాన్ని, ఆత్మగౌరవాన్ని కాపాడుకుందాం.

### ఈ వ్యాసానికి ఆధారాలు


1) *దాశరథీ శతకము - కంచెర్ల గోపన్న (భక్త రామదాసు)*
2) *భర్తృహరి సుభాషితములు - ఏనుగు లక్ష్మణకవి (తెలుగుసేత)*
3) *సుమతీ శతకము - బద్దెన భూపాలుడు*
4) *భాస్కర శతకము*
5) *వేమన శతకము - వేమన*


*



*గత 24 సంవత్సరాలుగా ఐటి రంగంలో ఉన్న ప్రసాద్ తుర్లపాటికి ప్రాచీన సాహిత్యం పై ఎనలేని మక్కువ. శతక సాహిత్యం, ప్రబంధ సాహిత్యాల పై అనేక వ్యాసాలు రాశారు. ఉపన్యాసాలు ఇచ్చారు. కంప్యూటర్ భాషాశాస్త్రంలో విశేషమైన కృషి చేశారు. భార్య శ్రీలత, పిల్లలు అశ్విని, అభిషేక్‌లతో శాన్ యాంటోనియో, టెక్సస్‌లో నివాసం.*






కథ

# ఒకే మాట

## కొమరగిరి అనంత ప్రతిమారాణి

నా పేరు పావని, హైద్రాబాదులో పుట్టి పెరిగాను, మాది పెద్ద కుటుంబం. నాకు ఇద్దరు అక్కలు, ఇద్దరు తమ్ముళ్ళు, నేను మూడవ అమ్మాయిని. నా పెళ్ళి నాటికి అక్కల, తమ్ముళ్ళ పెళ్ళిళ్ళు అయిపోయాయి. అందరికి పిల్లలు వున్నారు. నా పెళ్ళి కొంచం మన తెలుగువాళ్ళ స్టాండర్డ్ ప్రకారం లేటయింది!

నేను ఎం.బి.ఎ చేసి పది సంవత్సరాల నుంచి ఒక టెలీ కమ్యూనికేషన్ కంపెని హెచ్ఆర్ డివిషన్‌లో పని చేస్తున్నాను. ఇంట్లో బయట కూడా అందరిలో మంచి పేరు తెచ్చుకున్నాను. నేను ప్రమోద్‌ని బెంగుళూరులో ఒక కాన్ఫరెన్స్‌లో కలిసినప్పుడు ఒకరినొకరు ఇష్టపడ్డాము. Love at first sight అంటారు కదా అదేవిధంగా జరిగింది మా విషయంలో. అమ్మ, నాన్నగారు నా పెళ్ళికి తొందరపెట్టినా, వచ్చిన సంబంధాలు అన్నింటికీ ఏదో ఒక వంక చెప్పేదాన్ని. విషయం తెలిసిన తరువాత వాళ్ళు ప్రమోద్ గురించి, అతని కుటుంబం గురించి కనుక్కుని, కుటుంబం మంచిది, అబ్బాయికి చదువు, వుద్యోగం బాగున్నాయి, ఆస్తి వున్నవారు, అన్నివిధాలా బాగా వుంది ఈ సంబంధం అని అనుకున్నారు. చాలా సంతోషపడ్డారు కూడా! రెండు నెలల్లో మా పెళ్ళి ఏ ప్రాబ్లెమ్స్ లేకుండా జరిగిపోయింది. ప్రమోద్‌తో పెళ్ళి జరిగిన నెలరోజుల్లో నేను జాబుకి రాజీనామా ఇచ్చి అతనితో బెంగుళూరు వెళ్ళాను. అతను ఒక

ఇంజనీరింగు ఫర్మ్‌లో పని చేసేవాడు. ఆరునెలల లోపట నేను కూడా అదే ఫర్మ్‌లో జాబు చెయ్యటము మొదలుపెట్టాను.

ప్రమోద్ ఒక్కడే కొడుకు. తనకి వెనకా ముందూ ఏవరూ లేరు. పెళ్ళిలో మా చుట్టాలు కొంతమంది మాట్లాడుకుంటూంటే నా చెవుల పడిన విషయము ఏమిటంటే వీళ్ళ కుటుంబంలో వంశపారంపర్యంగా కొంతమందికి పిల్లలు లేరు, ఉన్నవాళ్ళకి ఒకళ్ళు ఇద్దరు పిల్లలు చాలా గ్యాపుతో పుట్టటం జరిగింది, కొంతమందికి చాలా మిస్ కారేజులు అయినాయి, అని. నా పెళ్ళి అయేటప్పటికి నా వయస్సు ముప్పయి ఆరు, ప్రమోద్ వయ్యస్సు నలభై. అప్పుడే కొంతమంది చుట్టాలు పెళ్ళిలో నా వయస్సు గురించి కామెంటు చెయ్యటం విన్నాను, పెళ్ళి ఇంత లేటు అవుతే పిల్లలు పుట్టరని! ప్రమోద్ నా కన్నా నాలుగేళ్ళు పెద్ద కదా అన్న విషయం గురించి ఎవరూ ఏమి కామెంటు చెయ్యలేదు, ఇది విచిత్రం కదా. ఆడపిల్ల వయసు గురించి అన్నారే కాని మగవాడి వయసు గురించి ఎవరు ఏమి అనలేదు. ఈ రకమైన భేదం ఎందుకో కదా ఆడా మగలో!! ఎందుకు ఇంత క్రూరంగా మాట్లాడుతారు అని ఒక్కక్షణం అనిపించిందే కాని నేను ఇటు వంటి కామెంట్సు పట్టించు కోలేదు! నారో మైండెడ్ పీపుల్ అని అనుకున్నాను. ఈ గాసిప్‌కి అంత ప్రాముఖ్యత ఇవ్వదలుచు కోలేదు! పిల్లలు పుడితే పుడుతారు లేకపోతే లేదు, ఇందులో ఇంతగా తలకాయ బద్దలు కొట్టుకునేది ఏముంది అని అను కున్నాను అప్పుడు!

పెళ్ళి అయిన రెండో సంవత్సరము నుంచి అందరూ అడగటమే ఏమిటి ఆలస్యం అని. నవ్వి పూరుకునేదాన్ని. నాకు, ప్రమోద్‌కి లేని బాధ వీళ్ళ అందరికి ఎందుకో అని అని పించేది. నాలుగేళ్ళు గడిచాయి. చుట్టాలు, బయటవాళ్ళు, ఆఫీస్ కో వర్కర్సు అందరూ కూడా ఈ టాపిక్ గురించి మాట్లాడు కుంటు న్నారు అన్న సంగతి నాకు, ప్రమోద్‌కి తెలుసు కాని ఈ విషయన్ని మేము మా మధ్యకి రానివ్వలేదు! ప్రాబ్లం నాలో వున్నా తనలో వున్నా మేము ఒకరినొకరు తప్పుపట్ట దలుచుకోలేదు! ప్రమోద్ చాలా మంచివాడు. సాధ్యమైనంత వరకు నన్ను ఇటువంటి సిట్యుయేషన్స్ నుంచి షీల్డు చేస్తూ వచ్చాడు. మేము ఇద్దరము ప్రేమగా ఒకళ్ళనొకళ్ళని అర్థం చేసుకుని ఒడుదుడుకులు లేకుండా ఒకేమాట మీద జీవితం గడుపుతున్నాము! ఇంత మంచి భర్త దొరకటం నా అదృష్టం అని నేను ఎప్పుడూ అనుకుంటాను. ఇంతకన్నా నాకు ఏమి కావాలి? ఇదే విధంగా మా జీవితాలని ఒడుదుడుకులు లేకుండా కాపాడు తండ్రి అని మనసులో దేవుడికి దణ్ణం పెట్టుకున్నాను!

ఒకరోజు మా అత్తగారి దగ్గరి నుంచి ఫోను వచ్చింది విజిట్‌కి వస్తున్నట్టు. నేను ప్రమోద్ కలిసి గెస్టురూంని క్లీన్ చేసి, బెడ్‌షీట్స్ ఛేంజ్ చేసి రెడీ చేశాము వాళ్ళకోసం. మా అత్తగారికి నాకు ఏమి సమస్యలు లేకుండా కలిసిపోయి వుంటాము కనుక ఆవిడ వస్తే నాకు ప్రాబ్లెమ్సు వుండవు. అందుకని వాళ్ళ రాకకి ఎదురుచూశాము. అనుకున్న రోజున వచ్చారు ఇద్దరూ. కుశల ప్రశ్నలు అయ్యాక మేము మా ఆఫీసులకి వెళ్ళిపోయాము. ఇట్లా ఒక వారం గడిచింది. ఆదివారం వచ్చింది. వీకెండు కనుక మేము లేటుగా లేచాము. నేను కిచెన్‌లోకి వెళ్ళాను కాఫీ, ఇడ్లీ చెయ్యా టానికి. ప్రమోద్ కూడా నాతోపాటు వచ్చాడు హెల్ప్ చెయ్యా టానికి. ఇడ్లీ, కొబ్బరి పచ్చడీ, కాఫీ తెచ్చి డైనింగ్ టేబుల్ మీద పెట్టి వాళ్ళనిద్దరిని, "బ్రేక్ ఫాస్టు చేద్దాము రండీ," అని పిలిచాను.

న్యూస్ పేపర్ తెచ్చుకోవటానికి వరాండాలోకి వెళ్ళబోతూ వాళ్ళ నాన్నగారి చేతిలో పేపర్ చూసి వెనక్కి వచ్చాడు ప్రమోద్. అందరం సైలెంటుగానే బ్రేక్‌ఫాస్ట్ చేశాము, ఒకరకమైన అన్ ఈజినెస్ వుంది వాతావరణంలో. కారణం నాకు తెలియటంలేదు. వాళ్ళు లివింగ్ రూంలోకి వెళ్ళి కూర్చున్నారు. నేను పాట్సు అన్నీ డిష్‌వాషర్‌లో లోడ్‌చేసి లివింగ్ రూంలోకి వచ్చి కూర్చున్నాను. అప్పటికే మా మామగారు పేపరు కొనడం ఒక పెద్ద వేస్టు అన్న సబ్జక్టు మీద లెక్చరు ఇస్తున్నారు! అందరితో పాటు నేను కూర్చు న్నాను. ఉన్నట్టుండి మా అత్తగారు, "అమ్మా పావని ఒకసారి డాక్టర్‌కి చూపించుకుంటే బాగుంటుందేమో," అని అన్నారు

నేను, ప్రమోద్ ఒకేసారి ఆవిడవైపు చూశాము ఎందుకూ అన్నట్లుగా. "నేను బాగానే వున్నానే, ఇప్పుడు డాక్టర్ ఎందుకూ? అని అన్నాను.

"పెళ్ళి అయి నాలుగేళ్ళు అయినా పిల్లలు లేరుకదా, ఒక సారి డాక్టర్‌కి చూపించుకుని ఏదైనా ట్రీట్‌మెంటు చేయించుకో రాదా, తప్పు ఏంటి?" అని అన్నారు

"అమ్మా, నాకు, పావనికి పిల్లలు లేరు అనే బాధలేదు. పుట్టి నప్పటికే పుడతారు, పుట్టకపోయినా మాకు బాధలేదు. ఇటువంటి సమాజంలో పిల్లలిని పెంచటం కన్నా, లేకుండా వుండటమే మంచిది," అని అన్నాడు ప్రమోద్ నేను జవాబు చెప్పే లోపలే.

నేను వేరే ఏమి అనలేదు. ఎప్పటిలాగే ప్రమోద్ నన్ను ఈ సిట్యుయేషన్ నుంచి కూడా ప్రొటెక్ట్ చేశాడు. నీళ్ళు నిండిన కళ్ళతో తనవంక చూసి తనకి కళ్ళతోనే థాంక్స్ చెప్పాను. తను కూడా నీవు ఏమి బాధపడకు, నేను వున్నాను కదా అని కళ్ళతో అన్నట్టుగా అనిపించింది. అర్థం చేసుకుని సపోర్టు చేసే భర్త దొరకటం ఎంత అదృష్టం అని అనుకున్నాను. ఆరోజంతా నిశబ్దంగానే గడిచింది. తరువాత కూడా దీని గురించి ఎవరము మాట్లాడలేదు. ఇదే విధంగా నడిచింది ఒక వారం. మా అత్తగారికి మేము ఇస్తున్న సైలెంట్ ట్రిట్‌మెంటు నచ్చినట్టు లేదు. మూడువారాలు వుందా మని వచ్చినవాళ్ళు రెండో వారంలోనే, "వెనక్కి వెళ్ళాలి ప్రమోద్, పావని. చాలా పనులు వున్నాయి," అని చెప్పి హైద్రాబాదు వెళ్ళి పోయారు. మేము వాళ్ళని వుండమని బలవంతం చేయ్యలేదు!

వీళ్ళు వేళ్ళిన ఒక వారం తరువాత అనుకుంటాను మా అమ్మ దగ్గర నుంచి ఫోను వచ్చింది. "పావని మీ అత్తగారు చెప్పి నట్టుగా పరీక్షలు చేయించుకోరాదటే, అల్లుడిగారిని కూడా చేయించుకోమని చెప్పు," అని రహస్యం చెప్పినట్టుగా చెప్పింది. మా అత్తగారు, మా అమ్మా మాట్లాడుకున్నారన్నమాట అని అను

కున్నాను. ప్రమోద్ వాళ్ళ అమ్మకి ఏమి చెప్పాడో, అదే నేను మా అమ్మకి చెప్పాను. ఈ ఫోను కాలు గురించి ప్రమోద్‌కి చెప్పి తన మనసు పాడు చెయ్యదలుచుకోలేదు. కాని ఈ ఆడవాళ్ళ నోర్లు కట్టించాలి అని అనుకున్నాను. మరునాడు రాత్రి భోజనం చేస్తున్నప్పుడు ప్రమోద్‌తో ఈ టాపిక్ గురించి మాట్లాడటం మొదలు పెట్టాను. "ప్రమోద్, మన వాళ్ళు సజెస్టు చేసినట్టుగా నేను టెస్టులు చేయించుకుంటాను ఏమంటావు," అని అడిగాను.

సడన్‌గా ఇట్లా అడిగేసరికి ప్రమోద్ స్టన్ అయినాడు ముందు. "ఇవన్నీ ఎందుకు పావని మనకు, మనం సంతోషంగా హాయిగా లేమా. పిల్లలు లేకపోతే ఏమైంది, ఈ విషయం మర్చిపో. వియ్ ఆర్ ఫైన్ ద వే వియ్ ఆర్," అని. డిషెస్ అన్ని లోడ్ చేసి ఫుడ్డు డబ్బాలలో సర్ది ఫ్రిజ్‌లో పెట్టి, టేబులు తుడిచి, చేతులు కడుక్కుని, టవలుతో తుడుచుకుని వెళ్ళి సోఫాలో కూర్చుని టీవీ ఆన్ చేసి రిమోట్‌తో చానల్సు ఛేంజ్ చేస్తున్నాడు. ఈ లోపల నేను కూడా మిగిలిన పనులు చేసి వచ్చి తన పక్కన కూర్చున్నాను. తను నా చేతిని తన చేతిలోకి తీసుకుని, నా వైపు తిరిగి,"డోంట్ వర్రీ పావని, వేరేవాళ్ళకోసం ఏమి చెయ్యవలసిన అవసరము లేదు. కాని ఇఫ్ యూ వాన్ టు గో త్రూ విత్ ఇట్ ఫర్ యువర్ శాటిస్‌ఫాక్షన్ ఐ విల్ సపోర్ట్ యూ అండ్ ఐ విల్ ఆల్సో గో త్రూ విత్ ద టెస్టింగ్," అన్నాడు నన్ను దగ్గరికి తీసు కుంటూ. ఈసారి నా వంతు అయింది స్టన్ అవటము. తన చేతిని గట్టిగా పట్టుకున్నాను వదిలి పెట్టకుండా. నాకు ఎంతో ధైర్యం కలిగింది. ఇంతకన్నా నాకు వేరే ఏమి కావాలి అని అనుకున్నాను

ఆ రాత్రి అట్లా గడిచిపోయింది!

మర్నాడు ఈ విషయం మా అత్తగారికి మా అమ్మకి ఫోను చేసి చెప్పాము. మా అత్తగారు సంతోషపడ్డారు కాని, "నీకు ఎందుకురా బాబు ఈ టెస్టులు... నీవు మగవాడివి కదా ఇది ఆడవాళ్ళకి మాత్రమే వచ్చే సమస్య కదా," అని అన్నారు వెంటనే. దీనికి ప్రమోద్, "ఈ ప్రాబ్లం ఒక్క ఆడవాళ్ళదే కాదు అమ్మా, ఇది మగవాళ్ళకి కూడా వస్తుంది. చాలా శాతం మగవాళ్ళకే ఈ ప్రాబ్లం ఎక్కువగా వుంటుంది ఆడవాళ్ళ కన్నా," అని అన్నాడు. దీనికి ఆవిడ, "ఇదెక్కడి విడ్డూరం," అని అన్నారు అని ప్రమోద్ నాతో చెప్పాడు.

ఇద్దరము ఒక వారం సెలవు పెట్టాము ఈ టెస్టులన్నీ చేయించుకోవటానికి. మా అత్తగారు వచ్చారు ఇంట్లో సహాయానికి. మా ఫామిలి డాక్టర్ మమల్ని యూరాలజి స్పెషలిస్టు దగ్గరికి వెళ్ళమని రెకమెండ్ చేసారు. నా ఫస్టు ఇంటర్వ్యూలో ఆ డాక్టర్ నా పిరియడ్స్ రెగ్యులరా కాదా, ఓవ్యు లేషన్ సరిగ్గా వుందా లేదా, fertile periodలో ట్రై చేస్తున్నామా లేదా అని menstrual cycle వివరాలు అడిగి తెలుసుకున్నారు. నన్ను బ్లడ్‌టెస్టుకి, అల్ట్రాసౌండ్‌కి పంపారు. Endometrium అంటే యూటెరస్ లైనింగ్ గురించి తెలుసుకోవటానికి, లైనింగు తిక్కు అవటానికి హార్మోన్సు సరిగా ప్రొడ్యూసు అవుతున్నాయా, endometriosis ఏమయిన వున్నదా అని తెలుసుకోవటానికి అల్ట్రా సౌండ్ ఉపయోగిస్తారు. అన్ని టెస్టులు అయి రిజల్ట్సు వచ్చిన తరువాత నా టెస్టుల్లో ఎందులో కూడా ఏ రకమైన ప్రాబ్లం లేదని, అంతా నార్మల్‌గా వుందని డాక్టర్ విజిట్లో తెలిసింది. ప్రమోద్ చాలా సంతోషపడి ఈ సంగతి వాళ్ళ అమ్మకి చెప్పాడు.

ఇక ప్రమోద్‌కి స్పెషలిస్టు చెప్పినదేమిటంటే, upto 50% infertility is male problem, usually due to low sperm count అని. Semen analysis చేస్తే స్పర్మ్ కౌంట్ తెలుస్తుందని చెప్పాడట. Sperm count లో number of sperm, shape, number with heads, movement etc. చూస్తారు. నార్మల్ కౌంట్- 15million sperm/ml of semen. Low sperm count blockage వల్ల కూడా అవవచ్చు అని చెప్పాడట. ఈ ఇన్ఫర్మెషన్ ప్రమోద్ నాకు ఆ రోజు రాత్రి చెప్పాడు. మరునాడు పొద్దునే లేచి టెస్ట్‌లకి వెడుతున్నాని చెప్పి వెళ్ళిపోయాడు. రెండురోజుల్లో అన్ని టెస్టులు పూర్తి అయ్యాయి. టెస్టు రిజల్ట్సు వచ్చాయని వచ్చాక డాక్టర్ అపాయింట్‌మెంట్ ఇచ్చారు. మరునాడు మా అత్తగారు పొద్దున్నే లేచి రోజు చేసే పూజలే కాకుండా వేరే ఎక్స్‌ట్రా పూజ చేసినట్టు అనిపించింది! బొట్టుపెట్టి ప్రసాదం ఇచ్చినప్పుడు ఆవిడ ముఖంలో ఆందోళన కొట్టవచ్చినట్టుగా కనిపించింది. ఆవిడతో ఏదైన అంటే ఏడుస్తారని ఏమి అనకుండా వస్తామని చెప్పి బయటకి వచ్చేశాము. కారు వున్నా, ఆటో తీసుకున్నాము. డాక్టర్ ఆఫీసుకి వచ్చేవరకు ప్రమోద్ చేతిని గట్టిగా పట్టుకుని కూర్చున్నాను. ఇద్దరము సైలెంటుగా కూర్చున్నాము ఆటోలో.

డాక్టర్ మాకు అర్థం అయేట్టట్టు చెప్పింది ఏమిటంటే, "ప్రమోద్, స్పర్మ్‌కౌంట్ చాలా లోగా వున్నది. కాని ఈ విషయంలో అంతగా వర్రీ అవ్వవలసిన అవసరంలేదు. దీనికి సొల్యూషన్స్ వున్నాయి. ఈ రోజుల్లో టెక్నాలజీ ఎంత అడ్వాన్స్ అయిందంటే ఉన్న ఆ ఒకటి రెండు spermsqT rd¾ eggను ఫర్టిలైస్ చేస్తున్నారు. ఈ spermsను యూటెరస్‌లోకి ట్రాన్స్‌ఫర్ చెయ్యవచ్చును. లేదా in vitro fertilization చేసి యూటెరస్‌లో implant చెయ్యవచ్చును. ఈ రెండు technics చాలా సేఫ్. మీరు ఇంటికి వేళ్ళి ఆలోచించుకుని ఏ సంగతీ నాకు మీ నిర్ణయం చెప్తే నేను మిగిలిన arrangements చేస్తాను," అని అన్నాడు. మేము ఆయనకి థాంక్సు చెప్పి బయటకు వచ్చి ఆటో మాట్లాడుకుని అందులో ఎక్కి కూర్చున్నాము. నేను ప్రమోద్ వైపు తిరిగి ఏదో అనబోయే లోపలే తను నా వైపు తిరిగి,

"It is better this way పావని, ప్రాబ్లం నాలో వుండటం మంచిదైంది. నాకు చాల సంతోషంగా వుంది," అని అన్నాడు.

"అదేంటీ అట్లా అంటున్నావ," అని అడిగాను.

"ఇప్పుడు మా అమ్మ కాని, మా వైపు బంధువులుకాని తప్పు నీది అనే అవకాశం లేదు. దీనితో అందరి నోర్లు మూత పడతాయి. పిల్లల్ని ఎప్పుడు కంటావే అని కూతలు కూసే అవకాశం లేదు. ఇప్పుడు ఎంతమంది నన్ను బ్లేమ్ చేస్తారో చూద్దాము, my mother

included'' అని అన్నాడు. ''నేను మా అమ్మకి థాంక్సు చెప్పుకోవాలి పరీక్షలు చేయించుకోమని ప్రోత్సహించినందుకు,'' అని అన్నాడు. మా ఇద్దరిలో ఒక రకమైన రిలీఫు వచ్చింది!

ఇంటికెళ్ళేటప్పటికి మా అత్తగారు మాకోసం ఎదురు చూస్తున్నారు. ప్రమోద్ వెళ్ళి ఆవిడ పక్కన కూర్చుని అన్ని విషయాలు విపులంగా ఆవిడకి అర్థం అయ్యేటట్టు చెప్పాడు. ఆవిడకి కళ్ళల్లో నుంచి నీళ్ళు కారటం మొదలుపెట్టాయి. కాసేపు అయిన తరువాత కళ్ళనీళ్ళు తుడుచుకుని...

''మగమహారాజువి నీకేమిటిరా ఇది, మన ఇంటా వంటా లేనిది,'' అని అన్నారు.

''అదేమిటమ్మా అట్లా అంటావు, మన వంశంలో ఎంతో మందికి పిల్లలు లేరు, చాల తక్కువమందికి పిల్లలు ఉన్నా నాలాగా ఒకళ్ళు మాత్రమే, కొంతమందికి అసలు ప్రెగ్నన్సీలు రానే లేదు, కొంతమందికి ఎన్నో మిస్ కారేజీలు అయినాయని నీవే కదా చెప్పేదానివి.

''ప్రాబ్లం మగవాళ్ళదే అయినా ఆ ఆడవాళ్ళు ఎన్నెన్ని మాటలు పడ్డారమ్మా బంధువులతో. నీకు ఇవి అన్ని తెలియవా? ఎందుకమ్మా నిన్ను నీవు మభ్యపెట్టుకుంటావు? మన ఫామిలీ లోనే వుందమ్మా ఈ ప్రాబ్లం,'' అని కొంచం కోపంగానే అన్నాడు ప్రమోద్.

''టెస్టులు తప్పు చేశారేమోరా, రిజల్టు మారినాయేమోరా లాబ్‌లో,'' అని అన్నారు.

''ఎందుకు చేస్తారమ్మా తప్పులు ఇటువంటి లాబ్స్‌లో? ఒకటికి రెండుసార్లు టెస్టులు రిపీట్ చేస్తారు, పంపేముందు కూడా రీచెక్ చేసి మరీ పంపుతారు కనుక ఇటువటి తప్పులు జరగవమ్మా,'' అని అన్నాడు. దీనితో ఆవిడ మళ్ళీ ఏమి మట్లాడ లేదు. తన గదిలోకి వెళ్ళిపోయింది. నేను కూడా ఆవిడతో ఏమి మాట్లాడలేదు. నా గదిలోకి వెళ్ళి అమ్మకి ఫోను చేసి చెప్పాను. అమ్మ గొంతులో కూడా రిలీఫ్ వినిపించింది.

''ఇప్పుడు ఏం చేస్తారు,'' అని అడిగింది.

''నేను ప్రమోద్ మాట్లాడుకొని ఒక నిర్ణయానికి రావాలి. తరువాత ఫోను చేస్తాను,'' అని చెప్పి ఫోను పెట్టేశాను.

రెండు రోజుల తరువాత మా అత్తగారు హైదరబాదు వెళ్ళి పోయారు. ప్రమోద్ తన రొటీన్‌లో పడిపోయాడు. ఏ రకమైన మార్పులేదు తనలో. నాకు ఎంతో సపోర్టు ఇచ్చిన ప్రమోద్‌ని ఇంక అనవసరంగా ఈ విషయంలో బాధ పెట్టదలుచుకోలేదు. మొదట్లోనే ఈ ప్రాబ్లం మా మధ్యకి రాకూడదని అనుకున్నాము కనుక ఇక ఈ ప్రసక్తి తీసుకురాలేదు. నేను కూడా నా రొటీన్‌లో పడిపోయాను.

ఒకరోజు తనే సప్పర్ టైంలో ఈ ప్రసక్తి తీసుకొచ్చాడు. ''పావని, డాక్టర్ చెప్పినదాని గురించి ఏమని నిర్ణయించావు, నీకు ఎట్లా ఇష్టం అయితే అట్లా చేద్దాము. ఏ విధంగా కూడా నీ మీద నా అభిప్రాయాన్ని ఫోర్సు చెయ్యను. Whatever you want me to do I will do. I want you to be happy. Take your time and let me know. '', అని అన్నాడు.

'' టైం తీసుకోవాల్సిన అవసరము లేదు. ఐ డోంట్ వాంటు గో త్రూ విత్ ఇట్. నేను చాలా సంతోషంగా వున్నాను. ఒక పెద్ద బరువు నా భుజాల మీది నుంచి దించినట్టు అయింది. అత్తయ్యగారి కొరకు చేయించుకున్న టెస్టులు అవి. అంతకన్నా వేరే ఏమి లేదు. Sorry to have put you through all that. నీవు అన్నట్టు వియ్ ఆర్ ఫైన్ ద వే వియ్ ఆర్. భవిష్యత్‌లో ఒకవేళ మనం పిల్లలు కావాలి అని అనుకుంటే ఎంతోమంది పిల్లలు ఆర్ఫనేజ్‌లో వున్నారు. వాళ్ళలో ఒక న్యూబార్న్ బేబీని అడాప్ట్ చేసుకుందాము, లేదా అక్కడి పిల్లల చదువులకి సహాయం చేద్దాము,'' అని అన్నాను. చిరునవ్వు అతని పెదవుల మీద కనపడింది. ఎన్ని రోజులు అయిందో తనని అట్లా చూసి. ''దట్స్ మై బేబి,'' అని లేచి చేతులు కడుక్కోని నా చైర్ దగ్గరికి వచ్చి నా బుగ్గ మీద ముద్దు పెట్టుకున్నాడు. ''ఐ యాం సో ప్రవ్డ్ ఆఫ్ యూ పావనీ,'' అని నన్ను దగ్గరికి తీసుకున్నాడు.

''లెట్స్ గో ఫర్ ఎ వాక్,'' అని అన్నాడు ఎంతో వుత్సాహంగా! నాకు కూడా చాలారోజుల తరువాత సంతోషం కలిగింది! నేను కిచెన్‌లో ఎక్కడివి అక్కడ వదిలేసి చేతులు కడుక్కుని వచ్చాను! ఇద్దరం చెప్పులు వేసుకుని బయటకు వచ్చి డోర్‌ని లాక్ చేసి చెయ్యీ చెయ్యీ పట్టుకుని నడవటం మొదలుపెట్టాము. ఎన్ని రోజులు అయిందో ఇట్లా మేము వాక్‌కి వెళ్ళి. ఫుల్ మూన్ అనుకుంటాను, వెన్నెల కురిసిపోతోంది బయట... సన్నటిగాలి వీస్తోంది. ఎంతో హాయిగా ప్రశాంతంగా వుంది వాతావరణం మా మనస్సుల్లాగా! *



*1945లో ఖమ్మంలో పుట్టి, హైదరాబాద్‌లో పెరిగిన అనంత ప్రమీలారాణి ఎమ్మెస్సీ చేసి, 1966 నుంచి 2010 వరకు ఇండియా, బ్రెజిల్, కెనడాలలో టీచరుగా పనిచేశారు. ఇది వీరి మొదటి కథ.*

# ప్రవాసి – తల్లిమనసు

### ఆటవెలది పద్యాల్లో అమ్మమనసు ఆర్ద్రత

రామ్ డొక్కా

మనసునందెయణచి మమతానురాగాలు,
మరలివత్తు ననుచు మాటయిచ్చి,
దూరదేశమేగ దుఃఖసంద్రము దాటి,
తల్లిగుండె మిగుల తల్లడిల్లె...

చన్నుపాలు కుడిపి చదువులు చెప్పింప,
చక్కనైన యిల్లు చాలదనుచు,
ఆకసాని కెగుర నవకాశముల గోరి,
తల్లిగుండె మిగుల తల్లడిల్లె...

పెద్దయాశలెన్నొ పెంచుకొన్నావురా,
కన్నతండ్రి నిన్ను కాంచలేక,
తలచి వగచె నేడు తడవతడవకును,
తల్లిగుండె మిగుల తల్లడిల్లె...

కడుపుకింత బువ్వ కంటికి కునుకైన,
కలిగినావొ లేదొ కాంచలేక,
కలత చెందుచుండె కలలోన నినుజూచి
తల్లిగుండె మిగుల తల్లడిల్లె...

ఒట్టుపెట్టి తనను ఒప్పించు రోజునే
అడ్డు చెప్పలేదు గుడ్డిమనసు,
ఒక్కసారి రమ్ము ఒడిచేర్చి లాలింప
తల్లిగుండె మిగుల తల్లడిల్లె..

రెక్కలమ్ముకొనుచు రేపవల్నీవింక,
అక్కడుండిపోతె యిక్కడెవరు
దిక్కుమొక్కు నాకు? దివ్వెనీవేయని,
తల్లిగుండె మిగుల తల్లడిల్లె...



వండిపెట్టనిమ్ము వాంఛిత మీడేర,
ఓపికున్ననాడె ఒక్క ముద్ద,
నాకు నీవె చాలు నాకమింకేదని,
తల్లిగుండె మిగుల తల్లడిల్లె...

తలచినంత వచ్చి తల్లిఋణము దీర్చు
కొనర, యితరమేమి కోరుకోను,
పంతమేల? నాదుబంగారుకొండవే,
తల్లిగుండె మిగుల తల్లడిల్లె..

పంచియిస్తి నీకెపరులకేమీయక,
పిసినిగొట్టుదనిరి, పీచుదనిరి,
పిచ్చిదాన్ని నేను, పిల్లల్నె ప్రేమింతు,
తల్లిగుండె మిగుల తల్లడిల్లె..

వేయిజన్మలైన విడియుండలేనురా,
వేరుమాట లేదు ‘వేరు’ తెగదు,
లోకమంత డొల్ల లోటు లోటేయని,
తల్లిగుండె మిగుల తల్లడిల్లె...

మునుపటి కళ తప్పె మనిల్లు, మన వీధి,
సందడసలు లేక సద్దుమణిగె,
పండుగన్న యింక పాతగుర్తేయని,
తల్లిగుండె మిగుల తల్లడిల్లె...

నీదు పుస్తకాలు, నీ బట్టలును, జోళ్ళు,
నీదు తలపు కండ్లనీరు నింపె,
నిన్న మరలిరాక, నేడు రేపైపోక,
తల్లిగుండె మిగుల తల్లడిల్లె...

# ఎవరు? ఎవరు?

## విన్నకోట రవిశంకర్

పసిపాపల్ని కాగితం పడవలుగా చేసి
కాలప్రవాహంలో వదిలిపెడుతున్న దెవరు?
అలల తాకిడికి ఉయ్యాలలూగే పడవల్ని చూసి
ఆనందంతో కేరింతలు కొడుతున్నదెవరు?

మసిపట్టిన ఆకాశానికి
ప్రతి ఉదయం వెల్లవేస్తున్నదెవరు?
నిశిపట్టిన మౌనవ్రతాన్ని
వేల పక్షిగొంతుకలతో భగ్నం చేస్తున్నదెవరు?



నిలకడలేని నన్ను
ప్రపంచమనే పదబంధప్రహేళికలో
ఒక నిలువు ఆధారంగా
నిలబెట్టిన దెవరు?
ఎప్పటికీ ఎవరూ పూరించని విధంగా
ఈ ప్రహేళికను రూపొందించినదెవరు?

చుట్టూ వరికంకులు విరగకాస్తున్నా
ప్రతి మెతుకు మీదా పట్టుబట్టి
ఒక పేరు రాస్తున్న దెవరు?
నిండు వెలుగుల కోసం
నిత్యం పరితపిస్తుంటే
బ్రతుకు దీపాల్ని ఒకటొకటిగా
ఆర్పివేస్తున్న దెవరు?



విన్నకోట రవిశంకర్ అమలాపురంలో పుట్టి, కాకినాడ, వరంగల్‌లలో చదివి సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్‌గా అమెరికాలో స్థిరపడ్డారు. పుస్తకాలు చదవడం, కవితలు, వ్యాసాలు రాయటం వ్యాపకాలు. కుండీలో మర్రిచెట్టు, వేసవివాన కవితాసంకలనాలు ప్రశంసలు పొందాయి. భార్య శ్రీకళ, పాప హిమబిందులతో కొలంబియా సౌత్ కెరొలినాలో నివాసం.




కథ

# వెళ్లానూ... వచ్చానూ...

జె.యు.బి.వి. ప్రసాద్

మా బేఏరియాలో, సాహితీసమావేశాలకి వెళ్ళటమంటే నాకు గిట్టదు. సందుకో సాహితీసంస్థా, వీధికో తెలుగు సాంస్కృతిక సంస్థా వున్న మా బేఏరియాలో, ఎవరి కుంపటి వాళ్ళదే!

"మీకు టెక్కు ఎక్కువ. అందుకే మా సాహితీ సమావేశాలకి మీరు రారు," అంటూ నన్ను నిష్టూరంగా ఆడిపోసుకునే వాళ్ళకి తక్కువేమీ లేదు.

"ఏదో నాలుగు కథలు గొలికినంత మాత్రాన నేను గొప్ప రచయితనేమీ కాదు. అదీగాక, మీ సమావేశాల్లో ఒకరి వీపు ఒకరు గోక్కోవడమేగా ఎక్కువగా జరిగేదీ? ఏదన్నా నేర్చు కుంటారా, ఏమన్నానా? అంతా కీర్తి పిచ్చిలో పడి కొట్టుకు ఛస్తూ వుంటారు. లేకపోతే సోషల్ నెట్‌వర్క్ పెంచుకుంటూ వుంటారు. అంతేగా?" అని ఎదురు తిరిగి ఝాడించేయాలని పిస్తుందిగానీ, 'మాటకు మాట తెగులూ, నీటికి నాచు తెగులూ' అన్నట్టు, నన్నూ తిరిగి నాలుగు ఝాడిస్తారని వూరుకుంటూ వుంటాను.

ఎవరన్నా ఒక చిన్న పుస్తకం రాస్తే, వచన కవితలతోనో, మరోవాటితోనో, దానికి ఒక ఆవిష్కరణ సమావేశం. ఇక ఆ పుస్తకాన్నీ, ఆ రచయితనీ ఎంతసేపు పొగుడుతారో ఆ సమావేశంలో!

ఒక తెలుగు స్వచ్ఛంద సంస్థలో పనిచేసే ఒక పెద్దమనిషి, నామొహంమీదే, "మీకు సమాజసేవ అంటే గిట్టదు. నలుగురికి ఏమన్నా ఇద్దామని చూడరు. అందుకే మీరు స్వచ్ఛంద తెలుగు సంస్థల్లో ఇమడరు," అంటూ నన్ను నిందించాడు.

"ఏమిటి మీ సేవ తెలుగు స్వచ్ఛంద సంస్థల్లో? సమోసాల నించీ, ఇండియా టికెట్ల వరకూ అవినీతే! అమెరికాలో మీటింగు లకి ఇండియానించి చుట్టాలని తెప్పించుకోవడంలో అవినీతి. నోరు తెరిస్తే కీర్తిపిచ్చి!" అని తిరిగి నిందిద్దామనుకున్నానుగానీ, ఏదో సామెత గుర్తొచ్చి వూరుకున్నాను.

ఈ సంస్థల వాళ్ళు, 'నీ చావు నువ్వు చావు' అని నన్ను, నా మానాన వదిలేశారు. అప్పట్నించీ సుఖశాంతులతో కళకళ లాడుతూ, వర్ధిల్లుతూ బతుకుతూ వున్నాను.

అలా మంచిరోజులు సాగుతూవుండగా, ఒకరోజు ఆఫీసు స్నేహితులతో కలిసి సినిమా చూస్తూ వుంటే వచ్చిందా ఫోన్ కాల్. సినిమా హాల్లో సెల్‌ఫోనును వైబ్రేట్ మోడ్‌లో పెట్టుకున్నా, అది జేబులో కదిలినప్పుడల్లా, 'ఎవరబ్బా నన్ను పిలిచేదీ?' అని మురుసుకుంటూ, ఒకసారి కాలర్ ఐడి చూద్దాం కద్దు.

బొత్తిగా తెలియని కాలర్ ఐడి. సినిమా ఏమన్నా ఓ రవ్వన్నా బాగుంటే, ఆ ఫోన్‌కాల్‌ని అప్పటికి నిర్లక్ష్యం చేసేవాణ్ణి. సినిమాలో హీరో, ఎవరితో ఎందుకు పోట్లాడుతున్నాడో తెలియని పరిస్థితి. హాల్లో జనమూ తక్కువే. బయటకి నడిచాను ఫోన్‌కాల్ తీసు కుందామని.

"హలో," అన్న నామాటకి బదులుగా, "నా పేరు సీతాదేవి అండీ! నేను 'కటాక్షం' అనే సాహితీసంస్థని నెలకొల్పానండీ! రచయితలందరూ కలిసి సాహితీకబుర్లు చెప్పుకోవాలన్నదే ఈ సంస్థ ఉద్దేశం. ఎవరో ఒకరి ఇంట్లో మీటింగు పెట్టుకుంటామండీ ప్రతీనెలా. మీకు ఈ మెయిలు కూడా పంపామండీ. మీరు జవాబే ఇవ్వలేదు," అంటూ గుక్కతిప్పుకోకుండా మాట్లాడిందావిడ.

అవును, నిజమే! అప్పుడప్పుడు అలాంటి ఈమెయిళ్ళు రావడం, నేను వాటిని పట్టించుకోకపోవడం మామూలే! సీతాదేవి పేరు పొందిన రచయిత్రి, కవయిత్రి. ఏవేవో పుస్తకాలు కూడా ప్రచురించిందావిడ. ఆవిడ భావాలు ఆవిడవీ, నా భావాలు నావీ. ఎవరి భావాలు వారివీ. ఆవిడకి భక్తి. నాకు దానిమీద వ్యతిరేకత.

"నేనిప్పుడు సినిమాహాల్లో వున్నానండీ! తర్వాత మాట్లాడదా మండీ," అన్నాను మర్యాదగా.

"అలాగేనండీ!" అని చెప్పి, ఫోను పెట్టేసిందావిడ.

"అమ్మయ్య!" అనుకుని, ఆ సినిమా హీరో ఇంకా బతి కున్నాడో, విలన్ల చేతుల్లో చావుదెబ్బలు తింటున్నాడో కనుక్కుందా మని, హాల్లోకి నడిచాను. ఆ ఫోను విషయం అప్పటికి మర్చి పోయాను. అయితే, సీతాదేవి మాత్రం మర్చిపోలేదా విషయం. నేను ఫోను చేస్తానేమోనని రెండ్రోజులు ఎదురుచూసినట్టుం దావిడ. ఏ చప్పుడూ లేకపోయేసరికి ఆవిడే తిరిగి ఫోను చేసింది.

"తర్వాత మాట్లాడదామన్నారు కదా? ఫోను చెయ్య లేదేం?" అంటూ నిలదీసిందావిడ.

"సాధారణంగా నేను తిరిగి ఫోను చెయ్యనప్పుడు, ఎవరూ నాకు తిరిగి ఫోను చెయ్యరండీ. నన్ను వదిలేస్తారు. ఏదో మర్యాదకి అలా అంటాము. మీరు కూడా అంతేననుకున్నాను," అని చెప్పేశాను.

మళ్ళీ ఆవిడ తమ సంస్థ గురించీ, దాని వుద్దేశం గురించీ చెప్పుకొచ్చింది. ఎలాగన్నా నేను వాళ్ళ మీటింగుకి వచ్చేటట్టు చూడాలని ఏమన్నా కంకణం కట్టుకుందేమో ఆవిడ. వదల్లేదు నన్ను. అడుగుతూనే వుంది రమ్మని. అదీగాక, ఏదో పెద్ద రచయిత లాగా ఫోజు కొడుతున్నాననుకుంటారేమోననే జంకు ఒకటి నాకు.

"మీరేమనుకోకండీ! ఈ సాహితీసమావేశాలకి రావడం నావల్లకాదు. నా భావాలు వేరూ, వీళ్ళందరి భావాలు వేరూ. నన్ను వదిలెయ్యండీ," అని స్పష్టంగా చెప్పేశాను.

ఎలాగన్నా మాట మారుద్దామని, నేనే, "మీకు నా గురించి ఎలా తెల్సింది? నేనేమీ పేరున్న రచయితను కానే?" అనడిగాను.

"ఓ, అదా?నిజమే! మీరసలు నాకు తెలియరు. మీరు రాసినవేమీ చదవలేదు నేను. రావుగారు మీ గురించి చెప్పారు," అంటూ నిజాన్ని నిర్భయంగా చెప్పేసిందావిడ.

రావుతో పరిచయం రెండు, మూడువారాల కిందటే జరిగింది. ఒకరోజు ఆదివారంనాడు, ఆఫీసులో పని వెలగ బెడుతూ వున్నప్పుడు, 'నీకో ఈమెయిలు రావునించీ వచ్చింది,' అని కంప్యూటరు చప్పుడు చేస్తూ చెప్పింది.

'ఈ రావు ఎవరబ్బా?' అనుకుంటూ, ఈమెయిలు తెరిచి చూశాను. ఆ ఈమెయిలు, 'ఎవరో నాస్తికుడు ఏదో మీటింగులో ఏదో అన్నట్టు' అన్న వార్త గురించి. రావు నాకు రాసిందేమీ లేదు. ఓ వార్తని నాకు పంపాడు. ఎటొచ్చీ ఆ ఈమెయిల్లో, తన ఫోను నెంబరు ఇచ్చాడు. వెంటనే ఫోను చేశాను.

ఆయనతో మాట్లాడాక గుర్తొచ్చింది. ఏదో వెబ్‌సైటులో ఈ రావు రాసిన కొన్ని వ్యాఖ్యానాలు చదివాను. కాస్త అభ్యుదయం గానే వున్నాయి ఆ మాటలు. రావు కూడా నాస్తికుడని తెలిసి సంతోషించాను.

"నేనూ, నా భార్యా మీవూరి పక్కవూళ్ళో వున్న మా అబ్బాయి దగ్గరకి వచ్చామండీ. ఇంకో రెణ్ణెళ్ళుంటాము. మా అబ్బాయీ, కోడలూ వుద్యోగాలు చేస్తారు. వాళ్ళకో మూడేళ్ళ పిల్లాడు. మా అమ్మాయికి ఇండియాలోనే పెళ్ళి చేసేశామండీ. అమ్మాయీ, అల్లుడూ ఇండియాలోనే వుంటారు. నేను ఫలానా వుద్యోగంలో కిందటేడాదే రిటైరయ్యాను. అదీ సంగతి," అంటూ తన విషయా లన్నీ చెప్పుకొచ్చాడు రావు.

విచిత్రం ఏమంటే, నా విషయాలు ఒక్కటీ అడగ లేదా యన. నేనూ చెప్పలేదు.'నా గురించి ఎలా తెలిసింది?' అని అడిగితే, ఏదో పత్రికలో నా కథ కింద నా ఈమెయిలు అడ్రసు చూశానన్నాడు.

పెద్దవయసులో వున్న నాస్తికులు కలిసినప్పుడు, ఎప్పుడూ అడిగే ప్రశ్నలే అడిగాను.

"మీ భార్యగారు కూడా నాస్తికులేనాండీ?"

అయివుండదని నాకు గట్టి నమ్మకం.

"అబ్బే! కాదండీ! మరీ చాదస్తంగా వుండదుగానీ, దేవుళ్ళూ, పూజలూ అన్నీ వున్నాయండీ!"

నా నమ్మకం వమ్ము కాలేదన్నమాట!

"మరి మీ పిల్లల సంగతేమిటండీ?" అనడిగాను ఆసక్తిగా.

సాధారణంగా, ఈ ప్రశ్నకి రకరకాల సమాధానాలు వస్తూ వుంటాయి.

"మా అబ్బాయి నాలాగే నాస్తికుడండీ! మా అమ్మాయి వాళ్ళమ్మలాగే ఆస్తికురాలండీ!"

బాగుంది! ఆస్తుల్లాగే, పిల్లలకి భావాలు కూడా పంచుకున్నారన్నమాట! బాగుంది! చాలా బాగుంది!

అప్పుడడిగాను అసలు ప్రశ్న!

"మీ పిల్లల పెళ్ళిళ్ళు ఎలా జరిగాయండీ? మీరు నాస్తికులు కదా? మత సంబంధిత తంతులు మీకిష్టం వుండదు కదా?"

"మనకు నమ్మకం లేకపోయినా, మన వియ్యాలవారికుంటాయి కదండీ? వాళ్ళొప్పుకోరు కదా ఆ తంతులు చెయ్యకపోతే? అదీగాక, మా ఆవిడకి కూడా ఆ నమ్మకాలున్నాయి కదా? ఆవిడా వూరుకోదు కదా అవి చెయ్యకపోతే? ఇక నలుగురు చుట్టాలూ నాలుగు మాటలంటారుకదా?" అంటూ నామీదే ప్రశ్నల వర్షం కురిపించాడాయన.

'చచ్చాంరా బాబూ,' అనుకున్నాను.

"అయితే నాస్తికులయి వుండీ, పట్టుపంచె కట్టుకుని, పీటల మీద కూర్చుని, బొట్టు పెట్టుకుని, మీ అల్లుడి కాళ్ళు కడిగి, కన్యాదానం చేశారన్న మాట! నాస్తికుడిగా మీ అబ్బాయికి పెళ్ళి ముందరే ఉపనయనం చేసి, చెవిలో గాయత్రిమంత్రం వుపదేశించారన్నమాట! చాలా బాగుంది!" అన్నాను ఆక్షేపణగా.

"మీ పిల్లల పెళ్ళిళ్ళు మీరెలా చేశారూ?" అనడిగాయన.

"మా పిల్లల పెళ్ళిళ్ళు నేను చెయ్యనండీ! వాళ్ళే చేసుకుంటారు. నాస్తిక పద్ధతిలో వాళ్ళు చేసుకుంటే, నేను వెళతాను. లేకపోతే, వెళ్ళను.వాళ్ళ జీవితం వాళ్ళది. అంతేగానీ, వాళ్ళ కోసం ఆ మతసంబంధిత తంతులు ఏమీ చెయ్యను. మా నాన్న పోయినప్పుడు కూడా నేనేమీ చెయ్యలేదు, విచారించడం తప్ప. నా సంగతులు తెలిసిన మా అమ్మా ఏమనలేదు, మా చుట్టాలూ ఏమనలేదు. నన్నేమన్నా అంటే, 'మీ భావాలు మీవీ, నా భావాలు నావీ' అని అంటానని వాళ్ళకీ తెలుసు," అని చెప్పుకొచ్చాను.

"ఇప్పుడలాగే అంటారు. తర్వాత మీపిల్లల పెళ్ళిళ్ళప్పుడు మీరే మారతారులెండి. అన్నీ మన చేతుల్లో వుంటాయా?" అన్నాడాయన వేదాంతం చెబుతూ.

నాస్తికుడి నోట వేదాంత ప్రవచనాలు విచిత్రంగా వుంటాయి.

"సరేలెండి! మా పిల్లల పెళ్ళిళ్ళు జరిగాకే, నా గొప్పలు చెప్పుకుంటాను లెండి," అని నవ్వాను.

"అదిసరేగానీ, ఒక సాహితీసమావేశంలో, 'కథకి వున్న సామాజిక ప్రయోజనం' అన్న విషయంమీద మాట్లాడాలి. ఏమన్నా సామాజిక ప్రయోజనం వున్న మీ కథలు కొన్ని చెప్పండి. చదివి,



నచ్చితే, వాటి గురించి మాట్లాడుతాను,'' అన్నాడాయన.

''సామాజిక ప్రయోజనం అనేది చాలా పెద్ద విషయమండీ! అందులో చాలా అంశాలు వుంటాయి. నాస్తికత్వం అనేది ఒక అంశం. దానిమీద కొన్ని కథలు గిలికానులెండి. మీకు నచ్చుతా యేమో చూడండి,'' అని హాస్యంగా అన్నాను.

ఆ తర్వాత ఆ నాస్తిక కథల వివరాలు కూడా చెప్పానా యనకు.

ఆ సంఘటన జరిగిన రెండు, మూడువారాలకి సీతాదేవి ఫోను. ఇదేనన్నమాట, ఆ రావు చెప్పిన సాహితీ సమావేశం.

''నేను రానండీ,'' అని కచ్చితంగా చెప్పినా, సీతాదేవి వాళ్ళ ఈమెయిలు లిస్టులోంచీ నా పేరు తీసెయ్యలేదు. నేనూ తీసెయ్యమని చెప్పలేదు. వాళ్ళ సాహితీసంస్థ ఈమెయిళ్ళు నాకు వస్తూనే వున్నాయి.

ఒకరోజు ఈమెయిల్లో సంగతి: ''రావుగారు 'కథలో వున్న సామాజిక ప్రయోజనం' అన్న అంశం గురించి మాట్లాడుతారు. దానికి ఆయన ముగ్గురు రచయితలని ఎన్నుకున్నారు. ఆ రచయితల పేర్లూ, రావుగారు ఎన్నుకున్న ఆ రచయితల కథల పేర్లూ ఇక్కడ ఇస్తున్నాము. మీరు మీటింగుకి వచ్చేముందరే, ఆ కథలు చదివి వస్తే, చర్చ బహు పసందుగా వుంటుంది,'' అని రాసింది సీతాదేవి.

ఆ ముగ్గురు రచయితల్లో నేనొకణ్ణి. నేను రాసిన ఓ మూడు నాస్తిక కథల పేర్లు కూడా వున్నాయందులో. అటువంటి సాహితీ మీటింగు ఈమెయిలు ఇదివరలో చూడలేదు. 'ఇదేదో కాస్త వేరేగా వుందే!' అనుకున్నాను.

ఆమర్నాడే, ఇంకో రచయిత రాసిన ఈ మెయిలుని సీతా దేవి అందరికీ ఫార్వార్డు చేసింది.

''మీరు ఆ నాస్తిక రచయిత కథల గురించి చర్చిస్తున్నారా? నేను దేవుళ్ళ గురించీ, మంత్రాల గురించీ వ్యాసాలు రాస్తే, ఆ నాస్తిక రచయిత నా మీద విమర్శగా ఓ కథ రాశాడు. మీ లిస్టులో ఆ కథ పేరు కూడా వుంది. మీరు దాని గురించి చర్చిస్తున్నారా?'' అనడిగాడు అతను, సీతాదేవికి మాత్రమే రాసిన ఈమెయిల్లో.

ఆశ్చర్యం వేసింది ఆ రచయిత ధోరణికి. సాధారణంగా ఎవరూ మనసులో వున్న విషయం డైరెక్టుగా బయటికి చెప్పరు. ఈ రచయిత మాత్రం, పిల్లిమీదా, కుక్కమీదా పెట్టకుండా, స్పష్టంగా చెప్పేశాడు తన అసమ్మతి.

''నేను మీకు వ్యక్తిగతంగా ఈమెయిలు రాస్తే, దాన్ని మీరు అందరికీ ఫార్వార్డు చేసి, నా పరువు తీస్తారా?'' అని ఆ రచయిత, సీతాదేవి మీద విరుచుకుపడతాడనుకున్నాను.

ఎవరేమంటారో చూద్దామని, రోజూ వాళ్ళ ఈమెయిళ్ళు చదివేవాణ్ణి ఆసక్తిగా. ఒక్కరూ ఒక్క మాట కూడా అనలేదు ఆ విషయం గురించి.

ఇంకో రెండ్రోజులకి, రావు ఒక ఈమెయిలు పంపాడు.

''నేను రచయితల గురించి మాట్లాడబోవడం లేదు. వాళ్ళు రాసిన కథల గురించే మాట్లాడబోతున్నాను. ఎవరి వ్యక్తిగత విషయాల్లోకీ నేను వెళ్ళబోవడంలేదు,'' అన్నది దాని సారాంశం.

రావు జవాబు ఆ రచయితకి ఎలా సరిపోయిందో, అర్థం అయితేగా? మొత్తానికి, ఆ తర్వాత ఎవరూ ఏమీ రాయలేదు ఆ విషయం గురించి. అంటే, ఆ సంగతి 'పాత' పడిపో యిందన్న మాట రచయితలకి.

మా పక్కూళ్ళోనే మా బాబాయి కొడుకు వుంటాడు. నాకన్నా బాగా చిన్నవాడు. వాడి అత్తగారు ఇండియాలో బాగా పేరు పొందిన రచయిత్రి. ఆవిడ పేరు సుభద్రమ్మ. ప్రస్తుతం కూతురి దగ్గరే వుంటోంది. నాతో అప్పుడప్పుడూ మాట్లాడుతూ వుంటుం దావిడ. నా గోల ఆవిడకి నచ్చదు. ఆవిడ గోల నాకు నచ్చదు. అయినా సరే, కల్సినప్పుడల్లా, మర్యాదగా మాట్లాడేసుకుంటూ వుంటాము, ఆ విషయమూ, ఈ విషయమూ.

ఆరోజు ఏదో పనిమీద మా బాబాయి కొడుకింటికి వెళ్ళాను. వాడి అత్తగారితో ఈ సాహితీ సమావేశం గురించీ, ఇప్పటివరకూ జరుగుతున్న రాజకీయాల గురించీ, సీతాదేవి గురించీ, రావు గురించీ, అన్నీ చక్కటి కబుర్లు, మసాలా కూడా రంగరించి, చెప్పా నావిడకి సరదాగా.

సుభద్రమ్మ నావేపు పులుకూ, పులుకూమంటూ చూసింది, నేనేదో పెద్ద తప్పు చేసినట్టు.

''అదేంటండీ? అలా చూస్తారేం కోపంగా నావేపు?'' అని ఆశ్చర్యంగా అడిగాను.

''నేను రచయిత్రిని అని మీకు తెలుసు కదా? నేను సాహితీ సమావేశాలకి వెళతాననీ, అవంటే నాకిష్టమనీ కూడా మీకు తెలుసుకదా? మరి, మీరు వాళ్ళకి నా పేరెందుకు చెప్పలేదూ? నన్ను కూడా పిలవమని మీరు వాళ్ళకెందుకు చెప్పలేదూ?'' అంటూ నిలదీసిందావిడ.

ఆశ్చర్యం పట్టలేక కిందపడిపోవాలనిపించింది. అలా పడి పోతే, ఆవిడ చెయ్యి పట్టుకుని ఎలాగూ లేవనెత్తదూ, అలాగే సంతోషంగా చూస్తూ వుంటుందని గాఢంగా అనిపించి, కింద పడిపోయే కార్యక్రమం ఆపేశాను.

''బావుందండీ మీ వరస! నేను చెప్పిన కబుర్లలోంచి మీకు దొరికిన విషయం అదా? ఏదో సామెత చెప్పినట్టు, నా మీద నెపం నెడుతున్నారా? అయినా, ఆ రచయితల లిస్టులో మీ గాఢ స్నేహితుల పేర్లు కూడా వున్నాయి. వాళ్ళనడగండి గట్టిగా!'' అని ఎదురుతిరిగాను.

''అడుగుతానండీ! వాళ్ళని కూడా తప్పకుండా అడుగు తాను. ఇప్పుడుకాదు. ఆ మీటింగయ్యాక, వాళ్ళు ఎప్పుడో మాట్లాడుతారు కదా నాతో? అప్పుడడుతాను వాళ్ళని గట్టిగా. ఇప్పుడు మిమ్మల్ని అడుగుతున్నాను'' అంటూ వదల్లేదావిడ నన్ను.

"వుత్తినే అడగడం కాదు, బాగా కడగండి వాళ్ళని," అన్నాను నవ్వుతూ.

"అలాగే, అలాగే. ఇప్పుడు మిమ్మల్ని కడుగుతాను. మీరు చెప్పండి," అంది సుభద్రమ్మ నవ్వుతూ.

"ఎందుకు మీ గురించి చెప్పలేదంటే, మీ పేరు చెప్పా లన్న విషయం నాకు తోచలేదు కాబట్టి. ఆ మీటింగుకి వెళ్ళడం ఇష్టం లేని నేను, మీ గురించి ఎలా చెబుతానూ? మిమ్మల్ని పిలవమని ఎలా చెబుతానూ? అంత ఆసక్తి వుంటే, మీరే వాళ్ళకి ఫోనుచేసి, 'వస్తానని' చెప్పండి. సంతోషంగా రమ్మంటారు. ఎంతమంది వస్తే అంత గొప్ప ఆ మీటింగు వాళ్ళకి. మీటింగు విజయవంతం అయిందనీ, బోల్డుమంది వచ్చారనీ చాటుకోవాలిగా వాళ్ళు కూడా?" అని చెప్పానావిడకి.

"పిలవని పేరంటానికి వెళ్ళడం ఏం బాగుంటుందిలెండి. మీరు వాళ్ళకి నా గురించి చెబితే బాగుండేది," అంది సుభద్రమ్మ.

ఓర్నాయనో! వదలదే ఆవిడ నన్ను నిందించకుండా! సాహితీ సమావేశం పిలవని పేరంటం అట! పిలవకపోతే, ఆ సాహితీ సమావేశానికి వెళ్ళకూడదా? సమావేశాన్ని పేరంటం చేసేసింది సుభద్రమ్మ. రాబోయే నవ్వుని ఆపుకున్నాను బలవంతంగా, ఇంకే మంటుందో నన్నని జడిసి. ఎంతైనా చుట్టా లావిడ కదా?

మర్నాడనిపించింది నాకు.'సీతాదేవికి ఇప్పుడు ఫోను చేసి అంది సుభద్రమ్మ గురించి చెప్పొచ్చు కదా?' అని. నిన్నావిడ నాతో దెబ్బలాడినప్పుడు కూడా, చివరికి, 'ఇప్పుడయినా మీరు వాళ్ళకి చెప్పండీ!' అని నన్నడగలేదు. 'ఇప్పుడు చెప్పమంటారా?' అని నేనూ అడగలేదు. చెబితే సంతోషిస్తుందని మాత్రం తెలుసు. సీతాదేవి నాకు ఫోనుచేసింది, ఎవరిదో ఫోను నెంబరు అడగ డానికి. అప్పుడు ఒక మాట చెప్పాను ఆవిడకి.

"మొన్నొకరోజు ఏదో పనిమీద మా బాబాయి కొడుకు ఇంటికి వెళ్ళాను. అతని అత్తగారు సుభద్రమ్మ. పేరున్న రచయిత్రి. ఇండియా నించి కూతురు దగ్గర వుండడానికి వచ్చింది. మీ సాహితీ సమావేశం గురించి చెబితే, ఆవిడ ఆసక్తి చూపించింది. 'అయ్యో, నన్ను పిలిస్తే నేను వెళ్ళేదాన్ని కదా?' అని కాస్త వాపో యింది కూడా. మీకు తెలుసా ఆ సంగతి?" అని అడిగాను.

"చాలా సంతోషమండీ! సుభద్రమ్మ ఇక్కడున్నట్టు నాకు తెలీదు. తప్పకుండా పిలుస్తానావిణ్ణి. మీరు కూడా రావొచ్చుగా? బాగుంటుందీ?" అందావిడ.

ఫోనుపెట్టేశాను. ఆవిడ విక్రమార్కుడు. నేను భేతాళుణ్ణి.

వాళ్ళ సాహితీసమావేశం జరిగిన మర్నాడు, సుభద్రమ్మ ఫోను చేసి చెప్పింది ఆ మీటింగు సంగతులు.

"సాహితీసమావేశం బాగా జరిగిందండీ. నన్ను అధ్యక్షత వహించమన్నారు. నేను, 'నా కథలకి ప్రేరణ' గురించి మాట్లా డాను. అందరూ సంతోషించారు. రావుగారు, 'కథకి వున్న సామాజిక ప్రయోజనం' గురించి మాట్లాడారు. మీరు రాసిన ఫలానా కథ గురించి కూడా మాట్లాడారు. ఎంతో బాగా జరిగింది మీటింగు. సీతాదేవి, నన్ను కార్లో తీసుకువెళ్ళి, తిరిగి తీసుకు వచ్చింది. ఎంతో మర్యాదగా చూసిందావిడ నన్ను. నా గురించి మీరు వాళ్ళకి చెప్పినందుకు చాలా థాంక్సండీ!" అంటూ సంబరం గా చెప్పుకొచ్చింది ఆ సంగతులు.

'పోనీలే! వాళ్ళూ వాళ్ళూ బాగానే వున్నారు కదా?' అనిపిం చింది.

"మీరు మీ గాఢస్నేహితుల్ని, 'మీరు నా గురించి సీతాదేవి గారికి చెప్పలేదేం?' అని అడిగారా?" అని అడుగుదా మనుకున్నానుగానీ, ఏవేవో సామెతలు గుర్తొచ్చి, మానేశాను.

మొత్తానికి, రావు, వివాదాస్పదమైన నా కథ గురించి మాట్లాడలేదని తెలిసింది. అదేమీ కొత్తగా అనిపించలేదు. భావాల కోసం శతృవుల్ని పెంచుకుంటారా వీళ్ళు?

ఇంకో రెండు వారాలు పోయాక సీతాదేవి నించి ఫోను.

"మళ్ళీ ఫోను చేశారేవిటీ? ఆ మీటింగులకి రానని నేను చెప్పేశానుగా?" అన్నాను కాస్త ఆశ్చర్యంగా.

"ఏం? మీటింగుల గురించే ఫోను చెయ్యాలా? ఏమన్నా సాహిత్యం గురించి కబుర్లు చెప్పుకోకూడదా?" అందావిడ.

"అలాగా! చెప్పండీ!" అన్నాను నీరసంగా, ఆవిడతో నాకేం కబుర్లుంటాయని.

"పున్నయ్యగారనే ఒక గొప్ప రచయిత మన బేఏరియాకి వస్తున్నారట. ఆయన బోలెడు నాస్తిక వ్యాసాలు కూడా రాశారట. నేనేవీ చదవలేదనుకోండీ. ఆయన రావుగారింట్లో వుంటారట కొన్నిరోజులు. అభ్యుదయంగా ఆలోచించేవాళ్ళని ఆయన రావు గారి వాళ్ళింట్లో 'గెట్టుగెదర్'కి పిలుస్తున్నారట. మిమ్మల్నీ, నన్నూ కూడా పిలుస్తారట. ఆయన నాకు చెప్పారు. నేను మీకు చెబు తున్నాను. ఆయన మీకు ఫోను చేస్తారట," అని వివరంగా చెప్పిందావిడ.

"అయ్యో! అలాగా! మీరు చెప్పకపోయారా ఆయనకి, నేను రాననీ, నన్ను పిలవొద్దనీ? అయినా, నాస్తికులే అభ్యుదయంగా ఆలోచిస్తారని మీరంటే నవ్వొచ్చింది నాకు. అలాంటప్పుడు మిమ్మ ల్నెలా పిలిచారాయన 'గెట్టుగెదర్'కి? మీరు నాస్తికులు కారు కదా?" అనడిగాను.

"అదే నాకాశ్చర్యం! నేను తప్ప, మిగిలిన వాళ్ళందరూ నాస్తికులేనట. అయినా, ప్రతీ మనిషీ జీవితంలో ఎప్పుడో ఒకసారి నాస్తికుడిగానే ఆలోచిస్తాడూ, వుంటాడూ. నేను మాత్రం? నేను రెండురకాల మనిషిని. కావాలంటే అటూ వుంటాను. ఇటూ వుంటాను. మీతో ఇప్పుడు మాట్లాడే సీతాదేవి వేరు. సాహితీ సమావేశాలు నిర్వహించే సీతాదేవి వేరు. కథలూ, కవితలూ రాసే సీతాదేవి వేరు. వాళ్ళంతా నాలో భాగాలేగానీ, మొత్తం నేను కాదు వాళ్ళు. మీరు ఆ తేడాలు గ్రహించాలి," అంటూ వెర్రివాళ్ళకి మాత్రమే అర్థం అయ్యే మాటలు మాట్లాడింది.

ఇదివరలో, దేన్నీ సహించకుండా పోట్లాడే నేను, ఈమధ్య కాలంలో వాళ్ళనీ, వీళ్ళనీ పోట్లాడకుండా వదిలెయ్యడం నాకే ఆశ్చర్యం కలగజేస్తోంది. దెబ్బలాడే ఓపిక నశించలేదుగానీ, వీళ్ళెలాగూ మారరని ఓ జీవితకాలం చెప్పేసింది.

అనుకున్నట్టుగానే, అంటే సీతాదేవి చెప్పినట్టుగానే, రావు నించి ఫోను.

''పున్నయ్యగారి గురించి మీరు వినే వుంటారు. గొప్ప అభ్యుదయ రచయిత. మనలాగే గట్టి నాస్తికులు. ఎన్నో పుస్తకాలు ప్రచురించారు. కొత్త పుస్తకం ఆవిష్కరణసభ కోసం అని ఇక్కడకి వచ్చారు. వేరే రాష్ట్రంలో వుంటారాయన. మీరా సభకి ఎలాగూ రారుకదా? అందుకని, సాహితీసంస్థలనీ, తెలుగు సాంప్రదాయ, సాంస్కృతిక, స్ఫూర్తి సంస్థలనీ, తెలుగువెబ్ పత్రికలనీ పట్టించు కోకుండా, అభ్యుదయంగా వుండేవాళ్ళని కొంతమందిని మాత్రమే 'గెట్టుగెదర్'కి పిలుస్తున్నాను. ఇది మీటింగు కాదు. అభ్యుదయం గా ఆలోచించే కొంతమంది మాట్లాడుకోవడానికి కలుస్తున్నా మంతే! పున్నయ్యగారు కూడా వుంటారు. ఆయనతోటి మాట్లా డొచ్చు మనం,'' అంటూ ఎంతో సామరస్యంగా వివరించా డాయన.

ఏం 'గెట్టుగెదర్' ఇదీ? ఎవరి గోలలో వాళ్ళుంటారు.కానీ, 'అభ్యుదయ వాదులు' మాత్రమే అంటే కొంత ఆసక్తి కలిగింది.

''గెట్టుగెదర్ అంటే మాట్లాడుకోవడం అయ్యాక, భోజనాలు కూడా పెడతారా? లేక వుత్త కాఫీలు మాత్రం ఇచ్చి పంపుతారా?ఈ గెట్టుగెదర్‌లో ఏం మాట్లాడుతారు అందరూ?'' అంటూ నా భేతాళ ప్రశ్నలు సంధించాను.

అమెరికాలో, ఎవరన్నా వాళ్ళింటికి పిలిస్తే, భోజనాలు పెట్ట కుండా పంపరు. అదో పెద్ద సాంప్రదాయం. ఏ సాహితీ సమా వేశమన్నా, ఏ సాంస్కృతిక కార్యక్రమమన్నా, భోజనాలు లేకుండా జరగవు.

'అన్నీ అయ్యాక, అప్పుడు కొంపలకెళ్ళి ఏం వంటలు మిడుకుతారూ?' అన్న విషయం కూడా వుంది.

''అయ్యో! భోజనం లేకుండా ఎలా వుంటుందీ? వచ్చిన వాళ్ళకి డిన్నరూ, వైనూ అన్నీ వుంటాయి,'' అని వివరించాడు రావు.

''ఆలోచించి, మీకే విషయమూ తెలియజేస్తా,''నని మాటిచ్చి, ఫోను పెట్టేసి, ఆశ్చర్యసాగరంలో మునిగిపోయాను.

అభ్యుదయవాదులందరూ, అభ్యుదయ విషయాలన్నీ మాట్లాడేసుకున్నాక, తాగుతారన్నమాట! తాగడమనేది కూడా అభ్యుదయం అయిపోయింది ఈరోజుల్లో. అమ్మో! ఇంకా ఎన్ని అభ్యుదయాలున్నాయో! అమెరికాలో మరీనూ! మా కంపెనీలో ప్రతీ శుక్రవారం సాయంత్రం తాగుడుపార్టీ! ఆరోజు ఓ పోలీసు కారు మాకంపెనీ పక్కనే మాటేసి, తాగి కారు నడిపేవాళ్ళని పట్టుకోడానికి చూస్తూ వుంటుందని అందరూ జోకేస్తూ వుంటారు. వెంటనే రావుకి ఈమెయిలు పంపాను.

''నాస్తికులతో అభ్యుదయ ఆలోచనలతో మీటింగులు మంచివే. అయితే, మీరు 'వైనూ, డిన్నరూ' గురించి కూడా చెప్పారు. నేను తాగుడికి పూర్తిగా వ్యతిరేకిని. కంపెనీలో వుండే వైను పార్టీలకేపోను. ఎక్కడైనా ఆల్కహాలు సప్లై చేస్తుంటే, అటు వంటి మీటింగుకి నేను వెళ్ళను. ఎక్కువమంది ఆడవాళ్ళు కూడా ఆ మీటింగుల్లో ఆ వైను తాగరు.అలా వైను తాగడాలూ, ఆ తప్పుపని చేస్తూ, దాంతోపాటు అభ్యుదయ విషయాలు మాట్లా డ్డాలూ, ఈ రెండు కలిసి జరగడం నేను ఇష్టపడను. మంచి విషయాలతోపాటు, ఆచరణ కూడా నాకు ఇష్టం. అందువల్ల నేను మీ ఇంటికి రావడంలేదు,'' అన్నది నా ఈమెయిలు సారాంశం.

ఆ మెయిలు పంపాక, 'అమ్మయ్య! ఇక ఆ గెట్టుగెదర్‌కి వెళ్ళే ప్రసక్తేలేదు,' అని సంతోషించాను. నా మెయిలుకి జవాబు వస్తుందనుకోలేదు. నా నమ్మకాన్ని వమ్ము చేస్తూ వచ్చింది రావు జవాబు.

''వైను సర్వే చేయడం కన్నా మీరు ఈ అభ్యుదయ మీటింగుకి రావడం ముఖ్యం. వైను అస్సలు సర్వ్ చెయ్యము. సీతాదేవి తప్ప అందరూ కొత్తవాళ్ళు, వస్తున్నారు ఈ మీటింగుకి. ఆ పైవారం మేము ఇండియా తిరిగి వెళ్ళిపోతున్నాము. మీరు తప్పకుండా రండి,'' అన్నది అతని ఈమెయిలు సారాంశం.

ప్రతీసారీ ఆశ్చర్యపోవాలంటే విసుగేసినా, ఆశ్చర్యపోక తప్పలేదు నాకు. నేను రావడం కోసం, ఆ గెట్టుగెదర్‌లో తాగడం మానేస్తామన్నారంటే, ఆశ్చర్యమేగా మరి?వాళ్ళ గెట్టుగెదర్‌కి వెళ్ళకపోవడానికి ఒకే ఒక అభ్యంతరం చెప్పాను. అది కాస్తా తొలగించాడాయన.

వెంటనే, 'మీఇంటికి వస్తున్నాను,' అని మెయిలు పంపాను.

ఆ తర్వాత కొత్త దిగులు పట్టుకుంది. రావు ఇంటికి వచ్చే వాళ్ళందరూ కనీసం ఓ ఇరవైమందన్నా వుంటారు కదా? రావు భార్య వీళ్ళందరికీ వండి, వడ్డించాలన్నమాట. ఏవో మాటల్లో, రావు, 'నాకు వంట బొత్తిగా రాదండీ,' అని మురుసుకుంటూ చెప్పినట్టు గుర్తు. ఇండియా నించి వచ్చిన అత్తగారిని కూర్చో బెట్టి, వుద్యోగం చేస్తున్న ఏ అమెరికా కోడలు ఆ వచ్చే ఇరవై మందికీ వండి, వడ్డిస్తుందీ? ఒకవేళ ఆ కోడలు చేసినా, ఆ ఇండియా అత్తగారు చెయ్యనిస్తుందా? ఒకవేళ, వాళ్ళిద్దరూ కలిసి పనిచేసినా, అంతమందికి ఇద్దరు మాత్రమే చెయ్యాలంటే కష్టంకాదూ? పైపెచ్చు ఇలాంటి భోజనాలకి, ఒక కూరా, ఒక పచ్చడీతో సరి పెట్టరు. నాలుగు కూరలూ, నాలుగు అన్నాలూ, ఓ పులుసూ, ఓ పచ్చడీ, ఓ హాటూ, ఓ స్వీటూ, గట్రా వుండా ల్సిందే. బోల్డు పని. తిన్నంత తిని, మిగిలింది మర్నాటికి దాచుకుంటారు.

''ఇరవైమందికి రావుగారి భార్యా, కోడలూ వండి, వడ్డిం చాలంటే కష్టం కదండీ? మీరేమనుకుంటున్నారూ?'' అనడిగాను సీతాదేవికి ఫోనుచేసి.

"ఓ అదా? ఇవన్నీ మామూలేనండీ! నేను రావుగారి భార్యకి ఫోను చేసి, 'సాయంకావాలా?' అనడిగాను. కొంచెం ముందరగా వచ్చి, ఓ పచ్చడి చేసి పెట్టమన్నారు. నేను కొబ్బరి పచ్చడి చేద్దా మనుకుంటున్నాను," అని చెప్పేసిందావిడ.

రావు ఇంటికి ఫోను చేశాను. ఆయనే ఫోనెత్తాడు.

"మీ భార్యగారితో మాట్టాడాలండీ! ఆవిడకి ఫోనిస్తారా?" అనడిగాను.

రావు భార్య లైనులో కొచ్చింది.

పరిచయాలయ్యాక, డైరెక్టుగా రంగంలోకి దిగిపోయాను. "ఎవరన్నా మీకు ఫోనుచేసి, 'గెట్టుగెదర్ వంటకి మీకు సాయం కావాలా?' అనడిగితే, ఆ ఫోను చేసింది ఆడవాళ్లయితే, ముందర కాస్త మొహమాటానికి మీరు వద్దన్నా, కాస్సేపటికి సంతోషంగా ఒప్పుకుంటారు. ఆ ఫోను చేసింది మగవాళ్లయితే, మీరు మర్యాద కోసం బొత్తిగా ఒప్పుకోరు వంటలో సాయానికి. 'మగవాళ్ళేమిటీ, వంటలో సాయం ఏమిటీ?' అని మీరు అనేసుకుంటారు. అంత మంది కోసం మీ ఇద్దరు మాత్రమే వంట చేస్తుంటే, పడి తినడానికి నాకు సిగ్గుగా వుంటుంది. సాధారణంగా మగాళ్ళెవరూ మీకిలా ఫోను చెయ్యరు. అయితే, గియితే వాళ్ళ భార్యలని చెయ్య మంటారు ఫోను. మీరు నా విషయంలో అందరిలాగా తీసుకో కండి. మొహమాటానికి కూడా వద్దనకండి. నేను ఓ రెండు, మూడు గంటలు ముందరగా వచ్చి, కొన్ని పదార్థాలు తయారు చేస్తాను. మీరు కొన్ని చెయ్యండి. పని పంచుకుందాం. నన్ను సాయం చెయ్యనివ్వండి," అంటూ చాలా వివరంగా, సామ రస్యంగా చెప్పానావిడకి. ఆవిడ సంతోషంగా ఒప్పుకుంది.

అన్నట్టుగానే, ఓ మూడుగంటలు ముందుగా వాళ్ళింటికి వెళ్ళాను. రావు భార్య, మనవడి బట్టలు మడత పెడుతోంది. ఇంట్లో ఎవరూ లేరు. రావు, పిల్లాణ్ణి 'డేకేర్' నించి తేవడానికి, పున్నయ్యతో కలిసి వెళ్ళాడట. కొడుకూ, కోడలూ వుద్యోగాల నించి ఇంకా రాలేదట.

రావు భార్య సామాన్లు అందిస్తూ వుంటే, చకచకా కొన్ని పదార్థాలు తయారుచేసేశాను. సీతాదేవి వచ్చి కొబ్బరిపచ్చడి చేసింది. రుచి చూడమని రవ్వంత చేతిలో వేసింది.

"అబ్బ! పులుపు! దీన్నిండా చింతపండు కుమ్మరించారు. నాకు పచ్చళ్ళలో చింతపండంటే అయిష్టం. అన్ని పచ్చళ్ళూ పుల్ల గానే వుంటాయి," అంటూ మొహం చిట్లించాను.

అందరూ నవ్వారు. రావు భార్య కొన్ని పదార్థాలు తయారు చేసింది.

"మీ మొహం చూస్తే, మీరు వంటపనులు చేసే మగాడి లాగానే వున్నారు లెండి," అంటూ కితాబిచ్చింది రావు భార్య నాకు.

అట్లపిండిలాగా ఉబ్బిపోయాను ఆ మంచి మాటలకే. నేను తప్ప, మరో మగపురుగు ఆ ఆడవాళ్ళకి సాయం చేయడానికి రాలేదు. కాస్సేపటికి అందరూ వచ్చారు. 'గెట్టుగెదర్' మొదల య్యింది.

'పదార్థాలు బాగున్నాయ,'ని నన్ను మెచ్చుకుని, సంతోష పెట్టారు కొందరు.

అందరం హాల్లో కూర్చున్నాం. నేను ఫైర్‌కేసు దగ్గరున్న గట్టు మీద కూర్చున్నాను వాళ్ళ మాటలు వింటూ.

యథాలాపంగా పక్కకి తిరిగి చూస్తే, కొంత దూరంలో వైను స్టాండూ, దాన్నిండా వైను బాటిల్సూ. కొంతమంది ఆ స్టాండు వేపు ఆశగా చూడ్డం నా దృష్టిని దాటిపోలేదు. అడగడానికి వాళ్ళకి మర్యాద ముసుగు!

అన్నీ పిచ్చికబుర్లే! అభ్యుదయ కబుర్లు ఒక్కటీలేవు. నాస్తిక మాట ఒక్కటీలేదు. ఒకాయన, చేతికి ఏవేవో పూజల దారాలు కట్టుకుని వచ్చాడు.

ఒకాయన పున్నయ్యని ఏమన్నా చెప్పమన్నాడు.

దానికి పున్నయ్య, "ఇక్కడ మీరందరూ మీ గిరి గీసుకుని, అందులో మీ కార్యక్రమాలు చేసుకుంటున్నారు. వాటిలోకి మీ చుట్టూ వున్న అమెరికా వాళ్లని లాగడంలేదు," అని చెప్పాడు.

దారాలు కట్టుకున్నాయన, "అవునండీ! నిజం! మా ఆఫీసు లో వున్న అమెరికా వాళ్ళు వాళ్ళ డ్రింకింగు పార్టీకి నన్ను పిలు స్తారు. నేను వెళతాను. అయితే, మొన్నామధ్య వినాయకచవితి పూజ చేసుకున్నప్పుడు, నేను ఆ అమెరికన్లని ఎవర్నీ పిలవలేదు. ధైర్యం చాలలేదు. ఇప్పుడనుకుంటున్నాను పిలిచి వుండాలని," అంటూ పిచ్చిమాటలు చెప్పాడు.

నాస్తిక పున్నయ్య ఆ మాటలని ఏమన్నా విమర్శిస్తాడేమో నని చూశాను. ఆయన నోరెత్తితేగా!

ఇంకొకాయన, "రాత్రి తర్వాత పగలూ, పగలు తర్వాత రాత్రీ వస్తూ వుంటాయి. అలాగే మనుషులకి కష్టాలూ, సుఖాలూ ఒక దాని తర్వాత ఒకటి వస్తూ వుంటాయి," అని కవిత్వం చెప్పాడు.

ఇక సీతాదేవి మాతృత్వం మీద కవిత్వం చదివింది. స్త్రీలు మాత్రమే పిల్లల్ని కంటారట. వాళ్ళకి మాత్రమే అనుభూతులు కలుగుతాయట. అందుకే పిల్లల బాధ్యతలన్నీ తల్లులకే వుండా లట. పురుషులు దానికి పనికిరారట. ఎందుకంటే పురుషులకి అనుభూతులు కలగవట, పిల్లల్ని స్వయంగా కననందుకు. మాతృత్వమనే గొప్ప విలువ కలిగినవారే స్త్రీలట. పురుషులు ఆ విషయంలో తక్కువట. ఇలా సాగింది ఆ కవిత్వం.

విచిత్రం ఏమంటే, అక్కడున్న ప్రతీ పురుషుడూ చాలా సంతోషంగా, పిల్లల విషయంలో తమ తక్కువతనాన్ని ఒప్పేసు కుని, పిల్లల బాధ్యత పూర్తిగా స్త్రీలకి ఇచ్చెయ్యడానికి అంగీకరిం చేశారు. మరి స్త్రీలకే కదా అనుభూతులున్నవి?

"ఆ 'గెట్టుగెదర్' ఎప్పుడయిపోతుందా, ఎప్పుడు కొంపకి పోయి ఏదన్నా పుస్తకం చదువుకుందామా?" అని ఎదురు చూస్తున్నది నేనొక్కణ్ణే.

అప్పుడడిగింది సీతాదేవి ఓ ప్రశ్న.

"మనుషులందరిలోనూ ఎంతోకొంత కపటత్వం ఎందుకు వుంటుందండీ? మనసులో మాట ప్రతీసారీ బయటకి ఎందుకు చెప్పలేము? మా ఆయన, తన తల్లిని ఇండియా నించి తీసుకు వస్తానంటాడు. అది నాకు ఇష్టం వుండదు. ఆ విషయం బయటకి చెప్పలేక, ఏదో చెబుతాను. నాకు కొన్ని విలువలుంటాయి. బయటవాళ్ళ విషయంలో ఒక్కోసారి, ఆ విలువలు బయట పెట్టకుండా, సర్దేసుకుంటూ వుంటాను. ఆ కపటత్వం ఎలా పోతుంది?" అని.

దానికి ప్రతీఒక్కరూ, ఏదో చెప్పసాగారు. వాళ్ళ మాటలు వినడం మానేశాను. ఇదేం మాయదారి 'గెట్టుగెదరో' అర్థం అయి చావలేదు.

ఉన్నట్టుండి సీతాదేవి, నావేపు చూసి, "మీ అభిప్రాయం ఏమిటండీ?" అని గట్టిగా అడిగేసింది.

అందరూ నా వేపు చూస్తూ, నేనేం మాట్లాడతానా అని చూస్తున్నారు. ఇక మాట్లాడక తప్పలేదు.

"అభ్యుదయ 'గెట్ టుగెదర్' అని పిలిచారు నన్ను. ఒక్క అభ్యుదయ విషయం మాట్లాడలేదు ఎవరూ. పూజలు చేసి, దారాలు కట్టుకున్నాయన తన పూజకీ, అమెరికన్ల తాగుడు పార్టీకీ పోలిక పెట్టాడు. క్రిష్టియన్ పూజవాణ్ణి హిందూ పూజకి పిలుస్తాడట! వేరే దేశం మనుషులను కలుపుకోవడం అంటే, పూజకి పిలవడం అనుకుంటున్నాడు. నాస్తిక పున్నయ్యగారు నోరెత్తలేదు. మీ భర్తకో తల్లి వుంటుందనే, మీ భర్త కూడా ఒక తల్లికి పుట్టాడనే చిన్న సంగతి మీకు ఇప్పటికీ మీ జ్ఞానంలోకి రాలేదన్నమాట. ఇంతమంది అభ్యుదయ మగాళ్ళు ఒక్కరు కూడా ఆడవాళ్ళకి వంటలో సాయం చెయ్యలేదు. ఇంకొకాయన ప్రకృతిలో రాత్రీ, పగళ్ళకీ, సమాజంలోని మనుషుల కష్టసుఖాలకీ పోలిక పెట్టాడు. ప్రకృతికీ, సమాజానికీ తేడానే తెలియదు ఆయనకి. ఇక సీతాదేవి గారయితే, స్త్రీలకి అనుభూతులూ, వాటితోపాటూ పిల్లల బాధ్యతా అంటగట్టేసి, పిల్లల పనుల్నించీ పురుషులకి విముక్తి కలిగించేశారు. ఇక కపటత్వం గురించీ ప్రశ్నిస్తున్నారు. ప్రతీ మనిషికీ కీర్తి పిచ్చో, డబ్బు పిచ్చో వుంటుంది. తాము చేసే పనుల వల్ల, తాము మంచివాళ్ళనీ, గొప్పవాళ్ళనీ వాళ్ళకి కీర్తి కావాలి. లేదా డబ్బు కావాలి. అందుకోసం, వాళ్ళ మనసుల్లో ఏమున్నా, అవసరార్థం అది బయటపెట్టరు. ఏమన్నా విమర్శిస్తే, మళ్ళీ ఇంకో మీటింగుకి పిలవరేమోనని భయం వాళ్ళకి. ప్రతీ కారణం ఏదో ఒక అవసరం కోసమే! సోషల్ నెట్‌వర్కు పెంచుకునేది తమ అవసరాలు తీర్చుకోవడానికే. నాకా గోలలేదు. నన్నెవరూ మీటింగుకి పిలవకపోయినా చింతించను. అందుకని మనసులో వున్న మాట నిష్కర్షగా చెప్పేస్తాను. 'ఎందుకులే వాదించడం?' అని వూరుకుంటానేమోగానీ, ఏమన్నా అనేసు కుంటారనీ, మళ్ళీ నన్ను వాళ్ళ సోషల్ నెట్‌వర్కులో వుంచు కోరేమోననీ కాదు. 'మారని బుర్రలు వున్న వీళ్ళతో ఎందుకులే వాదించడం' అనను కుంటాను. అలాంటప్పుడు లొంగే అవసరం అక్కర్లేదు. ఏదో లబ్ధి కోసం చూసే వాళ్ళకే కపటత్వం గానీ," అంటూ ఓ పెద్ద లెక్చరిచ్చాను.

అందరూ నిశ్శబ్దంగా అయిపోయారు. కొంతమంది గుసగుసలాడటం నాకు కనిపించింది. ఒకరిద్దరి మొహాల్లో చిన్న నవ్వు. 'అత్తగార్ని తేను' అన్న మనిషి గురించి కూడా కామెంటు లేదు. అంతా నిరసనగా వున్నట్టు చేశారు. అందరూ ఇంకా తేరుకోకుండానే, అలా చూస్తూ వుండగానే, గబగబా లేచి, చెప్పులేసుకుని, బయటకి వచ్చి, వెనకాల తలుపేసేశాను. *

*Expert Astrology Services*

**JAYAKUMAR SIVACHARYA**

***Priestly Services for South & North Indians***

***(Tamil, Telugu, Kannada, Gujarati, Maharashtra, UP, Punjab)***



**All Hindu Religious Pujas, Satyanarayana Puja, Namakaranam, Upanayanam, Weddings, Birthday/Graduation, Gruha Pravesham & all other functions. And Homams – Ganapati, Navagraha, Chandi, Ayush, Rudrabhisekham & more.**

*కాకినాడలో పుట్టిన జెయుబివి ప్రసాద్ సిలికాన్ వ్యాలీలో సాఫ్ట్‌వేర్ కంపెనీకి టెక్నికల్ మానేజర్‌గా పనిచేస్తున్నారు. గురజాడ, చలం, శ్రీపాద, రంగనాయకమ్మ రచనలు అమితంగా ఇష్టపడే వీరికి సంగీతం, నృత్యం అభిరుచులు. ఆ కుటుంబంతో ఒకరోజు కథాసంపుటి ప్రచురించారు. భార్య, ఇద్దరు పిల్లలతో క్యుపర్టినో, కాలిఫోర్నియాలో నివాసం.*

జీవన సౌరభం

# ఇది ఏ కొమ్మపువ్వో?

రాజేశ్వరి ఉదయగిరి

ప్రతీసారి లాగే ఈ సారి కూడా బాగా ఎదురు చూసీ, చూసీ, చూడగా - ఇదిగో వచ్చింది వసంతం. Springhas sprung as we say. సౌత్‌లో ఇంక మాకు మంచు కురిసే రోజులు ఈ సీజన్‌కి అయిపోయినట్టే. ఇంక మెల్లిగా gardening పనులు మొదలు. BTW, gardening గురించో, spring గురించో మాట్లాడే ఉద్దేశం లేదు నాకు.

భారతదేశం నించిఎగురుతూ, ఎగురుతూ వచ్చి - ఇక్కడ వాలి, ఇక్కడో గూడు కట్టుకుని, అందులో పిల్లల్ని సాకుతూ, ఇటు పూర్తిగా గూడున్న చెట్టు సొంతమో,అటువచ్చిన వూరి సొంతమో కాలేక, అటు-ఇటు గాలివాటానికి ఊగిసలాడుతున్న జీవితాలు ఎన్నెన్నో ఈ దేశంలో. నిజానికి ఏ పరాయి దేశమైనా ఇంతే.

సరే అమెరికాలో ఉన్నాం కదా అని పూర్తిగాAmericanize కాలేకపోయి, పండగలు పబ్బాలు వస్తే మన సంప్రదాయాన్ని పక్కకు నెట్టేసి కేవలం Halloween, Christmas,Thanksgiving లాంటివి మాత్రమే celebrate చేసుకుంటూ ఉండలేం.ఒక పక్క ఉగాది ఎంత ముఖ్యమో, ఇంకో పక్కNew Years eve and New Years day అంతే ముఖ్యం. Proms కీ, Graduations కీ ఎంత పెద్ద పార్టీలు చేస్తామో, ఆరంగేట్రం వగైరా అంతే ఆర్భాటంగా చేస్తాము.



దాదాపు రెండేళ్ళవయసు నించీ పసిపిల్లలు మాట్లాడే ముద్దుముద్దు మాటలు వింటుంటే, అది ఏ భాషో ఆలోచించకుండా మనసారా, తనివితీరా, ఆస్వాదిస్తాం; ఆనందిస్తాం. మరో రెండేళ్ళు దాటగానే english పలుకులు ముద్దొస్తున్నాయే అని మురిసిపోతాం. ఆపైన తెలుగు మన మాతృభాష కనుక అది మాట్లాడటం చాలా అవసరం అని పిల్లలకి నూరిపోస్తాం. ఇటీవల అమెరికాలో మన అదృష్టం కొద్దీ బాగా పెరిగిపోతున్న తెలుగుబళ్ళల్లో వేస్తాం. వీకెండ్ వచ్చిందంటే సంగీతమని, కూచిపూడి అనీ, భరతనాట్యమనీ- ఒకపక్క బాలీవుడ్ అనీ, ఇంకో పక్క బాలే (ballet) అనీ, ఒకపక్క సాకర్, ఇంకో పక్కక్రికెట్. ఒక పక్క piano, ఇంకో పక్క వయోలిన్. ఇక academics పరంగా help కావాలి కనుక kumon chinese mathనో ఆశ్రయిస్తాము. ఇటుswimming , అటుHindu mythology, ఇటు స్పెల్లింగ్ బీ, అటు Hindu epics మీద వ్యాసరచన పోటీ. ఇవేవి ఆనట్లేదని, అటు Miss.America, ఇటు మనకున్న అశేష తెలుగు సంస్థల్లో మనవారు జరిపే కార్యక్రమాల్లో పోటీపడి, నెగ్గి, all-rounder అనిపించుకోవాల్సిన బాధ్యత.

Indiaకి ఫోన్‌చేస్తే అమ్మమ్మలు, నానమ్మలతో అనర్గళంగా తెలుగులో మాట్లాడాలి. స్కూల్‌కి సంబంధించిన పోటీల్లో, మీటింగ్స్‌లో, కాన్ఫరెన్స్‌లలో అందరూ ముక్కుమీద వేలేసుకునేలా ఆంగ్లము అల్లెయ్యాలి.

ఇంతాచేసి ఒకపెద్ద డాన్సర్‌గానో, లేదా గాయనిగానో, లేదా చిత్రకరుడిగానో భవిష్యత్తుకి బాటలు వేసుకుంటూ వారి సామర్థ్యాన్ని చాటుకుంటే, మన మనస్సుకీ, ఆశకీ అది చాలదు. We want them to match for some residency program leaving behind all classes, trainings, practices, performances, achievements - most of all may be some dreams woven in that direction. ,~ me] confusion?

పిల్లల్ని, పిల్లల్లా పెరగనివ్వని ఈనాటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పరికరాలు ఎంత గొప్పవో, వారి పసితనాన్ని వీలయినంత బిజీగా మార్చేసే తల్లితండ్రుల ఆలోచన కూడా అంతే గొప్పది.



Options ఉండడం మంచిదే -The more the better. కానీ అన్ని options అందరూ తీసుకుంటే 'Option' అన్న పదానికి అర్థమే లేదు.

ఒక అందమైన పూల తోటలో రకరకాల పూలు. ఒక్కో పువ్వుదీ ఒక్కో అందం. ఒక్కో పువ్వుకీ మనసుని మైమరపించే పరిమళముంటే మరో పువ్వుకి అసలు వాసనే అంటదు. కొన్ని చిన్న చిన్నగా విరగపూస్తే, మరికొన్ని పెద్ద పెద్దవిగా, సంవత్సరానికి ఒకటే పువ్వుగా పూసి మనసు నింపుతాయి. కొన్ని చెట్లకి పూలే పూయవు, కొన్ని ఆకులే పూవులయిపోతాయి. ఏ రంగైనా, ఏ



వాసనైనా, ఎలాంటి రూపైనా అన్ని పువ్వులూ, అన్నిచెట్లూ అవి ఉన్నట్టుగా ఉంటేనే ఆ తోట ఉద్యానవనం అవుతుందేమో. Each flower is unique.

మనలోచాలా మందికి తెలిసి అనుభవమున్న విషయమే, just గుర్తుచేసుకుంటే?

అందరు పిల్లలూ గాయకులు కాలేరు,డాన్సర్లు కాలేరు. ఒకొక్కరిది ఒక్కో ధోరణి. వారి వారి అభిరుచిని బట్టి, వారిలోని నైపుణ్యాన్ని బట్టి, ఆ దారిలో వారికి మనంసహాయాన్నిసహకారాన్ని అందిస్తే బాగుంటుందేమో. వారి దారి ఏదో తెలుసుకుంటేఆ దిశలోనే మరింత శిక్షణ అందించడంసముచితమేమో?

ఇండియాకి వెళ్ళినప్పుడు పూర్తిగా అక్కడి జీవితాన్ని ఆకళింపు చేసుకోలేక,అక్కడి వాళ్ళకిమన వాళ్ళు అర్థంకాక మన వాళ్ళకి అక్కడి వాళ్ళు అర్థంకాక సతమతమవుతున్నారు. ఇక్కడి వరస చూస్తే , ఇక్కడివారు మన ఉనికిని గమనిస్తూ మనల్ని అక్కున చేర్చుకుంటూనే Immigrantsగా ముద్రిస్తున్నందుకు - చిన్న బాధని మనసులో దాచుకుంటూ- అటూ కాలేకపోతూ, ఇటూ కాలేకపోతూ... ఏమవ్వాలి ఈ చిగురించే కొమ్మలు?

వలసపక్షులు ఎప్పటికైనా వలస పక్షులేనాలేక స్థానీకరణ చెందుతాయా??

ఈ కొంగ్రొత్త కొమ్మలు ఏ చెట్టువి?

ఈ పూలు ఏ కొమ్మవి?

*



*భారత్‌లోను, అమెరికాలోను అనేక టీవీ, స్టేజి కార్యక్రమాలకు యాంకర్‌గా పనిచేసిన రాజేశ్వరి బహుముఖ ప్రజ్ఞాశాలి. అనేక తెలుగు సినిమాలలో కథానాయిక పాత్రలకి డబ్బింగ్ చెప్పారు. వృత్తిరీత్యా సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్న వీరి ప్రస్తుత నివాసం డాలస్, టెక్సస్*

# దైవదర్శనం

మాచిరాజు సావిత్రి

ఎంకన్న బాబుకి ఏడుకొండలంటా ఈ
ఎంకన్న గాడికి ఎకరమేలేదంట

దుక్కావా? దున్నావా? గింజైనా నాటావా?
కలుపైనా తీశావా? పంటైనా కోశావా?
ఏమీ చెయ్యని నీకు ఎందుకయ్య ఈ భూమి?
అన్నీ చేసే నాకు ఎందుకయ్య ఈ లేమి?

ఎంకన్న బాబుకి ఏడుకొండలంట ఈ
ఎంకన్నగాడికి ఎకరమే లేదంట

మళ్లా? మాన్యాలా? బ్యాంకిల్లో ఖాతాలా?
చీకట్లో యాపారాలా? ఒంటినిండా సొమ్ములా?
నిలువున మమ్ము దులిపి నీకు నిలువుదోపిడి ఇస్తే
పిడికెడు దుమ్ము రాలి, కడివెడు చెమట కారు

ఎంకన్న బాబుకిది ఖాతరే లేదేమో? ఈ
ఎంకన్నగాడి మీద కనికరమె రాదేమో

కట్నాలు, కానుకలూ, లాభాలు, లంచాలూ
ఎగ్గొట్టే పన్నులూ, నల్ల సొమ్ము మూటలూ
అన్నిట్లో నీకు వాటాలిచ్చిన దొరలంతా
బంగాళాల్లో చల్లగుండి ప్రసాదాలు మింగుతారు

కూటికి గింజలేక, మొలకింత గుడ్డలేక
నిలిచే నీడలేక, బతకలేక, చావలేక
ధర్మప్రభువు నీవని, నీ ధర్మదర్శనం కోసం
చూసి, చూసి శోష వస్తే ఈడ్చి పక్కన పారేస్తారు

ఎంకన్న బాబూ నీ ముచ్చట్లు చెప్పలేను
టిక్కెట్లు లేనివాళ్ల ఇక్కట్లు బాపలేవు

బంగారు గోపురాలూ, భోషాణాల్లో కాసులూ
కాపలా కాస్తామంటూ, అందరికి ఇస్తామంటూ
ఐ.ఎ.ఎస్. ఆఫీసర్లూ, దేవస్థానం డైరెక్టర్లూ
నీ చుట్టూ గోడకట్టి, నిన్ను లొంగదీశారయ్యో!

ఎంకన్న బాబూ ఈ బంగారపు పంజరంలో
బానిస బ్రతుకెందుకు? బయటకు రావెందుకు?

ఏడుకొండలవాడా ఈ కొండల్లో చిక్కి నీవు
బండబారిపోయావు, రాతిగుండెవైనావు
మనుషుల్లో చేరి నీవు మా మనుగడ చూడవయ్యా
మనిషే లేకుంటే, దేవుడెలా ఉంటాడయ్యా?

ఎంకన్న బాబూ ఈ కొండ నీకండగాదు ఈ
ఎంకిగాళ్ల గుండె బలమె కొండంత అండ నీకు

ఏం? వస్తావా? రావా? సరే!

ఉంచుకో నీ కొండలు, నీ గుళ్లు, గోపురాలూ
నీ నిండు హుండీలూ, నీ గుండు భక్తులూ
నా శక్తి నాకు ఉంటే, నీ భుక్తి నాకెందుకు?
నా ముక్తి నాలో ఉంటే, నీ భక్తి నాకెందుకు?

ఎంకన్న బాబుకి ఈ ఏడుకొండలేగానీ ఈ
ఎంకన్నగాడికి ఈ లోకమంత ఇల్లేరా



# ఏమని వెతకను?

భావన గోపరాజు

ఏమి వెతకను నేను?
ఫ్రీవేలో ఫ్రీడం ఇచ్చిన నా గల్లీలను వెతకనా
నాలుగుగిర్రల కారులోన నాలుగులక్షల కిలోమీటర్లు తిప్పిన నా ద్విచక్రాన్ని వెతకనా
ఏమీ తోచని ఖాళీసమయాన అసలు ఖాళీ లేకుండా చేసిన నా నేస్తాలను వెతకనా
ఇక్కడ కనిపించిన ప్రతీచెట్టులోన మా ఎన్నారై చెట్టుని వెతకనా
నే వేసె రెండు అడుగులలో నాతో నడిచిన ఆ ఇరవై అడుగులను వెతకనా
రోజూ మోగే అలారమ్‌లో నాన్న పిలుపు కోసమై ఆగే ఆ క్షణాన్ని వెతకనా
సెల్ఫీలు తీసుకుని చూసుకునే సమయాన అమ్మనాన్న కనులే నా అద్దమైన నిమిషాలు వెతకనా
ఏమీతోచనివేళ చిన్నోడితో ఆడే జగడాలే వెతకనా
ప్రతీ పార్టీలో మీతో కలిసి షికార్లు చేసిన గడియలు వెతకనా
నిదుర రానినాడు మీ పక్కకొచ్చి గప్పీలు కొట్టె లాలనను వెతకనా
సాయంత్రాన అలసి సోఫాలో కూర్చున్ననాడు నాన్నతో ఆ సాయంత్రపువేళ వీధులలోన చెక్కర్లు వెతకనా
కంప్యూటర్ లాబులో బాత్కాని కొడ్తునప్పుడు మన సంపంగిచెట్ల కింద సంభాషణను వెతకనా
ఏమి వెతకను నేను ఇక్కడ సాగించే జీవితాన జీవం ఎక్కడ వెతకను.





భావనా గోపరాజు వెయిన్‌స్టేట్ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్‌లో మాస్టర్స్ చేస్తున్నారు. ఒక తెలుగు సినిమాకు పాటలు రాశారు. నాలోని భావన అనే బ్లాగు నిర్వహిస్తున్నారు.

**MURTHY LAW FIRM**

United States Immigration Law

# Best Wishes to TANA
# +
# Entire Community!



www.murthy.com

*We know immigration matters!*℠

**MurthyChat | MurthyBulletin | MurthyForum**



కథ

# పదవ నెల

ఇందు ప్రియాంక

మే నెల...

అప్పుడప్పుడే... మిషిగన్లో చలి టాటా చెప్పి వెళ్ళొస్తా అనుకుంటూ సెలవు తీసుకున్న తొలిరోజులు!

ఇన్నాళ్ళు మంచు దుప్పట్లో మగ్గిన జనాలు... కన్వర్టబుల్ కార్లు బైటికి తీసి ఝూమ్మంటూ రోడ్ల మీద తిరుగుతున్నారు.

దూరంగా ఉన్న 696 ఫ్రీవే మీద కార్ల రొద వినిపిస్తోంది. మెల్లగా వాకింగ్ ట్రాక్ ఎక్కిన నేను... పక్కింటి పాటియోలో కూర్చుని జ్యూస్ తాగుతున్న ప్రసీజని పలకరించాను.

“హాయ్ ప్రసీ... ఎలా ఉన్నావు? ఇవాళ ఆఫీస్ ఎలా జరిగింది? ఒంట్లో ఎలా ఉందీ?”

“హాయ్ అక్కా... బాగున్నా! వాకింగ్‌కి బయలుదేరావా? నేను ఇవాళ రాలేనక్కా... కొంచెం అలసటగా ఉంది. ఇదిగో ఇప్పుడే ఆఫీస్ నించి వచ్చా.”

“అలసటగా ఉందా? ఏమన్నా తిన్నావా? టిఫిన్ చేసి పెట్టనా?”

“కొంచెం అలసటగా ఉంది అంతే! తొమ్మిది వచ్చింది కదా... సుధీర్ వచ్చేస్తాడు ఇంకాసేపట్లో. తను చేస్తాడులే,” అంటూ చిరునవ్వు నవ్వేసింది ప్రసీ.

"సరే మరి. జాగ్రత్త! ఎక్కువసేపు బైట కూర్చోకు. ఇది ఇంకా మే నెలే! నెమ్ము చేస్తుంది. అసలే నిండుగర్భిణివి. మనది మిషిగన్ గుర్తుంచుకో. తర్వాత కలుస్తాను, బై," అని చెప్పి మళ్ళీ వాకింగ్ ట్రాక్ మీదకి చేరాను.

ప్రసీజ నాకు రెండేళ్ళుగా పరిచయం. పెళ్ళయ్యాక యుఎస్ వచ్చింది భర్తతో పాటు. గలగలా మాట్లాడుతుంది. సున్నిత మన స్కురాలు. ఇక్కడే డిట్రాయిట్ డౌన్‌టౌన్‌లో ఉద్యోగం చేస్తోంది. ప్రసీ, ఆమె భర్త సుధీర్ ఇద్దరూ సోషల్‌గా బాగా ఆక్టివ్! అందరి పుట్టినరోజు పండగలకి, పార్టీలకి వెళ్తారు. ఫేస్‌బుక్, వాట్సాప్ లో ఎప్పటికపుడు అప్‌డేట్స్ పెడుతూ వుంటారు. ఇండియాలో బంధువులతో కూడా తరచూ స్కైప్‌లో చాట్ చేస్తూ ఉంటారు.

ఇప్పుడు ప్రసీకి తొమ్మిదో నెల. ఎంత ముద్దుగా ఉందో నిండుకుండలా... ఇంకో రెండు వారాల్లో తనకి డ్యు డేట్. పెద్ద వాళ్ళెవరు రావట్లేదు. వీసా వీలుపడలేదుట. ఇక అన్ని నేనే చూసు కుంటున్నా. ఎంతైనా ఇరుగు-పొరుగు అన్నాక ఆమాత్రం చేయాలి కదా! అదీ దేశం కాని దేశం. తెలుగువాళ్ళం. మనకి మనం సాయం చేసుకోకపోతే ఎలా? అందులోనూ తొలిచూలాయే! అందుకే ప్రసీజని సొంత చెల్లెల్లా చూసుకుంటున్నా!

ప్రసీది చిన్నపిల్లల మనస్తత్వం. ఆమెకి బుజ్జిపాప పుట్టబో తోంది అని తెలిసినప్పుడు ఎంత కేరింతలు కొట్టిందో! 'అక్కా... మా అమ్మమ్మ మళ్ళీ నాకోసం నా పాపగా పుడుతోంది. అప్పుడు అమ్మమ్మ నన్ను చూసుకుంది. ఇప్పుడు అమ్మమ్మని నేను చూసు కుంటా... భలే,' అనేది. సుధీర్ ఇవేమి పట్టించుకోడు. అన్నీ నీ ఇష్టం అనో... ఓహో అలానా అనో... అంటాడు. అందుకే ప్రసీ ఎక్కువ నాతోనే ఇవన్నీ చెప్పుకునేది.

పాప కోసం నర్సరీ అంతా ప్రసీనే డిజైన్ చేసింది. నేను అన్నీ అమర్చడంలో తనకి సాయం చేశా. తనకి గులాబిరంగు అంటే ఇష్టం. అందుకే పాప గది అంతా కూడా గులాబిమయం చేసేసింది. 'హలో కిట్టీ' థీమ్‌తో గది అలంకరించింది. ఎక్కడెక్కడ సేకరిం చిందో పాపం! వాల్ డెకాల్స్‌తో గోడలు నింపేసింది. సీలింగ్ అంతా రాత్రిపూట వెలిగే నక్షత్రాలు అంటించింది. పాప డ్రెస్సులు, సామాగ్రి కోసం ఒక గులాబి-తెలుపు రంగు చెక్కబీరువా కొన్నది. పాపకి తెల్లటిక్రిబ్ కొని దానిమీద 'హలో కిట్టీ' దుప్పటి పరిచింది. డయిపర్ స్టేషన్‌కు కూడా ఇదే థీం. ఇంకా, డయిపర్స్ అన్ని నెలలకి ముందే సేకరించింది. బోలెడు దుస్తులు కొనేసింది. ఉయ్యాల, రాకర్ ఛెయిర్, స్నానంతొట్టి, తువ్వాళ్ళు, షాంపూలు, క్రీమ్‌లు, మసాజ్ నూనెలు, పాలడబ్బాలు, పాలను/వైప్స్‌ను వేడి చేసే వార్మర్లు, డయిపర్ పెయిల్... ఇలా ఒకటా-రెండా? యెనాడూ కనీవినీ ఎరుగని సౌకర్యాలు అన్నీ కల్పించింది రాబోయే బుజ్జిపాప కోసం.

ఇవన్నీ చూసి నేనెంత ఆనందంతో కూడిన ఆశ్చర్యానికి లోనయ్యానో! అవును మరి! పదేళ్ళ క్రితం నా పురుడు అప్పుడు మా ఊళ్ళో ఇవన్నీ ఎక్కడున్నాయ్? చూరుకు ఒక కొక్కెం పెట్టి, దానికి మెత్తని పాతచీరలతో ఉయ్యాల వేసేవాళ్ళం. అది కూడా మంచం పక్కనే! దానికి ఒక తాడు కట్టి ఊపుతూ ఉండేవాళ్లం. అదే అప్పటి మా 'ఉయ్యాల/ క్రిబ్ /రాకర్' అన్నీనూ. స్నానానికి సున్నిపిండి, తలకి ఆముదం, దిష్టిపూసలు, సాదుబొట్టు, పాపాయికి పల్చటి జుబ్బాలు తప్పించి ఇంకేమి ప్రత్యేకంగా కొనలేదు. అలాంటిది ఇవన్నీ చూస్తుంటే నోట మాట రాలేదు నాకైతే.

ఇద్దరం కలిసి పాపగది అంతా సర్దేసాం. అంతా అయి పోయాక వీడియో, ఫొటోస్ తీసుకుంది ప్రసీ. స్క్రాప్‌బుక్ కోసమట! 'ఈ పిల్లకి ఎంత ఓపికో! రాబోయే బుజ్జాయి అదృష్టవంతురాలు. ఇంత ఓపిక, సృజనాత్మకత ఉన్న అమ్మ దొరికినందుకు,' అనుకున్నా!

అలా రోజులు గడుస్తున్నాయ్! జూన్ ఒకటవ తారీకున ప్రసీకి 'డ్యు డేట్.' ఇంకో రెండు వారాలన్నమాట. ఈమారు డాక్టర్ చెకప్‌కి తోడు నేనూ వెళ్ళా. డెలివరి ఎప్పుడంటారో అని ఒకటే కంగారుగా ఉంది అందరికి.

"నీకు ఇంకో రెండు వారాల్లో డ్యు డేట్. కాని ప్రస్తుత పరిస్థితి చూస్తే ఎప్పుడైన కాంట్రాక్షన్ మొదలవ్వొచ్చు. నువ్వు లేబర్‌లోకి వెళ్ళొచ్చు. అన్నీ సిద్ధం చేసుకోండి," అని చెప్పారు డాక్టర్.

"అక్కా.. భయంగా ఉంది," అంది ప్రసీ హాస్పిటల్ నుంచి బైటికొస్తూ.

"ఏం పర్లేదు! నీ బుజ్జి అమ్మమ్మ నీ చేతిలోకి తొందరగా వచ్చేస్తా అంటుంటే భయమెందుకు?" అన్నాను తనని ఉత్సాహ పరుస్తూ.

"అవునులే కానీ మొదటి కానుపు కదక్కా?"

"అబ్బా! సాంకేతికతలో ఈ దేశం ఎంత ముందుంది? ఈ హాస్పిటల్స్ ఎంత ఆధునికంగా ఉన్నాయ్? ఏమి లేని మా ఊళ్ళో... పల్లెటూళ్ళో నేను పురుడు పోసుకోలేదూ? ఇద్దరు పిల్లలని కనలేదూ? నువ్వేం కంగారుపడకు," అని ధైర్యం చెప్పా.

"అమ్మ ఉంటే బాగుండేది అక్కా."

"నన్ను అక్కా అంటున్నావ్! నీకు నేను ఉన్నా... బంగారంలా చూసుకునే నీ భర్త ఉన్నాడు... ఇంకా భయమా? ప్రసీ... మన తాత-ముత్తాతలు అందరూ ఇలా పుట్టినవాళ్ళే! మన అవ్వలు-అమ్మమలు చేయగలిగినది... ఇంత చదువుకున్నావ్... తెలివిగల దానివి... అమెరికాలో ఉంటున్నావ్..... ఉద్యోగం చేస్తున్నావ్. నువ్వు చేయలేవా?" ఒక చిరునవ్వు సమాధానం ఇచ్చింది ప్రసీ.

నాకు తనని చూస్తే జాలేసింది. ఈ సమయంలో తల్లి పక్కనే ఉండాలి అంటారు. తన కోరిక సహజమే! కాని అన్నీ అనుకున్నట్టు జరిగితే ఇది జీవితమెందుకవుతుంది? ప్రసీ మెటర్నిటీ లీవ్ పెట్టేసింది.

ప్రసీ భర్త, నేను కలిసి తనహాస్పిటల్ బ్యాగ్ సర్దేశాం. ఏవి అవసరం, ఏవి కావు అన్నీ ఐపాడ్లో నోట్ చేసుకుని దాని ప్రకారం సర్దుకున్నాం. ఇక బుజ్జాయి రాకకి అన్నీ సిద్ధం. నేనైతే ఎర్రనీళ్ళు

సామాగ్రి, కొబ్బరికాయ కూడ రెడీగా పెట్టుకున్నా. ప్రసీ తను బుజ్జి దానికి కుడుతున్న బేబి బ్లాంకెట్ చకచకా చేసేస్తోంది...

ఇంకో వారంరోజులు గడిచాయి! ప్రసీకి అప్పుడప్పుడు కడుపులో నొప్పి తప్ప ఇంకేమి సూచనలు కనిపించలేదు.

వారంరోజుల చెకప్‌కి వెళ్ళారు ప్రసీ దంపతులు. ఇంకో 2-3 రోజుల్లోనే కానుపుఅన్నారు. హాస్పిటల్‌కి వెళ్ళి ఒకసారి ఎమర్జెన్సీ ఎంట్రన్సులు అన్నీ చూసుకునివద్దాం... రాత్రివేళ నెప్పులొస్తే అని మావారు, సుధీర్ వెళ్ళారు. ఆ రోజున ప్రసీ మా ఇంట్లోనే ఉంది. తనకి ఇష్టమైన కొబ్బరన్నం, పాలపాయసం చేసా. పాపం ఏదో ఆలోచనలో ఉన్నట్టుంది సరిగ్గా తినలేదు.

రెండురోజులు భారంగా గడిచాయి. ప్రసీకి సన్నగా పోట్లు మొదలయ్యాయి. ఇక మూడవరోజు రాత్రి బాగా నొప్పులు వస్తుంటే అందరం బయలుదేరాం. నాకూ ఇక్కడి హాస్పిటల్స్ కొత్త! ఎప్పుడూ ఇటు రాలేదాయే! ప్రసీని ముందుగా 'ట్రియాజ్' లో ఉంచారు. అదేమని అడిగితే... ఇక్కడ కానుపు కోసం హాస్పిటల్లో జాయిన్ చేసుకునే ముందు ట్రియాజ్ అని ఒకచోట పెడతారట. నొప్పులు బాగ ఎక్కువయ్యాయి అనిపిస్తే మాత్రమే లేబర్ గదిలోకి పంపిస్తారట. విచిత్రంగా అనిపించింది.

మేము ట్రియాజ్ ముందు ఎదురుచూస్తూ ఉన్నాం! ఈలోగా సుధీర్ తన స్నేహితులు, బంధువులు అందరికీ చెప్పాడు... 'ప్రసీకి నొప్పులు మొదలయ్యాయి... హాస్పిటల్‌కి వచ్చాం. డెలివరి అయ్యాక చెప్తాము,' అని. ఇదేకాక... వాట్సాప్ మిత్రుల, బంధువుల గుంపులో మెసేజ్ పెట్టాడు... 'ప్రసీ ఈజ్ ఇన్ లేబర్. అవర్ ఏంజెల్ ఈజ్ ఆన్ ది వే,' అని. అందరం ఊపిరి బిగపట్టి ఎదురుచూస్తున్నాం!

ప్రసీని గంటసేపు ట్రియాజ్‌లో ఉంచి.. నొప్పులు తగ్గు ముఖం పట్టాయి... ఇవి 'ఫాల్ పెయిన్స్ ' మీరు ఆమెని ఇంటికి తీసుకెళ్ళిపోవచ్చు అని చెప్పారు. మాకు దిమ్మ తిరిగింది. 'ఇదేవిటి... ఇంటికెళ్ళి పొమ్మంటారు? ఆ పిల్లింకా నొప్పులతో గిజగిజలాడుతోంది,' అనుకున్నాం. అదే చెప్తే... 'ఇవి నిజం నొప్పులు కాదు. మా మెషీన్‌కి అన్నీ తెలుస్తాయి. బిడ్డ ఆరోగ్యంగా ఉంది. కాబట్టి మేము బలవంతపు ప్రసవం చేయము. దయచేసి ఇంటికి వెళ్ళిపోండి. మళ్ళీ బాగా నొప్పులొస్తే రండి,' అని చెప్పారు. ఇక చేసేదిలేక ఇంటికొచ్చేసాం!

ఇండియాకి ఇక్కడికి ఎంత తేడా? ఇదే మనదేశంలో అయితే... ఈపాటికి ప్రసీ సిజేరియన్ వార్డులో ఉండేదేమో! ఎంతైనా అమెరికా అమెరికానే అనుకుంటూ వెనక్కివచ్చాం. అదేమిటో ఇంటికొచ్చాక... ప్రసీకి నొప్పులు మెల్లగా తగ్గాయి. పాపం డాక్టర్లు దేవుళ్ళు నిజమే చెప్తారు అనుకుని... సరేలెమ్మని సరి పెట్టుకున్నాం!

ఇంటికొచ్చిన దగ్గర నించి స్నేహితులు, బంధువుల దగ్గర నించీ వస్తున్న ఫోన్‌కాల్స్ తీసుకోలేక సతమతమయ్యాడు సుధీర్. అందరికీ విషయం చెప్పడం... అందరూ... 'అయ్యో! అవునా? బిడ్డకి ఏమి ప్రమాదం లేదుకదా?! ఎందుకు ప్రసీకి డెలివరీ కాలేదు? అయినా ఆడపిల్లలు అసలు 38వ వారంలోనే పుట్టేస్తారు. మొన్న మా ఫ్రెండుకి అలాగే పుట్టింది పాప,' అని వ్యాఖ్యానాలు. అవి అన్నీ విని సుధీర్-ప్రసీలు మొహం చిన్నబుచ్చుకోవడం... అయ్యోపాపం అనిపించింది.

ఇలా ఈ వార్త అంతా పాకిపోయింది వారి స్నేహితుల సమూహాల్లో! ఫేస్‌బుక్‌లో ప్రసీ మీద జాలిపోస్టులు పడ్డాయి. వాట్సాప్‌లో 'బీ కాన్ఫిడెంట్ ప్రసీ. యుకెన్ డూ ఇట్!' లాంటి సందేశాలు వర్షంలా కురిశాయి. విషయం తెలిసినవాళ్ళు తెలియని వాళ్ళకి విడమరచి చెప్పడం... స్నేహితులు పదేపదే కాల్స్ చేసి విసిగించడం... ఇవన్నీ చూసిన ప్రసీకి చిరాకేసింది. అసలే ప్రెగ్నెన్సి హార్మోన్స్ చేసే గందరగోళంలో ఇది కూడా జతచేరి విసుగు, చిరాకు అందరి మీద ప్రదర్శించేసింది. ఆఖరికి వాళ్ళ అమ్మగారికి ఫోన్ చేసి... 'నువ్వే వచ్చుంటే ఇలా అయ్యేది కాదు,' అని పాపం వాళ్ళనీ వాయించేసింది.

ఏమిటో ఈ వింత కష్టాలు అనిపించింది. వాళ్ళ స్నేహితుల అత్యుత్సాహం మీద కోపం కూడా వచ్చింది. ఈ సోషల్ నెట్‌వర్కింగ్ ఈమధ్య విశృంఖలంగా తయారయ్యింది. వెర్రి వేయివిధాలు అన్నట్టుగా ఉంది.

ఇంకో రెండు రోజుల్లో డ్యుడేట్ రానే వచ్చింది. ఆరోజున మళ్ళీ చెకప్‌కి వెళ్ళింది ప్రసీ. అంతా బానే ఉంది... ఇంకో రెండు వారాల వరకు వేచి చూడొచ్చు అని చెప్పారుట!

అప్పటినించి ప్రసీకి ఇంకో రకమైన టెన్షన్ మొదలయింది. మొన్నటిదాక డెలివరి అంటే భయపడిన పిల్ల... ఇప్పుడు డెలివరి మళ్ళీ ఎక్కడ వాయిదా పడుతుందో అని భయపడుతోంది. ఎంతలోనే ఎంతమార్పు?!

సరిగ్గా ఆమె డ్యుడేట్ రోజున రాత్రి మళ్ళీ నొప్పులు మొదలయ్యాయి ప్రసీకి. ఈసారి ఎవ్వరికీ చెప్పలేదు. మేము నలుగురమే వెళ్లాం హాస్పిటల్‌కి. ఈసారి నొప్పులు బాగా వచ్చాయి. లేబర్ గదిలోకి తీసుకెళ్ళారు. అందరం ఊపిరి పీల్చుకున్నాం. నొప్పు లొస్తున్నాయ్! కాని బిడ్డ ముందుకి జరగట్లేదు అన్నారు. 'సి-సెక్షన్' అవ్వొచ్చు అని చూచాయగా చెప్పారు.

ఇక ప్రసీ ఏడుపు మొదలు! 'నాకు 'సి' ఒద్దు... నాకు భయం!' అంటూ. అందరం కలిసి బుజ్జగించాం... నచ్చజెప్పాం... అయినా వినదే! చివరికి ఆమె నొప్పులు మళ్ళీ తగ్గుముఖం పట్టాయని... ఆమెకి నొప్పుల మందు ఇస్తున్నాం అని, దాన్ని ఇండక్షన్ అంటారని చెప్పారు. 'పెటొసిన్' అనే మందు ఇచ్చారు. ఆ మందు దెబ్బకి ప్రసీ విలవిలలాడిపోయింది. ఆమెని చూసి నేను తట్టుకోలేక పోయా! అలా రెండురోజులు నొప్పులతో పోరాడింది. అయినా ప్రసీ కడుపులో బుజ్జితల్లి తన మీద దయ చూపలేదు. లేబరు ముందుకు కొనసాగట్లేదు అని... పెటొసిన్ ఇక ఇవ్వడం

కుదరదని... ఓవర్ డోస్ అవుతుందని... తన శరీరం ఇంకా లేబర్‌కి తయారుగా లేదని చెప్పి మళ్ళీ ఇంటికి పంపారు డాక్టర్లు!

ఈసారి అమెరికా వైద్యవ్యవస్థ మీద అందరికి విరక్తి వచ్చేసింది. పాపం ప్రసీ! కంటికిమంటికి ఏకధారగా ఏడ్చింది. తనకి అప్పటికే 40వవారం. అంటే అచ్చంగా నిండు తొమ్మిదినెలలు. ఇక అప్పటినించి 'పదవనెల.' అది కూడా రెండువారాలే! లేదంటే... 'సి-సెక్షన్.' తనలో ఏదో లోపం ఉందనీ... అందుకే డెలివరి తేలిగ్గా అవ్వట్లేదని బాధపడింది. ప్రసీ పరిస్థితి చూసి ఇండియాలో ఉన్న ఆమె తలితండ్రులు చెమ్మగిల్లి పొయారు. బిడ్డ మా దగ్గర పురుడు పోసుకుంటే ఇన్ని ఇబ్బందులు పడేదికాదు అని వారి బాధ!

అప్పటికే బిడ్డ బరువు ఎనిమిది ఎల్బీలు అని చెప్పారు డాక్టర్లు. ఇంకా లేటు అయితే ఇక నార్మల్ డెలివరి అవ్వదేమో అన్నది ప్రసీ బాధ! తనకి సి-సెక్షన్ ఇష్టంలేదు. ఇక ఇలా లాభం లేదని... గూగులమ్మ సాయం తీసుకున్న ప్రసీ చేయని ప్రయత్నం లేదు. రోజు అనాసపండు ముక్కలు తినడం మొదలుపెట్టింది. పొద్దునా... సాయంత్రం ఆముదం జ్యూస్‌లో కలుపుకుని తాగేది. ఖర్జూరపు పండు తినేది. రాకర్ కుర్చీలో కూర్చుని ఊగేది. ఇలా గూగుల్‌లో చెప్పిన సలహాలన్నీ పాటించింది. అయినా లాభం లేకపోయే!

ఇక ఆమె, ఆమె భర్త బాధ వర్ణనాతీతం!

"అక్కా... నాకు 'సి'నే ఏమో! నా రాతింతేనేమో!"

"ఎందుకలా అంటావ్ ప్రసీ? పిచ్చా నీకేమన్నా? ఇదే నామ జపమా?"

"నాకు ఇంకేమి దారి కనిపించట్లేదు అక్కా."

"పిచ్చిదానా! ఎలా రాసిపెట్టి ఉంటే అలా జరుగుతుంది. అలాగని దిగులు పడితే పనులు జరిగిపోతాయా?"

"భయమేస్తోంది... అందరూ ఏమనుకుంటున్నారో! అసలు అందరికి నా మొహం ఎలా చూపించాలి? ఏమని చెప్పాలి? ఇందులో నా తప్పేంటి?"

"అరె! ఏం మాట్లాడుతున్నావు? మళ్ళీ మొదటికొచ్చావా? ఇంతకీ నీ బాధ డెలివరి తొందరగా అవ్వట్లేదనా? లేక అందరూ ఏమన్నా అనుకుంటారనా?"

ప్రసీ మౌనంగా నావంక చూసింది. కళ్ళలో కన్నీళ్ళ వాన తుఫానుగా మారడానికి సిద్ధంగా ఉంది. నాకు తక్షణ కర్తవ్యం అర్థమయ్యింది. గీతోపదేశం ఇక తప్పలేదు.

"చూడు ప్రసీ! ఇది చాలా సహజం. నీ శరీరం కానుపుకి సిద్ధంగా లేనప్పుడు ఎవరేం చేయగలరు? నువ్వయినా ఏం చేయగలవు? కాయ పక్వానికి వస్తేనే చెట్టునించి రాలుతుంది. అంతేగాని పచ్చిగా ఉన్నపుడే రాలమంటే ఎలా? అయినా నీకొకటి చెప్పనా? నువ్వు నీకోసం బ్రతకడం నేర్చుకో! నీ కడుపులో పెరుగుతున్నది నీ బిడ్డ. నువ్వు కలలుకంటున్న నీ ప్రతిరూపం. ఎవరికోసమో నువ్వు నీ బిడ్డని కనట్లేదు. ఎవరికీ నీ పరిస్థితి గురించి సమాధానం చెప్పాల్సిన అవసరంలేదు. నార్మల్ అయినా, సి-సెక్షన్ అయినా నీ బిడ్డ నీ చేతిలో ఆరోగ్యంగా ఆనందంగా ఉండటం ముఖ్యం! ఇక సోషల్‌గా యాక్టివ్‌గా ఉండటం అంటే మరీ ఇంటిగుట్టంతా తీసుకెళ్ళి ఆన్‌లైన్‌లో పెట్టడంకాదు. ఏది బైటపెట్టాలో ఏది దాచుకోవాలో కూడా తెలిసి ఉండాలి. ఒకవేళ అలాంటి కామెంట్లు వచ్చినా వాటిని స్పోర్టివ్‌గా తీసుకోవాలిగాని ఇలా ఏడుస్తూ కూర్చుంటారా? నీ కడుపులో బిడ్డ ఉంది అన్న సంగతి గుర్తుపెట్టుకో. ఇలా ఏడిస్తే బిడ్డకి మంచిదికాదు. అర్థమయ్యిందా?"

నేను చెప్పాల్సిందంతా చెప్పేశాను... కొంచెం కఠినంగా అయినా సరే! ఏమనుకుందో ఏమో... మౌనంగా ఉండిపోయింది కాసేపు! ఆమెకి ఆలోచించుకునే వెసులు ఇవ్వాలని నేను వచ్చేసాను!

మరుసటి రోజు ప్రసీ నించి ఫోన్ వచ్చింది.

"అక్కా... చీజ్‌కేక్ ఫ్యాక్టరికి వెళ్దాం వస్తావా?"

"అవునా? మరి నువ్వు బైటికొస్తే, ఎవరైనా చూసి ఏమన్నా అడిగితే?"

"అడిగితే... 'సబర్ కా ఫల్ మీఠా హోతాహై' అని చెప్తా."

"అంటే...?"

"పక్వానికి వచ్చిన ఫలం తీయగా ఉంటుందని అర్థం."

"హహ్హాహ్హా..."

ఆ తర్వాత నాలుగు రోజులకు చిరునవ్వులు చిందిస్తూ ఒక ముద్దుల ముద్దబంతిని పొదివి పట్టుకుని ఇంటికి వచ్చిన ప్రసీకి దిష్టి తీయడానికి ఎర్రనీళ్ళతో సిద్ధంగా ఉన్నాను. *



ఇందు ప్రియాంక స్వస్థలం గుంటూరు నుంచి సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామర్‌గా అమెరికా వచ్చి అయిదేళ్లు అవుతోంది. వెన్నెల సంతకం బ్లాగు నిర్వహిస్తున్నారు. చదవడం, రాయడం, ప్రకృతిని చూసి పరవశించడం, సంగీతం వినడం ఇష్టం.

# Winding Nostalgia Roads

*Bala Kolluru*

Ghazals are intimately familiar to Indians, south or north. With its roots in ancient Persia, from last giants like Rumi and Ghalib, to modern purveyors like Begum Akhtar, Gulam Ali and Jagjit Singh, chances are you have heard a ghazal being spoken or sung, or probably read one. The good news for South Indians is that you don't need to know Urdu, Persian or even Hindi to appreciate Ghazals. If Urduless ghazal sounds like meat substitute, you are in for a surprise. Art knows no boundaries! Original English ghazals exist as a poetic form as well as in translation.

So what's a ghazal? A ghazal is a poetic form composed of a couplet with rhyme and refrain (Qafia and Radif) both occurring in the second line of the couplet. The last couplet typically contains the artist's name/signature. I present a ghazal below written by me for your enjoyment. The phrase "In India" is the Refrain/Radif in this poem.

Unchaste red convertible hugs pacific coastline, memories stir,
Warm breasts press into my back on my motorcycle, as I fly in India.

Thumb dipped in Toddy Palm locule extracts sweet jelly-nectar,
You will certainly not miss any Cheesecake or Pie in India.

Fall leaves crunched under Pine, snowballs scooped under Maple,
Are but memories. Coconut. Mango. Here it's so dry in India.

Dinner time, sweltering heat, steaming biryani, kebabs and sweat,
Lose the shirt, sit on the floor, there is no need for a coat or tie in India.

Rich, Poor. High, Low. No matter. Pleasure is a great leveler.
Sip some palm liquor, smoke charas, even Sadhus get high in India.

Greed steams, fluted glasses clink, businesses fill political coffers,
Nearby the slums fester, some children go hungry and cry in India.

This was no Haitian divorce, wan smile, broken heart,
She left me forever, with tears in her eyes and a sigh in India.

No binary Hell/Heaven here, queue up to be born again,
Cordwood, sandalwood and an open flame, is the way to die in India.

Sadhana, Nirvana. They say the stoic jump the eternal cycle of rebirth,
These are all the things Bala wanted to, but never did try in India.



***Bala Kolluru grew up in Chennai and lives in Metro Detroit with wife and two children. He writes software for Police Departments, for profit, and reads and writes science fiction & fantasy for fun.He is an avid NFL and basketball fan.***

జీవన సౌరభం

# అమెరికా అమ్మ

డా॥ పద్మజ నందిగాము

ఈ మధ్యకాలంలో ఎక్కువగా వింటున్న పదాలు Stress, Depression, Anxiety. నా చిన్నప్పుడు అమ్మ అన్నీ అమరిస్తే స్కూలుకి వెళ్ళి చదువుకోవటం మాత్రమే తెలుసు. స్ట్రెస్ అనే మాట కనీవినీ ఎరగం. కానీ ఈరోజుల్లో ఏడెనిమిదేళ్ళ పిల్లల దగ్గర్నించీ స్ట్రెస్ పడిపోతున్నారు. వాళ్ళని చూసి అమ్మానాన్నలకి స్ట్రెస్. ఈ అమెరికా జీవితమే మెకానికల్ కావడంతో చాలా స్ట్రెస్‌తో కూడినదైంది. అన్నీ టైముకి జరగాల్సిందే. పిల్లల్ని టైముకి స్కూలుకి పంపడం, స్కూలు నించి తెచ్చుకోడం, వచ్చాక extra curricular activitiesకి తీసుకెళ్ళడం... ఇంట్లో మళ్ళీ వంటావార్పు, పిల్లల్తో హోంవర్కు చేయించడం- పొద్దున లేచిన దగ్గర్నించీ రాత్రి పడుకునే దాకా పనేపని.

అక్కడ ఇండియాలో తల్లిదండ్రులు, అమ్మాయికి పెళ్ళిచేసి అమెరికా పంపిస్తే మా అమ్మాయి రాజకుమారిలాగా జీవితం గడుపుతుంది అనుకుంటారు. కానీ ఇండియాలోలాగా ఇక్కడ పనివాళ్ళు, పాలవాళ్ళు, ఇంకా వేరే సహాయకులూ ఎవరూ ఉండరుకదా. అన్ని అవతారాలూ మనమే - cleaning lady, cooking lady, washing lady, and above all - driver lady!

ఉద్యోగం చేస్తే అదో బాధ- అయ్యో, పిల్లల్తో ఎక్కువ సమయం గడపట్లేదే, నేను మంచి తల్లినేనా అనే ఆలోచన. ఉద్యోగం చెయ్యకపోతే, ఇంత చదువూ చదివి వేస్ట్ అయి పోతోందే అన్న ఫీలింగ్. పైగా చుట్టూ వున్న సమాజంనించి వచ్చే వత్తిడి ఒకటి. 'ఆవిడ అంత క్వాలిఫైడ్ కాదు, అందుకే ఇంట్లో ఉంటోంది,' అంటారు. అదే ఉద్యోగంలో పైకెదుగుతుంటే, 'అబ్బో, ఆవిడ చాలా ఎగ్రెసివ్. పిల్లలమీద శ్రద్ధ తక్కువ,' అంటారు.



ఆడవాళ్ళు అన్నీ చెయ్యాలనుకోవటం తప్పా? ఎందుకిలా స్ట్రెస్‌కి గురవుతున్నారు? ఈ స్ట్రెస్ మూలంగా అటు శారీరిక ఆరోగ్యమూ, ఇటు మానసిక ఆరోగ్యమూ కూడా దెబ్బతింటున్నాయి. స్ట్రెస్ మూలంగా చిన్నవయసులోనే గుండె జబ్బులు, బ్లడ్ ప్రెషర్, అధికబరువు (ఒబీసిటీ), డయాబెటీస్ వంటి వ్యాధులు ఎక్కువవౌతున్నాయి. అంతే కాకుండా depression, burn out, anxiety వంటి మానసిక సమస్యలు కూడా పెరుగుతున్నాయి.

పాతకాలంలో నాన్న ఆఫీసుకెళ్ళేవారు, అమ్మ ఇంట్లోనే వుండి టైముకి అన్నీ అమర్చేది. కానీ ఇవ్వాళ అమెరికాలో అమ్మలు ఇంట్లో పనితోపాటు బయట ఉద్యోగాలు చేస్తున్నారు. Corporate ladders ఎక్కుతున్నారు. ఎన్నో రంగాలలో మంచి గుర్తింపు తెచ్చుకుంటూ తమ కుటుంబ ఆర్థికస్థితికి ఎంతో తోడ్పడుతున్నారు.

ఇంటా బయటా తప్పని పరుగులు- దానితో పెరుగుతున్న ఒత్తిడి.

ఇండియాలో ఉన్న స్త్రీలకి కూడా ఇలాంటి సమస్యలే వున్నాయి అని కొందరు అనుకోవచ్చు, కానీ ఇండియాలో కొంత

యినా కుటుంబ సహాయం ఉంటుంది. దగ్గర్లో అమ్మానాన్న, అత్తామామ- ఎవరో ఒకరు సహాయం ఉంటారు. అమెరికా జీవితంలో చాలాసార్లు ఒంటరి పోరాటం అనిపిస్తుంది.

కారణాలు ఏమైనప్పటికీ, దీనికి పరిష్కారం ఏవిటి? వర్క్-లైఫ్ బేలెన్సు చేసుకోవడం ఎలా?

అన్నీ కావాలి అనుకోవచ్చు కానీ అన్నీ ఒకేసారి కావాలి అనుకోవడం సరికాదేమో. ఉద్యోగపరంగా కానీ, కుటుంబపరంగా కానీ- ఏది ముఖ్యం, ఏది అవసరం అనే ఆలోచన ఉండాలి. మంచి టైమ్ మేనేజ్‌మెంట్ స్కిల్స్ నేర్చుకోవాలి. మంచి mentorsని, మంచి social circleని ఏర్పరచుకోవాలి. ఏ విషయంలోనూ విపరీతాలు పనికిరావు, moderation చాలా ముఖ్యం.

ఇంట్లో అన్నీ ఆడవాళ్ళే చెయ్యాలి అనుకోకుండా భర్తల తోడ్పాటు కూడా పెరగాలి. ఇప్పటికే చాలామంది మగవాళ్ళు ఇంటిపనులలో తమ భార్యలకి తోడ్పడుతున్నారు. కానీ ఈ స్థితిని అధిగమించడానికి ఇంకా ఎంతో మార్పు అవసరం. మార్పు ఒక్క రోజులోనే వచ్చెయ్యదు. ముందు మన పెంపకంలోనూ మార్పు రావాలి. అబ్బాయిలకి కూడా ఇంటి పనులు చెయ్యడం, ఇల్లు మేనేజ్ చెయ్యడం నేర్పాలి. ఈ కాలంలో ఆడపిల్లలకి ఉద్యోగం ఎంత అవసరమో మగపిల్లలకి ఇంటి నిర్వహణ కూడా అంతే అవసరం. అంచేత మహిళలు గుర్తించ వలసిన ముఖ్యమైన విషయం ఏవిటంటే మన సమస్యకి పరిష్కారం మనచేతిలోనే ఉంది. మగపిల్లలని, ఆడపిల్లలని సమానంగా పెంచండి. రేపు ఇంకొక ఆడపిల్ల జీవితానికి మేలు చేసినవారవుతారు. *



*Dr. PadmajaNandigama was born in Guntur and has been living in United States for the last 20 years. She earned a Ph.D. in Psychology from Wayne State University. She is an adjunct Assistant professor of Psychology at Wayne State University and Schoolcraft College. She has given lectures on topics like motivation, emotional balance, communication skills etc. She is the author of a book 'Building Balanced Relationships.'*




# miindia.com

bringing community together!




**Serving the community since 1999**

**Save $$$ on Groceries, Dining & Shopping**

- Free Ads - Buy/Sell a Car, Computer or House
- Events / Movies
- Message Board
- Jobs
- Roommate Match
- Yellow Pages
- Special Deals and Discounts
- Entertainment - TV serials, Movies

- Network with thousands everyday!
- Grow your business with instant access to thousands!
- For feedback and advertising, e-mail info@miindia.com



www.miindia.com

Watch Movies and TV serials on miindia.com
Updated daily!

Rockin Raaga

## VISITOR HEALTH INSURANCE

Visit **www.miindia.com** or contact **info@miindia.com** for more details.



కథ

# పరమాన్నమూ- పలుగురాళ్లూ

తాడికొండ కె. శివకుమారశర్మ

ఇంటర్నేషనల్ కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్స్ షోలో స్టేజీమీద ఒక కొత్త పరికరాన్ని ఆరోజున ఆవిష్కరిస్తారని ప్రపంచమంతటా తెలియడం వల్ల ఆత్రంగా ప్రజలంతా టీవీలకీ, ఇంటర్నెట్లో వచ్చే వెబ్ ప్రసారాలకీ అతుక్కుపోయి చూస్తున్నారు. అది ఒక టీవీనో, కంప్యూటరో, లేక కంప్యూటర్నీ, ఫోన్నీ, టీవీనీ ఏకంగా కలిపేసున్న పరికరమో ఎవరి ఊహకీ అందడంలేదు. దాని గూర్చిన ఊహాగానాలన్నీ మీడియాలో వచ్చిన ఎక్స్పర్టుల తాహతునిబట్టీ రాగం, తానం, పల్లవులతో, లేక, నలభై వాయిద్యాల సింఫొనీలతో చెలరేగి పోయాయి. అదేమిటో ఊహకి అందకపోయినా, అది టెక్నాలజీ ప్రోగ్రెస్‌లో సృష్టించబోయే కొత్త మైలు రాయిని గూర్చిన రంగు, రూపు, రేఖలని గూర్చి ప్రతిపాదించడనికి ఎక్స్పర్టులలో ఎవరూ వెనుకంజ వెయ్యకుండా కొన్ని నెలలబట్టీ పోటీపడ్డారు.

ఆ మైలురాయి ప్రజలకి అవసరమా, అత్యవసరమా, లేక అనవసరమా అన్న విషయం మీద కూడా తర్జనభర్జనలు జరిగాయి. ఇంత హడావుడి జరుగుతున్నది గనుక ఇది అటు బిజినెస్సులకీ, ఇటు ప్రజలకీ గూడా అవసరమయ్యే వుంటున్నదన్న నిర్ణయానికి ప్రజలు వచ్చారని టీవీ చానెళ్లు ప్రజలకి తెలియజేశాయి- ఎందుకంటే, బిజినెస్సుల అవసరాలూ, ప్రజల అవసరాలూ అనులోమానుపాతానికి

(డైరెక్ట్ ప్రపోర్షనాలిటీకి) లోబడి వుంటాయి అన్న సిద్ధాంతం కొన్ని దశాబ్దాల క్రిందే ఋజువు చెయ్యబడిందని ఆ చానెళ్లే ఎన్నో ఏళ్ల క్రితం తెలియ జేశాయి గదా! అనవసరాలని కూడా అత్యవసరాల క్రింద మార్చగల శక్తి బిజినెస్సులకుంటుంది- దానికి విలోమాను పాతాన్ని (ఇన్వర్స్ ప్రపోర్షనాలిటీని) అంటగట్టి. కొంతకాలంగా ప్రజల ఇమాజినేషన్‌ని ఛాలెంజ్ చేసేలా, లేక కనీసం ఆకట్టు కొనేలా, కొత్త అప్లయన్స్ ఏదీ రాకపోవడం వల్ల ఈ కొత్త ఎనౌన్స్ మెంట్ ఎడారిలో కుంభవృష్టవుతుందని అందరూ ఆశపడు తున్నారు.

❖

జోగారావుగారు కన్స్యూమర్స్ ఎలక్ట్రానిక్ షో వచ్చే చానెల్ ట్యూన్ చేసుకుని టీవీ ముందు కూర్చున్నారు. తెలియనివాళ్లు ఆయన ఎక్సయిట్‌మెంట్‌ని చూసి, "అవ్వ! ఈవయసులో ఆ పిల్ల చేష్టలేమిటీ!" అని నోరు నొక్కుకోవచ్చేమోగానీ, తెలిసినవాళ్లు మాత్రం ఆయన అదృష్టం గూర్చి కించిత్తు అసూయపడినా పడొచ్చు. మరీ తెలిసినవాళ్లు మాత్రం ఆయన పిల్లల మీద జాలి పడతారు. 'సి.కె.'- కంప్లైంట్ కింగ్‌కి షార్ట్‌ఫాం- అని ఆయన్ని తెలిసిన వాళ్లంతా ఆయన వెనక పిలుస్తారని తనకి తెలిసినందు వల్ల సార్థక నామధేయుడవడానికి జీవితమంతా కృషిచేసి వుంటాడని అభిజ్ఞ వర్గాల భోగట్టా.

"ఏమే! ఇంపార్టెంట్ ఎనౌన్స్‌మెంటే, టీవీల వాళ్లకి కంప్లైంట్ ఇవ్వమంటే విన్నావుగాదు. ఇప్పుడు చూడు. ఇంతకన్నా పెద్ద టీవీ కొనుక్కు రావడానికి టైము గూడా లేదు," విసుక్కున్నాడాయన. పక్కనే కూర్చున్న ఆయన భార్య కావమ్మగారి నుంచీ జవాబు రాకపోవడం వల్ల చేత్తో తట్టారు.

"ఏవన్నా అన్నారా?" అన్నదావిడ.

వాళ్లని గూర్చి తెలిసినవాళ్లకీ, తెలియనివాళ్లకీ గూడా ఇక్కడ రెండు అనుమానాలు కల్గుతాయి. మొదటిది, మంచినిద్రలో వున్నప్పుడు కూడా వంటింట్లో పిల్లి మ్యావ్ అంటే ఠక్కున లేచే ఆవిడకి, పక్కనున్న భర్త మాట్లాడితే వినిపించదెందుకని అనేది. రెండవది, పిల్లి పిలిచినా పలుకుతావుగానీ, నేను మాట్లాడుతుంటే వినవెందుకని అని ఆయన ఆవిణ్ణి నిలదియ్యడెందుకని అనేది. మొదటిదానికి, అది ఆవిడ ఏర్పరచుకున్న డిఫెన్స్ మెకానిజం - ఆయనతో బతకగల్గడానికి- అనీ, రెండవదానికి, తన మాటలు ఆవిడకి తప్పక వినిపిస్తయ్యనే జోగారావుగారికి ప్రగాఢ నమ్మక మనీ, అందుకనే, పట్టించుకోనట్లు కనిపిస్తేనేం, మిగిలినవాళ్లల్లాగా దూరంగా పారిపోవట్లేదు- సంతోషం, అని ఆయన సరిపెట్టుకోక తప్పట్లేదనీ సందేహనివృత్తి గూర్చి బాగా తెలిసినవాళ్ల తీర్మానం.

ఆయన టీవీవైపు చూపించి, "అసలు పిక్చర్ కనిపిస్తోందా, చూడు. తీరా చూస్తే, ఎవరి మొహాలూ చూడకుండా చెవులతో మాత్రం వినాల్సొచ్చేలా వుంది. పెద్ద టీవీ అయినా కొననిచ్చావు గాదు!" చిరాగ్గా అన్నారు.

"పెద్ద టీవీలో కూడా ఏం తేడా వుందని? అమెరికాలో వాడింట్లో చూడలేదా?" అన్నది కావమ్మగారు.

"నా బొంద! స్క్రీన్‌ని రాహుకేతువుల్లాగా నాలుకలు చాచి మింగేస్తూ క్రింద మొదలుపెట్టి రెండు లైన్లల్లో స్క్రోలింగులు- వార్తలో లేక స్టాక్ మార్కెట్ వివరాలో ఏమయితేనేం? వాటి పైన మాట్లాడే వాళ్ల వివరాలు. వాటి మీద ఒకమూలగా చిన్న విండోలో రాబోయే సీరియల్లోంచి కొన్ని దృశ్యాలు. అటుచూడు- రెండో మూల 'ఈ ఎనౌన్స్‌మెంట్ గూర్చి మీరేమనుకుంటున్నారు?' అంటూ పోలింగులు. ఒకపక్కగా తారాజువ్వలు పైకెగురుతున్నట్లు గా సీరియల్ రాబోయే ఎపిసోడ్లో ఏం జరుగుతుందోనని రేపే ఉత్కంఠల వివరాలు. పైన ఒకమూలగా ఈ చానెల్ వాళ్ల సింబల్. పైనే ఇంకోమూల ఈ ఈవెంట్‌ని కవర్ చేస్తున్న చానెల్ వాళ్ల సింబల్. పోనీ, మధ్యలోనయినా వదిలిపెడతారా అంటే, అదీ లేకుండా, ఏదో గ్రహాంతరవాసులకి మెసేజ్ పంపిస్తున్నటుగా క్షణానికోసారి వెలిగే ఇంగ్లీషు అక్షరాలతో నిండిన కోడ్లు. ఇవ్వన్నీ టీవీలో మనుషుల మొహాలు కప్పేస్తున్నా, దిక్కులేదు - ఇటు భక్తి చానెల్‌కయినా అటు రక్తి చానెల్‌కయినా గానీ!"

"అమెరికాలో ఎవరికి కంప్లైంట్ చేశారని, ఇప్పుడిక్కడ ఇండియాలో చెయ్యడానికి?" ఆవిడ అంత పెద్దగా మాట్లాడడాన్ని విన్నవాళ్లుఆయనకి బాగా చెవుడనుకుంటారు. మారేజెస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్ అన్న నానుడికి వాళ్లు పోస్టర్ కపుల్ మరి!

"నా కొడుక్కి కంప్లైంట్ చేశాను. చూస్తూండు. వాడేదో చేస్తాడు," ధీమాగా అన్నారాయన.

"ఏమిటి చేసేది? వాడిప్పుడు అమెరికన్. మన టీవీవాళ్లు అమెరికన్లని చూసే కదా నేర్చుకున్నది!" ఆయన పిల్లలని ఏమైనా అనగానే వెంటనే పిల్లలని వెనకేసుకుని రావడం కొన్ని దశాబ్దాల క్రింద మొదలయి, ఇప్పుడు, ఆయన ఏమన్నాసరే, ఠక్కున ఆ నాణేనికి రెండోవైపుని చూపిస్తుంది.

"మనవాళ్లు అమెరికా వాళ్లకంటే రెండాకులు ఎక్కువే చదివారు!"

"లేకపోతే, ఊర్కేనే అనుకరిస్తూ కూర్చుంటే మనవాళ్లకి తెలివితేటలు ఎలా డెవలప్ అవుతాయట?"

తరచుగాఎక్స్-రేలకి ఎక్స్‌పోజ్ అయితే మనుషులు ఎలా అనారోగ్యానికి గురవుతారో, అలాగే ఇలాంటి సంభాషణలని తరచుగా వినడం ఆ యింట్లోని ఎలక్ట్రానిక్ వస్తువులకి ఎక్కువ సార్లు రిపేర్ రావడానికి కారణమంటుంది వాళ్ల కోడలు- అదే, శరణ్ భార్య.

ఆయన మళ్లీ ఏదో అనబోతుండగా నోటి మీద వేలుపెట్టి, నిశ్శబ్దం అని చూపించి, తర్వాత టీవీవైపు చూపించింది కావమ్మ గారు.

"లేడీస్ అండ్ జెంటిల్మెన్- దిమూమెంట్ వుయ్ హావ్ బీన్ వెయిటింగ్ ఫర్! హీయర్ ఈజ్ మిస్టర్ సరన్ ప్యాంతుల!" ఎం.సీ. గెస్టుని ఇంట్రడ్యూస్ చేశాడు. ఆ కన్సూమర్ షోలో జరుగుతున్న హాల్లో చప్పట్లు పెద్దగా మోగాయి.

"మా యింటిపేరుని ఎంత ఖూనీ చేశాడో! ప్యాంతులట! పంతుల అనడం నేర్చుకోవచ్చుగా! సరన్ ఏమిటి, నా బొంద,

సైరన్‌లాగా! ఎంచక్కా శరణ్ అని పేరుండగా! మా నాన్న తన మనవడికి అడిగి మరీ పెట్టించుకున్న పేరది!" సణుక్కున్నారు జోగారావుగారు.

శరణ్ మాట్లాడింది చాలా తక్కువ. "ఐవిల్ లెట్ దిప్రాడక్ట్ టు మార్కెట్ ఇట్ సెల్ఫ్," అన్నాడు. పెద్ద స్క్రీన్ మీద వీడియో క్లిప్ రావడం మొదలుపెట్టింది.

❖

రత్తయ్యకి పంతుల శరణ్ ఎవరో తెలియదు. ఆంగ్లమూ, హిందీ పదాలు కలిపిన వాక్యాలని వాడడం తప్ప ప్రత్యేకించి ఆంగ్లభాషతో పరిచయం లేనివాడు. 'సారొచ్చారు. ఆ ఛెయిర్ ఎయ్యరా' లాంటి ఆంగ్లానికి మాత్రమే అతను పరిచయం. అలాంటిది, అతను ఇలా అమెరికా రావడం ఇప్పటికీ ఇది కలా లేక నిజమా అని నిర్ధారించుకునేటందుకు రోజూ పొద్దున్నే ఒకసారి తనను గిచ్చుకున్నది చాలక, తరువాత కలిసినవాళ్లని అడిగి మళ్లీ గిల్లించుకుంటాడు. అమెరికాలో తమ ఉద్యోగరీత్యా మాత్రమే అతన్ని కలిసిన తెలుగువాళ్లకి, 'మిస్టర్ ప్యాంతుల'తో ఏ మాత్రం పరిచయం లేకుండా, ఆయన స్పాన్సర్ చెయ్యడంవల్ల మాత్రమే హైదరాబాదులో విమానాన్నెక్కి, రత్తయ్య అమెరికా చేరడమనేది అత్యంత ఆశ్చర్యకరమయిన విషయం. రత్తయ్యకి ఈ తెలుగు వాళ్లతో టచ్ చాలా అవసరమని మిస్టర్ ప్యాంతులకి తెలుసు - ఎందుకంటే, రత్తయ్య తన అవసరాలన్నింటినీ ఒక్క తెలుగులో మాత్రమే చెప్పగలడు గనుక.

ఉదాహరణకి, అతను, 'వీశెడు మైదా,' అంటాడు. దానికి రెండుశేర్ల నీళ్లని కలపమంటాడు. వీటిని పౌండ్లలోకీ, గాలన్లలోకీ తర్జుమా చెయ్యాలంటే ఇండియాలో వున్న బామ్మలకీ, అమ్మమ్మ లకీ ఫోన్ చేసి ముందు కిలోల్లోకీ, లీటర్లల్లోకీ ఎలా మార్చుకోవాలో కనుక్కోక తప్పలేదు. అలాగే, ఇనపబక్కెట్టు కూడా ఇండియా నించీ ఎక్స్‌ప్రెస్ మెయిల్లో తెప్పించక తప్పలేదు. అయితే, రత్తయ్యకి, తను నిచ్చెనని భుజాన వేసుకుని పోస్టర్లని మోస్తుం డగా, నిక్కరు మాత్రం వేసుకుని, చొక్కా లేకుండా, ముక్కు ఎగబీల్చుకుంటూ ఆ బక్కెట్ పట్టుకుని వెంటొచ్చే పదేళ్ల రంగడు అలవాటు. ఇక్కడ సూట్లూ, బూట్లూ వేసుకున్న వాళ్లుఆ బక్కెట్టుని మోస్తుంటే, ఆ నిచ్చెనని పట్టుకుంటే తమాషాగా వుంది. తనకి బతికుండగానే స్వర్గప్రాప్తి కలిగిందనేకాక, స్వర్గంలో కూడా నిచ్చె నెక్కి మైదా రాసి పోస్టర్లతికించే ఉద్యోగం తనదేనని అతనికి రూఢీ అయ్యింది.

కానీ, ఎలక్ట్రానిక్ షోలో ఎనౌన్స్‌మెంట్ అయిన తరువాత అతను ఇండియా తిరిగి వెడతాడనీ, అక్కడ పెద్ద బిజినెస్ పెడ తాడనీ, పరిమితంగానే అయినా అతనితో ముచ్చటించినవాళ్లు చెప్పారు. పదేళ్లక్రితం రిటయిరవ్వాల్సిన వయసులో కొత్త బిజినెస్ పెట్టడమేమిటో రత్తయ్యకి అర్థం కాలేదు.

రత్తయ్యకి కావలసినవన్నింటినీ సమకూరుస్తున్న మెగా హర్ట్ ఎలక్ట్రానిక్స్ కంపెనీ ఉద్యోగులకి- అందునా, ముఖ్యంగా తెలుగు వాళ్లకి- తమ బాస్‌కి ఇండియాలోని బిలియన్‌మందిలోనూ అతనే ఎందుకు కావలసి వచ్చాడనేది బిలియన్ డాలర్ల ప్రశ్న అయి కూర్చుంది. చుట్టరికం కాదని తెలుసు. అతనికి ఎన్ని అమెరికా హంగులని సమకూరిస్తే వాళ్లుఅతని దగ్గరకు రాగలుగుతున్నారో వాళ్లకి తెలుసు. లేకపోతే, రంగువల్ల కావచ్చు, వాసనవల్ల కావచ్చు, కాకపోతే, వేషధారణవల్ల కావచ్చు- వాళ్లతన్ని తట్టుకోగలరా? ఇవన్నీకాక చదువులోనేమో వాళ్లకీ అతనికీ, అమెరికాకీ, ఆముదాలవలసకీ వున్నంత తేడా వుండనే వుంది! ఎప్పుడో నలభయ్యేళ్ల క్రితం వాళ్లిద్దరూ ఒకే వూళ్లో వుండడం ఒక్కటే కారణంగా కనిపించింది. శరణ్ ఫోటోని వాళ్లతనికి చూపించి, "ఎప్పుడయినా చూశావా?" అనడిగారు. రత్తయ్య, లేదన్నాడు.

ఒకతనికి మదిలోఫ్లాష్‌బల్బ్ వెలిగింది. "ఇప్పుడుకాదు, నలభయ్యేళ్ల క్రితం," అన్నాడు. రత్తయ్య చిర్నవ్వు నవ్వి, "అప్పుడీ యనిలా వుండడు కద్సారూ!" అన్నాడు. శరణ్‌ది నలభయ్యేళ్ల క్రితం ఫోటో ఎలా తెప్పించాలో వాళ్లకి తెలియలేదు." ఆయనకి నువ్వు బాగా తెలిసుండాలి. నువ్వు పోస్టర్లు అతికిస్తూ తిరుగు తున్నప్పుడు నీ వెంటబడ్డ పిల్లల్లో ఎవరయినా నీకు ప్రత్యేకంగా గుర్తున్నారా?" ఒకతను అడిగాడు.

రత్తయ్య తలపాగా తీసి, బుర్ర గోక్కుంటూ, "ఇద్దరు ముగ్గు రుండేవారండీ, పోస్టరంకి మైదా రాస్తామని అంటూ. ఒక కుర్రాడు మాత్రం, నేను బాగా పోస్టర్లని అతికిస్తానని చెప్పేవాడండీ," అన్నాడు.

వాళ్లకి క్లూ దొరికింది.

❖

"మేజర్ బ్రేక్ త్రూ," శరణ్ ఎనౌన్స్‌మెంట్ పూర్తికాగానే దాన్ని విశ్లేషిస్తున్న టీవీ గెస్టు ముక్తకంఠంతో అన్న మొదటిమాటలు అవి.

"దిసీజ్ ఎ బ్లాక్‌బస్టర్ ఫర్ మెగాహార్ట్," అన్నారు తర్వాత.

"ఇప్పటిదాకా మెగాహార్ట్ ప్రాడక్టులన్నీ మొదట అమెరికన్లని ఉద్దేశించి చేసినవి. వాళ్ల మార్కెట్ కంటే ఇండియన్ మార్కెట్ మూడింతలు పెద్దదని గ్రహించిన మొదటి కంపెనీ మెగాహార్ట్. అది కూడా ఒక తెలుగువాడు కంపెనీ అధిపతిగా వుండడం వల్లనే సాధ్యమయింది," అన్నారొకరు.

"ఈ ప్రాడక్టు అవసరం మన భారత ప్రజలకి- ముఖ్యంగా తెలుగు ప్రజలకి ఎంతో వున్నది. మూడు మెట్ల స్క్రోలింగులూ, సింబల్సూ, గ్రహాంతరవాసులకి పంపించే మెసేజీలలాగా కోడ్ లెటర్సూ లేకుండా క్లియర్‌గా టీవీ స్క్రీన్ అంటా బొమ్మ వుండ డాన్ని ఎప్పుడో ముప్ఫయ్యేళ్ల క్రితం 'పాలూ-చేలూ' కార్యక్రమంలో చూశాను. మళ్లీ అలా చూడగలుగుతానని నా జన్మలో అను కోలేదు," అన్నారింకొకరు చెమ్మగిల్లిన కళ్లని తుడుచుకొంటూ.

"శరణ్ జీనియస్సేమిటంటే, ఆ అడ్వర్టయిజ్‌మెంట్లని తీసే శాడని అనిపించేలా మాయజేసి అంతకన్నా పెద్దగా వాటిని చూపించడం," అన్నాడు వాళ్లలో ఒక తెలివయినవాడు.

"ఆయన చూపించిన ఒక చిన్న షో క్లిప్పులోనే ఎన్ని అడ్వర్ట యిజ్‌మెంట్లని ఇరికించవచ్చో, ఇప్పటికన్నా ఎక్కువసేపు జనాలని

ఆకట్టుకునేలా ఎలా ప్రదర్శించవచ్చో, ఎంత బ్రహ్మాండంగా చూపించాడో! ఒక పడుచు కుర్రాడు సోఫాలో కూర్చుని టీవీ చూస్తూండగా, అతని భార్యో లేక గర్ల్ ఫ్రెండో రెఫ్రిజిరేటర్‌లో నుండీ పెప్సీ తీసుకొస్తుంది. ఆ పదిసెకండ్ల బిట్టుకీ, పెప్సీకి, ఆ అమ్మాయి వేసుకున్న టీషర్టు మేకర్ టామీ హిల్‌ఫిగర్‌కీ రెఫ్రిజిరేటర్ కంపెనీ గోద్రెజ్‌కీ, ఆ టీవీ మేకర్ సోనీకి- అబ్బబ్బా, ఆ అడ్వర్టయిజ్‌మెంట్లు రావణాసురుడి తలకాయల్లాగా ఆ వీడియో స్క్రీన్ చుట్టూ మొలుచుకొస్తుంటే - శరణ్ ఈజ్ ఎ జీనియస్- హి ఈజ్ ఇన్ ఎ కాటగిరీ బై హిమ్ సెల్ఫ్!"

"నాకు రావణాసురుడి తలకాయలు కాదు గుర్తొచ్చింది - మా యింట్లో వున్న దశావతారాల కాలెండర్. అందులో, సెంటర్లో శేషతల్పం మీద విష్ణుమూర్తి పడుకుని వుంటే, చుట్టుపక్కల చిన్న ఫ్రేముల్లో దశావతారాలుంటాయ్. అలాంటి కాలెండర్‌ని అందరం రోజూ చూస్తూనే వుంటాం. కానీ, శరణ్‌కి వచ్చిన ఐడియా మనకి రాలేదెందుకని?" ఒక యాంకర్ ప్రశ్నించాడు.

"వస్తే మాత్రం ఏంచెయ్యగలం? మనకి ఆ టెక్నాలజీ లేదు గదా! అతను పెట్టిన కండిషన్ చూడండి- క్లియర్‌గా నలభై అంగుళాల స్క్రీన్ మీద బొమ్మ చూడాలంటే ఎనభై అంగుళాల స్క్రీన్ కొనాలన్నాడు. ఆ బోర్డర్ విండోస్‌లో అడ్వర్టయిజ్‌మెంట్లని వెయ్యొద్దూ, మరి?"

"ఆ ఫ్రేముల్లో కొన్నింట్లో ఆర్డర్ కూడా పెట్టుకోవచ్చునన్నాడు- డిజిటల్ కనుక, అది వాళ్లు సప్లై చేసే వాటిల్లోంచయినా కావొచ్చు, లేకపోతే కంప్యూటర్ వాల్‌పేపర్‌లాగా మనకి కావల్సింది ఇంకేదైనా పెట్టుకోవచ్చు- అయితే, నెలసరి ముడుపుని చెల్లిస్తూ. వాళ్లు సప్లై చేసేవాటిల్లో దశావతారాలు, శతకోటి దేవుళ్లు వుండడం- శరణ్ ఈ విషయాన్ని గురించి ఎంత డీప్‌గా ఆలోచించాడో తెలియజేస్తుంది."

"ఇంకో గొప్పదనమేమిటంటే, అంత పెద్ద టీవీలు ఇల్లంతా ఆక్యుపై చేస్తయ్యని ప్రజలు భయపడతారని అతనికి తెలుసు. లేకపోతే, సినిమాపోస్టరంత సన్నగా స్క్రీన్‌ని తయారుచెయ్యడంతో బాటు, దాన్ని మన యిళ్లల్లో గోడలకి అతికించే మార్గం చూపించడం - అది కూడా గోడలని నున్నగా చెయ్యాల్సిన అవసరం కూడా లేకుండా- అబ్బో, కంప్లీట్ సొల్యూషన్ అంటే, దట్స్ ఇట్!"

"ఆ అతికించడం వాళ్ల కంపెనీ చేస్తే తప్ప టీవీకి వారంటీ వుండదట. అక్కడ కూడా, మళ్లీ వాళ్ల కంపెనీకే ఆ ముడుపులు కూడాను!"

"శరణ్ చివర్లో, 'డాడ్, దిసీజ్ ఫర్యూ,' అని, ఒక్కసెకను ఆగి, నవ్వు నాపేసి, 'ఐనో, ఐనో,' అన్నాడేమిటి?" అడిగారొకరు. అప్పుడు గుర్తొచ్చింది టీవీ చానెళ్లవాళ్లకి- శరణ్‌ని సీ.ఈ.ఓ.గా మెగా హార్డ్ కంపెనీకి అపాయింట్ చెయ్యంగానే జోగారావు గారింటికి పరిగెట్టుకెళ్లిన తరువాత వాళ్లని పట్టించుకోలేదన్న విషయం. 'తూఛ్' అంటూ టీవీచానెళ్లు జోగారావు గారింటివైపు పరుగెత్తాయి.

❖

"ఇంతకీ నాకు అర్థంకాలేదు వాడేం చెప్పాడో. మీకేమన్నా అర్థమయిందా?" అడిగింది కావమ్మగారు.

"వాళ్లు తయారుచేసే కొత్త టీవీని కొనుక్కుంటే ఈ అడ్వర్టయిజ్‌మెంట్లు ఆ వెండితెరమీద లేకుండా బొమ్మని చూడొచ్చుట!" జోగారావుగారు సమాధానమిచ్చారు.

"ఎంత గొప్పదాన్ని కనిపెట్టాడండీ మనబ్బాయి! ఇంక మీకు కంప్లైంట్ చేసే అవకాశాన్ని పోగొట్టాడు," అన్నది కావమ్మగారు సంబరంగా. ఆ కంప్లైంటింగ్ గొంతులో ఆనందం వినిపించక పోవడం ఆవిడకి అసాధారణమైన విషయమేమీ కాదు గనుక.

"చాల్లే, సంబడం! ఇప్పుడున్న టీవీని పారేసి కొత్త టీవీని కొనాలా? నాకు అక్ఖర్లేని అడ్వర్టయిజ్‌మెంట్లని ఇంకా పెద్ద ఫ్రేముల్లో చూడాలా? నలభయ్యంగుళాల బొమ్మని చూడాలంటే ఎనభయ్యంగుళాల టీవీని కొనాల్ట! ఎనభయ్యంగుళాలంటే ఎంతో తెలుసా? నీ పొడవుకి ఇరవై అంగుళాలని కలిపితే వస్తుందది! దానితో, ఇదుగో, ఈలివింగ్‌రూం గోడంతా నిండిపోతుంది," అన్నారు జోగారావుగారు విసుగ్గా.

"ఆ చుట్టూ ఫ్రేముల్లో దశావతారాలు పెట్టుకోవచ్చు కదండీ!"

"ఆ బొమ్మలు కూడా వాళ్ల దగ్గర్నుంచే కొనుక్కోవాలి! కరెంటు వున్నప్పుడేమో, చచ్చినట్లు కొన్నింట్లో వచ్చే అడ్వర్టయిజ్‌మెంట్లని చూడాలి. కరెంటు పోయినప్పుడేమో పట్టపగలు కూడా ఆ జీవంలేని నల్లఫ్రేముని చూస్తూ కూర్చోవాలి. ఇదా వీడి నిర్వాకం! ఫోన్ చేస్తాడు కదా, కడిగేస్తాను వెధవని!" అన్నారు జోగారావుగారు కోపంగా.

❖

రత్తయ్యకి అర్థమయ్యేట్లు చెప్పిన తరువాత అతను నిట్టూర్చాడు- ఈ వయసులో పోస్టర్లని అతికించడం మళ్లీ మొదలుపెట్టాలా? పైగా, అమెరికానించీ తిరిగొచ్చిన తరువాత! ఆ పోస్టర్లు ఎంత ఖరీదయినవైతేనేం? ❋



పుట్టింది, చదివింది గుంటూర్‌లో. ఐఐటి మద్రాస్‌లో బి.టెక్ చేశాక రట్గెర్స్ యూనివర్సిటీ, న్యూజెర్సీలో మాస్టర్స్, పిహెచ్.డి. చేశారు. భార్య మల్లిక, పిల్లలు విరించి, మహతిలతో ఇరవయ్యేళ్లుగా వాషింగ్టన్ డి.సి. దగ్గర్లో ఉంటున్నారు. ముప్పైకి పైగా కథలు రాశారు. కొన్ని కథలు బహుమతులు అందుకొన్నాయి. నటించడం, కర్ణాటక సంగీతం పాడడం అభిరుచులు.

# విశ్వశాంతి

## సుప్రభ



**సుగంధి**

భారతీయ సంప్రదాయమెంత భవ్యమైనదో
భారతీ పదాంబుజమ్ము లెంత భాగ్యమిచ్చునో
శారదాప్రసాద మందనెంత సౌఖ్యమబ్బునో
వేరుగా వచింపనేల నేను? విజ్ఞులెంచరే!

పం.చా సనాతనమ్ము ధర్మమౌను సాధు, మౌనిగః
జనాళికెల్ల శ్రేయమౌను సత్పథంబు నాణ్యమై
మనోజ్ఞమైన భావమున్న మాననీయ ఛందమై
ఆది యంతమేమి లేని యంబయిచ్చు వాక్యమై

నశించనట్టిదేదో తెల్పి, నాన్యమైన భక్తితో
నశేషమైన జ్ఞానదీప్తి నాత్మసౌఖ్య మందఁగా
విశాలమైన దృష్టిఁగల్గి విశ్వమంతఁ గాంచఁగా
విశేషమైన రీతులెన్నొ పేర్మిమీర జూపుదొ

వశిష్ఠులాది మౌనులెంచి పంచినట్టి జ్ఞానమై
కుశాగ్రబుద్ధులైన వారు కోరియిచ్చు కాన్కలై
వశంబుగాఁగ జిత్తవృత్తి, బాధలేక దేనికిన్
ప్రశాంతమైన మన్కిఁగడ్పు భవ్యమైన మార్గమౌ

హృదంతరాళమందు నుంచి యెల్లవేళలందునన్
సదా స్మరించుకొంచు వారి సత్కృపా విశేషముల్
సుధామయోక్తులాడుచుండి, చూపి స్నేహమే సదా
విధించినట్టి బాటనేఁగ విశ్వశాంతి గూరదా!

# IMMIGRATION LAW

**Joseph Kallabat & Associates, P.C.**, located in West Bloomfield, Michigan, focuses on serving its clients' business and professional needs in the areas of corporate, employment and family based immigration matters. Utilizing an entrepreneurial approach to immigration and business matters, we provide comprehensive solutions to a variety of legal issues. We are constantly updating and enhancing lines of communication with our clients by incorporating a 24/7 interactive case management and e-mail notification system. Our clients include companies headquartered throughout the United States.

## Our firm serves national and international clients in the following areas:

- H-1B Non-Immigrant Workers
- L-1 Intra-Company Transfers
- TN Non-Immigrant Workers
- H-2B Seasonal Laborers
- J-1 Waivers
- Permanent Residency
- Citizenship Processing
- PERM Labor Certification
- Treaty Trader/Investor Visa
- Aliens of Extraordinary Ability



## JOSEPH KALLABAT & ASSOCIATES, P.C.

Joseph Kallabat, Esq. • Kristyn Mattern, Esq. • Michael Morton, Esq. • Christopher Ammori, Esq.
Justin M. Facciolla, Esq. • Scarlett J. Akkam, Esq. • Christopher M. Dutot, Esq.. • Cassandra Talley, Esq.

7031 Orchard Lake Road, Suite 302 • West Bloomfield, MI 48322
www.insvisa.com
**Tel: (248) 865-3331 • Fax: (248) 865-3323**



కథ

# ఒంటరి నుంచి జంటకి...

ప్రజ్ఞ వేదుల

"అబ్బా, ఎంత లక్షణంగా ఉన్నావో! ఎప్పుడూ నిన్ను ఇంత సంప్రదాయబద్ధంగా చూడలేదు. చాలా అందంగా ఉన్నావు సత్యా," అప్పుడే ఇంట్లోకి అడుగుపెట్టిన పెద్ద అత్తయ్య అరుణ అంది. అరుణతో ఆవిడ చిన్న కూతురు కూడా వచ్చింది.

మరునాడే సత్య పెళ్లి. సత్య ఒక సాఫ్ట్‌వేర్ ఇంజినియర్‌గా పనిచేస్తూ ఉండగా అమెరికా సంబంధం కుదిరింది. పెళ్లి అయ్యాక భర్తతో పాటు అమెరికా వెళ్లిపోవాలి కాబట్టి, కంపెనీ వాళ్ళని అడిగినా కూడా, అమెరికాలో తాను ఉండబోయే ఊరిలో ప్రాజెక్ట్ ఇవ్వకపోవడంతో ఉద్యోగం మానేయవలసి వచ్చింది. ఇంక అమెరికా వెళ్ళాకే పై చదువో లేదా ఉద్యోగమో నిర్ణయించుకోవాలి.

సత్యది చాలా విచిత్రమయిన మనస్తత్వం. అంటే సెంటిమెంట్ సినిమాలు చూస్తే ఏడుస్తుంది కానీ నిజ జీవితంలో చాలా ధైర్యంగా ఉంటుంది. అలాగే పురాణాలు, రామాయణ మహాభారతలు చదవటం ఇష్టమే కానీ వాటిని నమ్మదు. సంగీతం అంటే ఇష్టం కాబట్టి భక్తిపాటలు, కీర్తనలు వింటుంది కానీ దేవుడిని నమ్మదు. ప్రతీ విషయంలో లాజిక్ వెతుకుతుంది. ఈ కాలంలో వెరైటీగా పెద్దలు కుదిర్చిన పెళ్లి చేసుకుంటోంది. పెళ్లి కుదిరినప్పటి నుండి ఇంట్లో ఏదో ఒక హడావుడి. అమ్మాయి ఇంట్లో

కాటరింగ్, పెళ్లిహాల్, పెట్టుబడి బట్టలు ఒక ఎత్తు అయితే, పెళ్లి కూతురి అలంకరణకి సంబంధించిన ఖర్చు ఇంకో ఎత్తు. పాతికేళ్ళలో ఒకటో రెండోసార్లు చీర కట్టింది. అలాంటిది పెళ్లి కోసం అని కంచికి వెళ్ళి మరీ అయిదు చీరలు కొనుక్కుంది. పండగలొస్తే తప్ప మెడలో చిన్న గొలుసు అయినా వేసుకోని సత్య, పెళ్లి కోసం చెవికి పెద్ద బంగారపు బుట్టలు, మెడలోకి టెంపుల్ జువెలరీ చేయించుకుంది. అసలు ఇంతలా ఆమె ఎప్పుడూ షాపింగ్ చేయలేదు. పెళ్లి కుదిరినప్పటి నుండి ఏదోకటి అలా కొంటునే వుంది.

ఆ మరుసటిరోజు పొద్దునే సత్యని పెళ్లికూతురు చేస్తున్నారు. చుట్టాలతో పెళ్లివారిల్లు కళకళలాడుతోంది. చాలామంది వస్తున్నారు అని తన అమ్మ చెప్పగా ఒక సింపుల్ చీర కట్టుకొని కొంచం మేకప్ వేసుకొని ముందర గదిలోనే అందరి మధ్యలో కూర్చుంది. పెళ్లి ఏర్పాట్లని గొప్పగా చేసినందుకు, సత్య కూడా ట్రెడిషనల్‌గా రెడీ అయినందుకు బంధువులు అంతా మెచ్చుకుంటున్నారు. ఇంట్లోవాళ్ళు కూడా ఒక్క పని కూడా చెయ్యనియ్యకుండా మహారాణిలా చూసుకుంటున్నారు. ఎవరు ఎంత మెచ్చుకున్నా సత్యలో ఏదో తెలియని ఆందోళన. ఏదో డైలమా.

"కర్మట్, ఎప్పుడూ జీన్స్‌లో కనిపించేది. పెళ్లి అనేసరికి చూడు ఎంత కళ వచ్చేసిందో పిల్ల మొహంలో," అని ఎవరో అంటున్నారు. ఎవరా అని సత్య అటువైపు చూసింది. ఎవరో తనకి తెలియని ఒక ఆంటీ.

"అమ్మా," అని గట్టిగా పిలిచింది.

"ఏంటి లడ్డు?" అని వంటింటిలోంచి కూతురి దగ్గరకొస్తూ భానుమతి అడిగింది. అమ్మాయి పెళ్లి అని అనుకున్నప్పటి నుండి సత్యని భానుమతి ఇంకా గారాబంగా చూసుకుంటోంది. అసలే ఒక్కగానొక్క కూతురు, అమెరికా వెళ్లిపోతుంది. సత్య లేకపోతే ఇంట్లో సందడే ఉండదు.

"ఎవరు అమ్మా ఆ... గ్రీన్‌చీర...?" సత్య లో గొంతుకతో అడిగింది.

"అక్కడ ఇద్దరు గ్రీన్‌లో ఉన్నారు," అంతే చిన్నగా భానుమతి అంది.

"పెళ్లికూతురు నేను అయినా కూడా నాకంటే ఎక్కువ నగలు పెట్టుకుంది.. ఆవిడ," సత్య చాలా కాజువల్‌గా అంది.

"ష్ ష్ , ఆవిడ వింటే బాగోదు. నువ్వు చాలా జాగ్రత్తగా ఉండాలి ఈ టైమ్‌లో. ఇప్పుడే కాదు, ఇకపై కూడా," అని అనేసి గబగబా వంటింటిలోకి తిరిగి వెళ్లిపోయింది.

'ఏంటో పెళ్లి సెట్ అయినప్పటి నుండి ప్రతివాళ్ళు ఇలా ఉండాలి అలా ఉండాలి అనుకుంటూ క్లాస్ తీసుకుంటు న్నారు. పెళ్లి అంటే మారిపోవాలా? అంతా గజిబిజిగా ఉంది వ్యవహారం. ఇంతకీ ఆ ఆంటీ ఎవరో చెప్పకుండానే వెళ్లిపోయింది అమ్మ,' అని సత్య మనసులో అనుకుంది.

సత్య ఫోన్‌లో మెసేజ్ బీప్ వస్తే చూసింది, వాట్స్ ఆప్‌లో గౌతమ్, 'ఏం జరుగుతోంది? జేజమ్మలా అలంకరించుకొని వున్నావా? నన్ను ఇక్కడ వాయించేస్తున్నారు పూజలతో. ఒక్క అయిదు నిముషాలు నన్ను పంతులుగారు కనికరిస్తే నీ సంగతి కనుక్కుందామని పింగ్ చేశాను. కాల్ చేస్తే ఇక్కడ ఏడిపిస్తారు... తెలిసిందే కదా," అని పంపాడు.

రిప్లై ఇద్దామని సత్య టైప్ చేయబోతుండగా పెద్దత్తయ్య దగ్గరకొచ్చి బుగ్గ గిల్లి, "సూపర్ ఉన్నావు. ఏంటి మీ ఆయనేనా? ప్రి-మారేజ్ మొమెంట్స్ చాలా బాగుంటాయిలే, ఎంజాయ్ చేయి," అని అంది. అంతలోనే, "అక్కా కార్టూన్ పెట్టక్కా," అనుకుంటూ ఒక చిన్నపిల్లాడు వచ్చి అడిగాడు.

సత్య చిన్నగా నవ్వి, "థాంక్స్ అత్తయ్య. ఆ గ్రీన్‌చీర ఆవిడ ఎవరు?" అని రిమోట్‌తో చానల్ మారుస్తూ అడిగింది.

"శివ అంకుల్ అమ్మగారులే."

"ఓహో. అన్నట్లు అమ్మ కుదిర్చిన వంటావిడ రాకపోవడంతో అమ్మ, పిన్ని చాలా కష్టపడ్తున్నారు వంటింట్లో. నా కంపెనీ కోసం నిన్ను తొందరగా రమ్మన్నాను, ఐ నో. కాని అత్తయ్య ప్లీజ్ వాళ్ళకి వెళ్ళి కొంచం సాయం చెయ్యి . నేను ఎలాగో అలా టైమ్ పాస్ చేస్తానులే."

"షూర్? ఎందుకంటే నిన్న నువ్వు కాల్‌లో నీ ఫీలింగ్స్ చెప్పినపుడు నాకు నీ మనస్థితి అర్థమయింది. మాట్లాడు కుందాం అనుకున్నాముగా? ఇప్పుడు ఓకేగా ఉన్నావా మరి?" అరుణ అడిగింది.

"పరవాలేదు. ప్లస్ నాకంటే వాళ్ళకే నీ హెల్ప్ కావాలి. కావాలంటే పిలుస్తానులే," సత్య అంది.

కానీ నిజానికి సత్య మనసులో ఎన్నో భావాలు, ఆలోచనలు. సమయానికి ఫ్రెండ్స్ కూడా లేరు. వీక్ డే అవడంతో అందరూ సాయంత్రమే వస్తామన్నారు. ఇక తన బెస్ట్ ఫ్రెండ్ ఏకంగా పెళ్లికే డైరెక్ట్‌గా వస్తానంది. అందరి మాటలు వినిపిస్తున్నాయి. మనుషులు కనిపిస్తున్నారు. కానీ మనసు ఇక్కడ లేదు. 'ఫిజికల్లీ ప్రెసెంట్ మెంటల్లీ ఆబ్సెంట్,' అన్నట్టుగా ఉంది. 'పెళ్లి అంటే భయంగా ఉంది. గౌతమ్ మంచివాడే. పైగా పరిచయస్తుడే కూడా. కానీ ఏంటో తెలియని కన్ఫ్యూషన్. అసలు ఇలా షాపింగ్ చేసి ఇన్నిన్ని బట్టలు, నగలు కొని, డబ్బులు వేస్ట్ చేశానా అని ఒక గిల్టీ ఫీలింగ్ ఒకవైపు. అందరినీ వదిలేసి ఒక కొత్త జీవితంలోకి అడుగుపెట్టబోతున్న ఫీలింగ్ మరోవైపు. పెళ్ళికి ముందు ప్రతి అమ్మాయి ఇలాగే ఫీల్ అవు తుందా?" అని సత్య ప్రతి నిముషానికి అనుకుంటోంది.

ఫోన్ తీసి, "పెద్దగా ఏంలేదు. లైట్ మేకప్ అంతే," అని గౌతమ్‌కి రిప్లై పంపింది. వారం ముందర వరకు చాలా కంఫర్ట్ జోన్‌లో ఉన్న సత్య అకస్మాత్తుగా ఇలా 'కట్టే, కొట్టే, తెచ్చే' టైప్‌లో మాట్లాడటం గౌతమ్‌కి నచ్చలేదు. తన ఫీలింగ్‌ని నిర్మొహమాటంగా చెప్పేశాడు కూడా ముందరరోజే.

ఉన్న కన్ఫ్యూజన్ సరిపోవడంలేదు అన్నట్లు, అప్పటి నుండి తనని ఎవరూ కూడా అర్థం చేసుకోవట్లేదు అనే భావన సత్యలో మొదలయింది. 'ఏంటి, నీ చుట్టూ కూడా మనుషులు నా పేరు చెప్పి ఏడిపిస్తున్నారా? ఎంజాయ్ చెయ్యి. మన ఊరు వెళ్ళాక ఇవేమీ ఉండవు... ఎవరూ ఉండరు. హ హ హ్,' అని మెసేజ్ వచ్చింది. అప్పటికే ఏదో పోగొట్టుకున్నదానిలాగా మొహం డల్‌గా ఉన్న సత్య, ఈ మెసేజ్ చూసి ఒకసారి ఫ్యూచర్ గురించి ఆలోచించి దిగులు పట్టుకుంది. ఈ విషయాలు పెళ్లి సెట్ అయినప్పటి నుండి తెలిసినవే. కానీ ఎందుకు నిన్న నుండే బాధపెడుతున్నాయి?

సత్య ఆలోచిస్తుండగా పెళ్లికూతురు బుట్ట వచ్చింది లోపల పెట్టమని సత్య నాన్నగారు కేక వేశారు. ఆయన ఒకచోట నిలబడ కుండా పనులు చేస్తూ అటు ఇటు తిరుగు తున్నారు. కూతురంటే అమితమయిన ప్రేమ. కూతురుని చూస్తుంటే ముచ్చటగా ఉంది, అలాగే అత్తారింటికి వెళ్లిపోతోంది అనే బెంగ. అందుకే ఇలాంటి ఆలోచనలేమీ రాకుండా ఉండాలనే, పనులు చేసిపెట్టే వారున్నా ఖాళీగా ఆయన కూర్చోలేదు.

"ఏంటేంటి? కుంకుడుకాయలు, రుబ్బిన గోరింటాకు, అమలాపురం నుండి మినపసున్ని గుండ, వైజాగ్ నుండి పెళ్లి కూతురు బుట్ట.... అసలీ విచిత్రమయిన కోరికలు ఏంటి?" అను కుంటూ అరుణ వచ్చి అడిగింది.

"అందులో ఏముంది? నాకు ఇష్టం అవి. నీకు తెలుసా కుంకుడుకాయలు షాంపూ కంటే చాలా బెటర్," అని సత్య చెప్పింది.

"అవునవును. నాకే చెప్పు. ముందు వచ్చిన పేజర్ కంటే వెనకాల వచ్చిన మొబైల్ ఫోన్ మేలట," అరుణ వేళాకోళంగా అంది. సత్య ఆ జోకుకి నవ్వలేదు. ఇక లాభం లేదు అని అరుణ ఫోన్ తీసి, ఒక నెంబర్‌కి డైల్ చేసి, "హెలో, నువ్వు ఇవాళ రాక తప్పదు. మాటర్ సీరియస్. బై," అని వెంటనే పెట్టేసింది.

సాయంత్రం ఇంట్లో మెహెంది ఫంక్షన్. కానీ సత్యకి రుబ్బిన ఆకుని గోరింటాకులా పెట్టుకోవడం ఇష్టం. అరుణ కూతురు ఎంతో ఇష్టంతో, ఓపికతో సత్య చేతికి రుబ్బిన ఆకునే గోరిం టకులా పెట్టింది. కొత్తపాటలు స్పీకర్లలో వినిపిస్తున్నాయి. ఇంటి బయట సత్య కోరినట్లు తాటాకు పందిరి రెడీ అయింది. పైగా ఇంటి ముందర లైట్లు కూడా అరేంజ్ చేశారు. మెల్లిగా చీకటి పడుతుండగా పెళ్లివారిల్లు మిరమిట్లు గొలిపే లైట్లతో, పాటలతో కళకళలాడుతోంది. 'వాతావరణం ఎంత సందడిగా ఉన్నా, నాకు మాత్రం ఏదో గుబులుగా ఉంది ఎందుకు? గౌతమ్‌కి కూడా ఇలాగే ఉండి ఉంటుందా? ఒక క్షణం ఆనందం, మరుక్షణమే భయం? ఒంట్లో బానే ఉంది. ఏంటో ఎవ్వరినీ ఏమీ అడగలేని, ఎవ్వరికీ ఏమీ చెప్పుకోలేని పరిస్థితి నాది,' అన్న తన ఆలోచనలకు బ్రేక్ పడే విధంగా, "అదేదో జంధ్యాల సినిమాలో అన్నట్టు, ఆవకాయ నూనెలో అప్పడాలు వేయించుకొని తిన్నదానిలా ఆ మొహం ఏంటే?" అరుచుకుంటూ ఇంటిలోకి వస్తూ కిరణ్మయి అంది.

కిరణ్మయి సత్యకి ప్రాణస్నేహితురాలు. అయినా సత్య ఇంట్లో పుట్టినట్లే భానుమతి, అరుణ వాళ్ళందరికీ బాగా క్లోజ్.

కిరణ్మయిని చూడగానే సత్య మొహం విప్పారింది. సన్నగా నవ్వి, "డైరెక్ట్‌గా రేపే వస్తా అన్నావు పెళ్ళికి?" సత్య వెటకారంగా అడిగింది.

"అనుకున్నాను అలా అంటావని. అరుణత్త లడ్డూ, మినపసున్నీ చేస్తున్నాము హెల్ప్ కావాలి అని కాల్ చేస్తే వచ్చాను. పోనీ వెళ్లిపోవాలా?" సరదాగా అని సత్య దగ్గరకొచ్చి కిరణ్మయి హగ్ ఇచ్చింది.

ఇంటరెస్ట్ ఉన్నవాళ్ళు మెహెందీ లేదా గోరింటాకు పెట్టించుకుంటున్నారు. సందడి పెరిగింది. పాటలు, డాన్స్‌లు బాక్‌గ్రౌండ్‌లో నడుస్తున్నాయి. కానీ సత్యలో మాత్రం మిక్సెడ్ ఫీలింగ్స్ ఇంకా పెరిగాయి. రేపు పెళ్లి అయిపోయాక లైఫ్ ఎలా ఉంటుందో అని. పెళ్ళికి ముందరే తనలో ఇన్ని మార్పులు కనిపిస్తున్నాయి, పెళ్లి అయ్యాక పరిస్థితి ఎంటో అని. సత్య చుట్టూ ఉన్నవారిని చూసి అప్పుడప్పుడు నవ్వుతోంది, కానీ అనీజీగా ఉంటోంది. కిరణ్మయి ఇవన్నీ గమనిస్తూనే ఉంది. రాత్రి భోజనాలు చేశాక సత్యని త్వరగా పడుకోమన్నారు, తెల్లవారుఝామున మూడింటికి పెళ్లికూతురుని చేసే ముహూర్తం. అందుకే కిరణ్మయి, సత్య ఇద్దరూ సత్య రూమ్‌లో పడుకున్నారు.

"ఏయ్ నిద్రపోయవా?" కిరణ్మయి అడిగింది.

"లేదు. నిద్రపట్టట్లేదు. యేదోలా ఉంది," సత్య సీరియస్‌గా చెప్పింది.

"అర్థమయింది. ఏంటి భయపడ్తున్నావా?"

"ఏమో..."

"మరి అమ్మవాళ్లని వదిలేసి వెళ్తున్నావని బెంగా?"

"ఏమో..."

"ఓహో నన్ను వదిలేసి పోతున్నావనా? ఏం పరవాలేదు. నేను కూడా మా ఆయనతో వచ్చే ఏడాదికి వచ్చేస్తున్నాగా!" కిరణ్మయి సరదాగా అంది.

"కాదెహె," సత్య చిరాకు పడింది.

"అయితే పిచ్చి అంటారు దానిని మెంటల్."

"జోకులొద్దు. ఇప్పుడు ఈ పెళ్లి చేసుకోవాలా?"

"వామ్మో! ఈ స్టేజ్‌కి వచ్చావా! ఆంటీని పిలుస్తాను ఆగు," అని కిరణ్మయి లేవబోయింది.

"వద్దు వద్దు. ఏవిటో తేడాగా ఉంది. చెప్పలేకపోతున్నాను నా ఫీలింగ్స్. పెళ్లి అవుతోందనే ఆనందం. అలాగే పెళ్లి అయిపో తోంది అని ఒక చిన్న వర్రీ కిరణ్," అని సత్య నిట్టూర్చింది.

"పెళ్లి ఇష్టమే కదా?" కిరణ్మయి సీరియస్‌గా అడిగింది.

"ఛ ఛ. నేను అలా అనలేదు. నాకు ఇష్టమే. లైఫ్ మారిపోతుంది కదా... అది... కొంచం ఖంగారు ప్లస్ భయంగా ఉంది. అంతే."

"పిచ్చిపిల్లా. నువ్వు అనుకున్నట్లు ఏం ఉండదు. పెద్దగా సర్దుకోలేకపోయే మార్పులు ఏమి ఉండవు. నన్ను చూస్తున్నావు కదా? సంతోషంగా ఉన్నాను. పెళ్లి అయ్యాక ఇద్దరి మధ్యా మంచి అండర్‌స్టాండింగ్ ఉంటే లైఫ్ సాఫీగా ఉంటుంది. సో ఇప్పుడు ఎలాగ ఉన్నావో, తరువాత కూడా అలాగే ఉంటావు. నాది లవ్ మేరేజ్ అయినా కూడా సేమ్ ఇలాగే అనిపిస్తే నాకు క్లాస్ పీకావు, గుర్తుందా? అయినా నీలాంటి ధైర్యవంతులు, స్ట్రాంగ్ అమ్మాయిలు కూడా ఇలా ఫీల్ అవుతారు అని నేను అనుకోలేదు. ఎంజాయ్ ద ఫీలింగ్స్ బట్ ఇగ్నోర్ దెమ్."

"అంతే అంటావా?"

"అంతే. ఈ ఆలోచనలు అన్నీ ప్రతి అమ్మాయికి పెళ్ళికి ముందర ఎప్పుడో అప్పుడు వస్తాయి. కొంతమంది బయటకి చెప్తారు, కొంతమంది చెప్పుకోరు. అంతే తేడా. ఇలాంటి ఫీలింగ్స్ చాలా నార్మల్. ఎప్పటిలాగానే పాజిటివ్‌గా ఉండు, హోప్‌ఫుల్‌గా ఉండు. ఎక్కువగా ఆలోచించి వర్రీ అవ్వకు. హాయిగా పడుకో."

"అలాగే... ట్రై చేస్తాను," అని సత్య కళ్లుమూసుకుంది.

తెల్లవారుఝామున రెండు గంటలు అయింది. నాద స్వరం సౌండ్‌కి సత్యకి మెళుకువ వచ్చింది. చుట్టూ వాతావరణం అంతా మారిపోయింది. ఆ క్షణం చాలా థ్రిల్లింగ్‌గా ఉంది. అందరి దృష్టి తనమీదే. లైమ్‌లైట్‌లో ఉన్న ఒక సెలిబ్రిటీ ఫీలింగ్ భలేగా వుంది. కానీ సత్య ఇంకా కన్ఫ్యూజన్‌లోనే వుంది. నిద్ర లేవటం, రెడీ అవటం, పెళ్లికూతుర్ని చేసెయ్యటం, పెళ్లి హాల్‌కి వెళ్లడం, అక్కడ మళ్ళీ రెడీ అవ్వడం అన్నీ టైమ్ తెలియకుండా అయిపోయాయి.

పెళ్లి జరుగుతున్నంతసేపూ కిరణ్మయి సత్య వెనకాలే కూర్చుని ఉంది. సత్య పెళ్లిబుట్టలో కూర్చొని గౌరీపూజ చేశాక, జీలకర్రా బెల్లం పెట్టే టైమ్‌కి గుండెలో దడ మొదలయ్యింది. గౌతమ్‌కు తనకు మధ్యన ఉన్న తెర దింపగానే, ఇద్దరు ఒకరిని ఒకరు చూసుకున్నారు. చూపులు కలసిన శుభవేళ ఏదో మాజిక్ జరిగినట్టు సత్యలో అప్పటిదాకా ఉండే గుబులు, భయం ఠక్కున మాయం అయిపోయాయి.

అందరూ వచ్చి నవదంపతులను ఆశీర్వదిస్తూ అక్షింతలు వేస్తున్నారు. ఇప్పుడు దిగులు అంతా పోయి ఎంతో తృప్తిగా వుంది. ఫొటోగ్రాఫర్లకి ఎక్కువ పని చెప్పకుండా సిగ్గుతో సత్య నవ్వుతూ ఉంది. ఆ నవ్వులో కిరణ్మయికి సంతోషం, ఆనందం కనిపించాయి. గౌతమ్ కూడా సత్యని చూసి హాపీగా ఉన్నాడు. పెళ్లిలో మొత్తం సత్య, గౌతమ్‌లు వెలకట్టలేని ఆ క్షణాలని ఎంజాయ్ చేస్తూనే ఉన్నారు. పెళ్లిలో భాగమయిన ప్రక్రియలు అన్నీ వరుసగా, చాలా బాగా జరిగాయి. అప్పగింతల టైమ్‌లో సత్య నాన్నగారి కళ్ళలో నీళ్లు చూసి, తన అక్క పెళ్లి జ్ఞాపకాలు గుర్తుకు వచ్చి గౌతమ్ కూడా ఏడిచాడు. అతిగారాబంగా పెరిగిన సత్యని, మిస్ అవుతాము అని మిగితావాళ్ళందరూ కూడా బెంగతో వున్నారు. సత్య మాత్రం ఏడవకుండా తమాయించు కుంది. పెళ్లి హాల్ ఖాళీ చేసి అత్తవారింటికి బయలుదేరే టైమ్‌లో కిరణ్మయి దగ్గరకొచ్చింది.

"చాలా చాలా థాంక్స్ కిరణ్. నేను కన్ఫ్యూజన్‌లో వున్నపుడు నాకు సహాయం చేశావు. ఆ టైమ్‌లో ఏదో తేడాగా ఉన్నపుడు పిచ్చి నిర్ణయాలు తీసుకోకుండా కాపాడావు," సత్య నవ్వుతూ చెప్పింది.

"నేను చేసింది ఏమీలేదు. అంతా నీ మనసులోనే ఉంది. పెళ్లి అయ్యే టైమ్‌కి చూడు ఎలా మారిపోయిందో నీ మూడ్. ఆల్ ఈజ్ వెల్. అలాగే కానీ, ఆ ఫొటోగ్రాఫర్‌కి నవ్వుతూ మొహం చూపించటం తప్ప, హెల్ప్ చేసిన నా మొహన్ని చూడటానికి కూడా వీలులేనంత హడావిడిగా అయిపోయింది నీ పెళ్లి మొత్తం. ఎలా ఉంది ఒంటరి నుంచి జంటలోకి జర్నీ?" కిరణ్మయి కన్ను కొడుతూ అడిగింది.

"చాలా బావుంది. ఇప్పుడు చాలా సంతోషంగా ఉన్నాను. క్లారిటీ ఉంది నాకు. థాంక్స్ అగైన్. అయినా అంత ఫీల్ అయిపోకు... ఇంకొక వారంలో ప్రయాణం. ఈలోగా కలుద్దాము మళ్ళీ," సత్య అంది తిరిగి కన్నుకొడుతూ.

"మిస్టర్ సత్యగారు, మిసెస్ సత్యని జాగ్రత్తగా చూసుకోండి. నిజంగా చెప్పాలంటే దీనితో మీరే జాగ్రత్త," అని కొత్త దంపతులతో కిరణ్మయి అన్న మాటలకి అందరూ నవ్వేశారు. *



యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్‌లో కంప్యూటర్ సైన్స్‌లో మాస్టర్స్ చేస్తున్న ప్రజ్ఞ వేదుల ఇంగ్లీషులో బ్లాగులు రాస్తుంటారు. పుస్తక పఠనం, సంగీతం పాడడం, వినడం అభిరుచి. ఈమధ్యనే తెలుగులో కథలు రాయటం మొదలుపెట్టారు.

# రెక్కలనే బహుమతిగా ఇవ్వు!

డా॥ నారాయణ గరిమెళ్ల

సొంత కాళ్ళ మీద
నిలబడ్డట్టే
సొంత రెక్కలతోనే
ఎగరడం కూడా!

జన్మతః
ఎవరి రెక్కలు వారికి
ఉన్నప్పటికీ
బహుమతిగానూ
కొన్ని రెక్కలనే పొందినప్పుడు
ఎగరడము లోని విలువా
ఎగరాల్సిన అవసరమూ
పదే పదే
స్ఫృహలోకి వచ్చి
జవసత్వాలను అందిస్తాయి

నిజానికి
రెక్కల విలువ తెలిసినవారు
ఇతరుల బహుమతులేవీ ఆశించరు!

ఎగిరేప్పుడు మాత్రం
ఎవరైనా తమ రెక్కల టపటపల కనుగుణంగా
చప్పట్లు కొట్టి ప్రోత్సాహిస్తే బాగుండనుకుంటారు.

అందుకే
మనస్ఫూర్తిగా
బహుమతి
ఇవ్వాలని ఉంటే
రెక్కలనే ఇవ్వు
ఔను
రెక్కలను మాత్రమే బహుమతిగా ఇవ్వు

బంగారం కన్నా
బ్రహ్మాండం కన్నా
నువ్విచ్చే రెక్కల బహుమతులే అమూల్యమైనవి

నీ రెండు చేతులతో
హృదయపూర్వకంగా ఇచ్చే
కరతాళ ధ్వనులే
నువ్విచ్చే ఆ ప్రోత్సాహపు బహుమతి





డాక్టర్ నారాయణ గరిమెళ్ళ పది వరకూ కథలు, అనేక కవితలూ వ్రాశారు. మొదటి కథ 1991 ఆంధ్రజ్యోతి-న్యూ జెర్సీ రాజాలక్ష్మి వారి కథల పోటీలో బహుమతిని పొందింది. పాటలు వ్రాయడం, పాడటం, స్టేజి షోలు చేయడం హాబీలు. రెస్టన్, వర్జీనియాలో నివాసం.

# ఆకాశం-పర్వతం - అతను-నేను

డా॥ కె. గీత



అతను నన్ను కౌగిట్లోకి తీసుకుని గాఢంగా బిగించినట్లు
ఆకాశం ఆ మంచుపర్వతాన్ని అలా ఎత్తుకుందంతే-
సియాటిల్ నగరంపై ముసిరిన
మంచు తెల్లని పెనుమబ్బులా
గగనమంతా పరిచిన దూదికంబళీ
కల్లోనూ ఊహించని
మహోన్నత శిఖరం మౌంట్ రైనర్
వేల ఏళ్లుగా అతను నాకోసం తపస్సు చేస్తున్నట్లు
ధీరగంభీర ముద్రలో
వరప్రద స్వప్నాలకు
కన్నీటి సాక్ష్యమై
మబ్బు చెదిరిన వేళ మహోన్నత మేఘం
మహిమాన్విత శిఖరం మౌంట్ రైనర్
అక్కడ
ధగధగా మెరిసే
నీలాకాశమై పర్వత చుబుకాన్నెత్తి అతను
నేలవిడిచి గగనాన ఒదిగి అతని బాహువుల్లో నేను
అక్కడ
అతనికి చేతుల్లేవు చుట్టూ ముసిరే మబ్బుల కెరటాలు తప్ప
ఆకాశానికి ముఖం లేదు మేనంతా అల్లుకున్న ప్రేమైక తమకం తప్ప
అతనిఉచ్ఛ్వాస నిశ్వాసాల బలం నా కురుల నల్లుకుని ఒడ
లంతా వ్యాపించినట్లు
పర్వతం మీంచి ఆకాశంలోకి చెల్లాచెదురుగా లేస్తున్న
మంచుపొగలు
ఒక గాఢ చుంబనం... ఒక కంటి చివరి బాష్పం
అతనూ నేనూ
అద్భుతాన్ని మైమరిచి చూస్తున్నవేళ
పర్వతమ్మీదికి పరుగెత్తి
దాని ఒళ్ళంతా తాకి
కేరింతలు కొట్టి
మెత్తని మంచుముద్దలై
పిల్లలు
అప్పుడే ఆకాశానికి పర్వతానికి
ఉద్భవించిన
పసిబుడుతలై ప్రత్యక్షమయ్యారు
అతను పిల్లల్ని చెరోవైపునా పొదువుకుని
పర్వతమ్మీదికి పరుగెడ్తూ
ఆగొకసారి గుండె తడుముకున్నట్లు
నావైపు చూసినవేళ
ఆకాశం పర్వతమూ ఏకమై
అమాంతం ఎగరేసుకుపోయినట్లు
అక్కడే అప్పటికప్పుడు
కవితనై జన్మించాను
కాగితంపై అడుగు మోపి
ఆనందతాండవం చేస్తూ పరవశించాను



శ్రీమతి కె. గీత పూర్తి పేరు కళా గీతామాధవి. తూర్పు గోదావరి జిల్లాలో పుట్టి కొన్నాళ్ళు హైదరాబాద్‌లో లెక్చరర్‌గా ఉద్యోగం చేసి, ప్రస్తుతం కాలిఫోర్నియాలోని మౌంటెన్ వ్యూలో ఉంటున్నారు. ద్రవభాష, శీతసుమాలు కవితా సంపుటాలు ప్రచురించారు. కొన్ని కథలు, వ్యాసాలు వ్రాశారు.

# నేనూ నా సీతాకోచిలుకా

హెచ్చార్కె



ఒక చల్లని సాయంత్రం లాన్‌లో ఎగురుతున్న పాపాయిల వెంట ఎగురుతున్న ఒక సీతాకోకచిలుక పాపాయిల్ని తప్పించుకుని నాదగ్గరికి వచ్చింది; తన కెంత భరోసాయో, నేనూ మనిషినే కదా?

తన రెక్కల మీది రంగులు ఏ ఆకాశం నుంచి తెచ్చుకుందో అని అలవాటుగా ఆశ్చర్యపడుతున్న నా మొహంలోనికి మోహంలేని నవ్వొకటి నవ్వి అడిగింది: నువ్వు కూడా ఓ కవివి కాదుకదా?

ఏం చెప్పను, మనుషులందరూ కవులేనని, కవులందరూ మనుషులేనని, కవీ మనిషి అనే గీత కవితాశత్రువు లెవరో గీసిందని గాఢంగా నిశ్వసిస్తూ ఏం చెప్పను ఆ పూలబజారు బిచ్చగత్తెకు?

అదంతా ఎందుకని, అంత గంభీరమైన వాదాలింత మెత్తని వెన్న ఈగతో ఎందుకులే అనుకుని తన గాలిప్రశ్నల్ని గాలికి వదలి తననే ప్రశ్నించడం మేలని అన్పించింది ఎందుకో నాకా సాయంవేళ.

సీతాకోచిలుకా సీతాకోచిలుకా, పాపాయిలు సరే, కవులెందుకు నీవెంట పడుతుంటారు, ఒకసారి చెరువునీళ్ల మీది అలల మీంచి, ఇంకోసారి పక్షులరెక్కల కింది నీడలలోంచి ఎందుకలా పలవరిస్తారు, స్వేచ్ఛ అంటే నీదేనని, నీలా ఎగర్లేమని దిగులుపడతారెందుకు నాక్కొంచెం చెప్పగలవా?

మనమిలా అలీనభూమ్మీద నిలబడి మాట్లాడుకోవడం బానేవుందిగాని, నేను చెప్పేది నీకేమంత రొమాంటిగ్గా వుండదు, ఇది విని ఒక సాయంకాలాన్ని చెడగొట్టానని నన్ను కొట్టవు కదా, కసిగా నన్నొక మల్టీకలర్ పద్యానికి గుచ్చి గుండెగోడకు గుచ్చుకోవు కదా అంటూనే అందిలా సీచిలుక.

నీవు/ఆమె/అతడూలాగే ఆకలిదప్పులతో సెక్సుకోరికల్తో విరామమెరుగక తిరుగుతుంటాను, అదికాస్తా కాగానే ఏ ఆకుకిందో నాలుగుగుడ్లుంచి సెలవని వెళిపోతుంటాను, ఇంతకీ స్వేచ్ఛ అంటే ఏమిటి, కవివయితే వదిలెయ్, మనిషివైతే చెప్పమని ఆకాశ నిశ్శబ్దంతో మరో నవ్వు విసిరి వెళిపోయిందా ఎగిరే ఇంద్రధనువు.



కె. హనుమంతరెడ్డి (హెచ్చార్కె) కవి, కథకుడు. నాలుగు కవితా సంకలనాలు ప్రచురించారు. కర్నూలు జిల్లాలో పుట్టిన వీరు చాలాకాలం సిపిఐ(ఎం.ఎల్.) పార్టీలోనూ, ఆ తరువాత కొంతకాలం జర్నలిస్టుగా ఈనాడు తదితర పత్రికల్లోనూ పనిచేసి ప్రస్తుతం పెన్నింగ్‌టన్, న్యూజెర్సీలో కూతురు దగ్గర ఉంటున్నారు.

# Interested in Studying Medicine? Accomplish Your Dream!






Windsor University
School of Medicine

PH: 1-844-994-6376

Email Address: info@windsor.edu

- Accredited Medical School
- Affordable Tuition
- Premedical Program
- Doctorate of Medicine (MD) Program
- Basic Science in St. Kitts, Caribbean
- Clinical Rotations in U.S. (Chicago Available)
- Residency Match Success

www.windsor.edu 347-859-3624

Windsor University School of Medicine is an accredited medical school located on the beautiful island of St. Kitts. The institution aims to provide an environment for students to study medicine. There are 17 acres of campus facilities to study basic sciences, prepare for the USMLE examinations, and transition into clinical rotations. The school provides affordable medical education to help accomplish the dream of becoming a physician for many students. Upon completion of the premedical and/or Doctorate of Medicine (MD) program, students move on to 72 weeks of clinical rotations in the United States. In addition to mentorship and tutoring, the school of medicine offers a good student to teacher ratio. There are numerous organizations available to develop leadership skills and more. Windsor University makes it a goal to graduate well-rounded physicians for residency and beyond.



కథ

# మరో ప్రస్థానం

సత్యం మందపాటి

"వచ్చే శనివారం మధ్యాహ్నం మనవాళ్లని భోజనానికి పిలుస్తున్నాను. అనిల్ పుట్టినరోజు కదా అని," అంది నీరజ, నరేష్ ఆఫీసుకి వెళ్లటానికి సిద్ధమవుతుంటే.

'అలాగే, వాళ్లందరినీ చూసి చాలారోజులయింది," అన్నాడు నరేష్.

చాలారోజులంటే రెండు వారాలని, వాళ్లందరూ అంటే వాళ్ల ముఖ్య స్నేహితులు ఆ ఏడు కుటుంబాలూ అని. అనిల్‌కి అదే రోజున ఆరో ఏడు వస్తుంది. ప్రతి సంవత్సరం అతని పుట్టినరోజు ఘనంగా చేయటం ఒక ఆనవాయితీ అయిపోయింది.

"ఈసారయినా కేటరింగ్ చేయిస్తావా?" అడిగాడు నరేష్. నీరజ సన్నగా నవ్వింది. "కేటరింగ్ చేస్తాను. నాకూ ఓపిక తగ్గిపోతున్నది. వాళ్లు వండినవి తెచ్చి మనకిస్తే చాలు. లక్ష్మిని పిలుస్తాను. అదే అందరికీ వడ్డించి, గిన్నెలు కడిగేసి వెడుతుంది. కాస్తో కూస్తో ఇస్తే సరి. చిన్నపిల్ల. దానికీ రోజులు గడవటం లేదు. లక్ష్మి గుర్తుంది కదూ..."

"గుర్తుంది నీకు ఒంట్లో బాగా లేనప్పుడు రెండు రోజులు వంట చేసింది కదా, సరే నేను వెడుతున్నాను," ఆఫీసుకి వెళ్లాడు నరేష్.

❖

''అక్కా, ఆకలేస్తున్నదే!'' ఐదోసారి అడిగాడు ఐదేళ్ల తమ్ముడు.

లక్ష్మి నవ్వింది. నవ్వు వచ్చి నవ్వలేదు. ఏడవలేక నవ్వింది.

తొమ్మిదేళ్ల వయసుదే అయినా, ఎంతో అనుభవమున్న మనిషిలా నవ్వింది. కళ్లల్లో నీళ్లు ఆపుకుంటూ నవ్వింది.

తమ్ముడు ఏమర్థం చేసుకున్నాడో ఏమో మరిక మాట్లాడ లేదు.

లక్ష్మి సంపాదించిన చిల్లర డబ్బుల కోసమని తాగి వచ్చిన తండ్రి ఆ పిల్లని చావగొట్టి డబ్బులు తీసుకుపోవటం తమ్ముడు చూశాడు కనుక మరింక ఏమీ అడగకుండా నోరు మూసు కున్నట్టున్నాడు.

లక్ష్మి తన అసహాయతకు, పక్కకి తిరిగి వెక్కివెక్కి ఏడ్చింది.

❖

అనుకున్న శనివారం అప్పుడే వచ్చేసింది.

నీరజ కేటరింగ్ దగ్గరనించీ అన్నీ సిద్ధం చేసుకున్నది. ఇల్లంతా అందంగా అలంకరించింది. వెనకాల ఆరు బయట ఒక చక్కటి షామియానా కట్టించింది. అద్దెకి తెచ్చిన కర్చీలు, బల్లలు తనకి కావలసిన విధంగా సర్దుతున్నాడు నరేష్.

''కేటరింగ్ వాళ్లు ఎప్పుడు తెస్తారుట అన్నీ,'' అడిగాడు నరేష్.

''పదకొండున్నరకల్లా వస్తారు. లక్ష్మిని ఇంకా ముందే రమ్మ న్నాను. పదింటికల్లా వస్తుంది. అంటే ఇంకో గంటలో,'' అంది నీరజ.

''మరి...'' తన మనసులోని మాట బయటపెట్టాడు నరేష్.

అర్థం చేసుకున్నట్టుగా నవ్వింది నీరజ. ''చెప్పాను. ఉన్న వాటిల్లో కల్లా మంచి బట్టలు ఉతుక్కుని కట్టుకు రమ్మని చెప్పాను,'' అంది.

❖

చాప మీద నీరసంగా పడుకున్న తమ్ముడితో అంది లక్ష్మి, ''ఒరేయ్! ఇవాళ నీకు పండగ. నేను వచ్చేటప్పుడు నీకు అన్నం పట్టుకొస్తాను. నీకూ నాకూ రెండు రోజులకి సరిపోయేంత.''

వాడి ముఖం ఒక్కసారిగా విచ్చుకుంది. వాడి కళ్లు సర్కస్ లైట్లలా వెలుగుతున్నాయి.

రాత్రి ఉతికి ఆరేసుకున్న గౌను వేసుకుని, ''బాగుందా?'' అని అడిగింది తమ్ముడిని.

లక్ష్మికి తెలుసు, వాడు బాగా లేదన్నా ఆ గౌనే తప్పదని. ఎందుకంటే తనకి వున్నది ఆ ఒక్క గౌనే కనుక.

వాడు తల వూపాడు, తన అంగీకారం తెలుపుతూ.

వాడికి, ''జాగ్రత్త... పని అవగానే వచ్చేస్తాను,'' అని చెప్పి, బయటికి వచ్చి, లక్ష్మి నీరజ ఇంటివేపు నడవసాగింది.

అలా నడుస్తున్నప్పుడే రెండు రోజులు సరైన తిండి లేకపోవ టంలోని ఆ నీరసం తెలిసి వచ్చింది.

కళ్లు తిరుగుతున్నట్లు వుంటే, పక్కనే వున్న స్తంభం పట్టుకుని ఒక్క నిమిషం నుంచున్నది.

తర్వాత నడకలో వేగం కొంత తగ్గించి, నెమ్మదిగా రోడ్డుకి ఒక పక్కగా నడుస్తున్నది.

''లక్ష్మిని పదింటికల్లా రమ్మన్నాను సహాయం చేస్తుందని. అప్పుడే తొమ్మిదీ యాభై అయింది. ఇంకా రాలేదు... చూశావా?'' అంది నీరజ అటూ ఇటూ హడావుడిగా నడుస్తూ.

నరేష్ నవ్వాడు. ''నీ లెక్క ప్రకారం చూసినా ఇంకా పది నిమిషాలుంది. ఎందుకంత గాభరా పడతావ్?'' అన్నాడు.

అతనలా అంటుండగానే వచ్చింది లక్ష్మి.

లక్ష్మిని చూడగానే ఎక్కడలేని ఉత్సాహం వచ్చి, వరుసగా పనులు పురమాయించింది నీరజ. లక్ష్మి కూడా చకచకా చెప్పిన పనులు అన్నీ చేసేస్తున్నది.

బల్ల మీద ఆపిల్ పళ్లు పెడుతున్నప్పుడు లక్ష్మిలో ఆకలి ఉప్పెనలా పైకి లేచింది. పక్కనే నీరస ఉండటం వల్ల తల వంచుకుని వాటిని సర్ది, మిగతా పనుల్లో పడిపోయింది లక్ష్మి.

లక్ష్మి ఏమన్నా తిన్నదా అని కానీ, తింటుందా అని కానీ నీరజ అడగలేదు. పనులు పురమాయించటంలోనూ, అనిల్‌కి కొత్త బట్టలు తొడిగి సిద్ధం చేయటంలోనూ సతమతమయి పోతున్నది.

అప్పుడే ఇంటి ముందు ఆగింది కాటరింగ్ వాన్. రకరకాల వంటకాలు తెచ్చి బల్ల మీద పెట్టి వెళ్లిపోయారు. వాటిని నీరజ చెప్పిన వరుసలో పెడుతున్నది లక్ష్మి.

అవన్నీ సర్దుతుండగానే అతిధులు రావటం మొదలు పెట్టారు. నీరజ చెప్పినట్లు, వచ్చినవారికి రాగానే పానీయాలు, సమోసాలు అందిస్తున్నది లక్ష్మి. దాదాపు పాతికమంది వచ్చారు.

అందరూ రాగానే అనిల్ చేత ఒక పెద్ద కేక్ కట్ చేయించి, హాపీ బర్త్ డే పాట పాడారు. అప్పుడే లక్ష్మికి తమ్ముడు గుర్తుకి వచ్చాడు. ఇంకా నీరసంగా పడుకునే వున్నాడో, లేచాడో. తన కోసం, తను తెచ్చే తిండి కోసం ఎదురుచూస్తున్నాడేమో. అలా ఎదురుచూడటంలోనే వాడు తన ఆకలిని మర్చిపోతాడేమో!

అతిధులందరూ భోజనానికి కూర్చున్నాక, నీరజ నిర్దేశ కత్వంలో లక్ష్మి వడ్డన చేస్తున్నది.

కొంతమంది వద్దంటున్నా వినకుండా నీరజ నవ్వుతూ, ''ఏం ఫరవాలేదు, ఒక్కరోజు కొంచెం ఎక్కువ తింటే ఏమీ అవదు. లక్ష్మీ! ఇంకొంచెం వడ్డించు,'' అని బలవంత పెడుతున్నది.

అనిల్ కూడా అంటున్నాడు. ''వద్దమ్మా! ఇంక తినలేను,'' అని.

''ఒరేయ్! ఇవాళ నీ పుట్టినరోజురా! ఏం ఫరవాలేదు తిను. నీకు ఇష్టమని పెరుగు గారెలు చేయించాను,'' అని ఇంకో రెండు తనే వడ్డించింది.

వాడు వద్దమ్మా తినలేను అంటూ మారాం చేస్తున్నాడు.

''నీకు ఆకలి తక్కువ. అంతే. ఏమీ అవదు. అదిగో అక్కడ డాక్టరంకుల్ వున్నారు చూశావా! ఆయన కావాలంటే నీకు ఆకలి ఎక్కువయేలా మందిస్తారు. ఏం సుధాకర్?'' అంది నీరజ.

సుధాకర్ పక్కనే కూర్చున్న అతని భార్య సుధ అంది, "అనిల్! సుధాకర్ ఇలాటి వాటిల్లో ఆరితేరిన డాక్టర్. ఆకలి ఎక్కువవటానికి మందు ఇస్తార్లే... తిను," అంది.

ఎదురుగా వున్న కుర్చీలో కూర్చున్న చంద్ర అన్నాడు డాక్టర్ సుధాకర్‌తో. "అవును. పోయినసారి నేను అజీర్ణంతో బాధపడ్డప్పుడు మీరు చేసిన వైద్యంతో ఆ అజీర్ణం మరుక్షణంలో జీర్ణమయిపోయింది."

సుధాకర్ కూడా నవ్వాడు.

లక్ష్మి విస్తళ్లు తీస్తున్నప్పుడు చూసింది, ఎంత ఆహారం వృధా అయిందో. పనివాళ్లు వాటిని చెత్తకుప్పలో పోస్తుంటే అనుకున్నది, తనలాటి వారు ఎంతమందికి ఆ ఆహారం ప్రాణం పోస్తుందో అవి!

నీరజ వెడుతున్న వాళ్లందరికీ, మిగిలిన పదార్థాలు పాకెట్లలో పెట్టి, 'తీసుకువెళ్లండి. వృధాగా పారేయటం ఎందుకు,' అని బలవంతపెట్టి ఇస్తున్నది.

అక్కడ వున్న గిన్నెలు ఖాళీ అయిపోతున్నాయి.

డాక్టర్ సుధాకర్, "ఇక మేమూ వెడతాం," అంటూ లేచాడు.

అతను బయటికి వస్తుండగా లక్ష్మి ఆయన దగ్గరికి వెళ్లింది.

"డాక్టర్ బాబూ," అని పిలిచింది.

ఆయన ఆగాడు.

"మీరు ఆకలి వెయ్యటానికి మందులిస్తున్నారు కదా! ఆకలి అస్సలు వెయ్యకుండా ఏదన్నా మందు ఇస్తారా? నాకూ, నా తమ్ముడికీ కావాలి!" అంది.

ఆయన చటుక్కున తల ఎత్తి లక్ష్మి వేపు ఆశ్చర్యంగా చూశాడు. లక్ష్మి కళ్లలో నీళ్లు అక్కడే వుందామా, బయటికి వద్దామా అని ఆలోచిస్తూ మెరుస్తున్నాయి! *



*సత్యం మందపాటి గత ముప్ఫైమూడు సంవత్సరాలుగా టెక్సస్ రాష్ట్రంలోని ఆస్టిన్‌లో ఉంటున్నారు. నాలుగు దశాబ్దాలుగా భారతదేశంలోను, అమెరికాలోను ఉన్న దాదాపు అన్ని ప్రముఖ పత్రికల్లోనూ 300కు పైగా కథలు, నవలలు, వ్యాసాలు, నాటికలు, కవితలు రాశారు. పది పుస్తకాలు ప్రచురించారు.*



# స్వాంతము

## గన్నవరపు నరసింహమూర్తి

ప్రపంచములో ఎనిమిదికోట్ల ప్రజలకు మాతృభాష తెలుగు. విస్తృతమైన పదజాలము, విస్తారమైన సాహిత్యము గల భాష తెలుగు. సాంకేతిక పరిజ్ఞానమభివృద్ధి చెందడము వలన తెలుగులిపిలో వ్రాయగలగడమే కాక తెలుగుసాహిత్యమును సుదూర దేశములుసు దూరరాష్ట్రాలలో నుండి కూడా ఆస్వాదించగలుగుతున్నాము. తెలుగువారితో యించుమించు సమాన సంఖ్యా బలమున్న ఫ్రెంచివారు, జర్మనులు, ఇటలీవారు, అరబ్బులు, యితరులు వారివారి మాతృభాషలలో పరిపాలనావ్యవహారాలను, న్యాయవ్యవస్థను నడుపుకొనడమేగాక వైజ్ఞానిక, వైద్యవిద్యల నభ్యసించి, వైజ్ఞానికపత్రికలను వారివారి భాషలలో చదువుకుంటారు. తెలుగువారి కంతటి భాగ్యము కలుగుతుందో కలుగదో తెలియదుకాని, పరిపాలనను తెలుగుభాషలో నడుపుకోవాలిగదా?! ఆంగ్లభాషతో సమాంతరముగా తెలుగు మాధ్యమమును ప్రోత్సహించాలని నా అభిలాష. నాలాంటివారికి...

ఆ.వె. పొట్టకూటి కొఱకు పొరుగూరు జొచ్చినా
సొంతయూరు పైన స్వాంతముండు
బ్రతుకుతెఱువు కొఱకు పరభాష నేర్చినా
మాతృభాష మాకు మధురమగును.
(స్వాంతము=మనసు)

కం. ముద్దుగ బెదవులు నాడగ
నొద్దిక 'అమ్మా!' యనంగ నొడిలో సుతుడున్
హద్దులు మీఱగఁ దల్లికిఁ
బెద్దయు సంతసము గల్గు! ప్రేముడివింతా?
(ప్రేముడి=ప్రేమ)

సీ. ముల్లింగ దేశమున్మొద్దుగ మన తల్లి
తేనెసోనలు జిల్కఁ దెనుగుపుట్టె
నట్టి తెనుగులోన నాలాపములు సల్పి
నన్నెచోడుడు కైతనాందిఁబల్కె
నరనాథుగోర్కె పైన న్నపార్యుడునాంధ్ర
భారతగాధకు బాటఁగట్టె
గీర్వాణభాషతోఁ గీలించి తెలుగును
తిక్కనార్యుడు బాసఁదేట బఱచె



తే.గీ. నెజ్జనార్యుడు ముగియించె నెలమి మిగులు
పిదప వెలిసిరి తెలుగులోఁ బెక్కు కవులు
గాధలెన్నెన్నొ జెప్పిరి కమ్మగాను
తెలుగు దీటైన బాసగా వెలిగె భువిని
(గీర్వాణభాష=సంస్కృతభాష; కీలించు=జతగట్టు)

చం. ఘనమగు రాజ్యసంపదలు గల్గగ దర్పముఁ దెన్గు
మన్నియల్
ఘనముగఁ బ్రోచి సుప్రజనుగాచిరి నమ్రతశిష్టధర్మమున్
వినయము మీఱ పండితులఁ, బేర్మినిగొల్విడి సత్కవీశు
లన్
దనిపిరి తెన్గుభారతిని ధన్యతఁబొల్చెను పెక్కు
కావ్యముల్!

(మన్నియ=రాజు; పేర్మి=గొప్ప; కొల్విడు=పోషించు,
ఉద్యోగమునిచ్చు)

కం. రాయలు పొగడగ నెలమిని
సోయగముల మించె తెలుగు! సూనృతమది, యా
హా! యాంధ్రభాష, బాసల
రాయంచయె బాతులందు రసమయ ధునిలో!
(ఎలమి=ప్రీతి; సూనృతము=సత్యము; ధుని=ఏఱు)

కం. పరభాషలెన్ని నేర్చిన
సరియగునే మాతృభాష సంభావనకున్
మరియాదలెంత యొదివిన
పరగృహములుఁ జేరగలమె వసనమ్మునకున్?
(సంభావన=గౌరవము; వసనము=నివసించుట)

సీ. సంగీత సాహిత్యసంపదల్పెనగాఁడ
తెనుగుభారతి తల్లి తేజరిల్లె
ధర్మశాస్త్రచయము ధరణిలో వెల్వడ
తర్కశాస్త్రము గడ్డుతగవుఁ దీర్చె
నర్థశాస్త్రము భువినామోదమొందగ
క్రయవిక్రయములు కలిమిఁదెచ్చె




ధన్వంతరిని నేర్చి దయతోడ వెజ్జులు
రుగ్మతల్బాపిరి రూఢిదేల

తే.గీ. పారతంత్ర్యము లేకనె ప్రజలునిచట
బ్రతుకలేదటె దీటుగా భరతభూమి
అన్యభాషల ననురాగ మలతిఁజేసి
మాతృభాషలఁ బెంచెడి మన్కిమేలు!
(పెనగాడు=మెలిపడు; వెజ్జు=వైద్యుడు; రుగ్మత=అనారోగ్యము; పారతంత్ర్యము=పరాధీనత; అలతి = కొలది; మన్కి=మనుగడ )

ఆంగ్లభాషతో సమాంతరముగా తెలుగు నభివృద్ధి చేసుకోవాలని ఆకాంక్షిస్తూ... *



విజయనగరం జిల్లాలో జన్మించిన గన్నవరపు నరసింహమూర్తి విశాఖపట్నం ఆంధ్ర వైద్యకళాశాలలో వైద్యవిద్య అనంతరం అమెరికాలో వైద్యవృత్తిలో స్థిరపడ్డారు. తెలుగు భాషాభిమాని. పద్యరచన చేయగల సత్తా ఉంది.

# Cospira Technologies

*We understand.. We care.. We deliver....*

**Comitted to Deliver Excellence in Employment Care and the best value in Software Consulting...**

- Hiring OPT / H1B / TN / E3 / GC / Citizines.
- Dedicated marketing team.
- We work on percentage basis.
- We train and hire fresh Masters Candidates.
- Free Accommodation, Trainining & Placement.
- Benefits include sponsorships, 401K and medical.
- H1B transfers are welcome.
- H4-EAD Training & Placements.
- We do green card sponsorship in EB-2.
- An E-verified company.

Software Development



Software Training




Software Consulting



**RAVI POTLURI**
CEO

Phone : 267 252 2496
http://cospira.com
Email : ravi@cospira.com

Cospira Technologies



కథ

# కలల తీరం

స్ఫురిత మైలవరపు

"మహీ .... కాఫీ పెట్టావా? మగ్‌లో పోసెయ్. వెళ్తూ కార్ లో తాగుతాలే. " హడావిడిగా రెడీ అవుతూ బెడ్‌రూమ్‌లోంచే అరిచి చెప్పాడు కార్తీక్.

"కాఫీ ఇక్కడ పెట్టాను."

"నేనేం చెప్పాను? వొకసారి చెప్తే వినిపించుకోలేవా?"

"ఏం చెప్పావ్?"

"మగ్‌లో పొయ్యమన్నాను కదా!"

" అవునా... సరే పోస్తాను లే."

"ఏంటీ వొక పక్కన టైమ్ అయిపోతుంటే అంత తాపీగా చెప్తున్నావ్," మహీ ఎక్కడా కంగారు పడకపోవడం ఇంకా చిరాకు పెడుతోంది కార్తీక్‌ని.

"ఇదిగో మగ్."

"నీకు నేనెవన్నా పట్టడం లేదు ఈమధ్య."

"సరే టైమ్ అయిపోయిందన్నావ్ కదా. ఇంక వెళ్ళు."

"డాడ్, కెన్ యూ డ్రాప్ మీ ఎట్ మై స్కూల్? ఇట్స్ గెటింగ్ లేట్ ఫర్ మీ," కార్తీక్ లాగానే హడావిడిగా పరిగెడుతూ వచ్చాడు వరుణ్.

"అమ్మని అడగచ్చు కదరా. నాకే టైమ్ అయిపోతుంటే వొకపక్క."

"ఓహ్ నో. అమ్మనా. షీ విల్ ఆస్క్ మీ హండ్రెడ్ క్వశ్చన్స్, షీ వోంట్ లెట్ మీ డూ మై స్టఫ్".

"వరుణ్ దట్స్ బాడ్. యూ ఆర్ బీయింగ్ రూడ్," కొడుకుని మందలిస్తూనే మహీ మొహంలోకి చూసాడు కార్తీక్.

మహిని చూస్తే వరుణ్ అన్న మాటలకి ఏమీ బాధపడ్డట్టు లేదసలు. వీళ్ళు వెళితే తలుపేసుకుందాం అన్నట్టు నిర్లిప్తంగా చూస్తోంది.

వరుణ్ ఇలా ఏమైనా అన్నప్పుడల్లా మహీ ఎప్పుడూ పెద్ద గొడవ చేసేది. వాడికి తనంటే కొంచెం కూడా గౌరవం లేదనీ, తను చెప్పినది వినిపించుకోడనీ బోల్డు కంప్లైంట్లు చెప్పేది. దానికి కార్తీక్ కొడుకునే వెనకేసుకొచ్చేవాడు. వాడికి ఇంకా ఇంపార్టెంట్ పనులు చాలా వున్నాయ్ అని మహీ వాదనని తేలిగ్గా తీసి పారేసే వాడు. కానీ కొన్నాళ్ళుగా మహీ దగ్గర నుంచి ఎటువంటి కంప్లైంట్లూ రావడం లేదసలు.

మహీ గొడవపడితే బావుణ్ణనిపించింది వొక్కసారి కార్తీక్‌కి. డ్రైవ్ చేస్తుంటే కూడా మహీ నిర్లిప్తమైన మొహమే గుర్తొస్తూ వుంది. ఇవాళే కాదు, కొన్నాళ్ళుగా గమనిస్తున్నాడు.

"వరుణ్, ఈ మధ్య అమ్మ నాతో అసలు దేనికీ గొడవ పడట్లేదురా...!"

"ఓహ్ దట్స్ కూల్ దెన్," ఐపాడ్‌లోంచి తల తిప్పకుండానే సమాధానం చెప్పాడు వరుణ్.

"అది కాదురా. అబ్జర్వ్ చేశావా, కొన్ని రోజులుగా తను చాలా సైలెంట్ గా వుంటోంది."

"నాకవన్నీ అబ్జర్వ్ చేసే టైమ్ లేదు డాడ్... యూ హావ్ ఎ గుడ్ డే... సీ యూ," స్కూల్ రాగానే హడావిడిగా కార్ దిగి పరిగెత్తాడు వరుణ్.

వాడిదంతా నా పోలికే అని పొంగిపోయేవాడు కార్తీక్ ఎప్పుడూ. ఆ నిర్లక్ష్యం కూడా తన దగ్గరనుంచొచ్చిందేనా అన్న సందేహం ముల్లులా గుచ్చింది.

❖

"మహీ ఇవాళ పొద్దున్న ఆరింటికే వెళ్ళాలని చెప్పాను. గుర్తుందా."

"ఆ... నీ కాఫీ, బ్రేక్ ఫాస్ట్ టేబుల్ మీద పెట్టేశాను."

"అబ్బా అదికాదు. ఇంత పొద్దున్నే ఎక్కడికి వెళ్తున్నావ్ అని అడగవా?"

"ఎక్కడికి వెళ్తున్నావ్?"

మహి మొహంలో నిరాసక్తత చూశాక చెప్పాలనుకున్నది ఇప్పుడు చెప్పాలనిపించలేదు. అనూని డైరెక్ట్‌గా చూస్తే సర్‌ప్రైస్ అవుతుందిలే అనిపించింది.

అనూ కార్తీక్‌కి వరసకి చెల్లెలు. అంతకంటే ఎక్కువ- మహికి ప్రాణ స్నేహితురాలు. ముగ్గురూ వొకే స్కూల్, ఇంటర్ వరకూ వొకే కాలేజ్. ఇంటర్ తర్వాత ముగ్గురూ మూడు దార్లు ఎన్ను కున్నారు. కార్తీక్, మహీ ఇంజనీరింగ్ వైపు వెళ్తే, అనూ మెడిసిన్ చదివి తర్వాత సైకియాట్రీ స్పెషలైజ్ చేసింది. కాన్ఫరెన్స్ పనిమీద మీ వూరే వస్తున్నా అని క్రితం వారం మెయిల్ పెట్టింది అనూ కార్తీక్‌కి.

❖

"అడ్రెస్ మెయిల్ చేశావుకదా, నేనే కాబ్‌లో వచ్చేద్దా మనుకున్నాను. లేకపోతే మహీ వస్తుందనుకున్నా. నువ్వే స్వయం గా వస్తావని ఎక్స్‌పెక్ట్ చెయ్యలేదు రా," సీట్ బెల్ట్ పెట్టుకుంటూ అంది అనూ.

"మహికి అసలు చెప్తే కదా నువ్వొస్తున్నట్టు."

"చెప్పలేదా? అదేం?"

"వూరికే. చిన్న సర్ప్రైజ్ ఇద్దామని."

"అబ్బో, నీకిలాంటి ఆలోచనలెప్పట్నుంచీ వస్తున్నాయి బాబూ?" అనూ గొంతులో కాస్త వెటకారం తొంగి చూసింది.

"అదీకాక నిన్ను చూసి చాలా రోజులయ్యింది కదే."

"రోజులు కాదురా. ఏళ్ళయింది. రెండేళ్ళ ముందు వరకూ కనీసం మహీ అయినా అప్పుడప్పుడూ ఫోన్ చేసేది, నీ మీద కంప్లైంట్లు చెప్పడానికి. ఈమధ్య అదీ మానేసింది. పిల్లాడేం చేస్తున్నాడు? ఎలా వున్నాడు?"

కారు అద్దంలోంచి బయటకి చూస్తూ గలగలా మాట్లాడు తోంది అనూ.

"వాడిప్పుడు లెవెంత్ గ్రేడ్. ఎప్పుడూ అబ్బాయిగారు బిజీ బిజీ. నాకే అరుదుగాఅప్పుడప్పుడూ దర్శనమిస్తూ వుంటాడు."

"రోజులెంత గిరగిరా తిరిగిపోతున్నాయో కదా! నిన్నగాక మొన్నే మహీ వాడి నెత్తుకుని అన్నం తినిపిస్తున్నది కళ్ళ ముందు మెదులుతోంది. అప్పుడే అంత పెద్దాడైపోయాడు. అవునురా మహీ ఎలా వుంది?"

"... ... ... ..."

బయటకి చూస్తున్నదల్లా, అవతలవైపు నుంచి ఎంతకీ సమాధానం రాకపోయేసరికి కార్తీక్ వైపు తిరిగింది. కార్తీక్ మొహం సీరియస్‌గా వుంది.

కాస్సేపు మౌనం తర్వాత కార్తీకే అన్నాడు.

"మహీ గురించే నీతో కాస్త మాట్లాడాలి."

"ఏం? ఏమయిందీ? ఏదయినా సమస్యా దానికి?"

"... ... ... ..."

కార్తీక్ ఇంతలా ఆలోచిస్తున్నాడంటే విషయం ఏదో పెద్దదే

అనిపించి ఏం చెప్తాడా అని అతనికేసే చూస్తోంది అనూ.

"దానికసలు కోపమే రావట్లేదు అనూ."

"నీ కోపం చూసి దానికి వైరాగ్యం వచ్చి వుంటుందిలే. అయినా అదా నీ సమస్య? ఇది చెప్పడానికా ఇంతలా ఆలోచించావు?" తేలిగ్గా నవ్వేసింది.

"ఇలా తీసిపడేస్తారనే ఎవరితో అయినా చెప్పడానికి కూడా భయపడుతున్నాను. నువ్వంటే చిన్నప్పట్నుంచీ మా ఇద్దరికీ తెలుసున్నదానివని నీతో చెప్పాలని పని కట్టుకుని ఎయిర్‌పోర్ట్‌కి వస్తే ఆఖరికి నువ్వు కూడా..." నిష్టూరంగా అన్నాడు కార్తీక్.

"పొద్దున్నే లేచి మరీ నాకోసం వచ్చావంటే ఏదో వుందనుకున్నాలే గానీ... అందులో సమస్య ఏంటో నాకర్థం అవ్వట్లేదు. మరీ వొక్క ముక్కలో చెబితే ఏం తెలుస్తుంది రా?"

"మహీ నాతో అసలు గొడవపడ్డం లేదు. నేను ఏమన్నా ఎదురు చెప్పడంలేదు. ఇంతకన్నా ఏం చెప్పాలో నాకూ అర్థం కావట్లేదే. చెప్పాలంటే... ఒకే యింట్లో నాతోనే వున్నా మనిషి వున్నట్టనిపించడం లేదు."

"అలాగా? ... ఎన్నాళ్ళుగా అలా వుంటోంది?"

"నేనొక నెలగా గమనిస్తున్నా."

"సరేలే, ఏదో విషయం ఎక్కువగా ఆలోచిస్తూ వుండి వుంటుంది. నేను ఈ కాన్ఫరెన్స్ అయ్యాకా వీకెండ్ ఇంట్లోనే వుంటానుగా అప్పుడు మాట్లాడి చూస్తాలే. కంగారుపడకు."

❖

"కార్తీక్, వరుణ్ ఏరీ?" శనివారం పొద్దున లేటుగా నిద్ర లేచొచ్చి, కిచెన్‌లో కాఫీ కలుపుతున్న మహీని అడిగింది అనూ.

"కార్తీక్ ఆఫీస్‌కి వెళ్ళాడు. వరుణ్‌కి ఏదో క్లాసట..."

"వీకెండ్ కూడానా...!"

"ఊ..."

ఏదో ధ్యాసలో వున్నట్టు వస్తున్నాయి మహీ దగ్గర నుంచి సమాధానాలన్నీ.

"పద కాఫీ తాగుతూ కాస్సేపు పాటియోలో కూచుని కబుర్లు చెప్పుకుందాం. ఈ వీకెండ్‌కి ఇంకేం పనులు పెట్టుకో లేదు. నీతోనే గడపాలనీ," అనూ వెనకే నడిచింది మహీ.

పొద్దుటి నీరెండ వెచ్చగా తగుల్తోంది. ఏదో తనదికాని చోట వున్నట్టు దిక్కులు చూస్తూ కూచుంది మహి. తనతో మాట్లాడ్డం పెద్ద ఆసక్తి వున్నట్టు కూడా అనిపించలేదు అనూకి మహిని చూస్తుంటే.

వరుణ్ చదువు గురించీ, కార్తీక్ ప్రాజెక్ట్ గురించీ ఏవో ప్రశ్నలు వేస్తూ, మహీనే గమనిస్తోంది అనూ. ఎటో చూస్తూ ఊ, ఆ అన్న పదాలు దాటకుండా జవాబులు చెప్తోంది మహి.

"మహీ, మనం కాలేజీ దగ్గర సమోసాలు తినేవాళ్ళం ఆ బండి గుర్తుందా?"వున్నట్టుండి టాపిక్ మార్చింది అనూ.

"అవునే. చాలా బావుంటాయి కదా సమోసాలక్కడ. ఆ బండి ముందు కూచుని ఎన్ని కబుర్లు చెప్పుకునేవాళ్లం. రోజూ మనం అక్కడ సమోసాలు తినేటప్పుడే ఆ రోడ్‌లో కార్తీక్ వెళ్ళేవాడు. ఫ్రెండ్స్‌తో మాట్లాడుతూనే వెనక్కి తిరిగి దొంగ చూపులు చూసేవాడు. స్కూల్లో మనతో కలిసే తిరిగినా, కాలేజీకొచ్చేసరికి అబ్బాయిల గ్రూప్ వేరయిపోయింది కదా!

"నీకు గుర్తుందా, కాలేజీలో వుండగా అందరం సెలవలకి వచ్చినప్పుడు, ఇంట్లో ఫ్రెండ్స్ దగ్గరకెళ్తున్నా అని మనిద్దర్నీ సినిమాకి తీస్కెళ్ళాడు. మీ బాబాయ్ చూసేశారు. ఇంటికెళ్ళాక పెద్ద గొడవ.

"ఏయ్ అనూ నీకు గుర్తుందా, న్యూయర్‌కి నాకొక్కదానికే గ్రీటింగ్ పంపాడు. నీకు పంపడం మర్చిపోయాడని నీకెంత కోపమొచ్చిందో."

అప్పటిదాకా మాటలే మర్చిపోయినట్టున్న మహి, కట్టలు తెంచుకున్న సెలయేరులా గలగలా మాట్లాడటం మొదలెట్టింది. మధ్యలో హాయిగా నవ్వుతోంది. ఆ నవ్వు అచ్చు తనకి తెలుసున్న మహిదే. అవునూ, కాదూ అనడానికి తప్ప అనూకి ఏ అవకాశం ఇవ్వలేదు. అనూ వున్న రెండురోజులూ మహీ అలా కబుర్లు చెబుతూనే వుంది. ఆ కబుర్లనిండా వాళ్ళ చిన్ననాటి జ్ఞాపకాలూ, ఆ జ్ఞాపకాలనిండా అప్పటి కార్తీక్ వుండటం అనూ దృష్టి దాటిపోలేదు.

❖

"వచ్చి అరగంట గడిచిపోతోంది. ఇంకో గంట ఆగితే నీ ఫ్లైట్ టైమ్ కూడా ఐపోతుంది. ఏదో కనిపెట్టేస్తానన్నావ్ ఈ రెండ్రోజుల్లో?" చిరాకు స్పష్టంగా కనిపిస్తోంది కార్తీక్ మొహంలోనూ, స్వరంలోనూ.

అనూ ప్రశాంతంగా నవ్వింది.

"నేనలా అన్నానా? నీకలా అర్థం అయ్యిందా?"

"... ... ..."

"సరే ఈ రెండు రోజుల ఎనాలిసిస్‌కి రిజల్ట్ కావాలి నీకు, అంతేకదా? నేనొకటి అడుగుతాను చెప్పు. మనం కాలేజీలో వున్నప్పుడు... నువ్వు మహీ వెంటపడేటప్పుడు... నువ్వు చెప్పిన అందమయిన కబుర్లేమయినా నీకు గుర్తున్నాయా?"

"అవన్నీ ఎప్పటి రోజులో... ఇంకా అవన్నీ తల్చుకుంటూ కూచుంటామా?"

"దానికవన్నీ గుర్తున్నాయి."

"అంటే?"

"మీ పెళ్ళయ్యాకా, నీ కెరీర్‌లో స్ట్రగుల్ అయ్యే రోజుల్లో ఇంచుమించూ దాన్నొక స్ట్రెస్‌బస్టర్‌లాగా చూసేవాడివి. ఆ రోజులేమయినా గుర్తున్నాయా పోనీ నీకు?"

"ఊ... ఎంత స్ట్రగుల్ అయ్యి ఈ స్టేజ్‌కి వచ్చానో గుర్తొస్తూ వుంటుంది. "

"అవన్నీ దాదాపు అది మర్చిపోయింది. అవి బాధపెట్టి

నన్నాళ్ళూ నీతో గొడవ పడేది. నాతోనో మరొకళ్ళతోనో చెప్పుకుని బాధపడేది.''

''ఏమంటున్నావ్ నువ్వూ...?''

''అది నీతో జీవితాన్ని ముడేసుకున్నప్పుడు నువ్వే తన జీవితం అనుకుంది. ప్రతీ విషయం నీతో చెప్పాలనుకునేది. నువ్వు దానితో అన్నీ పంచుకోవాలనుకునేది. దానికి పెద్దగా అనిపించే సమస్యలు నీకు చిన్నగా అనిపించి తీసిపారేసేవాడివి. వోదార్పు ఆశించినచోట ఎగతాళి ఎదురవడంతో అది నెమ్మది గా నీకు దూరమవడం మొదలెట్టింది. అది దూరం జరగడం కూడా నువ్వు గమనించలేదు.''

''కమాన్ అనూ! చిన్నప్పుడు చెప్పినట్టే కబుర్లు చెపుతూ కూచుంటే కుదురుతుందా? నేనేదో నాకోసమే అంతా చేసినట్టు మాట్లాడతున్నావ్ నువ్వు కూడా...''

''ఎందుకు అంత తొందరగా డిఫెన్సివ్ మోడ్‌లోకి వెళి పోతావ్? నన్ను పూర్తిగా చెప్పనివ్వు.'' అనూ గొంతులో తీవ్రత చూసి కార్తీక్ నోరు మెదపలేదు.

''నువ్వే లోకమనుకున్న మహీ నెమ్మదిగా తన టైమ్ అంతా బాబుకి ఇచ్చేసింది. ఇప్పుడు వాడూ అమ్మ కొంగట్టుకుని తిరిగే దశ దాటిపోయాడు. నీ పరుగులు చూసి, తనూ అలా పరిగెడితే పిల్లాడేమయిపోతాడో అని ఎప్పుడూ కెరీర్ బిల్డ్ చేసుకోవాలను కోలేదు. దానికంటూ వ్యాపకాలేవీ లేవు. నువ్వు దానితో మాట్లాడ్డ వంటే, నీ ఎక్స్‌పెక్టేషన్‌కి తగ్గట్టు అదే పనైనా చెయ్యలేకపోతే దాని గురించిన దెప్పిపొడుపులే. అవునా?''

''నువ్వూ చూస్తున్నావ్ కదా నేనెంత బిజీగా వుంటానో. నా చిరాకులో నాకు టైమ్‌కి ఏది అందకపోయినా ఇంకా లేట్ అవు తుంది కదా?''

''నేను బిజీ అని ఎవరితోనయినా చెప్పడం అంటే ఏంటో తెలుసా? నాకు నీకన్నా ముఖ్యమైన పని వుంది అనడం కార్తీక్, చాలా జంటల్లో వొకళ్ళు ఎక్కువ యాంబిషియస్‌గా వుంటారు. మిగిలిన భాగస్వామికి దాని వల్ల తమ జీవితం వెలితిగా అనిపిం చొచ్చు. అలా అనిపించినప్పుడు ఫ్రెండ్స్‌తోనో, పిల్లలతోనో, హాబీల తోనో ఆ వెలితిని నింపేస్తారు. కనీసం నింపేశామన్న భ్రమలో అయినా బతికేస్తారు.మహీ కూడా కూడా ఆ వెలితిని పూడ్చేసు కుంది.''

''దేనితో?'' కార్తీక్ మొహంలో ఆశ్చర్యం, అసహనం పోటీ పడుతున్నాయ్.

''కలలతో!''

''అంటే? నాకేం అర్థం కావట్లేదు.''

''నువ్వనుకుంటున్నట్టూ నిద్రపోతూ కనే కలలు కాదు. కళ్ళు తెరుచుకుని కనే కలలు.''

''వాట్?''

''తప్పంతా నాదే అంటావు. అంతేనా?''

''నీది తప్పనో, దానిది తప్పనో ఏవీ అనడం లేదు. అసలు నేనెవరు అది తేల్చటానికి? తప్పు, వొప్పు అనే త్రాసులో ఇమడని విషయాలు ఈ ప్రపంచంలో చాలా వుంటాయని చెప్పడానికి ప్రయత్నిస్తున్నానంతే. ఒరే కార్తీక్! మనం చదువుకునేటప్పుడో, వుద్యోగం చేసేటప్పుడో కొంతమంది పరిచయం అవుతారు. చాలా దగ్గరగా అనిపిస్తారు. కొన్ని రోజులు చనువుగా మసులుతాం. కొన్నాళ్ళకి ఏదో రకంగా దూరం అయిపోతాం. తర్వాత వాళ్ళ దగ్గర నుంచి మెయిల్ వచ్చినా, కాల్ వచ్చినా టైమ్ వున్నప్పుడు చూద్దాం లే అని ఇగ్నోర్ చేస్తాం. వాళ్ళని మన ప్రయారిటీ లిస్ట్‌లో చివరికి తోసేస్తాం. అది జీవిత భాగస్వామే అయితే? అవతలవాళ్ళ ప్రయారిటీ లిస్ట్‌లో తమ నంబర్ ఏంటో వాళ్ళకి అర్థమైపోతే? నువ్వే ఆలోచించి చూడు.''

''... ... ... ...''

''ఫ్లైట్ ఎనౌన్స్ చేశారు. వస్తాను,'' కార్తీక్ భుజం మీద చెయ్యి వేసి మెత్తగా నొక్కి వదిలి చెప్పింది అనూ.

''అనూ... నా మహీ నాకెప్పటికీ దొరకదా?'' మొదటిసారి కార్తీక్ గొంతుకార్తీక్‌కే బేలగా వినబడింది.

చెకిన్ వైపు వెళుతున్న అనూ తల తిప్పకుండానే చెప్పింది.

''దొరకచ్చు. తన కలల తీరం కన్నా మంచి ప్రపంచం దానికి నీ దగ్గర దొరికినప్పుడు.''

కనుమరుగైపోతున్న అనూ కేసే చిన్నపిల్లాడిలా బెంగగా చూస్తూ వుండిపోయాడు కార్తీక్. *



స్ఫురిత మైలవరపు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఇద్దరు పిల్లలు, భర్తతో డాలస్‌లో నివాసం ఉంటున్నారు. దైనందిన జీవితంలో తప్పకుండా చెయ్యాల్సినవి రొటీన్ పనులైతే, మనల్ని మనం మర్చిపోయేంత తృప్తినిచ్చే పనులు హాబీలు అనే స్ఫురిత ఆ తృప్తిని, రాయడంలోనూ, బొమ్మ లెయ్యడంలోనూ వెతుక్కుంటున్నారు. గత ఆరు సంవత్సరాలుగా నా రాతలు బ్లాగు నిర్వహిస్తున్నారు.

# నువ్వుండి ఉంటే...

## నిషిగంధ

నువ్వుండి ఉంటే బావుండనే సమయాలు కొన్ని ఉంటాయి...

పొడవాటి యూకలిప్టస్ చెట్ల మధ్యలో
రెపరెపలాడే కాంతి నీడల్లో
వదలలేక... వదిలి కదల్లేక... తచ్చట్లాడిన ఆ ఒక రోజుని
మడతలు తీసి
దిగులు సాయంత్రాల
ఎముందరంతా పరుచుకున్నప్పుడల్లా
పక్కన నువ్వుంటే బావుండుననే అనిపిస్తుంది...

తీరికలేని పగళ్ల చివర్లలో
ఏమీ చేయాలనిపించని సమయాలు కొన్నుంటాయి...
సెలయేటి అలల మీద దక్షిణపు గాలి
సేదతీరే సమయాలు...
వాగు పక్కన మన పచ్చపూలచెట్లు నీళ్లలోకి తొంగి
చూసుకుంటూ
పూలరెక్కల్ని సరిచేసుకునే సమయాలు...
అధాటుగా తగిలి... ఇంకాస్త తాకి... అనాలోచితంగానే
అరచేతుల్ని ముడివేసి
గలగలమంటూ నడవాలనిపించే అలాంటి సమయాల్లో
నువ్వు లేవని ఎంతో కొంత ఎక్కువగానే బరువేస్తుంది!

వెన్నెల్లో వర్షం కురవదెందుకనీ!?
చీకటి గుత్తులుగా కట్టిన ఒకనాటి ఆకాశాన్ని చూస్తూ
అడిగినప్పుడప్పుడనుకుంటా
పెదవులకు పెదవులు ఆన్చి
దాటెళ్లిపోయిన వాననీ
ఇంకా నింగి సరిహద్దుల్లోకి కూడా చేరుకోని వెన్నెల్నీ
అన్నీ కలగలిపిన ఏడుకాలాల స్వప్నాన్నీ
నాకోసం వెదికి తెచ్చి
నీ పాటికి నువ్వు వెళ్లిపోయావ్...

ఆగి ఆగి సంతోషపెట్టే ఆ చిన్ని కలవరం
చెంపల్ని నిమిరినప్పుడల్లా
పక్కన నవ్వుంటే చెప్పలేనంత బావుండుననే అనిపిస్తుంది!





విజయవాడలో పుట్టిన నిషిగంధ ప్రస్తుతం ఫ్లోరిడాలోని మయామిలో ఐటి ప్రొఫెషనల్. చిన్నప్పటి నుంచి పుస్తకాలు చదవడం బాగా అలవాటు. శరత్ సాహిత్యం అంటే ఇష్టం. మానసవీణ బ్లాగ్ నిర్వహిస్తున్నారు.

# WHAT IS TRUE EDUCATION?

## IT'S PURPOSE AND GOALS - HOW DO WE ATTAIN IT?

*Dr. Raghavendra S. Prasad*

*The highest education is that which does not merely give us information but makes our life in harmony with all existence". -Ravindranath Tagore*

*"Social and global problems can directly be traced to a malfunctioning system of education." -Swami Vivekananda*

Life of education is the values. Sign of education is humility. Fragrance of education is goodness. End goal of education is character. Effulgence of education is purity. Product of education is Creativity. Effervescence of education is beauty and magnetism. Fruit of education is human integration. Destiny of education is self-realization.

It is not the quantity of information we provide through education of mind that matters, it is quality of education that transforms the minds of students through the heart of education that matters the most.

To earn true education, we need to first unlearn our misunderstandings and negative attitudes. In order to get rid of our ego and transform our attitudes, we need to acquire humility. It eradicates our six enemies like desire, anger, miserliness, delusion, ego and envy that lie dormant in us. It brings unity of thoughts, words and deeds and brings purity of our heart. Education transforms our ignorance into knowledge, knowledge into wisdom, wisdom into enlightenment. Through this enlightenment we attain knowledge of the Self, leading to eternal happiness. It takes us from the duality of karmic existence, to the qualified non-dualism of devotion, to the non-duality of eternal knowledge and wisdom that help us see the underlying unity in diversity. Thus value based education leads to humility, goodness, integrity and character, which in turn bring in purity leading to unity and Divinity.



### *The Two Kinds of Education*

"Education consists mainly of what we have unlearned." *-Mark Twain*

One can classify education into secular and spiritual... AparaVidya and Para Vidya. Apara Vidya is the education of the mind and Para Vidya is the education of the heart. AparaVidya is informational, related to outer world and livelihood (jivanopadhi). Para Vidya is transformational and experiential, related to purpose of life (jivanaparamavadhi).

### *The Science and Art of Education*

The science of education transfers knowledge by a structured curriculum, testing adequacy of transfer of this knowledge by an examination and gives certificates of completion of the courses with degrees like BA, MA, PhD. This is only instructional and informational to the recipient. This

gives them the fund of knowledge in the field of study.

The art of knowledge is application of this knowledge to day to day world. While most western universities emphasize this practical or applied knowledge, current day Indian education lacks in this aspect.

### *The Heart of Education*

"Educating the mind without educating the heart is no education at all." *-Aristotle*

While rest of the world focuses on the science and art of education, the ancient Indian educational system focused much on the education of the heart that brings about inner transformation. This transformational knowledge, also called spiritual education or para vidya, is the connecting thread (sutra) of all fields of knowledge. Here the student is able to integrate the assimilated worldly knowledge with spiritual insights of unity and oneness.

### *Current Status of Indian Education*

"To educate a person in the mind but not in morals is to educate a menace to society." *- Theodore Roosevelt*

There seems to be a misunderstanding of secular education in India. It lacks in emphasis on human values. This unfortunately is dangerous and harmful to harmonious functioning of society. Our so-called secular education without incorporating universal values defies the very goal of education.As a result, we started making educated graduates with no transformation of the heart. In order to correct the problem we should take steps to bring back values into educational curriculum.

### *Imparting Human Values into Education*

"Education without values, as useful as it is, seems rather to make man a more clever devil." *-C. S. Lewis*

Culture, integrity and harmony of a society stands on the foundation of inherent values that it promotes and practices. Value based education transforms us into better human beings with compassion to all and makes us realize universal brotherhood (vasudhaikakutumbam)... the esoteric dream of Upanishads. This education leads us to jeevanaparamavadhi, the purpose and goal of life and living. This transforming education with values fills people with humility and goodness of character. Outer worldly knowledge obtained through normal societal secular pathways can be enhanced with infusion of spiritual values. How do we do this as a society and as an individual?

### *A few suggestions for true education*

Education should be value based. Accepted common human values along with the essence of local cultural values should be incorporated into educational curriculum.

Curriculum should include knowledge and values of different word cultures and rligions. Studentsshould be required from a very young age to participate in voluntary community service. Visiting lecture series by inspiring social leaders, debates and discussions on social responsibility related topics, honoring extemporary students, teachers and successful social programs annually will be invaluable.

Government should mandate value-based curriculum in schools and colleges. It could establish a Ministry of Ethics and Values to incorporate values in the society. It can create a think tank with members drawn from academia, business and social services, all ethnicities and religions.

Both print and electronic media should promote and highlight reports pertaining to human values. Theycould help by devotinga column for a topic of human value interest and dedicate time for program in audio-visual and electronic media regularly.

Parents should educate themselves in human values, and be good role models by having a value-based life style. They should actively participate in the school and community committees on the topic and encourage their children to volunteer.

Besides learning the values as part of the curriculum, the students participate in community group service programs. They should personally aspire to and practice qualities such as, positive attitude, character enhancement,seeing, hearing, speaking and thinking that is only good. They should sharpen their discrimination power - between good and bad, right and wrong, essential and nonessential. They should acquire strengths of equal mindedness, dedication, commitment, selfless action and acceptance of results. They should read biographies of people of excellence, various major religions and human values.

### *My Personal Journey towards True Education*

My father planted the seeds of spirituality and values in me at a tender age of 5 years. My life became his message later on. He would bring in illustrated children's Ramayana, Bhagavata, MahaBharata, Panchatantras, Tolstoy Stories, and Aesop's fables from the library and ask me to write synopsis of my learning after I have completed the book. This generated curiosity in me and I started reading more on my own. I used to go long distances to listen to spiritual as well as political leaders. I started getting involved in community advocacy, electioneering, and debates. Later on I was in Ramakrishna Mission, Chinmaya Mission and currently in Sri Satya Sai organization.My spiritual education from a young age, the values learned from reading of our Puranas and other fables focusing on morals, and participation in civic activities, helped to balance my education, enabling me to lead a balanced and responsible life. Whatever I shared in this article is based on my direct personal experience and the general guidelines like purity explained here that are applicable to all. ✻



***Dr. Raghavendra Prasad is a medical doctor, a geriatrician by specialty. He was born in Prakasam District, Andhra Pradesh, India. He was the past President of TANA during 1985-87; Convener of the 5th TANA Convention in Los Angeles in 1985 and recipient of TANA Community Service Award in 1991. He led several Medical camps in Puttaparthy and in Texas as Medical Director. He is an author of a book of Telugu poems "Kavitha Kalyani" and a book on "Hinduism A Primer" (English) and "Hindu Dharmam-Pravesika".***

# కర్మ - జీవితము

శ్రీరాం దగ్గుబాటి



పుట్టినవారు గిట్టక మానరు
గిట్టినవారు పుట్టుక మానరు
పుట్టు గిట్టుల మధ్య జీవితం
పాపపుణ్య కర్మఫలానుభవం 1

కాలగతిలో జీవుల భ్రమణం
సంచిత, ప్రారబ్ధ, ఆగామి కర్మల సంకలనం
నడుపును జీవుని పలు జన్మలు అనంతం
తెలుసుకొని తెంచుకో ఈ కర్మల మాయాజాలం 2

సంచితం జన్మజన్మాంతర ఫలశేషం
ప్రస్తుత అనుభవం తప్పని ప్రారబ్ధం
ఆగామి ఈ జన్మలో స్వయంకృతాపరాధ ఫలం
కర్మ నిశ్శేషమే జీవ పరంపరా ధ్యేయం 3

నీలో అందర్నీ, నిన్ను అందర్లోను వీక్షించు
నిస్వార్థసేవని అవలంబించు, ఫలాసక్తిని విసర్జించు
ప్రేమానురాగ అన్యోన్యతలను పెంపొందించు
కర్తృత్వాభిమానము త్యజించి ముక్తిని సాధించు. 4

శుద్ధాత్మ నీవని తెలుసుకో
నిష్కామకర్మతో మసలుకో
నీ గమ్యం జీవిత లక్ష్యం చేరుకో
జన్మరాహిత్యంనీ పరమార్థమని నమ్ముకో 5

శ్రీరాం చిరకాలంగా టొరొంటో వాస్తవ్యులు. ధర్మపత్ని అజంతా గారితో కలిసి టొరొంటో తెలుగు వాహినిలో తొలిరోజుల నుండి క్రియాశీలక సభ్యులు.

# మంచులో నా ప్రియురాలు

తమ్మినేని యదుకులభూషణ్

పాపిట మెరిసే హిమకణం
ఎర్రని అరచేతులతో
జుట్టు సవరించుకొని
పలువరుస కనిపించేలా
కిలకిలా నవ్వుతుంది

ఎండలో మంచు
వెలిగిపోయిన క్షణం

ఆకులన్నీ కోల్పోయిన చెట్టు
పూవులతో నవ్వినట్టు

మంచులో నా ప్రియురాలు
ఎర్రని అరచేతులతో
మొహం దాచుకొని
మందారమొగ్గలా
నునుసిగ్గులు పోతుంది

ఎరుపెక్కిన సాయంత్రం
ఎండ వెనుదిరిగిన క్షణం



తమ్మినేని యదుకుల భూషణ్ కవితలు, కథలు, విమర్శలు రాసినా కవిగా ప్రసిద్ధులు. నిశ్శబ్దంలో నీ నవ్వులు కవితాసంకలనం ప్రచురించారు. రాయలసీమలో జన్మించిన వీరు కొన్నాళ్లు సింగపూర్‌లో పనిచేసి ప్రస్తుతం న్యూజెర్సీలో సోమర్‌సెట్‌లో ఉంటున్నారు.

# ఎడంగా జరిగాక

## చంద్ర కన్నెగంటి

కాసిని కుశలప్రశ్నలూ
నాలుగు పొడిమాటలూ
గుడ్డిగా తడుముకుంటూ

తాకవు
కలవవు
ముడిపడవు

ఇద్దరి మధ్యా
రెండు కప్పుల కాఫీ
మిగతాదంతా ఖాళీ

నిలిచిందో ముగిసిందో తెలియని
ఒకప్పటి దగ్గరి చెలిమికి
ఇబ్బందిగా ఒక కొనసాగింపు

అటు జారిపడిన స్పూనూ
ఇటుపక్క నుంచి నవ్వులూ
సమయం పదకొండు

సరే మళ్ళీ కలుద్దామంటే కలుద్దామని
నువ్వటూ నేనిటూ
ఇద్దరికీ తెలుసు ఇక కలవబోమని





కథకుడు, కవి అయిన కన్నెగంటి చంద్ర గుంటూరు జిల్లాలో పుట్టారు. కథ, కవితా సంపుటాలను ప్రచురించారు. 20కి పైగా కథలు రాశారు. కొంతకాలం తానాపత్రిక సంపాదకులుగా ఉన్నారు. భార్య కన్నెగంటి మంజులత, కొడుకు విరించిలతో డాలస్, టెక్సస్‌లో నివాసం. సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్.

# ఆలోచనావర్షం

## డా॥ వైదేహి శశిధర్



కిటికీ అవతల తెరిపి లేకుండా
ఏకాగ్రతతో వర్షించే ఆకాశం
గది లోపల ఎడతెగకుండా
ఏకాంతం లోఎగసి పడే  ఆలోచనలు

ఆకాశం ఎప్పుడూ ఇంతే
ఆలోచనలలా అంతులేకుండా
ఏకధారగా కురుస్తూనే ఉంటుంది
ఒక్కోసారి చిరుజల్లై మరోసారి జడివానై
అప్పుడప్పుడూ తుఫానై మరెప్పుడో అశ్రునయనాలై

కిటికీ అవతల ఆకాశం కురిసి కురిసి  వెలిసి పోతుంది
గది లోపల ఆలోచనలు ఎగసి ఎగసి  అలసి పోతాయి
తడిసిన ఆకాశం పై పల్చని నీరెండ నారింజలామెరుస్తుంది
అలసిన ఆలోచనలపై ఆశల ఇంద్రధనస్సు ప్రాణహరితమై
విరబూస్తుంది.



డా॥ వైదేహి శశిధర్ స్వస్థలం, వైద్యవిద్యాభ్యాసం ఆంధ్ర మెడికల్ కాలేజీ, విశాఖపట్నం. వృత్తి ఫిజీషియన్. కుటుంబంతో కలిసి న్యూజెర్సీలో ప్రస్తుత నివాసం. తెలుగు, ఇంగ్లీషు భాషలలో కవిత్వం వ్రాస్తుంటారు. నిద్రిత నగరం, పునశ్చరణం సంకలనాలు వెలువరించారు. నిద్రితనగరం ఇస్మాయిల్ అవార్డు అందుకుంది. కవిత్వం, సాహిత్యం, సంగీతం అభిమాన విషయాలు.

# సాహిత్యం- సమాజం

ఆరి సీతారామయ్య

రచన అనే పదార్థం అది ఏదైనా, కథైనా, నవలైనా, కవితైనా, ఏదైనా, ఈ రాసేవాళ్ళు అసలెందుకు రాస్తూ వుంటారు? వారి ప్రేరణ ఏంటి? అని నాకో ప్రశ్న ఉదయించింది. కొన్ని జవాబులు కూడా తోచాయి. సమాజాన్ని మార్చాలనే ఆశయం కొందరి చేత రాయిస్తుంది. రచయితలకు సామాజిక స్పృహ ఉండాలంటారు ఇలాంటివారు. పాఠకుల వినోదం కోసం రాస్తున్నాం అంటారు కొందరు. డబ్బులు చేసుకోవటానికి కొందరూ, పేరు ప్రఖ్యాతుల కోసం మరికొందరూ రాస్తూంటారు.

నిన్నమొన్నటి దాకా రచయితలకు సామాజిక స్పృహ ఉండాలనే అభిప్రాయం నాక్కూడా ఉండేది. దానికి ముఖ్య కారణం సాహిత్యం సమాజాన్ని మార్చగలదు అన్ననమ్మకం. సమాజాన్ని మంచి దోవన పెట్టగలిగితే అది ఆశించదగ్గ విషయమే గదా? ఈమధ్య నాకు ఆ నమ్మకం సడలిపోయింది. కారణం సమాజం బాగుపడటం మీద వ్యతిరేకత కాదు. సాహిత్యానికి అంతశక్తి/ప్రభావం లేదేమోనన్న అనుమానం.

ఈ అనుమానం కూడా ఒక నమ్మకమేనా? దీనికేమైనా ఆధారాలూ గట్రా ఉన్నాయా? అని కదా మీరు అడగటం?

గత వంద సంవత్సరాల్లో భారతదేశంలో మంచి సాహిత్యం చాలా వచ్చింది కదా? హిందీలో ప్రేమ్‌చంద్, బెంగాల్లో శరత్‌బాబూ, తెలుగులో చలం- సమాజంలో ఉన్న కుళ్ళును నిర్మొహమాటంగా బయటపెట్టారుకదా? గత 40-45 సంవత్సరాల్లో దేశం అంతటా అన్ని భాషల్లోనూ స్త్రీవాద కథలూ, కవితలూ, నవలలూ బోలెడు వచ్చాయి కదా? వీటి వల్ల సమాజం ఎంత మారింది? అసలేమైనా మారిందా? మారితే అది ముందుకా వెనక్కా?



నా అభిప్రాయంలో భారత సమాజం, ముఖ్యంగా తెలుగు సమాజం, కొంచెం కూడా ముందుకెళ్ళలేదు. మార్పు అంటూ ఉంటే అది తిరోగమనమే.

నా అభిప్రాయాన్ని సమర్థించే రెండు పరిణామాల గురించి చెప్తాను: మొదటిది, స్త్రీల మీద అత్యాచారాలు ఎక్కువ కావటం, రెండోది, తెలుగు సినిమా పరమ నీచస్థాయికి దిగజారటం.

దాదాపు రెండు సంవత్సరాల నుండి భారతదేశంలో స్త్రీల మీద అత్యాచారాలు జరగటం గురించి ప్రతివారం అంతర్జాతీయ పత్రికల్లో పతాక శీర్షికలౌతున్నాయి. మనుషుల్లో జంతువు లుండటం సహజం అంటారేమో. సగటు మనుషులే కాదు, పాలకవర్గంలో కూడా స్త్రీలమీద అత్యాచారాలు జరగడం సహజమే అన్నట్టు సమర్థన కనబడుతున్నది. శరత్‌బాబు పుట్టిన బంగాల్లో పోయిన సంవత్సరం తపస్‌పాల్ అనే ఒక పార్లమెంట్ సభ్యుడు తమ పార్టీ కుర్రవాళ్ళను పంపించి ప్రతిపక్ష పార్టీ స్త్రీలను రేప్ చేయిస్తానని బహిరంగంగా ప్రకటించాడు. మరి మగపిల్లలు తప్పులు చెయ్యరా, అంత మాత్రానికి వాళ్ళను ఉరితియ్యాలా? అని వాపోయాడు ఉత్తర ప్రదేశ్ నాయకుడు

ములాయంసింగ్ యాదవ్. ఆడవాళ్ళు నైతికంగా దిగజారినప్పుడే అత్యాచారాలు జరుగుతాయన్నాడు మధ్యప్రదేశ్ మంత్రి కైలాష్ విజయవర్గీయ.

అత్యాచారాలకు పాల్పడేవారుగానీ, వారిని ప్రోత్సహిస్తూ మాట్లాడే నాయకులుగానీ, వీళ్ళెవరూ సాహిత్యం చదవలేదా? వీళ్ళకు చదవటంరాదా? చదివేవారిని వీళ్ళెప్పుడూ కలవలేదా? మరి వీళ్ళ మీద సాహిత్యప్రభావం ఎందుకులేదు?

ఇక తెలుగుసినిమా విషయం. గత ఇరవై సంవత్సరాల్లో ఏ దేశంలోనూ తెలుగు సినిమా అంతగా దిగజారిన సినిమా మరొకటి లేదు. స్త్రీలను వ్యాపారవస్తువులుగా మార్చింది తెలుగు సినిమా. వెకిలిచేష్టలను హాస్యంగా మార్చింది తెలుగు సినిమా. బూతులను పాటలుగా చలామణి చేస్తున్నది తెలుగు సినిమా. తెలుగు సినిమాలకు మాటలు రాసేవారికి లైంగిక వేధింపుకీ ప్రేమకీ మధ్య తేడా తెలియదు. అసలు తెలుగువారికి సంస్కృతీ సంస్కారం లేవు అనిపించేటట్లు నిదర్శనంగా నిలబడుతుంది ఈనాటి తెలుగు సినిమా.

తెలుగుసినిమాని ఇలా మార్చినవారికి సాహిత్యం గురించి తెలియదా? వీళ్ళెవరూ గురజాడ గురించీ, చలం గురించీ, కొకు గురించీ వినలేదా?

అది ఎంత నిరాశ కలిగించే ఆలోచన అయినా, సాహిత్యానికి సమాజాన్ని మార్చేశక్తి లేదని అనిపిస్తున్నది ఇప్పుడు నాకైతే. సమాజాన్ని మార్చగల శక్తులేవో నాకైతే తెలియవు. సాహిత్యం మాత్రం కాదని అనిపిస్తున్నది. సాహిత్యానికి అంత శక్తి ఉన్నట్లయితే శ్రీశ్రీ కవితలు తెలుగు సమాజాన్ని ఎలా మార్చాయో చెప్పండి? కొసరాజు పాటలు, రావిశాస్త్రి కథలూ, చలం నవలలూ తెలుగువారిని మార్చాయా? స్త్రీవాద సాహిత్యం వల్ల స్త్రీల పరిస్థితి ఏమైనా మెరుగుపడిందా? మార్క్సిస్ట్ సాహిత్యం వల్ల మనుషుల్లో వర్గభేదాలు తగ్గి సౌభ్రాతృత్వం పెరిగిందా?

ఆశించిన మేరకు, ఆశించిన దిశగా సమాజం మారటం లేదని సామాజికస్పృహతో రాసేవారికి తెలియదా? తెలిసి కూడా ఈ కథలూ, నవలలూ, కవితలూ ఎందుకు రాస్తూంటారు? చదివేవారు ఎందుకు చదువుతూంటారు? ఎందుకంటే, చీట్లపేకలాగా, జూదంలాగా, వ్యవసాయంలాగా, సాహిత్యం కూడా ఒక వ్యసనం. ఏదో ఒకరోజు సమాజం మారుతుందనే ఆశ తొందరగా చావదు.

*



*ప్రకాశం జిల్లాలో పుట్టిన ఆరి సీతారామయ్య బయోకెమిస్ట్రీలో పరిశోధన చేసి, డిట్రాయిట్‌లోని ఆక్లాండ్ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా ఉన్నారు. రెండు కథాసంపుటాలు ప్రచురించారు. నలభైకి పైగా కథలు రాశారు. భార్య ఉషతో బూమ్‌ఫీల్డ్, మిచిగన్‌లో నివాసం.*




*Wishing TANA Conference*

*A Grand Success*

# Ramayah Auto Repairs and Services



## Complete Car Repair Services - Domestic and Imports

Experienced master mechanics on duty. Reliable service at reasonable rates.

Serving the Indian community since 1992.

We are on 9 mile between Meadowbrook and Novi Rd., in the NOVI COMMONS Office complex. Pull up to the back of the building to our Unit # 308. Please ask to speak with Steve Mohan.

43000 West 9 Mile Rd., Unit 308 Novi MI 48375
Phone: 248-230-8503 | Fax: 248-381-1040
Email: ramayahauto@gmail.com



కథ

# సింహేంద్ర మధ్యమం

## అపర్ణ మునుకుట్ల గునుపూడి

సుజాత కూతురు సరితకి రెండిళ్ల అవతల ఉండే తెల్లవారి అమ్మాయి జెన్ని ప్రాణ స్నేహితురాలు. వేసవి శలవల్లో కాస్త పెద్దవాళ్ళం అయ్యేం అనుకుంటూ ఊళ్ళో జరుగుతున్న పాప్ కాన్సర్ట్ సెంటర్‌కి వెళ్ళడం మొదలుపెట్టేరు. వెళ్లి వచ్చేప్పుడు అక్కడ నుంచి వాళ్ళ పోస్టర్స్ కొని తెచ్చుకునేది జెన్ని. ముఖ్యంగా అమ్మాయిల బ్యాండ్ అయితే తప్పకుండా కొనుక్కునేది.

"నీ ఫ్రెండ్ అన్ని పోస్టర్స్ ఏం చేసుకుంటుంది సరితా?" అని అడిగితే,

"బెడ్రూమ్‌లో తగిలించుకుంటుంది."

"ఇన్నిటికి చోటెక్కడుందే."

"గోడలకి క్రింద నుండి పైదాకా అంటించేస్తుందమ్మా."

"అవేం పాడతాయా? ఆడతాయా?"

"వాటిని చుస్తూ ఐపాడ్‌లో పాటలు వింటుందమ్మా. అందరూ అలాగే చేస్తారు."

"హు! ఎవరి పిచ్చి వారికానందం," అనేసింది సుజాత.

శలవలు ముగిసి స్కూళ్ళు తెరిచేరు. ఇద్దరూ హైస్కూలుకి వచ్చేరు. కొత్త స్కూలు. కొంచెం దూరం. ఇంకా కూడా తల్లితండ్రులు వంతులు మానలేదు. పెద్దక్లాసులు కనక కాస్త ఆటకట్టి చదువు మీద శ్రద్ధ పెరిగింది. జెన్ని పొడుగ్గా సన్నగా అయింది. క్రాస్ కంట్రీలో పరుగెడుతోంది కదా దాంతో ఇంకా సన్నగా

తేలుతోంది అనుకుంది సుజాత. బుద్ధిమంతురాలు ఇటు చదువు అటు ఆటలు బాగా నెగ్గుకొస్తోంది అని మురిసిపోయేది. ఇద్దరూ తన కళ్ళ ముందు పెరుగుతున్న పిల్లలు కదా. వాళ్ళు బాగుంటే ముచ్చట కాదూ మరి.

పెద్దక్లాసుల పిల్లల ముందు వీళ్ళు కూడా పెద్దవాళ్ళలాగా కనిపించాలని నానా అవస్థలు పడుతూ, చిన్నవాళ్లయినా హై స్కూల్లో ఉన్నామని కొంత పొగరూ, అందంగా కనపడాలన్న వుబలాటం, వీటన్నిటితో ఎలాగో తొమ్మిదో క్లాసు ముగించి పదిలోకి వచ్చేరు. పెద్దవాళ్ళకి ఆదుర్దా మొదలయింది. ఇక డ్రైవింగ్ మొదలెడతారు. రెండేళ్లలో కాలేజికి పంపాలి. ఆ తర్వాత పిల్లలు దూరంగా వెళ్ళిపోతారు అని. ఇవే ఆలోచనలతో పిల్లల్ని ఇంటికి తేవడానికి బయలుదేరింది సుజాత. స్కూలు దగ్గర ఆగగానే సరిత కారెక్కుతూ, "జెన్నీ ఇవాళ రాలేదమ్మా హాస్పిటల్లో ఉందిట," అంది.

"హాస్పిటలా! ఏమైంది, నిన్నటిదాకా బాగానే ఉందికదా!" ఆశ్చర్యపోయింది సుజాత.

"తెలీదు దాని శరీరం మాములుగా తిని అరిగించుకొనే శక్తి వచ్చేవరకు."

"రోజూ చూస్తూనే ఉన్నాం కొంచెమైనా అనుమానం రాలేదు," పొంగి వస్తున్న దుఃఖం ఆపుకుంటూ అంది.

"అది ఇప్పటికి 10, 12 నెలలుగా తిండి మానేసుంటుందని డాక్టర్ల అంచనా. మేం ఇంట్లోనే ఉన్నా ఎప్పుడూ ఏదో తినేసేను ఆకలి లేదంటుంటే, నిజమే అనుకున్నాం. నేను పెద్దగా పట్టించుకోలేదు. పెద్దపిల్ల అయ్యింది, దాని ఆకలి దానికే తెలుస్తుందిలే అని ఊరుకుండిపోయాను. ఈమధ్య సన్నగా ఉన్నట్టుంటే పొడుగయ్యింది క్రాస్‌కంట్రీలో పరుగెడు తోంది, అందుచేత అనుకున్నాను కాని వేరే ఆలోచన రానేలేదు," వాపోయింది లీసా.

'నా పరిస్థితి అంతే.  మాములుగా ఎదిగే పిల్ల సన్నబడుతోంది అనుకున్నాను... తనకే ఇంత బాధగా ఉంటే తల్లికెలా వుందో కదా,' అనుకుంది సుజాత.

"మరి ఇప్పుడెలా తెలిసింది."

"మొన్న హఠాత్తుగా స్కూల్లో పడిపోయిందిట. వెంటనే పిలుస్తే వెళ్ళేను. అప్పటికే పరిస్థితి హీనంగా ఉందని అంబులెన్స్ పిలిచేరు వాళ్ళు వెంటనే హాస్పిటల్‌కి తీసుకువెళ్ళేరు. వింటూ, ఆవిడని ప్రశ్నలతో ఎక్కువ వేధించకుండా, ఖంగారుపడొద్దని, మళ్లీ వస్తాం అని చెప్పి బయలుదేరింది సుజాత.

"సరితా, నీ ఫ్రెండ్‌కి నోట్స్ అవీ కాస్తంత తెచ్చి పెడుతుండు." వచ్చేదారంతా ఇద్దరూ ఏం మాట్లాడలేదు.

ఇంటికొచ్చేక, "సరితా ఎలా ఉన్నావు? జెన్ని సంగతి ఏమిటో అర్థం అయిందా?" అయిందన్నట్టు తలూపింది.

"మాతో బయటికి వెళ్ళినప్పుడు ఎప్పుడూ ఏవీ ఆర్డర్ చేసేది కాదు. నేను బలవంతం చేసుంటే ఇంత జబ్బు వచ్చేది కాదేమోనమ్మా."

"అలా ఎందుకనుకుంటావు."

"మేం ఇద్దరం అన్ని కలిసి చేస్తాం కదా ఒకటి రెండుమార్లు నేనన్నాను కూడా. నువ్వు కుడా ఆర్డర్ చేసి తీరాలి అని. కాని ఎప్పుడూ నెక్స్ టైం అంటూ దాటేసేది. ఇప్పుడు తలుచుకుంటే బాధగా ఉంది."

"ఇందులో నువ్వు చేసేదేంలేదు సరితా! అలా బాధపడకు. నువ్వు ధైర్యంగా ఉండు, ఇకమీదట జెన్నికి ఏం సాయం చెయ్యాలో చూడు. తొందరగా ఇంటికొచ్చేలా చూడాలి."

అనుకోవడమే కాని రోజులు కాస్తా నెలల్లోకి జరిగేయి. అంతలో జెన్ని డిప్రెషన్‌లోకి దిగింది. స్కూలు మానేసింది, ట్యూటర్ని పెట్టేరు. గోరుచుట్ట మీద రోకలిపెట్టులా జెన్నీ తల్లితండ్రులు శిశుహింస చేసేరేమోనన్న ఆరోపణ, అబ్జర్వ్ చెయ్యడానికి సోషల్ వర్కర్. అంతా పెద్ద సుడిగుండంలా తయారయింది. సుజాత, సరిత అప్పుడప్పుడు వెళ్లి కాసేపు గడిపి వస్తున్నారు. ఓరోజు ఉండబట్టలేక ఇదంతా ఎందుకు చేసిందిట అని అడిగింది సుజాత.

"ఎందుకేమిటి సన్నగా ఉండాలనే పిచ్చి బాగా తలకెక్కింది. దాని బట్టలు తెద్దామని దాని గదిలోకి వెళితే గోడల నిండా ఆ సింగర్స్ పోస్టర్లు ఉంటాయిగా. వాళ్ళ పాటలంటే ఇష్టం కదా అందుకనే పెట్టుకుంటానంటే వద్దనలేదు. కాని అంతర్లీనంగా ఆ బొమ్మల్లో అతిసన్నగా ఉన్న అమ్మాయిలే ఎక్కువ వున్నారు. మనం సంగీతం గురించి పెట్టుకుందనుకుంటే అది వాళ్ళని రోల్ మోడల్స్‌గా పెట్టుకుని తిండి మానేసి ప్రమాదం తెచ్చుకుంది."

ఎంత ఆలోచించినా తప్పెవరిదో అర్థం అవడంలేదు సుజాతకి. జెన్ని తెలివితక్కువ పిల్లకాదు. ఆటలంటే ఇష్టం. వాటికి కోచ్‌లు బాగా తర్ఫీదు ఇచ్చేవాళ్ళు. తగు జాగ్రత్తలు తీసుకుంటూనే ఉంటారు. అటువంటిది అందరి కళ్ళూ కప్పి ఎలా మాయ చేసిందో? లక్షణమైన పిల్ల సింహేంద్ర మధ్యమానికి ఆశపడి సింహం వాతన బడినట్టు ఇన్ని కష్టాలు తెచ్చుకుంటుందా. అదే అడిగింది లీసాని.

"మాకూ ఏమితోచడం లేదు. మేం ఆఫీసు పనుల్లో మునిగి ఉన్నా దాంతో మాట్లాడే తీరిక లేకుండా ఉండం. మాతో ఒక్క మాటైనా చెప్పలేదు. మ్యూజిక్ బ్యాండ్ల పిచ్చిపడితే వాళ్ల ద్వారా డ్రగ్స్, ఆల్కహాల్ అలవాట్లు వస్తాయేమోనని భయపడ్డాం. అవేవీ కాకుండా ఇంత ప్రమాదం తెచ్చుకుంది. ఏం చెప్పమంటావు."

*



అపర్ణ మునుకుట్ల గునుపూడి వృత్తికి రెవెన్యూ మానేజర్‌గా పనిచేసినా, సాహిత్యం, సంగీతం మరియు నాట్యం అంటే చాలా ఇష్టం. ముప్పై పైగా కథలు, ఎనిమిది నృత్యరూపకాలు, అనేక కవితలు రాశారు. తన రచనల్లో ఎక్కువ సరదా కలిగించేవి తను కల్పించిన పాత్రలు రంగం మీద చేసే నృత్య రూపకాలంటారు. ఘర్షణ కథల సంపుటిని వెలువరించారు. భర్త సుబ్బారావు, పిల్లలు అనుపమ, రజనిలతో ప్రస్తుత నివాసం ఆల్టో, కాలిఫోర్నియా.



కథ

# గౌరమ్మ మొగుడు

సుజాత

“ఇదిగో ఈ అమ్మాయి పేరు గౌరి. మన విశాల్ భార్య,” సుమతీరావు గౌరి చెయ్యి పట్టుకుని తనవైపు లాక్కుని మరీ అక్కడున్న వర్కుచీరల గ్రూప్‌కి పరిచయం చేసింది.

“నా పేరు గౌరీమనోహరి అండీ,” సున్నితంగానే అయినా స్థిరంగా ధ్వనించింది గౌరి గొంతు.

సుమతీరావ్ కొద్దిగా ఆశ్చర్యపడి, “అవునా? మరి మీ ఆయన మాకలా చెప్పలేదుగా? ఇదిగో లేడీస్, ఈ అమ్మాయి పేరు గౌరీమనోహరి. విశాల్ భార్య. నెల క్రితమే పెళ్ళయింది. గౌరి అమెరికాలో అపార్ట్‌మెంట్ ప్రవేశం చేసి రెండు వారాలైంది,” అంది హాస్యంగా!

గౌరి కూడాకొద్దిగా నవ్వింది.

“రా, రా లోపలికి వెళ్దాం,” అని లోపలికి లాక్కుపోతుంటే పక్కావిడ చీరమీది కుందన్లో, రాళ్ళోగానీ గౌరికి చేతిమీద పరపరా సంతకాలు పెట్టేశాయి.

“స్స్... అబ్బ...” అనుకుంటూ సుమతీరావ్‌గారి వెంట లోపలికి పరిగెత్తింది గౌరి.

కాసేపయ్యాక, “విశాల్ ఏడండీ?” అడిగింది కొద్దిగా మొహమాట పడుతూనే.

విశాల్ అక్కడికి కొద్ది దూరంలో కోక్ పట్టుకుని పెద్దపెద్దగా తెలుగు రాజకీయాల మీద నవ్వురాని జోకులు వేస్తూ... అసలు గౌరి సంగతే మర్చిపోయినట్టుగా ఉన్నాడు.

చిరాకు వేసింది. 'కొద్దిరోజులు అలవాటై అందరూ పరిచయం అయితే సరే, కల్సిపోతాను. ఇవాళే కదా అసలు బయటికొచ్చింది. ఈరోజన్నా నా కూడా ఉండొచ్చుగా?'

''విశాల్...'' అంటూ గొంతు తగ్గించి పిలవబోయింది. రెండుసార్లు పిల్చాక విశాల్ గౌరివైపు చూసి ఏంటన్నట్టు తలెగరేశాడు.

''అబ్బ, ఇలారా కాసేపు...'' అంది శబ్దం రాకుండా పెదవులు కదిలిస్తూ.

ఏమర్థమైందో మరి, బొటనవేలు పైకెత్తి విజయసూచకం అభినయించి మళ్ళీ అటువైపు తిరిగి మాటల్లో పడిపోయాడు.

అలా ఎందుకు చేశాడో బొత్తిగా అర్థం కాలేదు గౌరికి.

అంత పెద్ద హాల్లో తనొక్కతే కొత్తది! అందరికీ పాత పరిచయాలున్నాయి. ఇహ జీవితంలో నగలు పెట్టుకునే అవకాశం రాదేమో అన్నంత భారీగా అలంకరించుకున్నారు కొందరు. నిజానికి అలాటి నగల డిజైన్లని గౌరి నగలషాపుల ప్రకటనల్లో తప్ప ఎవరూ పెట్టుకోగా ఇంతవరకూ చూడలేదు.

ఒకావిడ గౌరి కట్టుకున్న చీర వైపు కొద్దిగా ఆశ్చర్యంగా చూసి లోపలికిపోయింది. గౌరిక్కూడా ఆశ్చర్యం వేసి తన వంక చూసుకుంది.

లేత గోధుమరంగుకు గులాబి అంచున్న సన్నని ఉప్పాడ పట్టుచీర.

సుమతిగారు వేసే జోకులకు హాలు దద్దరిల్లిపోతోంది.

''సో, అయితే నీ మిసెస్ టెక్నికల్ కాదా?'' నెమ్మదిగా అడిగాడొక ఫ్రెండ్.

''ఉహూ, మ్యూజిక్కో, శాన్స్క్రిటో... ఎందులోనో ఎమ్మే చదివిందట. మా డాడీ ఫ్రెండ్ కూతురు,'' అంటూ మధ్యలో ఆపి, ''ఏయ్, గౌరీ, ఇట్రా,'' అని కేకేశాడు.

''నీ సబ్జెక్ట్ ఏంటి ఎమ్మేలో? మ్యూజిక్కా? శాన్స్క్రిటా? ఏదో చెప్పారే డాడీ... గుర్తులేదు,'' ఆలోచిస్తున్నట్టు మొహం పెట్టాడు.

''రెండూ...'' జవాబు చెప్పి అక్కడి నుంచి లోపలికి వెళ్ళిపోయింది గౌరి.

''రెండూనా? అంటే డబలెమ్మే అంటారిదేనా?'' తెల్లబోయాడు మిత్రరత్నం!

''అయినా ఎమ్మే ఏంట్రా, ఈరోజుల్లో ఎమ్మే చదివేవాళ్ళున్నారా???'' అని ఆశ్చర్యం కూడా పడి ఇటు తిరిగేసరికి విశాల్ అక్కడలేడు. దూరంగా మరెవరితోనో కబుర్లలో పడ్డాడు ఇంకో కోక్ తెచ్చుకుని.

''అయితే ఏంలే, బ్యూటిఫుల్‌గా ఉంది,'' అన్నాడు ధైర్యంగా అప్పుడు!!

ఇంతకీ ఆరోజు పార్టీ విశేషం ఏమిటంటే సుమతీరెడ్డిగారి రెండో అమ్మాయి ఆష్కకి ఓణీల ఫంక్షన్ సందర్భంగా ఆరోజు ఊళ్ళో వాళ్ళందరికీ బోయినాలు.

లంకంత కొంపాయెను! పుష్పకవిమానమల్లే ఎంతమంది వచ్చినా మరొకరికి చోటున్నట్టే విశాలంగా తోస్తోంది.

''ఈరోజుల్లో 'ఈవిషయానికి' ఇంత హడావుడి, అదీ ఈ దేశంలో చేసి ఇంత పెద్ద పార్టీ చేస్తారా?'' మనసులో అనుకుంటూనే,

''నలుగురూ కలవడానికి ఏదో ఒక సందర్భం కల్పించుకుంటేనేగానీ ఏదేశంలో అయినా కుదిరేట్టుగా లేదు,'' అని సర్ది చెప్పుకుంది గౌరి.

బక్కపల్చని ఆష్కని ఒక సింహాసనం మీద అరుంధతిలో జేజెమ్మలా అలంకరించి కూచోబెట్టారు. ఒంటినిండా కిలో నగలు!! పార్టీ అని వచ్చిన దాని అమెరికన్ ఫ్రెండ్స్ ఈ తతంగాన్ని వింతగా చూస్తూనే, అందరూ కల్సిన ఉత్సాహంలో తెగ కబుర్లు చెప్పేసుకుంటున్నారు.

ఒకపక్క టేబుల్ నిండా ఆష్కకి వచ్చిన ప్రెజెంట్లు గుట్టలుగా పేరుకుంటున్నాయి! 32 ఐటెమ్‌లతో లంచ్ మెన్యూ సిద్ధం అయింది.

ఈ హడావుడి అంతా గౌరికి కొంత అసహనం కల్గిస్తున్నా, విశాల్ ఇలా తనను ఒంటరిగా వదిలేసి ఫ్రెండ్స్‌తో చేరిపోవడం కల్గిస్తున్న కోపం ముందు ఇది తక్కువగానే తోచింది.

ఆష్కని ఆశీర్వదించాల్సిందిగా సుమతి అందరినీ ఆహ్వానించింది. అందరూ వెళ్ళి అక్షింతలు వేసి ఆశీర్వదిస్తూ ఉండగా, కాకినాడ నుంచి వచ్చి ఉన్న ఒక అత్తగారు ''హారతి ఇవ్వరేమే వీళ్ళ దుంపలు తెగా,'' అంది కోడలితో!

హారతి సిద్ధమైంది. సూచించిన పెద్దావిడ ఉత్సాహంగా ఏదో మంగళహారతి పాడాలని ప్రయత్నించింది. సుమతీరావ్ పాపం చాలా ఇబ్బందిపడి దాన్ని బయటపెట్టలేక, చప్పట్లు కొట్టి, ''ఎంత బాగా పాడారండీ,'' అని అభినందించింది.

ఆ ఉత్సాహంలో ఆవిడ మరో పాట అందుకుంటుందేమో అని కంగారుపడి, ''ఎవరన్నా మంచి పాట పాడండ్రా,'' అంటూనే అందుబాటులో ఉన్న గౌరిని చెయ్యి పుచ్చుకుని లాగి, ''గౌరీ, ఒక మంచి పాట పాడు,'' అనిఊపిరి పీల్చుకుంది.

గౌరి పాడుతుందని ఎప్పుడో విశాల్ చెప్పాడు కానీ ఆవిడ అప్పట్లో అంత సీరియస్‌గా తీసుకోలేదు. ఏదో సరదాకి, హాబీగా పాడుతుందని అనుకుంది.

గౌరి అందరివైపూ చూసింది.

ఎన్నాళ్లయిందో అసలు గొంతు సవరించి అనిపిస్తోంది. నిజానికి ఎంతోకాలం కాలేదు. గట్టిగా పెళ్ళికి రెండు రోజుల ముందు నుంచి కాబోలు సాధన ఆగింది.

అందరివైపూ చూసి కొద్దిగా తటపటాయించి గౌరి గొంతు సవరించింది.

కానీ మంగళహారతి పాడలేదు. 'నిన్నే నెరనమ్మినానురా,'

అని పంతువరాళిలో ఖంగుమని గొప్ప దమ్ముతో, విశ్వాసంతో, అంతకుమించిన మాధుర్యంతో ధ్వనించిన ఆ స్వరానికి హాల్లో అంతటా క్షణాల్లో నిశ్శబ్దం వచ్చి వాలింది.

గానం పూర్తయ్యాక కూడా కొన్ని క్షణాలు నిశ్శబ్దం. ఆ తర్వాత సడన్‌గా జడివాన మొదలైనట్లు చప్పట్లు!

విశాల్ ఆశ్చర్యంతో అలాగే చూస్తూ నిల్చున్నాడు. నిజంగానే అతను గౌరి పాట వినలేదు ఇంతవరకు!

గౌరి పాడుతుందని తెలుసుగానీ, పాడమని అడిగేంత టైము ఎప్పుడూ దొరకలా విశాల్‌కి! అంతకుమించి అసలు అడగాలని, పెళ్ళాం పాట వినాలనీ ఆసక్తి లేదు. గౌరిని అంతకుముందు చూసి ఉండటం వల్ల, కొద్దిగా పరిచయం కూడా ఉండటం వల్ల తండ్రి, "నా ఫ్రెండ్ కృష్ణమూర్తి కూతుర్ని అనుకుంటున్నాం నీకు. ఏవంటావురా," అని అడగ్గానే పెద్ద అభ్యంతరం ఏమీ కనపడక సరే అన్నాడు. పచ్చని ఛాయా, ఆ పెద్ద కళ్ళూ, పొడుగాటి జడా... మొహంలో అణకువ... ఇవన్నీ అంతకుముందే విశాల్‌ని ఆకర్షించినా పెళ్ళి దృష్టితో ఆ ఆకర్షణకు ముడి పెట్టలేదు. చూసి ఆనందించాడంతే!

పెళ్ళికూతురు రెండు ఎమ్మేలు చదివిందని తెలిసి తెల్లబోయాడు.

ఎమ్మేలా? పైగా రెండా? అందులో ఒకటి మ్యూజిక్కూ, మరొకటి శాన్స్క్రిటూ! ఏం చేసుకుంటారు ఎమ్మేలు? ఉజ్జోగాలు ఎక్కడొస్తాయి వీళ్ళకి? కెరీర్ ప్లానింగ్ బొత్తిగా లేదనుకుంటా! కొద్దిగా విసుగేసింది!

'రెండు ఎమ్మేలా? ఏం చేసుకుంటారవీ," అని పెళ్ళిలోనే అడుగుదామనుకున్నాడుగానీ కుదర్లేదు. అమెరికా వెళ్ళాక అడుగుదాం లెమ్మని వూరుకున్నాడు.

అమెరికా వచ్చాక అసలే కుదర్లేదు. గుర్తుకు రాలేదు కూడా.

సుమతీరావు తేరుకుని గట్టిగా కౌగిలించుకుంది గౌరిని! "విశాల్, నువ్వెంత లక్కీయో! అమృతం అనుకో! ఇంత అద్భుతంగా పాడుతుందా?? ఇంత అద్భుతంగానా? విన్నావా? విన్నావా అసలు? రోజూ వింటావా గౌరి పాట," ఆమె అడుగుతుంటే,

'అలాటివి మా ఇంటావంటాలే,'వని చెప్పడానికి మొహమాటం వేసింది.

ఒక్క పదినిమిషాల్లో ఆ హాలంతా గౌరి అభిమానులతో నిండిపోయింది. ఒక తమిళ బామ్మగారు వచ్చి గౌరి బుగ్గలు పుణికి, తన చేతి నుంచి రెండు మట్టిగాజులు తీసి ఆమె చేతికి తొడిగింది. గౌరి నవ్వుతూ, కొంచెం సిగ్గుపడుతూ అందరి అభినందనలూ స్వీకరించింది.

ఇంటికొస్తుంటే కారులో విశాల్ మౌనంగా ఉన్నాడు. కాసేపు గడిచాక, "నువ్వు పాడతావని నాకు అమ్మ చెప్పింది కానీ నేను ఇదే వినడం," అన్నాడు.

గౌరి నవ్వింది.

"ఇక నీకు సుమతీ ఆంటీ మంచి ఫ్రెండ్ అవుతుందిలే!," అన్నాడు మళ్ళీ.

మర్నాడు ఎనిమిది గంటలవేళ గౌరి బెడ్రూములో కూచుని గళం విప్పగానే బాత్రూంలోంచి పరుగున వచ్చాడు విశాల్.

"ఓయ్, ఏంటి? ఇంత పెద్దగా పాడేస్తే ఎలాగ? మన కింద ఫ్లోర్లో పై ఫ్లోర్లో కూడా అమెరికన్సే ఉన్నారు. వాళ్లు కనుక కంప్లెయింట్ చేస్తే బాగుండదు," అన్నాడు

"కంప్లెయింటా? ఏమని? ఎందుకు?"

"ఎందుకేంటి? నువ్విలా రోజూ ఇండియన్ క్లాసికల్ మ్యూజిక్ పాడుతూ ఉంటే వాళ్ళకు డిస్టర్బెన్స్‌గా ఉంటుంది."

"మరి, ఎక్కడ పాడుకోను?"

"పాడుకోకపోతే ఏమవుతుంది? ఎవరైనా అడిగినపుడు పాడూ..."

"నేను నా సంగీతం ప్రాక్టీస్ చేసుకోవాలి రోజూ! తప్పదు. అంతేకాదు, నా వయొలిన్ కూడా! అందరూ ఆఫీలకు పోయాక చేసుకుంటాన్లే," అంది ఇక లాభం లేదని.

"ఏంటి వయొలిన్ కూడానా? మన కిందింటి వాళ్ళు ఇద్దరూ పెద్దవాళ్ళు. ఆఫీసులకు పోరు. ఇంట్లోనే ఉంటారు. ఎదురింట్లో మిడిల్ ఈస్ట్ వాళ్లెవరోఉన్నారు," విశాల్ ఉద్దేశమేమిటో అంతు పట్టలేదు గౌరికి

"అయితే పాడటం మానేయమంటావా? అది కుదరదు,"

ఒళ్ళు మండిపోయింది. పాడుకోకపోతే ఏమవుతుందా? ప్రాణం పోతుంది. అవును, పాడుకోకపోతే తన ప్రాణం పోతుంది. ఎలా చెప్పాలి ఇతనికి?

మాట్లాడకుండా అక్కడి నుంచి వెళ్ళిపోయింది. మరో అరగంటకు సుమతీరావు నుంచి ఫోన్ వచ్చింది. సాయంత్రం చిన్న గెట్టుగెదర్ ఉందనీ, గౌరిని ముందుగానే దింపమనీ!

"నువ్వు మళ్ళీ పాటలు పాడాలి కాబోలు," అన్నాడు విశాల్ టై కట్టుకుంటూ!

సాయంత్రం గౌరిని సుమతి ఇంటి ముందు దింపి, "అవగానే కాల్ చెయ్యి, వచ్చి తీస్కెళ్తా!" అని కారు వెనక్కి తిప్పాడు.

లోపలికి వెళ్తూనే గౌరి సుమతి దగ్గరికి వెళ్ళి, "నేను మీ ఇంట్లో ఎక్కడైనా కూచుని కాసేపు పాడుకోవచ్చా?" అని అడిగేసింది గబగబా!

సుమతి ఆశ్చర్యంగా చూస్తూ, "అఫ్‌కోర్స్ డియర్, నీ ఇష్టం. ఎక్కడైనా కూచుని పాడుకో! మా ఇల్లు పావనం చెయ్యి... మీ ఇంట్లో పాడవా?" అంది.

"మా ఇంట్లో పాడితే కిందవాళ్లకి వినిపిస్తుందని విశాల్ ఒద్దన్నాడు," అని చెప్తుండగానే కంఠంలో జీరలాంటిది తొంగి చూసింది

సుమతి మరింత ఆశ్చర్యపడి అంతలోనే విశాల్ కంగారుని అర్థం చేసుకున్నట్టుగా తలపంకించి, "ఓకే, ఓకే పద, పైన ఒక గది చూపిస్తాను. విశాలంగా ఉంటుంది. ఎవరూ నిన్ను డిస్టర్బ్ చెయ్యరు," అని తీసుకెళ్ళింది.

ఒక అరగంట తర్వాత మెరుస్తున్న మొహంతో తేలికపడ్డ హృదయంతో కిందికి దిగి వచ్చింది గౌరి. ఆవేళ పార్టీలో గౌరి

ప్రధానాకర్షణ. సుమతీరావు ఎగ్జిబిషన్ అన్నట్టుగా పాటలు పాడించక, గౌరిని అందరికీ పరిచయం చేసింది. గౌరి మనసు గెల్చుకుంది

చివర్లో గౌరే మంచి సినిమా పాట పాడి అందర్నీ సంతోషపెట్టింది.

"సంగీతం నేర్చుకున్నారా మీరు," ఒకాయన అడిగాడు కూతురికి నేర్పమని అడిగితే ఎలా ఉంటుందో ఆలోచిస్తూ!!

"ఊరికే నేర్చుకోవడం కాదు, ఆ అమ్మాయి మ్యూజిక్‌లో ఎమ్మే చేసింది," అన్నారు మరెవరో.

"అయ్యో, అవునా? మీకు ఇండియాలో అయితే కెరీర్ బాగుండేదేమో! కాన్సర్ట్లూ అవీ ఉండేవేమో! ఇక్కడ ఉజ్జోగం చేసే ఆలోచన ఉందా," అందొక అమ్మాయి.

"నేనొచ్చి ఇంకా నెల కూడా అవలేదండీ! కెరీర్ గురించి ఆలోచిస్తాను... మేబీ లేటర్ ఆన్," అంది గౌరి. ఎందుకో అలా అంటుంటే కడుపులో పెద్ద దిగులు! ఒక పెద్ద ఖాళీతనం!

చదువుకున్నన్ని రోజులూ అసలు కెరీర్ గురించి ఆలోచనలు లేవు. పాడాలి పాడాలి నేర్చుకోవాలి అన్న ధ్యాస తప్పించి. చదువు పూర్తయ్యాక అనిపించింది. చక్కని వాతావరణంలో గురుకులం లాంటి మ్యూజిక్‌స్కూల్ పెట్టాలనీ ఎంతోమంది పిల్లలకు సంగీతం నేర్పాలనీ! అది కూడా కెరీర్ గానో, సంపాదన కోసమో అనే ఆలోచనేలేదు. పిహెచ్.డి. చెయ్యాలని కూడా మరోపక్క ఆలోచన.

ఈలోపే పెళ్ళి ప్రస్తావన, ఇంట్లో అందరికీ నచ్చడం, పెళ్ళి, కళ్ళు మూసి తెరిచేలోపు అమెరికాలో కాపరం!

'అసలు నాన్నని తన్నాలి! అమెరికా పంపించే ఉద్దేశం వుంటే ఏఇంజనీరింగ్‌కో పంపించక, 'నీ ఇష్టం బంగారూ!' అని తనను మ్యూజిక్ వైపే ప్రోత్సహించాడెందుకు?' చనువుగా ఉక్రోషపడింది మనసులోనే!

ఒక్కోసారి గౌరి కళ్ళు గట్టిగా మూసుకుని, ఇదంతా కల! అసలు పెళ్ళీగిళ్ళీ ఏంలేదు. ఎవరో ఒకరు నన్ను, 'ఇక లే, ఏంటా మొద్దునిద్ర,' అని లేపేస్తారు అని ప్రయత్నించి చూసిందిగానీ ఎవరూ ఎప్పుడూ లేపలా!

"వంటేం చేశావు"అన్న ప్రశ్నతో విశాల్ వచ్చి కళ్ళు తెరిపించేవాడు.

అమెరికాలో కాపరం అన్న ఊహేలేదు తనకి. సడన్‌గా ఇక్కడికి వచ్చి పడేసరికి ఏమిచేయాలో తెలీడంలేదు. ఈలోపే ఇంటర్ తర్వాత విడిపోయి ఇంజనీరింగ్లు చదివి ఏరికోరి అమెరికా మొగుళ్ళని తెచ్చుకున్న స్నేహితురాళ్ళు, "పోన్లే, నువ్వూ వచ్చేశావా? ఆ ఎమ్మేల్తో ఏంచేస్తావుగానీ మీ వూర్లోనే యూనివర్సిటీ ఉందిగా! ఏదైనా చదువుకో! లేదా కమ్యూనిటీ కాలేజీ దగ్గర్లోనే ఉండుంటుంది వెదుకు. అందులో చేరు. త్వరగా ఉజ్జోగాలొచ్చే కోర్స్ ఏదైనా చెయ్యి. బుక్ కీపింగో, టాక్సేషనో...."

వచ్చి నెల కాలేదు, అపుడే ఉచిత సలహాలు! బోడి సలహాలు.

"నాకు ఉజ్జోగం చేసే ఆలోచన లేదు. తిని టీవీ చూస్తూ గడిపేద్దాం అనుకుంటున్నా," అంది కఠినంగా!

అంతే! స్పృహ తప్పిపడిపోయింది ఒక మిత్రురాలు.

"అమెరికా వచ్చి పనిచెయ్యనంటావేం? ఎంతోకొంత సంపాదించకపోతే ఎలా" ఇంకో మిత్రురాలు ఎలాగో గొంతు పెగుల్చుకుంది.



"నేను పని చెయ్యను అనటల్లేదు. ఆ పని నాకు నచ్చకపోతే చెయ్యను అంటున్నాను. డబ్బు కోసమైనాసరే"

"నీ ఖర్మ. ఎలాగో ఏడు," అని వదిలేశారు వాళ్ళిద్దరూ!

కమ్మగా పాడుతూ గడిపిన క్షణాల్ని వదిలి ఇంటికి చేరింది గౌరి సుమతీరావు కార్లో!

"నాకు కాల్ చేస్తే నేనొచ్చేవాణ్ణిగా," అన్నాడు విశాల్ !

"మరేం పర్లేదు లేవోయ్! మళ్ళీ మేమేదైనా ప్రోగ్రాం పెట్టుకుంటే నువ్వే తెచ్చి దింపాలి," హాస్యంగా అని కారు దిగకుండానే బై చెప్పి వెళ్ళిపోయిందావిడ!

తెల్లగా, చల్లగా, హాయిగా కాస్తున్న వెన్నెల. ఎవరిళ్ళలో వాళ్ళు న్నారు. కాసేపు అక్కడే లాన్‌లో కూచుని పాడుకోవాలి అనిపించింది గౌరికి.

ఆ సంగతి చెప్తే విశాల్ గుండె ఆగిపోతుందని మాట్లాడకుండా లోపలికి నడిచింది.

❖

రెండు రోజుల తర్వాత ఆఫీసులో ఉండగా సుమతీ నుంచి ఫోన్. "మీయావిణ్ణి నేనొచ్చి మా ఇంటికి తీసుకుపోతున్నా! సాయంత్రం దించుతా మళ్ళీ," అని

సాయంత్రం ఆరింటికి వచ్చి దింపేసి వెళ్ళింది గౌరిని. వెళ్తూ వెళ్తూ, "రేపు ఫోన్ చేస్తాన్లే మన ప్రోగ్రాం సంగతి," అని చెప్పి వెళ్ళింది కార్లోంచే.

"ఎందుకు తీసుకెళ్ళిందావిడ? ఏం చేశారక్కడ?" అనడిగాడు గౌరి ఇచ్చిన కాఫీ అందుకుంటూ.

"సుమతిగారి ఫ్రెండ్సూ, ఇంకా ఆవిడ తోడికోడళ్ళట వాళ్లంతా వచ్చారు, నాచేత పాడించుకునేందుకు. అబ్బ, ఎంత సేపు పాడానో! భలే హాయిగా ఉందివాళ," అంది గౌరి మిలమిల మెరిసిపోతున్న మొహంతో.

"అయితే రోజూ పాడుకోక తప్పదా నువ్వు?" కొంచెం అదో రకంగా ధ్వనించింది విశాల్ గొంతు! రోజూ పాడుకోడానికి సుమతీరావు ఇంటికి వెళ్తుందా అయితే? దగ్గరే అనుకో... అయితే మాత్రం?

"రోజూకాదు, ఎపుడూ పాడుకోవాలనే ఉంటుంది నాకు. కానీ ఇక్కడ కుదరదంటున్నావు నువ్వు," గౌరి గొంతులో కూడా కొంత నిరాశ.

ఈ 'పాడు' గోల ఏమిటో అంతుపట్టేలా తోచలేదు విశాల్‌కి!

ఆ తర్వాత మరోవారంలో సుమతి ఫోన్ చేసింది విశాల్‌కి. "గౌరి దగ్గర పిల్లలకు సంగీతం నేర్పించడానికి పేరెంట్స్ బాగా ఉత్సాహపడుతున్నారోయ్! మనది చిన్న ఊరవడంవల్ల ఎవరూ లేరు నేర్పించేవాళ్ళు. గోపీనాథ్‌గారి అమ్మాయిని హ్యూస్టన్ తీసుకెళ్ళి నేర్పిస్తున్నారు తెల్సా వీకెండ్స్‌లో? అదృష్టం బాగుండి గౌరి వచ్చిందిక్కడికి. గోపీనాథ్‌గారి వైఫ్ తెలుసుగా సుమిత్ర... ఆవిడైతే గౌరి గొంతు విని అబ్బురపడిపోయిందంటే నమ్ము. గౌరి ఒప్పుకుంటే వాళ్ల పాపని ప్రతి వీకెండూ హ్యూస్టన్‌కి తీసుకెళ్ళడం తప్పుతుందని ఆవిడ ఆశ!

"నిజంగా ఎంత అదృష్టవంతుడివి విశాల్ నువ్వూ? ఏమి గొంతు ఏమి గొంతు? పి. లీల తెల్సా నీకు? అలాటి గాంభీర్యమే మీ యావిడ గొంతులో! మొన్న గుళ్లో చూశాక నాకు ఎంతమంది కాల్ చేశారో తెల్సా గౌరి నంబర్ ఉంటే ఇమ్మనీ, ఆవిడ నేర్పుతుందేమో కనుక్కోమనీ!

"ఇంత దూరంలో పడి ఉంటున్నాం కదా పుట్టిన నేలకి? ఏదో మన సంగీతమూ, మన కళలూ ఇవన్నీ దూరం కాకుండా ఉండాలని ఎవరి తిప్పలు వాళ్ళు పడతారు పాపం! నేను అడిగాను గౌరిని ఈ విషయం! కానీ గౌరి ఏ విషయమూ తేల్చుకోలేకపోతోంది. మొన్నే కదా వచ్చింది. ఇంకా ఈ వాతావరణం పూర్తిగా కొత్తాయెను! సుమిత్ర గారే కాదు, శ్రీరామ్ పూసపాటి తెల్సుగా వాళ్లబ్బాయి, అనూ కాటసాని వాళ్ల చిన్నది, కిషోర్ సోమయాజుల వాళ్ళ పాప..." సుమతీరావు మాటల ప్రవాహంలో విశాల్ మతి ఎటో పోయింది.

ఇంత జరిగాక ఇక గౌరి ఆగుతుందా నేర్పకుండా??

"నేను గౌరితో మాట్లాడతాలెండి, కనుక్కుంటా, ఒప్పుకుంటుందేమో!" అన్నాడు ప్రస్తుతానికి తప్పించుకుందామని.

"నువ్వు ఒప్పుకోడం ఏమిటోయ్? నువ్వొప్పుకోనంటే నేనూరుకుంటానా? ఇంతమందికి నేర్పగలనా అని గౌరి ఆలోచిస్తోందంతే! సర్లే, నీకు వదిలేస్తే నువ్వు మొత్తం చెడగొట్టేట్టున్నావ్, గౌరితో నేను మాట్లాడతాలే! నువ్వాఫీసుకెళ్ళు." అబ్బ, ఈవిడకు బొత్తిగా మొహమాటం లేదు. ఏం పెద్దరికమో ఏమో!

ఆఫీసు నుంచి ఇంటికి వచ్చాక తీరిగ్గా ఇద్దరూ బాల్కనీలో కూచుని కాఫీ తాగుతుండగా అడిగాడు, "మ్యూజిక్ నేర్పుతాను అన్నావటగా పిల్లలకి, సుమతీరావు ఫోన్ చేసింది."

"నీకు చెప్పకుండా ఎలా నేర్పుతానూ, అయ్యో అదేం మాట," అనలేదు గౌరి.

"అవును, ఎంతోమంది పేరెంట్స్ అడుగుతున్నారట. నాకిది ఆ సరస్వతి అనుగ్రహంలాగే ఉంది. అసలు పాడుకోడానికే కుదర్దేమో అని భయపడుతుంటే, రోజూ పాడుకునే అవకాశం వచ్చినట్టుగా ఉంది," అంది

"కల్లో కనపడిందా సరస్వతి, రోజూ పాడుకోమని చెప్పిందా? ఊళ్ళోవాళ్ళ పిల్లలందరికీ నేర్పమని కూడా చెప్పిందా? ఫీజు అదీ నువ్వు చెప్తావా సరస్వతి చెప్తుందా కల్లో?" అన్నాడు వెటకరిస్తూ.

గౌరి పట్టించుకోలా! రోజూ తనివితీరా పాడుకోబోతున్నాననే సంతోషంలో మునిగి ఉంది.

"కల్లో కాదు, ఇలలోనే! సుమతిగారే సరస్వతి నాకు," అంది ఎక్కడో ఆలోచిస్తూ.

విశాల్ దిగాలు పడిపోయాడు!

❖

విశాల్ చూస్తుండగానే మూడునెలలు వేగంగా తిరిగిపోయాయి. వారంలో మూడురోజులు ప్లస్ వారాంతంలో ఒకరోజు గౌరి సంగీతం క్లాసులు జరిగిపోతున్నాయి. వారాంతం సుమతీ

రావు ఇంట్లో! మిగతా రోజులు గుడిలో!

మొత్తం ప్రత్యక్ష విద్యార్థులు 16 మంది. ఇదికాక వయొలిన్ క్లాసులకు వచ్చేవారు ముగ్గురు. ఈ మూడు నెలల్లోనే గౌరికి సుమతీరావు డ్రైవింగ్ లైసెన్స్ ఇప్పించేసింది.

సుమతి ఉత్సాహం చూస్తుంటే విశాల్‌కి దడ పట్టుకుంది. సంగీతంక్లాసుల్లో గౌరి ఎలాఉంటుందో తెలీదు కానీ ఇంట్లో మాత్రం మొన్నమొన్నటి వరకూ కొత్త పెళ్ళికూతుర్లానే ఉంది. ఈమధ్య బాగా మార్పు తోస్తోంది !

తను డ్రైవ్ చేస్తుంటే ప్రకృతిని చూస్తూ పరవశిస్తూ పక్క సీట్లో కూచునేదల్లా మొన్నొకరోజు, "నేను డ్రైవ్ చేస్తాలే, మీరు కూచోండి," అంది!

పైగా బయటికి వెళ్ళినపుడు కాష్ పేమెంట్లు ఎడాపెడా చేసేస్తోంది తనే సొంత డబ్బులతో! మూడునెల్ల క్రితం గౌరి ఇలా లేదు.

ఇంకా ఎలా మారుతుందో తెలీదు! ప్చ్!

డిపెండెంట్ వీసా మీదున్నా సొంత ఐడెంటిటీ!!

ఊహించని విషయం ఇది! ఈ స్ట్రెస్ ఎలా తట్టుకోవాలో అర్థం కావట్లేదు విశాల్‌కి!

ఆ ఆదివారం పదకొండు గంటలకు సుమతీరావు ఫోన్ చేసింది... విశాల్‌కి కాదు గౌరికి!

45 నిమిషాలు మాట్లాడాక దాని సారాంశం గౌరి చెప్పింది... ఒకటిం పావు నిమిషంలో!!

స్కైప్‌లో మ్యూసిక్ క్లాస్ నేర్చుకోడానికి నలుగురైదుగురు పిల్లలు వేరే వూళ్ళ నుంచి రిక్వెస్ట్ చేస్తున్నారట. గౌరి కాంటాక్ట్ కావాలని కోరారట సుమతిగారిని! గౌరి లెసన్స్ స్కైప్‌లో చెప్ప డానికి ఒప్పుకుంది !

"నాకు చెప్పలేదేం," అన్నాడు మళ్ళీ... అసలా ప్రశ్నే వృథా గా తోస్తుండగా!

"నాకూ ఇప్పుడేగా తెల్సింది! అయినా చెప్పడానికే ముంది? నాకిష్టమేగా, అదీకాక హైస్కూలు పిల్లలు వాళ్ళు. ఉదయాన్నే ఆరింటికి అరగంట స్కైప్ చేస్తే చాలు. వారానికి రెండు క్లాసులు."

"ఉదయాన్నే ఆరింటికా????"

"అవును, నువ్వు లేవక్కర్లేదు, నేను లివింగ్‌రూమ్‌లో లాప్ టాప్ పెట్టుకుని తీసుకుంటాలే క్లాసు,"

ఈమాత్రం బోడి సంగీతం క్లాసులకు ఇండియా నుంచి ఇంట్లోవాళ్ల అప్లాజు!! వాళ్ళమ్మా నాన్నలు మరీ జీవిం చేస్తున్నారు. వాళ్ళ నాన్నంటాడు, " రోజూ పాడుతున్నందుకు చాలా సంతోషం బంగారూ! అందరికి నేర్పడం మంచిపనే కానీ నువ్వు అందులో పడి నేర్చుకోవడం మానేయకు. మహామహా వాళ్ళవి ఇప్పుడు ఫేసుబుక్‌లో పేజీలున్నాయి. కొత్త రికార్డ్స్ అప్‌డేట్ చేస్తుంటారు. వింటూ ఉండు" అట!

మరే, ఈవిడొక్కత్తే ఈ దేశంలో సంగీతాన్ని పాలిస్తోంది! ఈమధ్య ఏ చిన్నగెట్టుగెదర్ జరిగినా గౌరి సంగీతం ఒక టాపిక్ అయిపోతోంది. "నీ వైఫ్ మ్యూజికల్ లెసెన్స్ చెప్తుందటగా? చాలా అద్భుతంగా పాడుతుందట?" అని ఎవరో ఒకరు అడగనే అడుగుతున్నారు.

"విశాల్, నా వయొలిన్‌కి తీగలు తెచ్చుకోవాలి కొత్తవి. షోల్డర్ రెసెట్ కూడా !స్ట్రెయిట్ మ్యూజిక్ షాప్‌కి వెళ్తున్నా! వస్తావా నువ్వు?" చెప్పు లేసుకుంటోంది గౌరి.

నిట్టూర్చాడు!!

"వస్తానుండు."

❖

మరో నాలుగు నెలలు గడిచాయి!

ఉగాది!

గుడి ఆవరణంతా పట్టుపరికిణీలూ, జడగంటలూ, పంచెలూ, నుదుట నామాలతో నిండి తెలుగింటి నట్టిల్లులా వుంది. దర్శనం చేసుకుని వస్తున్న వాళ్లందరికీ ఉగాదిపచ్చడి చేతిలో కొద్దిగా వడ్డిస్తోంది ఒక ఓణీపిల్ల. మరోపక్క కెఫెటేరియా అనగా ప్రసాదశాలలో భోజనాల ఏర్పాట్లు జరుగుతున్నాయి. సుమతీరావు మోకాళ్ళ దాకా అంచున్న పెద్ద పట్టుచీర, దానికి తగ్గ నగలతో తయారై హడావుడిగా భజనహాల్లో తిరుగుతోంది. పండగ ప్రత్యేక దర్శనం పూర్తయ్యాక గౌరి దగ్గర సంగీతం నేర్చు కుంటున్న పిల్లల విద్యాప్రదర్శన ఉందక్కడ! గౌరి కారు దిగి అక్కడ అడుగు పెట్టగానే ఎదురొచ్చి లాక్కుపోయింది సుమతి గారు. "ఏంటి ఆలస్యం చేశావ్? నీ మొగుడేమన్నా సణుగు తున్నాడా? గమనిస్తున్నాలే వాలకం," అంటూ!

గౌరిని చూడగానే పిల్లలలంతా పరిగెత్తుకొచ్చారు. వాళ్లందరి చేతులూ పట్టుకుని సగం టెన్షన్ తగ్గించుకుంది గౌరి. వాళ్ళందరినీ చూస్తుంటే తన చిన్నతనం గుర్తొస్తోంది. స్కూలు సంగీతం, తప్ప ఇంకేమీ ఉండేవి కాదు దినచర్యలో!

మొదటిసారిగా స్టేజీ మీద పాడినపుడు, 'మూర్తిగారి అమ్మాయి,' అంటే ఎంత గర్వపడ్డారో నాన్న, అనేక ప్రదర్శనల తర్వాత, 'గౌరీమనోహరిగారి తండ్రి శ్రీమూర్తి గారిని స్టేజిమీదికి ఆహ్వానిస్తున్నాం,' అంటే అంతకంటే ఎక్కువ గర్వపడ్డారు. గౌరి తండ్రిగా గుర్తించినపుడు కళ్ళనీళ్ళు పెట్టేసుకున్నారు!

తండ్రి గుర్తొచ్చి మనసు తడిగా అయింది గౌరికి!

అన్నట్లు విశాల్ ఏమైనా తిన్నాడో లేదో చటుక్కున గుర్తొచ్చి లేచి వెళ్ళింది. విశాల్ హాయిగా ఫ్రెండ్స్‌తో కల్సి వడలు లాగిస్తూ కబుర్లు చెప్తున్నాడు.

నడిచి వస్తున్న గౌరిని చూపిస్తూ తన ఫ్రెండ్స్‌కి ఏదో చెప్తున్నాడు. 'నా వైఫ్ గౌరి,' అని చెప్తున్నాడేమో మరి!

పూజ పూర్తవగానే పిల్లల సంగీతం మొదలైంది. గౌరి వయొ లిన్ అందుకుని వాళ్లతోపాటు కూచుంది. పిల్లలంతా అద్భుతంగా పాడారు.

సుమతీరావు సంతోషానికి అంతు లేకుండాపోయింది. ఆవిడేగా గౌరిని కనిపెట్టింది (డిస్కవరీ). అటూఇటూ తిరుగుతూ అన్నీ చూసుకుంటూనే ప్రోగ్రాం మీద ఒక చెవి పడేసి ఉంచింది.

చివరగా పిల్లలు అన్నమాచార్య కీర్తలనలేవో పాడుతుండగా విశాల్ లేచి బయటికి వెళ్లాడు సుమతిగారు పిలవడంతో!

"విశాల్, నీ ఫ్రెండ్ ఎవరినైనా పిలువు, ఈ కుర్చీలు కొంచెం పక్కగా సర్దాలి! మనిద్దరివల్లా కాదు," అందావిడ అప్పటికే రెండేసి కుర్చీలు సర్దేస్తూ!

ఇంతలోనే ఆలయ సింహద్వారం నుంచి లోపలికి వస్తున్న వాళ్లని చూసి ఆవిడ గబగబా ఎదురెళ్ళింది. "ఏంటింత లేటు? పెందలాడే వస్తారనుకున్నాను? ఫోన్ చేస్తే తీయరేం సుభాష్ గారూ," అని ఆహ్వానిస్తూనే ఒకాయన్ని చనువుగా మందలించింది.

"బయలుదేరడమే కాస్త లేటయింది. సారీ సుమతిగారూ! ప్రోగ్రాం అయిపోయిందా?" అడిగాడాయన లోపలికి నడవబోతూ

"అయిపోయినట్టే! మధ్యమావతిలో మంగళహారతి విందురుగాని పదండి! అదే ప్రాప్తం మీకు," అంటూ పక్కకు తిరిగి, "విశాల్! నిహాల్‌నో మరొకర్నో పిలిచి కొద్దిగా ఈ పని కానిచ్చెయ్," అని వచ్చినవాళ్ళను లోపలికి తీసుకెళ్ళింది.

విశాల్‌కి ఎందుకో తలనొప్పిగా అనిపించింది. గబాగబా తానొక్కడే కుర్చీలన్నీ మూడేసి చొప్పున పక్కకి సర్దేసి లోపలికి వచ్చాడు. సుమతీరావు దగ్గరికి వెళ్లి, "ఆంటీ మంచినీళ్ళు ఇంకా రాలేదు, ఫోన్ చెయ్యాలి," అన్నాడు గౌరికేసి చూపులు సారిస్తూ!

నీలిరంగు పట్టుచీరలో గౌరి అద్భుతంగా కనిపిస్తోంది. నిజానికది చీర అందమో గౌరి అందమో కాదు! గౌరి మోహంలో తృప్తి, సంతోషం, ఉత్సాహం... ఇవి ఆమెకు కొత్త సౌందర్యాన్ని అద్దుతున్నాయి.

"అయ్యో, అవునా... చేసేద్దాం చేసేద్దాం," అంటూ సుమతి గారు మొబైల్ అందుకుంది.

చోటు చాలక నిలబడి పిల్లల సంగీతాన్ని వింటున్న వాళ్ళలో ఒకాయన, "ఈ అబ్బాయెవరూ? ఇంతకుముందు చూశానా," అన్నాడు విశాల్ కేసి చూస్తూ!

ఫోన్ చేయబోతున్నదల్లా ఆగి సుమతీరావు అన్న మాట బహుశా విశాల్ ఎన్నటికీ ఊహించలేడు.

"ఈ అబ్బాయా? ఇతని పేరు విశాల్! మన మ్యూజిక్ టీచర్ గౌరి మనోహరి భర్త."





**Audio and Music System service Available for all Type of functions for an Exciting Price For more details Contact: Srinivas Raju Dhenuvakonda Phone : 313-310-2367 or saidoot99@yahoo.com**


కొయ్యబారిపోయాడు విశాల్!

'గౌరి మనోహరి భర్త'... ఇదొక్కటే వినపడింది! అదొక్కటే వినపడుతోంది మళ్లీమళ్లీ!

"అవునా? గౌరిగారి భర్తగారా? ఓ... నైస్," చేయి పట్టుకుని ఊపేస్తున్నాడాయన!

గౌరిని మొదటిసారి ఆ వూరి తెలుగు కమ్యూనిటీకి సుమతీరావు పరిచయం చేసిన మాటలు గుర్తొచ్చాయి విశాల్‌కి అప్రయత్నంగానే.

"ఇదిగో ఈ అమ్మాయి పేరు గౌరి! మన విశాల్ భార్య."

విశాల్ భార్య...

గౌరి భర్త...

తలనొప్పి మైగ్రేయిన్‌గా మారుతుండగా మనసులో ఆలోచన మెదిలింది

గౌరి భర్తగా ఎత్తుకి ఎదిగాడాతను? *



సుజాత జర్నలిస్టు మరియు కథకురాలు. అమెరికా వచ్చాక వాకిలి అంతర్జాల పత్రికకు ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. గ్రంథ పఠనం అభిరుచి. నివాసం ఆస్టిన్, టెక్సస్.

# బతుకమ్మా! సగర్వంగా తలెత్తుకుని బతుకు! సంబరంగా బతుకు!!!

నారాయణస్వామి వెంకటయోగి

యింకా బాగా గుర్తుంది. చిన్నప్పుడు దసరా సెలవులకు యింటికి పోయినప్పుడు పొద్దున్నే నిద్రలేపేది నాయనమ్మ. 'లే బిడ్డా లే! జల్దీ లేచి మొకం కడుక్కొని, ఇన్ని పాలు తాగి ఆ గోనె సంచి తీసుకొని శెలుక దిక్కు పోయిరా! మంచి మంచి తంగేడి పువ్వు, గునుక పువ్వు, బంతి పువ్వు, చేమంతి పువ్వు, మోత్కాకులు తీసుకోనిరా! నీ సోపతోల్లు అంతా అప్పుడే పోయింద్రు! ఇంక ఆల్సెమైతే పువ్వు దొరుకదు,' అంటూ తొందరపెట్టేది. 'అబ్బా సెలవులల్ల కూడా జల్ది లేవాల్నాయె?' అని విసుక్కుంట తొందర తొందరగ తయారై బయటపడేది. 'పదిలం బిడ్డా! పురుగు బూసి చూసుకో! ముల్లు గిట్ల గుచ్చగిట్ల,' అని భద్రం చెప్పేది నాయనమ్మ! బాగా పొద్దెక్కేదాకా, కడుపుల మల్ల గురగుర అనెదాక పూలు ఆకులు తెంపుకోని యింటికి చేరుకునేది. నిండ నింపుకొచ్చిన సంచి దులుపుతుంటే బాపు, నాయనమ్మ సంబర పడెటోల్లు. 'అబ్బో ఈసారి మనదే అందరికన్న పెద్దదయితది! పూలు మాలెసగనే తెచ్చిండు కొడుకు,' అంటూ వీపు నిమిరేది నాయనమ్మ! నిజానికి నేను తెచ్చినవి తక్కువేనని, యేదో నన్ను మెచ్చుకోవటానికి అంటున్నరని అప్పుడు తెల్సుకోలేక పోయినా తర్వాత తర్వాత తెల్సుకున్నా! మల్లా బాపు కూడా పోయి పూలు తెచ్చెటోడు. ఇద్దరివీ కలిస్తే బాగానే జమయ్యేవి. యింతకీ ఈ హంగామా అంతా మా బతుకమ్మ పేర్చేటందుకు. వాడకట్టుకి అందరి బతుకమ్మ కన్నా మాదే పెద్దది కావాలని తాపత్రయం. యెప్పుడో ఒకసారి తప్ప మాది అంత పెద్దదిగా పేర్చగలిగేవాళ్లం కాదు.



ఆశ్వయుజ మాసం శుద్ధపాడ్యమి నుండి తొమ్మిది రోజుల పాటు తెలంగాణలోనే జరుపుకునే ఒక గొప్ప సామూహిక పండుగ బతుకమ్మ. తెలంగాణ ప్రజల సామూహికజీవితానికి ప్రతీక బతుకమ్మ. పనిలోంచి శ్రమజీవితాల్లోంచి పెల్లుబికిన పాటల పూల సమాహారం బతుకమ్మ. ఏవో ఒకటి రెండుదేశాల్లో పూలకు సంబంధించిన పండుగ లున్నా యింత పెద్ద యెత్తున విశిష్టంగా జరుపుకునే పూలపండుగ బతుకమ్మ మరెక్కడా కానరాదు. అందుకే బతుకమ్మ పండుగ ఒక ప్రత్యేక సాంస్కృతిక చిహ్నంగా మారి ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాతి గాంచింది.

ఈ పండుగ ప్రధానంగా పూలకు, నీళ్ళకు, స్త్రీలకు ప్రకృతికి సంబంధించిన పండుగ. స్త్రీ ప్రకృతికి చిహ్నం. ప్రకృతిలో అత్యంత ముఖ్యమైన నీళ్ళకు, ప్రకృతికే రంగులద్ది వన్నెతెచ్చే పూలతో, ప్రకృతికి మరో రూపమైన స్త్రీలిచ్చే నీరాజనం బతుకమ్మ పండుగ, ప్రకృతి పండుగ! ప్రధానంగా శ్రమజీవులైన స్త్రీలు (ముఖ్యంగా బహుజన స్త్రీలు) తమ శ్రమకు ఫలించిన ప్రకృతికీ, తోడునిచ్చిన నీళ్లకూ, తమ చిరునవ్వుల్లాంటి పూలతో జరిపే ఉత్సవం బతుకమ్మ. బహుశ మరే పండుగ స్త్రీలకు, ప్రకృతికీ, పూలకూ సమస్త జీవరాశులకూ ప్రాణాధారమైన నీళ్ళకూ యింతగా ముడివడి లేదనడం అతిశయోక్తి కాదు.

బతుకమ్మ పండుగ జరుపుకోవడానికి వెనుక చాలా కథలు (legends) ప్రచారంలో ఉన్నాయి. వీటిలో ప్రధానమైనవి-

మహిషాసురమర్ధని గౌరి అమ్మవారి నేపథ్యంలో చెప్పే కథ. మహిషారున్ని చంపిన తర్వాత దుర్గాదేవి (గౌరి) మూర్ఛ పోయి నప్పుడు స్త్రీలంతా ఆమెను తిరిగి లేవమని, 'బతుకమ్మ' అని పది రోజుల పాటు పాటలు పాడాక ఆమె తిరిగి లేస్తుంది. కనుక స్త్రీలు ఆమె తిరిగి లేచిన సందర్భంగా పండుగ జరుపుకుంటారు.

ప్రాచుర్యంలో ఉన్న మరో కథ- పూర్వం ఒక కాపు దంపతు లకు పుట్టిన పిల్లలంతా పురిట్లోనే చనిపోవడంతో యేడవ సంతా నానికి బతుకమ్మ అని పేరు పెట్టడంవల్ల ఆమె బతుకు తుంది. తర్వాత ఆమెకో సోదరుడు కూడా పుడతాడు. పెళ్ళి వయసు వచ్చి నంక బతుకమ్మకు పెళ్ళి చేసి పంపిస్తారు. సోదరునికి కూడా పెళ్ళి అవుతుంది. ఒకసారి తల్లివారింటికి వచ్చిన బతుకమ్మ తన మరదలుతో కలిసి చెరువుకు స్నానానికి పోయినప్పుడు తన చీర కట్టుకుందన్న కోపంతో మరదలు బతుకమ్మను గొంతు పిసికి చంపేసి చెరువువొడ్డున పాతిపెడుతుంది. చని పోయిన బతుకమ్మ తన భర్తకు కలలో కనిపించి తనని తీసికొని పొమ్మని అడుగు తుంది. ఆయన చెరువు వొడ్డుకి పోయి అక్కడ మొలిచిన తంగేడి చెట్టు పూలని ఆశ్చర్యంతో తెంపబోగా ఆ చెట్టు (బతుకమ్మ) జరిగిన కథ చెబుతుంది. అప్పట్నుండీ తంగేడిపూలతో బతుకమ్మ పేర్చడం ఆనవాయితీగా బతుకమ్మ పండుగ ప్రసిద్ధి చెందింది.

బతుకమ్మ పాటల పండుగ. పాటలు లేని బతుకమ్మను ఊహించడం అసాధ్యం. పాట శ్రమ నుండి పుట్టింది. పాటను, ముఖ్యంగా జానపద పాటను శ్రమ నుండి వేరుచేసి చూడడం అసాధ్యం. బతుకమ్మ పండుగ రోజుల్లో స్త్రీలు తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మల చుట్టూ వాడ వాడలా పొద్దుగూకి , దిగూట్లో దీపాలు వెలిగేదాకా తమదైన ప్రత్యేకత కలిగిన శ్రావ్యమైన గొంతుకలతో సామూహికంగా పాడే అద్భుతమైన పాటలు వారి సామూహిక శ్రామిక జీవనానికి నిలువెత్తు ప్రతీకలు, దర్పణాలు. బతుకమ్మ పాటల్లో శ్రామిక జీవితం, కష్టనష్టాలు, కన్నీళ్ళు, వెతలు, గాథలు, సామూహిక జీవనగానం పుష్కలంగా కనబడుతుంది. అందుకే బతుకమ్మ పండుగ తెలంగాణ స్త్రీల సామూహిక, శ్రామిక, జానపద ప్రాకృతిక దర్శనం. చారిత్రికంగా బతుకమ్మ పండుగను ప్రదానంగా బహుజన కులాల శ్రామిక స్త్రీలు పెద్ద




యెత్తున జరుపుకుంటారు. శ్రామిక స్త్రీలు తమకున్న సొమ్ములతో, రంగుల రంగుల చీరలతో అలంకరించుకుని దొరల గడీలలో సామూహికంగా బతుకమ్మ ఆడేవారు. కాలక్రమేణా అగ్ర కులా లకు చెందిన స్త్రీలు కూడా బతుకమ్మ పండుగ జరుపుకోవడం కొనసాగించారు. యిప్పుడు తెలంగాణ ప్రాంతమంతా కులాలతో నిమిత్తం లేకుండా బతుకమ్మ పండుగ జరుపుకుంటు న్నారు. అయితే ప్రజల ప్రతి సామూహిక సాంస్కృతిక సంఘటన లకు తాత్విక, రాజకీయ అంశాలు ముడివడి వుంటాయి. ఆ కోణం లోంచి చూసినప్పుడు బతుకమ్మ ఖచ్చితంగా శ్రామిక ప్రజల పండుగ అనే చెప్పుకోవాలి. కాలక్రమేణా బతుకమ్మ తెలంగాణ సమాజానికి చెందిన విభిన్న సమూహాల ప్రజలని ప్రభావితం చేయడం, వారి సంస్కృతిలో మొత్తంగా తెలంగాణ సామూహిక సంస్కృతిలో భాగం కావడం- మొత్తంగా తెలంగాణకే సాంస్కృతిక చిహ్నం కావడం- సమాజ ఉపరితలంలో భాగమైన సంస్కృతి, పునాదిని పెద్ద యెత్తున ప్రభావితం చేయడానికి ఉత్కృష్టమైన ఉదాహరణ!

అద్భుత చారిత్రక నేపథ్యం కలిగి, ఒక సామూహిక సాంస్కృతిక సంఘటనగా, ప్రధానంగా శ్రామిక బహుజన స్త్రీల పండుగ అయినప్పటికీ యివాళ్ల తెలంగాణా పల్లెపల్లెనా ప్రతి ఒక్కరూ సంబరంగా, సగర్వంగా జరుపుకుంటున్న పండుగ బతుకమ్మ! *



మెదక్ జిల్లాలో పుట్టి, హైదరాబాద్‌లో చదివి, కొంతకాలం అక్కడే ఉద్యోగం చేసి, సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్‌గా అమెరికాలో స్థిరపడ్డారు శ్రీ స్వామి వెంకటయోగి. రెండు కవితా సంకలనాలు- కల్లోల కలల మేఘం, సందుక ప్రచురించారు. భార్య విద్య, ఇద్దరు అమ్మాయిలతో ప్రిన్స్‌టన్‌లో నివాసం.

# అందమయిన భాషరా ...

డి.ఎ. ఉషా రాజు

కొందరికి తెలుగు గుణమగు,
కొందరికి సంస్కృతంబు గుణంబగున్, రెండున్
గొందరికిని గుణములగు, నే
నందరి మెప్పింతు గ్రుతుల నయ్యే యెడలన్.

అన్నాడు పోతనామాత్యుడు భాగవతం ప్రారంభంలోనే. ఈ తెలుగూ సంస్కృతమూ అందంగా కలసిన భాషనే మనం తేటతెల్లని తెలుగని మురిసిపోతూ ఉంటాం. తెలుగు సంస్కృతాలు మిళితమయిన పోతన భాగవతాన్ని ఈనాటికీ ఆస్వాదిస్తున్నాం. అదేవిధంగా ఈ రెండు భాషలూ కలబోసిన కీర్తనల్నీ, స్తోత్రాలనీ వినీ, పాడీ ఎంతో ఆనందిస్తాం.

పోతన పద్యాలలోని అందం భాషదా? అది తెలియచెప్పే భావనదా? ఆ కూర్పులోని నాదమాధుర్యానిదా?

బాల రసాల సాల నవపల్లవ కోమల కావ్యకన్యకన్
గూళలకిచ్చి యప్పడుఁపు గూడు భుజించుటకంటె సత్కవుల్
హాలికులైననేమి గహనాంతరసీమలఁ గందమూల కౌ
ద్దాలికులైననేమి నిజ దార సుతోదర పోషణార్థమై.

ఈ పోతన పద్యంలో ఏఏ పదాలు సంస్కృతమో (కాదో) చూద్దాం....

మొదటి పాదం పూర్తిగా సంస్కృతమే కదా. రెండవ పాదంలో గూళలు, పడుపు, కూడు, కంటె అన్న పదాలు అచ్చ తెలుగే అయినా భుజించుట (భోజనం) అన్న పదం సంస్కృత భుజ్ ధాతువు నుంచి వచ్చింది. మూడవ పాదం దాదాపుగా అంతా సంస్కృతమే 'ఏమి' అన్న పదం తప్ప! నాలుగవ పాదం మళ్ళీ అంతా సంస్కృతమే. రెండు భాషలలోని పదాలు కలిసి రసాత్మకమైంది. తెలుగు పదాలు కొన్నే అయినా అవి లేకపోతే ఈ పద్యానికి అర్థం, భావం ఉండవు.

ఇది కావ్య రచన కాబట్టి సంస్కృతమెక్కువగా ఉందను కోవచ్చు, కానీ వాడుక భాషలో సంస్కృత పదాలు కోకొల్లలు. సాధారణంగా తెలుగులో ఉన్న విశేషణాలు, నామవాచకాలలో సంస్కృత పదాలు ఎక్కువ. తెలుగులో క్రియాపదాలు, సర్వనామ పదాలు, సంఖ్యలు సంస్కృతానికి భిన్నంగా ఉంటాయి. అదే వాడుక హిందీలో అయితే సర్వనామపదాలు, క్రియాపదాలు, సంఖ్యలు కొంతలో కొంత సంస్కృతానికి సమీపంగా ఉంటాయి. స్వచ్ఛమైన హిందీలో తప్ప వాడుక హిందీ (హిందుస్థాని)లో బహుశా పర్షియా, అరబ్, ఉర్దూభాషల ప్రభావంతో కలిసిన నామవాచక పదాలు ఎక్కువ కనపడతాయి.



ఉదాహరణకి...

సంస్కృతం- పుస్తకం, ప్రేమ, సమీపం, ఆనందం, సంతోషం
తెలుగు- పుస్తకం, ప్రేమ, సమీపం, ఆనందం, సంతోషం
హిందీ వాడుక భాష- కితాబ్, ఇష్క్, నజ్దీక్, ఖుషీ
సర్వనామ పదాలు, ప్రశ్నార్థక సర్వనామపదాలు, సంఖ్యలు.
సంస్కృతం- అహం, త్వం, సః, సా, తత్
- కహ్/ కా/కిం? (who, what) కథం (how)? కిమర్థం (why)? కుత్ర (where)? కుతహ్ (where from)? కదా (when)? కతి (how many)?
- ఏకం, ద్వే, త్రీణి, చత్వారి, పంచ
హిందీ- హమ్, తుమ్, వహ
- కౌన్? క్యా? కైసా? క్యోం? కహాఁ? కహాఁ సే? కబ్? కిత్నా?
- ఏక్, దో, తీన్, చార్, పాంచ్
తెలుగు- నేను, నీవు, అతడు, ఆమె, అది
- ఎవడు/ఎవతె ? ఏమిటి?; ఎలా? ఎందుకు ఎక్కడ? ఎక్కడనుంచి?

ఎప్పుడు? ఎన్ని?

- ఒకటి, రెండు, మూడు, నాలుగు, ఐదు

సంఖ్యలలో లక్ష, కోటి మాత్రం సంస్కృతం లోంచి వచ్చినవే. మన 'సున్నా' సంస్కృత 'శూన్య' నుంచి వచ్చింది.

**తెలుగు వాడుక భాషలో సంస్కృత పదాలు**

అభిమానం, అవమానం, అనుమానం, అనుగుణం, అదృష్టం, ఆలోచన, ఆక్షేపణ, ఆహారం, ఆదర్శం, ఆక్రమణ, ఆకర్షణ, అన్నం, ముఖం, శరీరం, నీరసం, జ్వరం, ధనం, పుస్తకం, పత్రిక, మధ్య, మాయ, మనసు, మతి, బుద్ధి, దయ, కరుణ, సమయం, కాలం, భార్య, భర్త, మామ, తాత (సంస్కృతంలో తాత అంటే తండ్రి. పితామహుడు అనే అర్థం కూడా ఉంది.), స్నేహం, మిత్రుడు, వృక్షం, మంచం, ఇత్యాది.

అక్షరం, పదం, వాక్యం, కర్త, కర్మ, క్రియ, విభక్తి, సంధి, రచన వంటి వ్యాకరణ- సాహిత్య సంబంధమయిన పదాలు; సంగీతం, గానం, లయ, తాళం, శృతి, ఆలాపన, నాట్యం, నృత్యం వంటి కళా సంబంధమయిన పదాలు సంస్కృతం నుంచే వచ్చాయి.

సంస్కృత పదాలు చాలా కలిసినా ఇతర భారతదేశ భాషల్ని, భాషాపరిచయం, జ్ఞానం లేకపోతే అర్థం చేసుకోలేం. కారణం, సర్వనామాలు, క్రియాపదాలు ఇతర ప్రయోగాలు వేరుగా ఉండటం వల్లే. విడివిడిగా కొన్ని మాటలు అర్థమైనంతమాత్రాన వాక్యం అర్థం కాదు.

ఏ భాషైనా ప్రామాణికమెలా అవుతుందో చెప్పటానికి ఆచార్య గంటిజోగి సోమయాజిగారు ఇలా రాసారు... 'మాండలిక భాషయందు కావ్యములు పుట్టి, సభలు జరిగి, విచారణలు ప్రబలినప్పుడా భాషకు స్థైర్యము కలుగును. ద్రవరూపము పోయి ఘనీభవించును. నోటి మాట ఆ నోటి నుండి మరొక నోటికి పాకి మారుచునే యుండును. లిఖితము మారదు. అట్టి లేఖనం లేనప్పుడు భాష ఝురీ వేగమున మారిపోవును. భాషకు స్థిరత వచ్చాక మాండలిక రూపములు చాలా నశించును. కవులే మాండలికమును గ్రహించిరో అవియే నిలచును. వానినే శిష్టులు వాడుదురు. ఏకరూపత ఏర్పడుచుండును.' (ఆంధ్ర భాషా వికాసము. ఆచార్య గంటిజోగి సోమయాజి, పు 247, 1978). మాండలికమంటే, నియమబద్ధం కాకపూర్వం వివిధ ప్రదేశాలలో (మండలాల్లో) వాడుకలో ఉన్న భాష (dialect). ఒకే భాషలో ప్రాంతీయ భేదాలు చాలా ఉండేవి.

సంస్కృత పదాలు నన్నయాదిగా కవులు 'అచ్చ' తెలుగులో కలిపేసారని విమర్శిస్తున్నాం? ఆంగ్లపదాలు తెలుగులో ఎక్కువ కలుస్తున్నాయని ఈనాడు బాధపడుతున్నాం. మాట్లాడే భాష మారకుండా ఉంటుందా? 'స్వచ్ఛమయిన' భాష అసలు ఏదైనా ఉందా?

మనుష్యులు ఒకరినొకరు అర్థం చేసుకోవటానికి కాల క్రమేణా ఉత్పత్తి అయిన ఒక ఉపకరణం భాష. ఒక్కొక్క మాట లో, ఒక్కొక్క వాక్యంలో అంతర్గతమయిన భావమే దాని అర్థం తెలుపుతోంది. ఆమాట ఏ భాషలోదైనా కావచ్చు. దాన్ని ఎక్కువగా విని, వాడి వుంటే దాని అర్థం, ఉపయోగం మస్తిష్కంలో స్థాపితమైతే మనం మాట్లాడేటప్పుడు అనాలోచితంగా బయటకి వచ్చేస్తుంది (involuntary). రాసే (వ్రాసే)టప్పుడు కొంచమో ఎక్కువో అలోచించి, ఒక్కొక్క పదమూ మస్తిష్కం (మెదడు)లో నుంచి ఇచ్ఛాపూర్వకంగా జ్ఞాపకం చేసుకుని రాస్తాం (voluntary). ప్రతీ మాటా, వాక్యం మెదడులో ఒక మానసిక చిత్రాన్ని (ఇమేజ్) చూపిస్తుంది. కొత్త (క్రొత్త)భాషలో మాటలు నేర్చుకున్నప్పుడు ఇంకొకభాషలోని అదే పదానికి కూడా ఆ చిత్రమే మనోనేత్రానికి కనబడుతుంది. భాష సుపరిచితమై, అర్థమైతేనే; మస్తిష్కంలో వీటన్నికీ పూర్వస్మృతి ఉంటేనే! పాతస్మృతులు లోపలి పొరల్లో వుంటాయి. రోజూ వాడేవి పైపొరల్లో ఉండి వెంటనే బయటికి వస్తాయి. మాట్లాడేటప్పుడు, రాసేటప్పుడు వచ్చిన మాటగాని, కలిగిన అనుభూతి (ఆనందం)గాని కణాల సమూహాలమధ్య జరిగే రసాయన ప్రక్రియే.

ఏ భాషలో అయినా ఆయా క్రియాపదాలతో కలిపితే మరే భాషలోని పదాలనయినా కలిపేసుకోవచ్చు. భాష వ్యక్తీకరణకి ఉప కరణం (communication tool). ఇప్పుడు అదే జరుగుతోంది మనకు నచ్చినా నచ్చకపోయినా!

'క్షేమంగా వెళ్లి లాభంగా రండి,' వంటి విషెస్ చాలా మంచి అనుభూతిని కలిగిస్తాయి. 'క్షేమం, లాభం' సంస్కృత పదాలే అయినా, 'గా, వెళ్లి- రండి' లేకపోతే ఈ వాక్యానికి అందమూ, అర్థమూ ఉండదు. ఈరోజుల్లో 'safeగా వెళ్ళిరండి' అనటం మామూలే. ఏళ్ల తరబడి అలవాటు వల్ల మన mindలో క్షేమం/safe అన్న భావన సమానమే. అలాగే పరీక్షలో pass or fail అయ్యాం అంటాం కానీ, ఉత్తీర్ణులయ్యాం అనం. భాగ్యనగరంలో అయితే ఈ మూడిట్లో ఏదైనా వినపడవచ్చు... 'జర సోచా యించు భాయ్! కొంచం ఆలోచించన్నా! కొంచం థింక్ చెయ్యి బ్రదర్!'

*భాష అన్నది ప్రవహించే నది*
*సెలయేళ్ళనెన్నో కలుపుకుంటూ రూపురీతీ మార్చుకుంటూ*
*వయ్యారంగా పరుగులిడుతుందది*
*సంజ్ఞలూ శబ్దాలే ఆదిమానవుడి భాష*
*ఉందికదా ఆటవికులక్కూడా ఏదో భాష*
*మాండలికం ప్రజల పలుతీరుల భాష*
*నియమబద్ధమయిందేమో ప్రామాణిక భాష*
*గ్రామ్యమయినా గ్రాంధికమయినా*
*తూర్పు అయినా పడమరయినా*
*యాస అయినా ప్రాస అయినా*
*తేనె తియ్యనిది మన తెలుగుభాష*

ఒక పాటలో కాని, కవితలోగాని అందమన్నది చిర పరిచయం (familiarity) వల్ల సంభవించే అనుభూతి. అందుకే మనభాషలో కాని మనకి బాగా తెలిసిన మరో భాషలో కాని అయితేనే ఆ సాహిత్యాన్ని అస్వాదించగలం. పాలు నీరులా కలిసిపోయిన తెలుగు సంస్కృతాల మేలుకలయికే మన అందమయిన, ఆస్వాదిస్తున్న తెలుగుభాష. హంస క్షీరనీరములు విడదీస్తుందనే లోకోక్తిని వినీ, చెప్పీ ఆనందిస్తూ ఉంటాం. అంటే క్షీరం గొప్పదనీ, నీరు ఏదో తక్కువైనదనీ ఊహించుకుంటాం. కానీ నీరు లేకుండా క్షీరం ఉంటుందా (పాల పొడి అవుతుందిగాని)? అసలు ప్రకృతిలో తినదగిన, త్రాగదగిన ఏ పదార్థంలో అయినా, లేక ఏ జీవి శరీరంలో అయినా నీరు లేకుండా ఉంటుందా? అలాగే సంస్కృతం లేకుండా అందమయిన తెలుగులేదు. *



*ఉష డెబ్భయ్యవ దశాబ్దం నుంచి మిషిగన్లో, డెట్రాయిట్ మెట్రోపాలిటన్ ప్రదేశంలో ఉంటున్నారు. వృత్తి వైద్యం. మూడు భాషలు (ఎంతో కొంత హిందీ కూడా) వివిధప్రాంతాల యాసలు తెలిసిననందువల్ల, ఈమధ్య సంస్కృతం నేర్చుకుంటున్నందు వల్ల, భాష పోకడలగురించిన ఈ ఆలోచనలని పంచుకుంటున్నారు.*

# ఏడనున్నావురో నాయుడుబావా

సుధ రాజ

**నాలుగురాళ్లు సంపాదిద్దామని రంగమెల్లాడు నాయుడుబావ. ఇక్కడ పల్లెలో ఎంకిపాట్లు ఎన్నో. అత్తమామల్ని సూడాల పిల్లపాపల్ని సాకాల. ఇల్లువాకిలి, గొడ్డుగోద, పొలంపుట్ర ఎన్నని చూసుకుంటది. నాయుడుబావని తిరిగి రమ్మని ఎలా పిలిచిందో ఇక వినండి.**

ఏడనున్నావురో నాయుడుబావా
ఏగమోచ్చేయరో నాయుడుబావా
ఈ ఎంకి మాటినుకోరా నాయుడుబావా

కుక్కపిల్లా కూడు ముట్టనంటాంది
చిట్టితల్లీ అయ్యా ఏడనంటాంది
ఎంకి గుండే గుబులు గుంటాంది

ఏ గమొచ్చేయరో నాయుడుబావా
ఈ ఎంకిమాటినుకొరా నాయుడుబావా

కన్నతల్లీ కళ్లన్నీ కాయలే కాచాయి
నేలతల్లీ ఒళ్లంతా బీటలే వేశాయి
జాజిమల్లీ పూలన్నీ జాలిగారాలాయి ॥ఏ॥

గొడ్డుగోదా ఊసురంటోంది
ఏరు కూడా భోరుమంటోంది
ఊరువాడా ఎదురుచూస్తోంది ॥ఏ॥

కాసులైనా గాని కష్టమైనా గాని
పంచుకుంటే గదర మంచిగుండేది
చెంత నుంటే గదరా మరి పంచుకుండేది ॥ఏ॥

పసిడిగిన్నైన గాని మట్టిపిడతైనగాని
పట్టెడన్నమే గదరా పొట్ట చేరేది
ఆపైన మనకింత పట్టునిచ్చేది ॥ఏ॥

పట్టు పరుపైన గాని గట్టినేలైన గాని
నిదుర పడితే గదర కలలు వచ్చేది
మది కూసింత కలత తీరేది ॥ఏ॥

పెద్ద మేడైన గాని సుట్టుగుడిసైన గాని
కాయమంతే గదరా నువ్వాదగి ఉండేది
పొయ్యేటేళే గదర నువ్వా హద్దు దాటేది ।ఏ॥

ఊసులెన్నో చెప్పుకుందాం
ఆశలన్నీ పంచుకుందాం
కాయకష్టం చేసుకుందాం
కాయకష్టం చేసుకుందాం
కలో గంజో కలిసీ తిందాం
పల్లె కొచ్చేయరో నాయుడుబావా
లొల్లి ఇంకా పెట్టనురా నాయుడుబావా

ఏడనున్నావురో నాయుడుబావా
ఏగమొచ్చేయరో నాయుడుబావా
ఈ ఎంకి మాటినుకోరా నాయుడుబావా



**సుధ చిరకాలంగా డెట్రాయిట్ ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. వృత్తి రీత్యా వైద్యులు. సాహిత్య, సంగీత, ఆధ్యాత్మిక కార్యక్రమాలంటే వీరికి ఆసక్తి.**

# ఇంకా తెలవారుతుందేం

## శ్రీనివాస గోగినేని

భూనభోంతరాళాలు బద్ధలైన తరువాతా
వంటిలోని బలమంతా ఒక్కసారిగా మాయమైన తరువాతా
ఇహపర సుఖాలపై విరక్తి కలగిన తరువాతా
ఈ పక్షులు ఇంకా కిలకిలా రాగాలు పలుకుతున్నాయేం

సాధించిన విజయాలన్నీ చిన్నబోయిన తరువాతా
పట్టపగలే మదినిండా చిమ్మచీకటి ముసిరిన తరువాతా
చుట్టూ అందరు ఉన్నా ఒంటరి అనిపించిన తరువాతా
ఈ చీకటి విడిపోతుందేం

రద్దీలోని రణగొణ ధ్వనిలోను నిశ్శబ్దం ఆవహించిన తరువాతా
జవ జవలాడే యవ్వనంలోను నిస్సత్తువ తరువాతా
నిర్దేశించుకున్న గమ్యాలన్నీ మాయమైన తరువాతా
ఈ సూర్యుడు ఇంకా తూర్పున ఉదయిస్తున్నాడేం

ప్రతి పనిలో వెంట ఉన్న స్నేహితుడు
తప్పు చేసినా సహించిన సహనుడు
భవిష్యత్ మార్గనిర్దేశం చేసిన దేశికుడు
నా కోసం సుఖాలెన్నో వదలిన త్యాగధనుడు
ప్రతి పనిలో స్ఫూర్తి రగిలించిన బ్రహ్మాండ నాయకుడు
ఈ జీవితం ప్రసాదించిన దేవుడు
నా పితరుడు మరణించిన తరువాతా

ఈ పక్షులు ఇంకా కిలకిలా రాగాలు పలుకుతున్నాయేం
ఈ చీకటి విడిపోతుందేం
ఈ సూర్యుడు ఇంకా తూర్పున ఉదయిస్తున్నాడేం
ఇంకా తెలవారుతుందేం





శ్రీనివాస గోగినేని ఈ తానా మహాసభల కార్యదర్శి మరియు తానా ఫౌండేషన్ కార్యదర్శి కూడా. కృష్ణాజిల్లాలో పుట్టిన వీరు *1999*లో కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ కన్సల్టెంట్‌గా అమెరికా వచ్చారు. చిన్న చిన్న కథలు, కథానికలు, కవితలు రాస్తుంటారు. ప్రస్తుతం మిచిగాన్ వెస్ట్ బ్లూమ్ ఫీల్డ్ యందు భార్య పద్మశ్రీ, కుమార్తె సంధ్యశ్రీ, కుమారుడు శ్రీకాంత్‌తో నివసిస్తున్నారు.

# Adi Yogi - A Doorway to the Willing

*Leela Korrapati*

Why a consecrated structure shaping up in Tennessee has a Global Significance.

To find out, we need to go back a few millennia to the Himalayas. In these remote snowy peaks the first yogi dispensed his knowledge of this sacred science of yoga. Because he was the very first, he was known as the "Adi Yogi" in Sanskrit and was called "Shiva."

About 300 million people throughout the world are practitioners. Morethan 40 million Americans avidly practice it. But where did yoga come from?

Sadhguru Vasudev, a profound mystic of our times, explains, "The word 'Shiva' literally means 'that which is not' - boundless nothingness. 'That which is' is creation. In the night sky, the first thing most people notice are innumerable stars. But these are just spots of creation; the biggest presence is actually a vast emptiness, which is referred to as 'Shiva.'"

The splendor of Shiva, this boundless nothingness, which is nevertheless the very basis of everything that exists, cannot be overstated. Thanks to astrophysics, today we know that creation exploded from nothing and will eventually dissolve back into nothing. Anyone who grasped the immeasurable source of creation and experienced "that which is not" was called "Shiva," in the yogic culture. In this context, the originator of yoga, the Adi Yogi, is also known as Shiva.

This resplendent Adi Yogi has been beautifully described in yogic lore. A being of glorious beauty and enormous intensity emerged on this planet forty thousand years long ago. His power and capabilities were of a kind unknown to humanity. His exuberance was boundless. When he danced, the earth shook. When he was still, he sat lost in meditation for millennia, cradled in the lap of the Himalayas. There, he would slip from states of utter stillness into states of rapturous dance, and then back again to stillness, awash in his own tears of ecstasy.



People beheld this spectacle, mystified. What wondrous thing was creating such ecstasy? Certainly no earthly pursuit could be the source of such delight. After seeing Adi Yogi's ecstasy, even the pleasurable promises of paradise seemed trivial. "We are missing out!" they lamented. In their hearts arose a desire to taste this mysterious elixir. Many sought him out and implored him to teach them all he knew, but Adi Yogi was unmoved with their weak propositions.

Eventually, Shiva handpicked seven intrepid seekers, the doughtiest of all who approached him, to impart this sacred science. Taking them as disciples, he assumed the role of the Adi Guru (the first Guru) and taught them the very nature and mechanics of the human cosmos, and illustrated seven different ways to approach this great knowledge.

These teachings were not religious instructions or philosophies - they predated all religion. Rather, they were a methodology to take humans to their ultimate potential. So sophisticated were the instructions that no aspect of the

human system was excluded as a means to elevate human consciousness. These seven disciples became the means through which this powerful science reached every part of the globe, and eventually became the basis for every spiritual process on the planet.

Sadly, most of those who teach or learn in today's yoga studios are unaware of Adi Yogi- himself. "Today what is being practiced in yoga studios has rendered yoga into a sophisticated exercise form and completely innocent of the immense possibilities embedded in the yogic science," Sadhguru observes. It is to Shiva, the Adi Yogi and Adi Guru, that the world owes its knowledge of Self--the sacred science of yoga.

Those seven luminous beings who Shiva personally chose to impart his knowledge came to be known as the sapta rishis - the 'seven sages.' Agastya Muni, one of the sapta rishis, was sent to southern India to carry Adi Yogi's message.

One of the methods that Agastya Muni used to facilitate the transcendence of human nature to the peak of consciousness was the "consecration" of the physical territories he encountered. He consecrated every human habitation south of the Deccan Plateau in some form and made sure that a live spiritual process was on. He had said that when the world truly goes off the track- when knowledge becomes poison - his work would rise and act.

The Adi Yogi Project at the Isha Institute of Inner-sciences (III) in McMinnville, Tennessee, is a modern-day undertaking that seeks to rekindle, perpetuate, and strengthen the foundations laid down by Agastya Muni by spreading to the West the significance of consecrated spaces. Spread over 1200 acres in the Cumberland Plateau of Tennessee, the III is the U.S. center of the Isha Foundation based in India. A spiritual center free from dogma and religious philosophies, III is dedicated to those seeking ultimate wellbeing through the sacred science of yoga.

Its founder Sadhguru Vasudev is a yogi, mystic, visionary, author, poet, speaker, and more. His peerless insights into the human condition have helped him create a global foundation that has touched over 7 million people through his signature program called "Inner Engineering: Technologies for Wellbeing." With a seemingly inexhaustible supply of energy, Sadhguru has worked relentlessly for human wellbeing in the realms of inner spirituality, humanitarian work, the environment, primary education, and global leadership forums, to name a few. Sadhguru oversees one of the largest volunteer forces in the world, numbering over two million volunteers from all walks of life.

Elaborating on the significance of consecration, Sadhguru explains, "Consecration is a live process. If you transform mud into food, we call this agriculture. If you make food into flesh and bone, we call this digestion. If you make flesh into mud, we call this cremation. Similarly, if you can make this flesh, or even a stone or an empty space into a divine possibility, that is called consecration." He continues, "Today, modern science is telling you that everything is the same energy manifesting in a million different ways. What you call divine, what you call a stone, what you call a man, a woman or a demon, are all the same energy functioning in different ways. For example, the same electricity becomes light, sound, heat and so many other things depending upon the technology used. Similarly, if you have the necessary technology, you can make the physical space around you into a divine exuberance, you can take a piece of rock and make it into a god or a goddess-this is the phenomenon of consecration."

In ancient India, there used to be a temple at every corner. A temple was not a place of prayer, nor did it have anything to do with God. It existed to enclose a part of the world within a cocoon of grace so that every human being within its aura had the good fortune of living in that grace. Access to consecrated spaces gave people balance and strength. It provided a space to disengage from the vacillations of the material world and to ground oneself in deeper dimensions. Consecrated spaces laid the foundation for spiritual growth and both inner and material wellbeing, and they enabled people to live peacefully, joyfully and harmoniously.

Over time the understanding of the value of consecrated spaces eroded as societies slowly forgot their purpose.

The underlying spiritual science of temple construction was gradually lost to dogma and custom. Temples became places simply to pray and worship. Now, due to the ravages of time, the loss and distortion of knowledge, and destruction and invasion, consecrated spaces have all but disappeared.

In order to re-establish the path to inner balance and growth, to raise human consciousness on a mass scale, and to promote widespread spiritual wellbeing, Sadhguru has resolved to create as many consecrated spaces as he can. It is Sadhguru's vision that a grid of such energy centers across the world, beginning in North America, Europe and India, would provide the possibility of inner wellbeing to a large number of people, allowing them to benefit from the subtle but powerful influence.

The proposed Adi Yogi Project at the Isha Institute in McMinnville, Tennessee is the beginning of this auspicious undertaking. "If America begins to meditate, you will see, the whole world will long for it," says Sadhguru.

The two-level structure will be built to last for thousands of years. A central feature will be the 21-foot metal statue of Adi Yogi and a powerful copper lingam with which one will be able to make physical contact. The design and layout will be in alignment with cosmic properties. The building will be 111 feet x 111 feet for each of the two levels, 24,642 square feet in total.

The Adi Yogi Project in McMinnville marks the bridging of the gap between antiquity and modernity and between the East and West. But more importantly, it is a doorway to return to grace for those who are willing.

*From Isha Foundation Publications*

# జడా శతకము

## జెజ్జాల కృష్ణమోహనరావు

పరిచయము- ఆరునెలలకు ముందు ఫేస్‌బుక్‌లో జడ పైన ఒక శతకము కూర్చుటకోసం శ్రీ బ్నింగారు కవులను పద్యములను వ్రాయమని ఆహ్వానించారు. కాని అందులో ఎక్కువ పాలు హాస్యమునకే చోటు. హాస్యము కాని, గంభీరమైన వస్తువులకు అందులో చోటు తక్కువ. నేను పురాణ కథా వస్తువుల పైన, దైనందిన జీవితములోని వస్తువులపైన సుమారు 240 పద్యములను అల్లినాను. వాటిలో వంద పద్యములను ఇక్కడ అందిస్తున్నాను.

శ్రీరస్తు తమ్మి కనులకు
శ్రీరస్తు కనువినికి జడకు - శ్రీల చెవులకున్
శ్రీరస్తు నెల మొగమునకు
శ్రీరస్తు మృగపతి కటికి - శ్రీరస్తు సదా -1

మృదు కరముల వీణియతో
నుదజాక్షుని రాణి తేఁటి - యురువిడి జడతో
త్రిదశాదుల పూజలఁ గొను
సదమల కల్యాణి దేవి - సన్నుతు లివిగో -2

నల్లని పామో యనఁగా
నల్లని తుమ్మెదలా యనఁగ - నల్లని జడతోఁ
దెల్లని యుడుపులఁ దాల్చిన
తల్లీ మాకొసఁగు విద్య - తప్పక దయతో -3

నెమలియు పామనుకొని దా
నుమ యల్లిన జడను లాఁగ - నుత్సాహించన్
గొమరుని, వాహనముం గని
ప్రముదిత యగు స్కంధమాత - రక్షించు సదా -4

భూమమ్మే కురులవఁగా
కోమలమగు జడలతోడి - కుధరజ గౌరీ
వ్యోమమ్మే కేశమ్మవ
శ్యామలమగు జడలతోడి - హర కావు మమున్ -5

### రామాయణము

ఊపుచుఁ దన జిన్న జడను
జూపెను దల్లులకు నగుచు - సుందరరాముం-
డా పసి మోమయ్యెను దా-
రాపథమున శ్యామలాంశ - రజనీకరమై -6

(ఆకాశములో చల్లని కిరణములతో ప్రకాశించే చంద్రునిలా శ్రీరాముని ముఖము ఉన్నదని ఇక్కడ భావము)

జడనల్లని నిడుద కురులు,
పొడిమట్టి విభూతి, కట్టి - మురికిగ బట్టల్,
పడకయు నేలగ, మేల్కొని
పడఁతియు విభుఁ దల్చి బాధఁ- బడు నా లంకన్ -7

జడ నొకటి గలది, రెండగు
జడలు గలది దయయు లేక - క్షాంతితనూజన్
గడు వేధించిరి, మూఁడగు
జడలు గలది సీత మిగుల - సంరక్షించెన్ -8

జడలన్ దాలిచి వనిలోఁ
గుడుచుచు నున్నారు కాయ-గూరల వారి-
క్కడి కెట్టుల వత్తురు
పడతీ రక్షింతు రెట్లు - భళి హాస్యమ్మే -9

మఱచేవా నీదు జడను
దరచుగ నే వేయుచుంటిఁ - దరువులఁ గల యా
విరులన్ దురుముచు నిపు డె-
వ్వరు నీజడ వేయుచుంద్రు - వసుమతిపుత్రీ -10

చూలాలి చూల నల్లెను
బూలన్ జడ నొకటిఁ బ్రీతి - భూపతి రేయిన్
చాలన్ మాటల నాడెను
వేళాయెను వీడఁ బాన్పు - విధియా పనుపా? -11

### శివుడు-పార్వతి

ఉడురాయఁడు నవ్వెను తలఁ,
గడగన్నులనుండి గంగ - కలకల మనియెన్
జడదారినిఁ బెండ్లాడెను
గడు ముదమున గిరిజ సిగ్గు - కళికలు విచ్చన్ -12

వడిగా పెనుసడు లెల్లెడఁ
గడు గొప్పగ మ్రోఁగుచుండఁ - గైలాసములో
పొడవగు నెరియల జడతో
మృడుఁ డా సతితోడ లయల-నృత్యము నాడెన్ -13

అంబరమున జడ నల్లును
సంబరమున శంభు వెపుడు - సంతోషముతో
నంబయు జడ నల్లును బు-
ష్పాంబరముల శంభు వెపుడు - సంతోషించన్ -14

ఒక పామునుఁ బెన వేసె, మ-
ఱొక పా మా పాము జడయు - నొప్పగ నుండెన్
స్వకరమ్మున గల నగ నా
యకలంకుఁడు కానకుండ - నచ్చెరువొందెన్ -15

(అర్ధనారీశ్వర రూపములో శివుని చేతిలోని సర్ప భూషణము పార్వతీదేవి పాములాటి జడను చుట్టుకొన్నది. శివునికి తన చేతిలోని పాము నగ ఎక్కడికి వెళ్లినదని ఆశ్చర్యపోయాడు)

శ్రీకాంతుని పాదములన్
శ్రీకంఠుని శిరమునుండి - శీతనగమునన్
బ్రాకటముగ నంతమవని
శీకరముల జడగఁ బుట్టి - శ్రీగంగ యయెన్ -16

## సుందర దృశ్యములు

జడ సొంపుల జడ వంపుల
జడగంటలను జాల - చక్కఁగ గీయున్
జడతో నడయాడు తెలుఁగు
పడుచుకు సోయగము నిచ్చు - బాపిఁక లేఁడే -17

కన్నయకు పింఛ మందము
పన్నగధరు కందము జడ - వలివెలుఁగేగా
కన్నియకు జడయె యందము
కన్నుల కందమ్ము కొయ్య - కాటుక గీటుల్ -18

జడ కృష్ణుని శిరమందున
జడ శంభుని శిరమునందు - జాహ్నవికిరవై
జడ తాపసి శిరమందున
జడ నేనున్ దాల్చెద నిఁక - జడధినివాసా -19

జడలేని దైవ మెక్కడ
పుడమిన్ గానంగ నౌనె - పూజించంగా
జడయే శుభసూచక మా
జడఁ జూడుం డద్దమందుఁ - జనఁగా గుడికిన్ -20

అందురుగా నాగమ్మని
సుందరి పొడవైన జడను - జూచిన రసికుల్
తొందరలో నీ చవితిన్
జిందించెదరేమొ యెఱుగ - క్షీరము జడపై -21

నాగముబోల్ జడగల చెలి
నాగా యని బిలిచెఁ బ్రియుని - నాగవనములో
నాగమ్ములు గుమిగూడఁగ
నాగానందమ్ము నిజము - నాగుల కెల్లన్ -22

మణి నేను జూడలే దా
ఫణితలపై నొక్క మారు - వసుధాతలిపై
మణి నిండిన జడబిళ్లను
ఫణివలె నర్తించు జడను - భళిరా గంటిన్ -23

పున్నెముఁ జేసిన బువ్వులు
గన్నియ జడలోనఁ జేరెఁ - గమనీయముగా
పున్నెముఁ జేయని బువ్వులు
వెన్నుని జరణములఁ జేరి - వేడెను దపనన్ -24

పుడమిని జాగ్రత్తగ నా
జడ ముపయోగించకున్న - జడ ముండదు, వా-
ల్జడ లుండవు, ముడు లుండవు,
నిడివిగ కేశములు సున్న - నెలఁతలు బోడుల్ -25

జడ లవి రెండమ్మాయికి
దడ యొక్కటె డెందమందుఁ - దద్ధిమికిటతా
కడకయె సున్నగఁ దలఁపులు
గుడి వాకిట బిచ్చ మెత్తఁ - గూర్చుంటిఁ గదా -26

(ఇందులో వరుసగా 2,1,0 అంకెలున్నవి)

పాయలు మూడౌను జడకుఁ
బాయక కోమలులు వేయు - పలు వేనలులన్
పాయలు డీఎన్ఏలో
వేయును జడగాను బ్రకృతి - వింతగ రెండై -27

నల్లని జడ కొన్నాళ్లకు
తెల్లఁగనగు, నగుట తగదు - దినములు గడువన్
మెల్లఁగ సాయంఛాయగ
నెల్లరికిని ముదిమి వచ్చు - నిది ప్రకృతిగదా! -28

జడలోఁ బూలుండినచోఁ
గడు తీపిగ మాటలాడి - కలియఁగ నగుగా
జడలోఁ బూలుండనిచోఁ
విడిగానుండి పడవలెను - విరహపు వెతలన్ -29

(ప్రేమికుల సంకేతము ఇది. ఆమె జడలో పూలు పెట్టు కొంటే line clear, లేకపోతే దూరము నుండి చూసుకోవాల్సిందే!)

ఉడుపథమున నుడురాయఁడు
విడివిడిగా మెఱయుచుండు - వెలుఁగుల తారల్
జడలో మల్లెల గంధ
మ్మొడిలో నీవుండ మోహ-నోత్సవమేగా -30

ఆనాఁడు వేయి నౌకలు
యాన మ్మొనరించె హెలెన - యందమ్మునకై
యీనాఁ డెన్నియొ నౌకలు
యాన మ్మొనరించు నాతి - యందపు జడకై -31

తాళమ్ములతో డప్పుల
కోలాటపు గీతి పాడి - కూడిరి, త్రాళ్లన్
కేలన్ బట్టిరి, తిరుగుచు
లీలన్ జడ నల్లి విప్పి, - రెల్లరు మెచ్చన్ -32
(ఇది తెలంగాణాలో జడకొప్పుల ఆటను చిత్రించును)

సీమలు పిలిచెను నన్నా
వ్యోమము పిలిచేను వేగ - నుత్సాహముతో
నేమేమో చేయవలయు
నీమహిపై జడకు వేళ - యిప్పుడు లేదే -33

అంబరమును సంధ్య వదలె
సంబరమునఁ దార లలరె - శశి స్పర్శించన్
చుంబితమగు జడలో విరి
రెంబయు నవ్వంగ పక్షి - ఱెక్కలు విప్పెన్ -34

తట్టెడు రాళ్లనుఁ దలపైఁ
బెట్టి నడచుచుండు పాప - విరులన్ జడతో
నెట్టుల నుండెదనో యని
పట్టపగలు కలలఁ గాంచెఁ - బాపమ్మయ్యో -35

## పెళ్లికూతురు

అల్లండి జడను వేగము
మల్లియలన్ జంపకముల - మనములు గడు రం-
జిల్లఁగఁ జల్లఁగ నేఁడీ
యల్లరి పిల్లయ్యె వధువు - హరుసము నిండన్ -36

మరువము దవనము కురువక
మరుదగు పారిజాత సుమము - లన్నిటితోడన్
దరుణియు మల్లెల జాజుల
సరములుగా జేసి వధువు - జడలోఁ దురిమెన్ -37

అల్లీబిల్లీ పిల్లా
యల్లెద మొక జడను నీకు - నందముగాఁ బల్
మల్లెల సంపెఁగలన్ నీ
యుల్లము పొంగంగ బావ - నుడికించంగన్ -38

మల్లెలతో మరువముతో
నల్లుదమా జడను చక్క-నమ్మకు నందం
బుల్లసిలంగా రేతిరి
పెళ్లికొడుకు మురిసి తరిసి - ప్రేమించవలెన్! -39

మళ్లీ జడలోఁ బువ్వులు
మళ్లీ మదిలోన నవ్వు - మళ్లీ గీతుల్
మళ్లీ నుదుటను కుంకుమ
మళ్లీ మధుమాస మయెను - మనికియు నీతో -40

చల్లం డక్షింతలఁ దలఁ
జల్లఁగ వీరుండవలెను - సంతోషముతో
నెల్లరి హృదయమ్ములు సొం-
పిల్లఁగ జడ నూపుచుండు - పిల్లలఁ గనుచున్ -41

వారిజనేత్రులయందున్
వారి వివాహమ్ములందు - వాక్కు లసత్యం-
బారయ నుడువఁగ సరి యీ
వారిజ నేత్రకును జడయు - భళి సవరమ్మే -42

## విష్ణువు

జడలోఁ మెడలోఁ బూవులఁ
గడు ముదమున గ్రుచ్చి మాలఁ - గమలాక్షునికిన్
మెడలో వేసెను గోదయు
కడు ముదమున దానిఁ దాల్చెఁ-గమలాక్షుండున్-43

మోహినిఁ గనఁగా మోదపు
సాహినమే పరుగు లెత్తె - సాగరసీమన్
దేహీ యని సుధ నడుగక
వాహినిబోల్ జడను గనుచు - వారలరేరే! -44

జడదారియు నొకనాఁ డా
జడమును ద్రావంగ నయ్యె - జడగల వధువై
జడదారిని పెండ్లాడెను
విడిగా బిడ్డలను గనెను - విధి మాయ యిదే -45
(ఆ బిడ్డలే ప్రభవాది సంవత్సరములు, ఆ జడదారియే నారద మునీంద్రుడు, ఇదియే నారద-నారది కథ)

మీసముతో మిసిమి నలరు
యా సరసిజనేత్రు మనము - హర్షమ్మున కా-
వాస మ్మయ్యెను జూడఁగ
శ్రీసతి రమణీయమైన - జెలువంపు జడన్ -46
(చెన్నై తిరువల్లిక్కేణి పార్థసారథిస్వామి గుడిలో మూల విగ్రహమునకు మీసములు ఒక ప్రత్యేకత)

నిను జూడ వచ్చు వేళన్,
గనుగవ జడపైన నుంచి - కవుగిలు వేళన్,
నిను బల్కరించు వేళన్,
వినిపించుమ తల్లి మొరలఁ- బ్రియముగఁ బతికిన్- 47

## అమ్మ

"అమ్మా నాకొక జడ వే-
యమ్మా" యంచడిగెఁ బాప, - యంగుళముల కే-
శమ్మును దువ్విన తల్లియు
నెమ్మదిగా చిన్ని జడను - నేర్పున నల్లెన్ -48

అమ్మమ్మయు వేసెను జడ
నమ్మకు, నమ్మయును వేసె - నందముగా నా,
కమ్మాయికి నే వేసితి -
నమ్మలు జడ లల్లుచుండి - రానందముగా! -49

జడ వేసెను మా యమ్మయు,
జడ వేసెను నాదు భర్త - సరసము నిండన్,
తడబడు చేతులతోఁ దా
జడ వేయఁగ దొడఁగెఁ బాప - సంతోషముగా -50

జడ వేయును, గుచ్చులతో
ముడి వేయును, బూల నుంచు - మోమునఁ దిలకం
బిడుఁ, గన్నులకున్ గాటుక
నిడు, నాడిఁ గూర్చుండ బెట్టి -యిడు గోర్ముద్దల్ -51

అమ్మా నా జడ చూ-
డమ్మా నేనెందు వెళ్ల - నదియును వచ్చున్
అమ్మా పరిగెత్తఁగ వే-
గమ్ముగఁ బరిగెత్తి జడయు - గంతులు వేయున్ -52

నేనొక గుఱ్ఱ మ్మెతిని
దానెక్కెను వీపుపైన - తకతక యంచున్
వానికి నా జడ కళ్లెము
నే నడచితి నాల్గు కాళ్ల - నేలన్ లీలన్ -53

## జీవితము

నాఁడా దుశ్శాసనుఁ గని
చేడియ ద్రౌపదియు కురులు - చెదరఁగ విప్పెన్
నేఁడో దుశ్శాసనులే
వీడక వెంటాడుచుండ - వేయను జడ నేన్ -54

నీలమ్మగు నీ జడతో
లాలించే వెపుడు నన్ను - రజనిన్, మఱి యా
నీలాలను దేవుఁడు నను
పాలించుట కిచ్చినావు - భార్యవు నీవే -55

నా యందము, నా చందము
నా యానందమ్ము నిజము - నా జడయేగా
మాయమ్మయె నా యా జడ
గాయమ్మయె మనసు నాకు - కాన్సర్ కీమో! -56

"జడయే నీకంద"మ్మని
జడలో విరి తురిమి చాల - సంతసమందున్
జడ మెచ్చిన వాఁడెక్కడ
జడ నిఁక నల్లుటయు నేల - జడగా నుంటిన్ -57

"పామే నీ జడ" యన, నా
"పామే యొకనాఁడు కఱచె - వారిని నకటా
నే మడి పంచెను గట్టితి
నేమందును"యనుచు బామ్మ-యేడువ దొడఁగెన్ -58

కడగండ్లే జీవితమున
ముడివేసిన నెత్తిపైన - మోపుంచుచు లే-
వడి బాపఁగ తిరుగాడఁగ
జడలల్లుచు విరుల నుంచ- సమయము గలదే? -59

గంగయు నొక తిరియగు, పర-
గంగా నొక తిరియు యమున - గబగబ నడచున్
శృంగారి కా సరస్వతి
సంగమ మది తెలియకుండ - చను లోలోనన్ -60

(జడలో మూడు తిరులు లేక నెఱియలు ఉన్నా, జడ అల్లిక వల్ల మనకు రెండున్నట్లే కనబడుతాయి. ఈ త్రివేణి సంగమము లో ఇది ఒక అంతర్వాహిని అనే ఊహ యిది.)

పొట్టివి గొప్పవి కావా
పొట్టి వినాయకుని మనము - మ్రొక్కుట లేదా
పొట్టియె వామనుఁడౌఁగా
పుట్టెడు యందమ్ము గలదు - పొట్టి జడలకున్ -61

ఆటాడదు, మాటాడదు,
నీటుగ జడ వేసి బూల - నింపదు, కనులన్
గాటుక నిడకన్, వదినయు
మాటికి ద్వారమును జూచు - మా యన్నకునై -62

ముడి వేయును, ముడిఁ దీయును
గడియారముఁ జూచు నతివ - క్షణము వదలకన్
జడ త్రిప్పును, సడి సేయును
నిడుమోమున శ్వాస వదలు - నేస్తము రాఁడే -63

ఒకవైపునఁ బున్నమి మొగ
మొకవై పమవస యనంగ - నొప్పెడు నలుపున్,
చికురజటాహియు ముఖతా-
రకాపతిన్ దినఁగఁ బూనె - గ్రహణమె దినమున్ -64

తలనిండ పూలదండలు
తెలుఁగింటి వెలంది జడలు - తీయని స్మృతులౌ
యెలనాగల తలనాగము
లలరించును హృదయజడధి -నరుసపు సుధలన్ -65

పలుకే బంగారమయెను
జెలియకు సిగ్గెక్కువయెను - శిరము గదల్చున్
జలజమ్ముల చరణమ్ముల
నిల వ్రాయును జడయుఁ గదలు-నిటునటు సొంపై -66

పేరంటములకు వెళ్ళిన
వారందఱితోడ మెలఁగి - వారుండంగా
వారిజ నయనలు స్థానము
వారి జడను గాంచి యాఁడు-వారనుకొనిరో? -67

## శ్రీకృష్ణుడు

అమ్మా వేడెదఁ బిలువకు
మమ్మా గుమ్మఁడిని వాఁడు - హరియించును నన్
నమ్ముము తరుణుల జడల క-
రమ్ముల హరి లాగ ననెను - ప్రజనికతోడన్ -68

ఉంగరములవలె కేశము
లంగడు చెలువమ్ము మీఱ - లలితముగా నా
యంగన జడ యల్లంగను
రంగడు వంశమ్ము నూది - రాగము నింపెన్ -69

అల్లిన యా జడ యూఁగఁగ
నుల్లమ్ములు భయముతోడ - నురుకుచునుండన్
నల్లని ఫణి పడగలపై
నల్లన తాండవము నాడె - నా నందనుఁడున్ -70

హరి మధ్య నిలిచి మురళీ
స్వరముల మ్రోయించుచుండెఁ - జల్లని రేయిన్
హరి చుట్టు జడల నూపుచుఁ
దరుణులు కోలాటమాడి - తనిసిరి నగుచున్ -71

హరి నారులు నిఱువైపుల,
హరి జడలన్ గరములందు - హర్షము నునిచెన్
హరులిద్దఱు నారి నాడుమ
తరుణి జడన్ గైకొనంగఁ - దమకము హెచ్చెన్ -72

విరులెందుకు, జడ లెందుకు
హరి కనులకుఁ గానరాఁడు - హరమయె నాశల్
విరు లుంచెద, జడ నల్లెద
హరి కనులకుఁ గానబడఁగ - హరుసముతోడన్ -73

కలఁ గంటిన్ వనమాలిని
దలపై శిఖిపింఛ మొండు - ధరియించె జడన్
హళది దుకూలమ్ముఁ దొడిఁగి
వలపుల మణికరముతోడఁ - బరిరంభించెన్ -74

## మహాభారతము

తపమును జేయు మునీంద్రుఁడు
కపటముగా నింద్రుఁ డనుప - గణికనుఁ గాంచెన్
జపల జడన్ జూడఁ బిదపఁ
దపమున కడ్డంకి గలుగఁ - దనయ జనించెన్ -75

(విశ్వామిత్ర - మేనకల సంగమమువలన శకుంతల జనించిన సంఘటన)

అమరేంద్రానలవరుణుల్
యముఁడును నలువోలె రూపు - నందఁగ నపుడా
యమరుల్ వదనము గాంచఁగ,
దమయంతి, జడఁ గను నలునిఁ- దాఁ బెళ్లాడెన్ -76

చంపె సుయోధను భీముం
డంపెను యమపురికి వాని - నా చేతులతో
నింపెను రక్తము ద్రౌపది
వంపగు కురులందుఁ, దానె - వాల్జడ నల్లెన్ -77

జడ వేయకనున్నను నా
నిడుదగు వెండ్రుకల నమరి - నిండుగనుండున్
గడు సొబగుల సౌగంధిక
మడిగెను ద్రౌపదియు భీము - నతి ప్రేముడితో -78

## సత్యభామ

ఇచ్చకములఁ జిచ్చిడు ముని
ముచ్చటగాఁ బారిజాత - పుష్పము తా నొం-
డిచ్చెను శౌరికి, శౌరియుఁ
జెచ్చెర సతి రుక్మిణి జడఁ- జేర్చెను సుమమున్ -79

దయతో నలుకను మానుము
ప్రియ భామా పారిజాత - వృక్షమె తెత్తున్
స్వయముగ నీ జడఁ దురిమెద
నయమగు బలు పారిజాత - నవకళికల నేన్ -80

కరినీలపు జడఁ ద్రిప్పుచు
కరినీలశరీరు పత్ని - కను లెగిరించెన్
హరి మీఱజాల గలడా
తిరుగెక్కడ మాట కంచుఁ - దెగ గర్వించెన్ -81

ఎవరే జయించు వారిల
నెవరే నను సకల కళల - నెవరే యనుచున్
జవరాలు సవాలిడఁగా
నవనాగమువోలె జడయు - నగుచు బుసలిడెన్ -82

ఏడున్నిరువది తారలు
మూఁడును రెండును పడగలు - మోహనమయమై
యేడును మూఁడవతారము
లాడును జడలోన భామ - కనవరతంబున్ -83

(సత్యభామ జడ వర్ణిస్తుంది ఈ పద్యము)

తారలు రవి శశి హరి యవ-
తారమ్ములు పుష్పచయము - తరుణి జడ కలం-
కారములగు దానిని యా-
చారము గొలుచుటయు నృత్య- సభలో నెపుడున్ -84

(సత్యభామ జడ వర్ణిస్తుంది ఈ పద్యము)

## అనుసరణలు

సొగసులతో కీల్జడలున్
వగ లొలుకన్ వజ్ర మనఁగ - పల్వరుసలు నీ
మొగమున సోగైన కనులు
రగిలించును దీయనైన - రసమయ కీలల్ -85

(సొగసు కీల్జడదాన - సోగకన్నులదాన
వజ్రాలవంటి ప-ల్వరుసదాన - శ్రీనాథుడు)

భ్రమరములో యా హరినీ-
లములో యనఁ దోచుచుండు - రంగును బడసెన్
చమరీవాలసమమ్మే
రమణీ నీ జడయు వేయి - రజనుల యిరులే! -86

(భ్రమరికా హరినీల - చమర వాలములఁ బోల్
వేణీభరము చాయ - వేయి సేయు - శ్రీనాథుడు)

నిలువవె వాల్జడదానా
నిలువవె రాయంచనడల - నేర్పరి జాణా
లలితమగు హొయలు చానా
చలితమ్ముగఁ జేసె హృదిని - చప్పున రానా - 87

(నిలువవే వాలు కనులదానా పాట)

నల్లని వెండ్రుకలు గలది,
యల్లిన పూల జడతోడ - నందముగా శో-
భిల్లుచు, దయఁ జల్లున, దో
మల్లియలార కనినారె - మగువను వనిలో -88

(నల్లనివాడు పద్మనయనమ్ముల వాడు -పోతన)

జడలో గొజ్జఁగి దండలు
కడు చిక్కులతోడి సరము - గళమునఁ గదలన్
తడబడు యడుగుల నడకల
వెడలెను వాల్గనుల నిద్ర - వీడక మునుపే -89

(విడజారు గొజ్జంగి విరిదండ జడతోను
కడు చిక్కుబడి పెనగు కంటసరితోను
నిడుదకన్నుల దేరు నిదుర మబ్బుతోను
తొడరి పదయుగళమున తడబడెడు నడతోను -క్షేత్రయ్య)

లలితము కేతకి గంధము
పులకిత మయె నాగమల్లి - పూవుల జడయున్
చలనమయెను పడవెటకో
యెల బ్రాయమ్మందమునకు- నిడెను నివాళుల్ -90

(కొండగాలి తిరిగింది పాట)

జడలన్ శోభిలు వానిని
వడిగాఁ మన బాపములను - బాపెడు వానిన్
దడలన్ సడల్చు వానిని
విడకన్ గొల్చెదను రామ-విభునిన్ భక్తిన్ -91

(జటాకలాప శోభితం సమస్తపాప నాశకం
స్వభక్త భీతిభంజనం భజేహ రామ మద్వయం)

నీజడలోగల మల్లియ
లో జవ్వనినాదు ప్రేమ - కుత్తరమే, నీ-
వాజాబు చదువఁ దేనియ-
లే జారు మనస్సులోన - లెస్సగ సకియా -92

(నీ ముడిద మల్లిగె హూవిన మాలె పాట)

గంగాతరంగములతో
పొంగారెడు కుండవోలె - పొసఁగెడు జడతో
నంగారము నొసటి కనుగ
నింగిన్ శశి తొడుగు వాని -నిరతము గొలుతున్ -93

(జటా-కటాహ-సంభ్రమ-భ్రమన్నిలింప-నిర్ఝరీ
విలోల-వీచి-వల్లరీ - విరాజమాన-మూర్ధని
ధగద్ధగద్ధగజ్జ్వల-ల్లలాట-పట్ట-పావకే
కిశోర-చంద్రశేఖరే - రతిః ప్రతిక్షణం మమ)

సడి సేయకు మో గాలీ
బడలిన నా రాజు తాను - బడుకొనియుండెన్
సడి సేయకు జడ ముంగురు
లొడిలోఁ బడుకొన్న రాజు - నొరయుచు లేపున్ -94

(సడిసేయకే గాలి పాట)

వంపులతో సొంపులతో
నింపెసఁగెడు యమున యేది - యెక్కడ గలదో
సొంపులతో సోయగముల
వంపుల యా యమున నీదు - వాల్జడయేగా -95

(వంపులతో సొంపులతో యింపగు ఆ యమునేది చరణం)

కొమ్మల గువ్వలు పాడిన
రెమ్మల పవనంబు సడులఁ - బ్రియ సేయంగా
నిమ్మన వేణువు వినినన్
నమ్మితి నీవంచు జడను - నచ్చెద వంచున్ -96

(కొమ్మల గువ్వలు గుసగుసమనిన చరణం)

అమ్మా వెళ్లొస్తా నే
నమ్మా మతి వెళ్లివత్తు - నంచును సంకే-
తమ్ముగఁ జెప్పను ప్రియుఁ జూ-
తమ్మంచున్ జడను ద్రిప్పి - తరుణియుఁ ద్వరగా -97

(పెళ్లికానుక చిత్రములో ఒక దృశ్యము)

## చిత్రకవిత్వము

జడగురియుచునుండె నకట
జడమాయెను డెంద మిచట - జవ ముడిఁగెనుగా
జడకనుఁ గట్టితి నేనిట
జడనిధి తల్పుండె నాకు - శరణిఁకపైనన్ -98

(ఇందులో జడ పదములకు కేశార్థము లేదు)

## నవగ్రహముల పేరులతో పద్యము

రవి తేజము, శశి వెన్నెల
కవిగురుబుధమతియు నశని - గన్నుల, మోమున్,
సువినీల కేతువు జడయు,
రవమో మంగళము, రంగు - రాహు రతనమే -99

## ద్విపద గర్భిత కంద పద్యము

జడ యొక నాగము, సరిగా
ముడులను ముడిచి నిడుదగను - ముద్దిడు విధమున్
వడిగను వేయుట వరమే,
గడవలె గడు చెలువ మలర -కనులకు ముదమే -100



జెజ్జాల కృష్ణమోహన్‌రావు నెల్లూరులో జన్మించారు. మాతృభాష కన్నడం. మద్రాసు, తిరుపతి, బెంగుళూరులలో చదువు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో డాక్టరేట్ చేశారు. తెలుగు, ఇంగ్లీషులో పద్యరచన, కంప్యూటర్ ఆధారంతో ఛందస్సు పై శాస్త్రీయ విశ్లేషణ చేయటం వీరికి ఇష్టమైన వ్యాపకాలు. ఫ్రెడరిక్, మేరీల్యాండ్‌లో నివాసం.

# MOTHERS CRY, INC.

*Dr. Uma Eyyunni*

There is a tremendous stigma about mental illnesses that is an inhibitory factor for socialization and support, all across the different communities and more so in the Indian community in North America. As the first and second generation individuals face various challenges, the mental health issues have taken a back seat in all aspects of care. Many of the individuals and their families can do better in life if only they accept that this is a real challenge and it requires community support more than any other problem.

Motherscry, Inc. is a non-profit organization launched on November 14th 2010, in Jacksonville, Florida. The team that started this organization are Dr.Uma Eyyunni, Dr. Anjali Pathak, Dr.Ravi Kancha and Dr. Ram Eyyunni, and a few other friends, with the mission of raising awareness about mental and developmental health issues in the community through educational seminars. The major purpose is to provide emotional support and suggestions about the available resources for the families with challenged loved ones.

The theme can simply be expressed as

M - Mental well being
O - Outreach
T - Therapeutic Guidance
H - Help & Hope
E - Empathy
R - Resources
S - Support
C - Challenge
R - Rehabilitation / Recovery
Y - Youth



As physicians, our team has had personal as well as professional experiences which led to the formation of Mothers Cry, Inc. "Mother's quest for child's best" has been our motto, and here we mean both the parents, not just the mothers.

The first free educational seminar we organized was about "Challenges of Dual cultures" which was addressed by a few youngsters in the community and professional Psychiatrists. With their guidance, further discussions were held where the youngsters could express themselves freely.

In Jacksonville, the occurrence of mental health challenges was a staggering one in four in 2007. And this malady effects all economic and educational levels in the society. In the past, there were misconceptions that the mental illness occurred only in "broken families". Far from being true, thisillness effects all strata of life, more prevalent in the age groups between late teens and early twenties, where youngsters are just blossoming.

The first generation that migrated from India have been professionals to a large extent. They came as adults to this country with degrees in Medicine, Engineering, etc. They had their own share of struggles, with a small percentage ending up in severe depression. However, it is commendable that many Indians have withstood the struggles and have succeeded in their endeavors.

However the stories took different and unanticipated turns in some situations, where the second generation found it difficult to "belong". Hence the onset of the triggering factors for depression, anxiety disorders, and substance abuse situations. The expectations and environment of the first generation have been very different from those of the second generation.

The Mothers Cry organization struggles to bridge this gap. It is amazing how insecure some of our adults feel even to attend a free educational seminar about mental health issues, worried as to what the other Indian friends think if they attend the meetings. But I am proud to say that we are prevailing in our efforts. We have expanded our organization to Autism and related disorders, developmental challenges and now after four years, we have several non-Indian friends also that attend our meetings.

Fortunately for us, we have writers, lyricists and musicians among us with whose help we have done two fundraisers.Srinivasa Bharadwaj Kishore and I have presented an English musical/dance ballet on Buddha, based on classical Bharathnatyam, written by me and an English musical play, Vivekananda, in which several youngsters took part. We are pleased to say that we could afford to give donations to CARD (Center for Autism and Related Disorders) and NAMI (National Alliance on Mental Illness). We could get some support from AAPI-American Association of Physicians from India. I am also proud to mention that we as a team trained about fifteen children from ages 3-17 , and made them sing Christmas carols in a Senior (old age) home and a Hospice center. I was so moved when one of the terminally ill patients said "God Bless you, you brought cheer into a sad place".

To date, we have been offering free educational seminars every 2-3 months. The subjects included Developmental disorders, Anxiety disorders, Depression, Learning disabilities, Attention deficit disorders, obsessive compulsive disorders, Teenage challenges and coping skills, Bullying in schools and many others. We are still trying to make mental health an important subject for these prominent organizations. It is a struggle because of the stigma, even in the highly educated professionals.

The Indo USChamber of Commerce recognized our voluntary efforts with the Pillar of Community award.

Time and again we reinforce the fact that mental illness is not anyone's fault and it should not have to be alienated from the regular society. The stigma needs to be challenged and we need to acknowledge that Mental Health is an organic brain disorder. The families of the challenged ones need to be given moral, emotional and financial support especially because public resources are scarce.

We need to be aware that our children, our future generation, are growing up in this country, and are having experiences very different from our own. We need to grow up with them and LISTEN to them. Developing such empathy across generations will help early diagnosis, treatment and prevention of suicides.

So we continue to do what little we can to contribute to this heart wrenching challenge. We all need to understand and accept that the challenged individuals and their families are no less than any other family and it is no one's fault. Life just happens!

When people start being judgmental and critical about the "faults or defective upbringing and hence the mental health problems in the youngsters" or denying that a problem exists, I have a simple appeal. Please read carefully, how the challenged individual feels…….and develop empathy not sympathy.

Look mom, I can fly, said my son at age five (jumping off a couch)

Sure my love, said I, have no fear, aim for the sky

Dad said reach for the moon, and be sure, I'll get there soon

Said he when he was fifteen with hopes high and dreams clean

What happened to me mother? I rock rock but go nowhere

Who clipped my wings mother, so I can't go any further???

We do not have answers yet for this anguish, but we still have kindness and humanity. Like any other chronic ailment of the body, mental illness consumes energy of the whole family and financial resources. It is high time that our community is prepared to raise awareness and acknowledge when there is a problem. Denial and stigma will end only in tragedies. With the help of knowledge, awareness and research tools, one day we will find appropriate treatments and solace.

Website: www.motherscry.net *



హైదరాబాద్‌లోని మాడపాటి హనుమంతరావు పాఠశాలలోను, ఉస్మానియా వైద్య కళాశాలలోను చదివిన ఉమా ఇయ్యుణ్ణి భర్త రామానుజం, పిల్లలు శ్రీకర్, డా॥ స్వాతిలతో ఫ్లోరిడాలో ఉంటున్నారు. ఇటీవలే రచనలు చేస్తున్నారు. హిందీ, సంస్కృతంలో కూడా ప్రవేశం ఉంది.

VOLUNTEERING TOGETHER FOR SERVICE ©

VT SEVA

www.VTSeva.org
www.VTSWorld.org

**Mission**

Promote understanding and tolerance in society by empowering our youth with value of volunteering and philanthropy.

**Vision**

Vision is to see all children and adults of the impoverished communities of India and other countries have access and opportunities to quality education and health care and enable them to live with dignity and pride.

PRAJNA




Prajna Learning Center
at Novi and Troy, MI
Phone: (248) 842-5648, (248) 802-8086
Visit http://www.prajna4me.org for more information

# సభా సౌరభం

ఈ తానా మహాసభలలో లిటరరీ కమిటీ ఆధ్వర్యంలో సాగే సాహిత్య సమావేశాలలో పాల్గొనే ఉపన్యాసకులు సమర్పిస్తున్న పత్రాలలో కొన్ని...



*Photography by Ramanamurthy*

# *We Thank our Media Partners*

## ELECTRONIC MEDIA

## PRINT MEDIA

# మాండలిక పదకోశం - ఆవశ్యకత, ప్రయోజనాలు

ఆచార్య వెలమల సిమ్మన్న

*'ముడి బంగారాన్ని మూటకట్టి దాచుకుంటే విలువుండదు. దాని మెరుగులు, మెరుపులూ తెలిసిరావు. ఆభరణాల రూపం లో వాడకంలోకి వస్తేనే బంగారానికి శృంగారం, బంగారానికి తావి అబ్బడమంటే అదే. అలాగే బంగారంలాంటి తల్లిభాష అయిన తెలుగు కూడా నిత్యం వాడకంలో ఉంటేనే భాషకు పెంపూ, రాణింపూ. భాష వాడకం వల్లనే పదసంపద పెరుగు తూంటుంది. పాచిపట్టిన నీరు వాడకానికి పనికిరాదు. వాడుక లోకి తెచ్చుకోలేని పదాలు వాడిపోతాయి...'*

-శ్రీ ఎ.బి.కె. ప్రసాద్

ఆంధ్రదేశ్‌లో శ్రీకాకుళం నుంచి ఒకరూ, గుంటూరు నుంచి ఒకరూ, చిత్తూరు నుంచి ఒకరూ, అదిలాబాద్ నుంచి ఒకరూ మొట్టమొదటిసారిగా కలుసుకుంటే వాళ్ళు మాట్లాడేది తెలుగే అయినా ఒక్కొక్కరు మాట్లాడే తీరులో ఒక్కొక్క విలక్షణత కన్పిస్తుంది. అదే మాండలికం అన్నమాట. ధ్వనుల ఉచ్చారణ లోనూ, పదాల ఎంపికలోనూ, పదబంధ నిర్మాణంలోనూ, వాక్య స్వరూపంలోనూ, ఉనికిలోనూ, కాకువులోనూ, అర్థస్ఫూర్తి లోనూ ఒక్కొక్కరిలో ఒక్కొక్క ప్రత్యేకత చాలా స్పష్టంగా కన్పి స్తుంది. అంతేకాదు ఒకే ఊళ్ళో వుంటున్న సంస్కారవంతు డొకడూ, సంస్కారం అబ్బని వాడొకడూ కలుసుకొనేప్పుడు వింటే వాళ్ళ వాళ్ళ వ్యవహారాల్లోనూ విభిన్నత స్పష్టమవుతుంది. ఒక కుమ్మరి, ఒక వడ్రంగి, ఒకరైతు మాట్లాడుకొనేటప్పుడు వాళ్ళ వాళ్ళ వృత్తులకు సబంధించిన పలుకుబడులు తరుచుగా కన్పిస్తూ వుంటాయి.

భిన్నరూపాల్లో భిన్నస్థాయిలో వున్న వాడుకల్ని 'మాండలికాలు' అని అంటారు. అయితే వీటన్నిటిలోనూ సమాన ధర్మం గరిష్టంగా వుంటుంది. కాబట్టి వాటినన్నిటినీ ఒకేభాషలో అంతర్భాగాలుగా పరిగణిస్తాం. "మాండలికం అనే పదం విస్తృతార్థంలో మనం వాడుతున్నాం. ప్రాంతీయమైన ఒక 'మండలం'లో వాడుకలో వున్న భాషే కానక్కరలేదు. ప్రాంతీయతతోపాటు వర్గాన్ని బట్టి, వృత్తిని బట్టి, విద్యా సంస్కారాదుల్ని బట్టి ఏర్పడ్డ వ్యవహార భేదాలన్నిటినీ 'మాండలికాలు' (Dialects) అవుతాయి.

మామూలుగా ఏ జీవద్భాషలోనూ నూటికి నూరుపాళ్ళు ఏకరూపత ఎక్కడా వుండదు. మాండలికంలో స్థూలంగా కన్పిం చేవి రెండు స్థాయిలు. ఒకటి ప్రాంతీయం. రెండోది సామాజికం. ప్రాంతీయతను బట్టి తెలుగులో కళింగసీమ మాండలికం, కోస్తా మాండలికం, రాయలసీమ మాండలికం, తెలంగాణా మాండలికం అనే విధంగా వర్గీకరించారు భాషా శాస్త్రవేత్తలు, ఆయా ప్రాంతాల్లో ఆయా మాండలికభాషలో నవలలు, కథలు, నాటకాలు వచ్చాయి. అన్ని ప్రాంతాల్లోని మాండలికాల్ని మనం అధ్యయనం చేయాలంటే తప్పనిసరిగా 'మాండలిక పదకోశాల' ఆవశ్యకత వుంది. ఈ పదకోశాల వల్ల అనేక ప్రయోజనా లున్నాయి కూడా.

ప్రారంభంలో తెలుగులో గ్రాంధికభాష చోటు చేసుకుంది. ఆ తర్వాత సరళగ్రాంధిక భాష వచ్చింది. పిదప అన్ని రంగాల్లో విస్తృతంగా వ్యవహారికభాష స్థానం సాంపాదించింది. ప్రాంతీయత్వాన్ని బట్టి మాండలిక రచన ఆంధ్రప్రదేశ్‌లో ఆయా ప్రాంతాల్లో బాగా జరిగింది. మాండలికాలపై అన్ని విశ్వవిద్యాలయాల్లోనూ, విశ్వవిద్యాలయాల వెలుపల ఉత్తమ పరిశోధన జరిగింది.

### మాండలిక పదకోశాలు - లక్ష్యం

'మాండలిక పదకోశాలు' తయారీ లక్ష్యం ఏమంటే ఆంధ్ర ప్రదేశ్‌లో వివిధ ప్రాంతాల్లో వున్న వ్యవహారంలో ఏయే సామాన్య లక్షణాలు గరిష్టంగా వున్నదీ గమనించి రూపభేదాలు చూపిస్తూ భాషలో ప్రాంతీయ ప్రామాణికాలనూ, రాష్ట్ర ప్రామాణికాన్ని నిరూపించడం.

### మాండలిక పదకోశాలు - ఆవశ్యకత

ఈ మాండలికాలు వృత్తిని బట్టి మారుతూ వుంటాయి. ఆంధ్రప్రదేశ్ సాహిత్య ఆకాడమీ వారు ప్రచురించిన మాండలిక వృత్తి పదకోశాల్లో కొన్నివేల పదాలు గ్రంథస్థమయాయి. భారతీయ భాషల్లో మొట్టమొదటిసారిగా తెలుగులో ఇలాంటి మాండలిక పదకోశాలు శాస్త్రీయ పద్ధతిలో రూపొందడానికి కారకులు ప్రముఖ భాషా శాస్త్రవేత్త ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తిగారు.

వృత్తిపదకోశాల విషయంలాగే సామాజిక భాషా పరిశోధన విషయంలో కూడా తెలుగుభాష అగ్రగామి కావడం మనకం దరికీ గర్వకారణం. దీనికి కూడా తగిన విధంగా పథకం రూపొందించి, 'స్విన్' కమిటీ చేత సిఫార్సు చేయించి, దాన్ని తెలుగు అకాడమి సక్రమంగా అమలుపరచడానికి ఎప్పటికప్పుడు సూచనలు ఇచ్చినవారు కూడా భద్రిరాజుగారే అని చెప్పక తప్పదు.

అకాడమి మాండలిక పదసేకరణ ప్రచురణలకు తోడ్పడింది. భిన్న ప్రాంతాల్లో పర్యటించి, ఆయా వృత్తులకు సంబంధించిన ప్రస్తుతం వ్యవహారంలో వున్న మాండలిక పదజాలాన్ని సేకరించి ప్రచురించింది. తెలుగులో మొత్తం సాంప్రదాయక వృత్తుల పదాల్ని సేకరించి వివిధ సంపుటాలుగా ప్రచురించాలని వారి సంకల్పం.

వాటిలో మొదటి 'వ్యవసాయ వృత్తి పదకోశం.' ఇది 1962 లో వెలువడింది. రెండోది 'చేనేత వృత్తి పదకోశం.' ఇది 1971 అక్టోబర్‌లో వెలువడింది. మూడోది బెస్త పరిశ్రమకూ, పడవల నిర్మాణానికి సంబందించినది. దీని సంపాదకులు ఆచార్య తూమాటి దొణప్పగారు. ఇది 1992మే 14 తేదీన వెలువడింది. 'మేదర పరిశ్రమ - ఇతర పనుల వృత్తిపదకోశం.' ఇది 1992లో వచ్చింది. దీని సంపాదకులు డాక్టర్ పోరంకి దక్షిణామూర్తిగారు.

'వాస్తు పదకోశం' డాక్టర్ బూదరాజు రాధాకృష్ణమూర్తిగారి సంపాదకత్వంలో వచ్చింది. ఇది 1968లో వెలువడింది. కుమ్మరం, వడ్రంగం పదకోశాలు ఆచార్య జి. నారాయణస్వామి రెడ్డి సంపాదకత్వంలో వచ్చాయి. కుమ్మరం (లోహకారవృత్తి) పదకోశానికి సంపాదకులు ఆచార్య జి. నాగయ్యగారు. స్వర్ణకార, హస్తకళలకు సంబంధించిన పదకోశాలు కూడా వచ్చాయి. మాండలిక పదకోశాల ఆవశ్యకతను 'ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి' గుర్తించింది. అందుకు మనం ఆ సంస్థకు కృతజ్ఞతలు తెలియజేయాలి.

తెలుగు అకాడమి 'వాణిజ్య పదకోశం', 'వృత్తిపదకోశం' మాండలిక పదకోశం అనే వ్యక్తి మాండలిక పదకోశాల్ని ప్రచురించింది. కరీంనగర్, కడప, విశాఖపట్నం, గుంటూరు, వరంగల్లు, చిత్తూరు, అనంతపురం, శ్రీకాకుళం, కర్నూలు, నిజామాబాద్ మాండలికాల్ని ముద్రించింది. తెలుగు అకాడమి కూడా మాండలికాల ఆవశ్యకతను గుర్తించడం ముదావహం. సంస్థల ద్వారా కాక స్వయం పరిశ్రమతో కొందరు ప్రచురించిన మాండలిక భాషా గ్రంథాలున్నాయి. చల్లా రాధాకృష్ణ శర్మగారి 'మదరాసు తెలుగు', 'రాయలసీమ మాండలికం - అనంతపురం ప్రాంతీయత' అనే ఆర్. నాగభూషణరావుగారి గ్రంథం, 'శ్రీకాకుళం ప్రజల భాష' అనే వి.సి. బాలకృష్ణశర్మ గారి గ్రంథం, నల్గొండ జిల్లా మాండలికం గూర్చి ఆచార్య రవ్వా శ్రీహరిగారి రచన ఈ కోవకు చెందినవే. ఆచార్య అత్తలూరి నరసింహా రావుగారి 'రావిశాఖీయం' రాచకొండ విశ్వనాథశాస్త్రిగారి మాండలిక ప్రయోగ విశేషాల్ని వివరిస్తుంది.

ఆంధ్రప్రదేశ్‌లో ప్రాంతీయదృక్పథంతో ఆయా ప్రాంతాల్లో విస్తృతంగా రచనలు వచ్చాయి, వస్తున్నాయి. మాండలిక పదాలు సంపద రోజు రోజుకు పెరుగుతుంది. ఈ మాండలికాలు అర్థం కావాలంటే తప్పనిసరిగా 'మాండలికాల పదకోశాలు' తయారు చేయాలి. ఉదాహరణకు 'కళింగాంధ్ర మాండలికం' (రచయిత ప్రయోగాలు) పై జి.ఎస్.చలం 'మాండలిక పదకోశం' తయారు చేశారు. ఇది జనవరి 2006లో వచ్చింది. పదసేకరణలో, ప్రణాళికలో దీని విస్తృతి చాలా విశాలం. ఏక రచయితను కాక అనేకుల్ని దృష్టిలో పెట్టుకుని ఆరోపంతో పాటు రచయిత ప్రయోగాల్ని వాక్యరూపంలో ఇచ్చినందువల్ల ఈ పదకోశం ప్రామాణికమైంది. అనుబంధాలుగా ప్రాంతీయ ప్రయోగంలో వున్న సంఖ్యావాచకాల్ని, వావి వరుసల్ని, అలంకారాల్ని, జంట పదాల్ని, ద్విరుక్తపదాల్ని, రూపవైవిధ్యాల్ని రూపాంతరాల్ని, నానార్థాల్ని పృథక్కరించి ఇచ్చినందువల్ల ఈ నిఘంటువు ప్రయోజనకారిత్వం పెరిగింది. అంచేత మాండలిక ఆవశ్యకత ఏర్పడింది.

### మాండలిక పదకోశాలు - సేకరణ - సమస్యలు

- 'మాండలిక పదకోశాలు' తయారుచేసేటప్పుడు మొట్ట మొదటిగా తెలుసుకోవలసింది చాలా ముఖ్యమైన అంశం విషయ సేకరణలో మెలకువలు చూపించడం, సేకరణలో నాణ్యత కోల్పోకుండా జాగ్రత్తగా చూడడం.
- ఆయా ప్రాంతీయ భాషా స్వరూప నిర్ధారణకు ఎవరు సరైనవారో నిర్ణయించి, విద్యా, సాంఘిక సంబంధాల దృష్ట్యా రకరకాల వ్యవహారాల్ని మనం ఎన్నుకోవడం అన్ని విధాల మంచిది.

❖ ఇందులో రచయితలూ, పాఠశాల ఉపాధ్యాయులూ, కళాశాల అధ్యాపకులూ, విద్యార్థులూ, ఉద్యోగులూ, వ్యాపారస్థులూ, వృత్తి విద్యావంతులూ (వైద్యులూ, న్యాయవాదులు), రాజకీయ కార్యకర్తలూ, చదువుకున్న స్త్రీలూ, రైతులూ, కార్మికులు ఇంచుమించు చదువుకున్న అన్ని వర్గాల వారిని తప్పనిసరిగా ఇందులో భాగస్వాములుగా చేయాలి. అన్ని వర్గాలకు చెందిన జనాల్ని కలుపుకోవాలి. అప్పుడే మంచి 'మాండలిక పదకోశాలు' తయారు అవుతాయి.

❖ వ్యవహర్తల దగ్గర నుంచి విషయ సేకరణ చేయడానికి మంచి ప్రశ్నావళి తయారుచేసుకోవాలి.

❖ ప్రశ్నావళిలో నామపద విభాగానికీ, క్రియా విభాగానికీ, సంఖ్యాపదాలకూ, బాంధవ్య బోధక పదాలకూ సంబంధించిన అన్ని వివరాలు విపులంగా ఉండాలి.

❖ మాండలిక విజ్ఞానశాస్త్ర అధ్యయనానికి అవసరమైన వ్యవహర్తల వివరాలు వుండాలి. ఉదాహరణకు పేరు, వృత్తి, చదువు, వయస్సు మొదలైనవి వుండాలి.

❖ ప్రతి వ్యవహర్తను కలుపుగోలుగా మాట్లాడించే చాకచక్యంగల మంచి వ్యక్తిని నియమించాలి.

❖ వ్యవహర్తల్ని టేప్‌రికార్డింగ్ చేయాలి. టేప్ చేసిన దాన్ని ధ్వని విధేయంగా రాసుకోవాలి.

❖ ఈ వ్యవహార ఖండికలు జీవితానుభవాలకు సంబంధించి కానీ, అభిప్రాయ ప్రకటనలకు సంబంధించి కానీ, ఒక్కొక్కసారి అనేక విషయాలకు సంబంధించి కానీ వుండ వచ్చు. ఇందులోనే మాండలిక పదాలు, వ్యాకరణ విశేషాలు ఎక్కువగా బహిర్గతమవుతాయి.

❖ ప్రశ్నావళిలో సేకరించిన సమాచారాన్ని వర్గీకరించి ఆయా వ్యక్తుల వ్యవహారాన్ని చాలా చక్కగా విపులీకరించాలి.

❖ మాండలిక పదకోశాల ముఖ్య ఉద్దేశం ప్రాంతీయ సామాజిక సామ్యాల్ని వైవిధ్యాల్ని సేకరించడం, ఆధునిక ప్రామాణిక భాషా ప్రభావం భిన్న ప్రాంతాల వ్యవహర్తలపై ఏ విధంగా వుందో చూపిస్తూ భాషా పరిణామాన్ని నిరూపించడం.

### మాండలిక పదకోశాలు - ప్రయోజనాలు

❖ మాండలిక పదకోశల తయారీవల్ల ఇంతకు పూర్వం వచ్చిన నిఘంటువుల్లో లేని పదాలు వేలకొద్దీ గ్రంథస్థమవు తాయి.

❖ ఒకవేళ పూర్వ నిఘంటువుల్లో వుండేవాటికి అర్థ స్పష్టత, నిర్దిష్టత, వైవిధ్యం నమోదవుతాయి. అంతేకాదు భిన్న రూపాంతరాలు ఏమిటో తెలుస్తుంది.

❖ ఆయా పద రూపాల ప్రాంతీయవ్యాప్తి గోచరిస్తుంది. పరిమితమైన మౌళిక పదాలు ఆధారంగా అపరిమితమైన నూతన పదాల కల్పన కొన్ని శతాబ్దాలుగా ఆంధ్రప్రదేశ్‌లో ఎలా జరుగుతుందో అందులో వున్న శిల్పం ఏమిటో పరిశీలకులకు స్పష్టమవుతుంది.

❖ ఇంతవరకు తెలుగులో వెలువడ్డ నిఘంటువుల్లో ఆరోపాలు (Entries) వున్న పదాలు దాదాపు అన్ని కావ్యా భాషల్లోంచి తీసుకున్నవే. జన వ్యవహారంలోంచి తీసుకున్నవి చాలా తక్కువ. దీనికి ప్రధాన కారణం జన వ్యవహారంలో వున్న పదాలన్నీ, వివిధ మాండలికాల్లో వున్నవన్నీ గ్రంథస్థం కాకపోవడమే. ఇప్పుడు మాండలిక పదకోశాలు తయారుచేస్తే అన్ని పదాలు చేరుతాయి. దీనివల్ల చాలా ప్రయోజనం వుంటుంది.

❖ మాండలిక రచనల ద్వారా వివిధ ప్రాంతాల్లో వ్యవహారంలో వున్న పదాలు గ్రంథస్థమై నిఘంటువులో చేర్చుకోవడానికి అవకాశం ఏర్పడుతుంది.

❖ పదాలే కాకుండా వాటి ప్రయోగాలూ, వాక్య నిర్మాణంలో అవి వచ్చే తీరూ, అర్థచ్ఛాయలూ, కాకువులూ వగైరా సరిగా తెలుస్తాయి.

❖ దీనివల్ల నిర్దిష్టమైన అర్థాల్లో వాటిని నిఘంటువులకెక్కించుకోవచ్చు.

❖ ఆధునిక ప్రమాణభాష (శిష్ట వ్యవహారికం) లో చేసిన రచనల కంటే మాండలిక భాషలో చేసిన రచనలు చదువురాని సామాన్య జనానికి దగ్గరగా వెళతాయనడంలో సందేహం లేదు.

❖ అక్షరజ్ఞానం లేనివాళ్ళకు వారి ప్రాంతానికి సంబంధించిన మాండలికంలో చేసిన రచనల్ని చదివి వినిపిస్తే తప్పకుండా ఆనందిస్తారు. దానికి సంగీతం తోడైతే ఆ ప్రాంతం వాళ్ళకే కాకుండా అన్ని ప్రాంతాలవాళ్ళూ కూడా విని అనం దిస్తారు. ఈ విధంగా సాహిత్యాన్ని చదువరాని వాళ్ళకు కూడా అందించే మంచి సాధనం మాండలికం అన్నమాట.

❖ మీదుమిక్కిలి ప్రామాణికభాషలో కన్నా, ఆయా మాండలిక భాషలో రచనలు చేయడం ఆయా వ్యక్తులకు చాలా సులువుగా వుంటుంది..

❖ మాండలిక భాష మాట్లాడేవాళ్ళతో కలిసిమెలసి వుంటూ వాళ్ళలో ఒక్కడిగా కన్పించేటంతగా తాదాత్మ్యం చెందడం వల్లా, అనుకరణ వల్లా ఎంతో మేలు జరుగుతుంది.

❖ మాండలిక పదోకోశాలు తయారైతే ఆయా ప్రాంతాల్లోని భాషా సహజత్వం సుస్పష్టంగా తెలుస్తుంది.

❖ మాండలిక పదపటాల (Dialect Atlas) వల్ల ఆయా పదాల ప్రాంతీయ విస్తృతిని బట్టి భాషా మండలాన్ని (Dialect areas) శాస్త్రీయంగా నిరూపించడం సాధ్యమవుతుంది.

❖ మాండలిక పదకోశాల తయారీ వల్ల తెలుగుభాషా పరిణామం ఏ విధంగా వుందో మనం గమనించవచ్చు.

❖ ఇలా మాండలిక పదకోశాల వల్ల చాలా ప్రయోజనాలున్నాయి.

## మాండలిక పటం తయారీ విధానం - పద్ధతులు

18వ శతాబ్దానికి చెందిన వ్యాకర్తలు లిఖితపూర్వకంగా వున్న సారస్వత భాష, వున్నత కుటుంబీకుల భాష ప్రామాణికమైందిగా భావించారు. సామాన్య జనుల భాషనూ మాండలిక భాషను చులకనగా చూశారు. అసలు పట్టించుకోలేదు కూడా. 19వ శతాబ్దంలో ప్రామాణిక భాషలో కన్పించిన కొన్ని ప్రాచీన భాషా లక్షణాలు మాండలిక పదకోశాలు (Dialect Diction Areas) రూపొందాయి. చారిత్రక భాషా శాస్త్రాధ్యయన ఫలింగా ప్రామాణిక భాషలోనే ప్రాచీన భాషా లక్షణాలు వుంటాయనేది తప్పు అనే అభిప్రాయం తేటతెల్లమైంది. మాండలిక భాష కొన్ని చారిత్రక కారణాల వల్ల ప్రామాణిక భాషగా రూపొందుతుంది. ప్రామాణిక భాషగా పరిగణించబడుతున్న నేటి ఆంగ్ల భాష ఒకానొకప్పుడు 'లండన్ మాండలిక భాష' అనే విషయాన్ని మనం మరిచి పోకూడదు.

మాండలిక పటాన్ని (Dialect atlas) తయారు చేయడానికి కొన్ని పద్ధతులున్నాయి. ఆ పద్ధతుల్ని మాండలిక పట నిర్మాణ కర్తలు తప్పనిసరిగా అనుసరించాలి.

❖ భాషలోని వివిధోప ప్రాంతాలల్లోని భాషా ప్రయో గాల్ని సంపాదించడానికి ప్రాంతీయ ప్రాథమిక సర్వేను ఏర్పాటు చేయాలి.

❖ వాడుక (usage)లోని తేడాల వల్ల మండలం ఏ విధంగా వర్గీకరించబడుతుందో గుర్తించాలి.

❖ భౌగోళిక ప్రదేశాల (geographical location) ను గమనించదగ్గ వాడుక తేడాల్ని పటం (map) గుర్తించాలి.

❖ పూర్వ నిర్దిష్ట ప్రాంతాల్లో క్షేత్ర కార్యకర్తలు పర్యటించి ప్రశ్నావళిని తయారుచేయాలి.

❖ స్థిరనివాసం ఏర్పరచుకున్న వ్యవహర్తల (informants) నుంచి సమాచారాన్ని (information) సేకరించుకోవాలి.

❖ ఈ విషయసామాగ్రి అసంఖ్యాక భాషా వ్యవహర్తల వ్యవహారంలో కొంత భాగం మాత్రమే అని గుర్తించింది.

❖ ప్రశ్నావళిలోని విషయ సంబంధ పర్యాయ వ్యవ హారం (వాడుక) వ్యాప్తి సూచకంగా పద, పదబంధ, వ్యాకరణా ద్యంశాల పటాన్ని రూపొందించాలి.

'మాండలిక పదకోశాలు' తయారీ వల్ల తెలుగుభాషకు వున్న విస్తృతమైన భాషాపరిణామం వెల్లడవుతుంది. ఈ పద కోశాల వల్ల మాండలిక విజ్ఞానికి ఎంతో మేలు జరుగుతుంది. ప్రామాణిక భాష ప్రభావం మాండలికాల మీద, మాండలిక భాషల ప్రభావం ప్రామాణిక భాష మీద ఎప్పుడూ ప్రసరిస్తూ వుంటాయి. ఈ మాండలికాలే ప్రామాణిక భాషకు పుష్టి చేకూరుస్తాయి. భిన్నత్వం లో ఏకత్వాన్ని ప్రదర్శిస్తాయి. 'మాండలిక పదకోశాలు' తయారు కావడంలో సమస్యల కన్నా ప్రయోజనాలే ఎక్కువ. ఈ పదకోశాల ద్వారా జనజీవన విధానాన్ని తెలుసుకోవచ్చు. ఆ పదకోశాలు తయారీకి ప్రభుత్వ సంస్థలు భాషపై అభిమానం గల ఇతర సంస్థలు ముందుకు రావాలి. ఒక్క మాటలో చెప్పాలంటే జనాల నాడిని పట్టుకునే 'మాండలిక పదకోశాలు' రావాలి 'ఆంధ్రప్రదేశ్ మాండలిక పదకోశం' త్వరలో రావాలని కోరుకుందాం.

### ఆధార గ్రంథాలు


1. ఆంధ్ర భాషావికాసం- ఆచార్య గంటిజోగి సోమయాజి
2. ఆధునిక భాషాశాస్త్రం- ఆచార్య వెలమల సిమ్మన్న
3. ఈనాడు భాషాస్వరూపం- ఉషోదయ పబ్లికేషన్స్ 'ఈనాడు' దినపత్రిక
4. కళింగాంధ్ర మాండలికాలు- శ్రీ జె.యస్.చలం
5. తెలుగు భాషాచరిత్ర- ఆచార్య వెలమల సిమ్మన్న
6. తెలుగు భాషా చరిత్ర (సంపాదకులు)- ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి
7. తెలుగు భాషా తత్త్వం - శ్రీ కొమఱ్ఱాజు లక్ష్మణరావు
8. తెలుగు భాషాస్వరూపం- డాక్టర్ బూదరాజు రాధాకృష్ణ
9. తెలుగు మాండలికాలు (అన్ని జిల్లాలు)- తెలుగు అకాడమి
10. ప్రముఖ భాషా శాస్త్రవేత్తలు- ఆచార్య వెలమల సిమ్మన్న
11. భాషాంతరం - ఆచార్య చేకూరి రామారావు
12. మాండలికవృత్తి పదకోశాలు- తెలుగు అకాడమి
13. భాష - ఆధునిక దృక్పథం- డాక్టర్ పోరంకి దక్షిణామూర్తి
14. వైకృత పద స్వరూప నిరూపణం- ఆచార్య తూమాటి దొణప్ప
15. శ్రీకాకుళం ప్రజల భాష - శ్రీ వి.వి. బాలకృష్ణమూర్తి





ప్రొ॥ వెలమల సిమ్మన్న పుట్టి పెరిగింది, శ్రీకాకుళం జిల్లా తిమడాం గ్రామం. విశాఖపట్నం ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి ఎం.ఏ., పిహెచ్.డి. చేశారు. తెలుగుభాష, ప్రత్యేకంగా మాండలికాలు, సాహిత్య విమర్శ, వ్యాకరణం- ఇలా వివిధ రంగాలకు సంబంధించిన అరవై గ్రంథాలు రచించారు. అనేక పురస్కారాలు అందుకున్నారు. ప్రస్తుతం ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్.

# తెలుగు కథల్లో స్త్రీ పాత్ర స్వభావ పరిణామం

ఆచార్య ఎస్. శరత్ జ్యోత్స్నారాణి

## పరిచయం

స్త్రీ జీవితం అనేక సమస్యల వలయమని చెప్ప వచ్చు. అందుకు నేడు నిత్యం స్త్రీ ఎదుర్కొంటున్న అనేకానేక సమస్యల్ని కారణంగా చూపవచ్చు. నేడు స్త్రీలు అన్ని రంగాల్లోనూ పురుషుల్ని అధిగమించి నప్పటికీ, ఏదో ఒక రూపేణ స్త్రీలను సమస్యలు చుట్టుముడుతూనే ఉన్నాయి.

అయితే ఇదిలా ఉండగా భూస్వామ్య సంస్కృతి స్త్రీని గృహ బానిసగా మారిస్తే, వ్యాపార సంస్కృతి ఆమెను ఆట వస్తువుగా మలిచింది. ప్రచార, ప్రసార సాధనాలు స్త్రీని అంగడి వస్తువుగా మార్చాయి. నేడు పురుషాధిక్య సమాజం స్త్రీకి కొన్ని గుణగణాలను ఆపాదించింది. అవేంటంటే వినయ, విధేయతలు, త్యాగం ముఖ్యమైనవి. అందులోనూ పాతివ్రత్యం, శీలం ఇంకా ముఖ్యమైనవి. స్త్రీలపై మతం, రాజ్యం, కుటుంబాల అదుపే కాకుండా వారిని వారే అదుపులో పెట్టు కునేలా చేసింది. తరతరాలుగా స్త్రీ అణచివేతకు గురయింది. నిరాదరణకు లోనయ్యింది. స్త్రీ ఒక భోగ వస్తువుగా చూడ బడింది. ఎన్నో అవమానాల్ని చవిచూసింది.

నాడు సతీసహగమనానికి, స్త్రీ బానిసత్వానికి వ్యతిరేకంగా పోరాడిన రాజారామ మోహనరాయ్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, రామకృష్ణ పరమహంస, రవీంద్రనాథ్ ఠాగూర్, గాంధీ, నెహ్రూ, సయ్యద్ అహ్మద్, జ్యోతిబాపూలె వంటి ప్రముఖ సాంఘిక, రాజకీయ, సంఘసంస్కర్తలు అనేకమంది స్త్రీ సమస్యల పరిష్కారానికై కృషి చేశారు.

అయితే తెలుగు కథాసాహిత్యంలో స్త్రీలకు సంబంధించిన సమస్యల్ని చిత్రించిన రచయితలు, రచయిత్రులూ ఎందరో ఉన్నారు. తొలి తెలుగు కథ అయిన దిద్దుబాటులోనే కమలిని భర్త తప్పుదోవ పడుతుండటంతో తన భర్తని తాను మార్చుకునే ప్రయత్నం చేసింది. గురజాడ రాసిన దిద్దుబాటు, మెటిల్డా, సంస్కర్త హృదయం స్త్రీ ప్రధానమైన కథలు. ఈ మూడింటి లోను మోసగాళ్ళు, దుర్మార్గులు అయిన పురుషుల్ని మార్చ గలిగిన, అలాగే వాళ్ళచేత హింసించబడిన స్త్రీలు దర్శనమిస్తారు. గురజాడ తీర్చిదిద్దిన పాత్రలు మెటిల్డా, కమలిని, సరళలను ప్రత్యేకదృష్టితో గమనిస్తే ఒకరికంటే మరొకరిలో కొంత చైతన్యం, మరికొంత ఎదుగుదల కనిపిస్తాయి. అంటే గురజాడ ఆనాడే స్త్రీలలో చైతన్యం వచ్చే క్రమాన్ని చాలా బలంగా, స్పష్టంగా చెప్పాడనిపిస్తోంది. గురజాడ తర్వాత స్త్రీ సమస్యల్ని తన కథల్లో మరింత బలంగా స్పృశించినవాడు శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి. శ్రీపాదవారి *ఇల్లు పట్టిన విధవాడపడుచు, అరికాళ్ళ కింద మంటలు, తాపీమేస్త్రీ రామదీక్షితులు బి.ఏ., కన్యాకాలే యత్నద్వరితా, కీలెరిగిన వాత, కొత్తచూపు, కలుపు మొక్కలు, గూడు మారిన కొత్తరికం, యావజ్జీవం హోష్యామి, షట్కర్మ యుక్తా, శుభికే శిర అరోహ, గుర్రప్పందాలు* లాంటి కథల్లో స్త్రీకి సంబంధించిన అనేక కోణాల్ని ఆవిష్కరించారు. శ్రీపాద వారి కథల్లో వితంతువు, ఆదర్శభావాల స్త్రీ, వేశ్య, గృహిణి, పెళ్ళికాని యువతి, కొడుకులపై ఆధారపడే తల్లులు, అత్తలు, సవతి తల్లులు లాంటి తదితర స్త్రీ పాత్రలు కనిపిస్తాయి.

స్త్రీలను గురించి, స్త్రీ స్వేచ్ఛను గురించి స్త్రీల పట్ల సానుభూతితో, సహృదయంతో కథలు రాసినవాడు గుడిపాటి వెంకటాచలం. చలం కథల్లోని ఆంతర్యం ఏంటంటే స్త్రీ లైంగికత్వం, మాతృత్వం, శ్రమ, ఇవి ఎలా దోపిడీకి, పీడనకూ, అణచివేతకూ గురౌతున్నాయో చెప్పడమే. అలాగే చలం కథల్లో పాత కట్టుబాట్లకు నలిగే స్త్రీలను చూడవచ్చు. *ప్రేమ పర్యవసానం, వాణీ - ఏ స్టడీ, అవతారమా?, ఆమెత్యాగం, మామగారి*

మర్యాద, చిగురు గౌను, భాషన్నా తెలీదు, మోసం చేసిందా, అనసూయ, చుక్కమ్మ, జెలసీ, రామభక్తుడు, అభినవ సారంగధరుడు, దోషగుణం, శేషమ్మ, కళ్యాణి, భార్య తదితర కథల్లో స్త్రీని వివిధ కోణాల్లో ఆవిష్కరిం చాడు. ప్రేమ పర్యవసానం కథలో నిర్మల ఎంతో స్వచ్ఛమైన స్నేహాన్ని కోరుకుంటుంది కానీ అతడు ఆమెను ఒక్కసారైనా అనుభవిస్తే బాగుండు అనుకుంటాడు. అంటే ఎంత ఓపెన్ మైండెడ్ గా ఉన్న స్త్రీని ఎదుటివాడు లైంగిక దృష్టితో చూస్తాడని చెప్పాడు చలం.

కొడవటిగంటి కుటుంబరావు స్త్రీ, పురుష సంబంధాల గురించి, వివాహం, ప్రేమ లాంటి విషయాల గురించి లెక్కకు మించి కథలు రాశారు. వివాహవ్యవస్థ అనేది స్త్రీలను బానిసత్వం లో ఉంచుతోందని, నిర్ద్వంద్వంగా చెప్పిన రచయిత కొడవటి గంటి. *అద్దెకొంప, సద్యోగం, అష్టకష్టాలు, మనుషుల కున్న స్వేచ్ఛ, మహా ఇల్లాలు, శీల పరిశీలన, పశ్చాత్తప్తుడు, రసికుడు, వర ప్రసాదం, దత్తపుత్రుడు,* పెంకిపిల్ల, మళ్ళీ పెళ్లి, అల్లుడి అలక, ప్రేమ పెళ్లి లాంటి తదితర కథల్లో స్త్రీ సమస్యల్ని ఆవిష్కరించాడు కొడవటిగంటి.

*ఆడవలసిన అబద్ధం* కథలో సుబ్బారావుకు పెళ్లి చిన్నప్పుడే అయ్యింది. ఏవో గొడవల వల్ల విడిపోతారు. అయితే ఒకరంటే ఒకరికి ఎనలేని ప్రేమ ఉందని, ఇద్దరూ ఇష్టపడుతున్నారని తెలుస్తుంది. ఇలా స్త్రీ, పురుషుల సంబంధం ఎంతో సున్నిత మైందని, వారిద్దరి మధ్యలో ప్రేమభావం సున్నితంగా ఉండా లని అంటాడు రచయిత. మల్లాది రామకృష్ణశాస్త్రిగారు చిత్రించిన స్త్రీపాత్రల్లో చలాకీతనం, సౌందర్యం, విసురు, ఎక్కువగా కన్పి స్తాయి. ఈయన రాసిన కథలు *సర్వమంగళ, ద్రౌపదీ వస్త్రాప హరణం, మంత్రార్థము, గురుప్రసాదం, చిత్రశాల* లాంటి తదితర కథలన్నీ ఆ సత్యాన్నే నిరూపించాయి.

మునిమాణిక్యం వారు సృష్టించిన కాంతం పాత్ర తెలుగు సాహిత్యంలో ఎంత సజీవంగా నిలిచిందో తెలిసిందే. ముని మాణిక్యం వారి కథల్లోని స్త్రీ పాత్రలన్నీ జాణలు, మాటకారులు, మమతానురాగాలు గల మధురమూర్తులుగా గోచరిస్తాయి.

సురవరం ప్రతాపరెడ్డిగారి కథల్లో స్త్రీల అణచివేతలు, శీలం కోల్పోయిన స్త్రీల పట్ల సమాజం చూపే నిరాదరణలాంటి విషయాలు ఆవిష్కృతమయ్యాయి.

కరుణకుమారగారి కథల్లో చాలా వరకు స్త్రీని కేంద్రీకృతం చేసుకొనే నడుస్తాయి. ఈయన చిత్రించిన స్త్రీపాత్రలు అణచి వేయబడుతున్న వర్గానికి చెందినవారు, సమాజపు మూఢాచారాల్లో మగ్గుతున్నవారు ఉంటారు. ఈయన రాసిన కథలు *కొత్త చెప్పులు, పశువుల కొట్టం, కయ్యా కాలువ, కనువిప్పు* లాంటి ఆ విషయాన్నే చెప్పారు. కనువిప్పు అనే కథ ద్వారా మేధావుల్లో లేని సహనం, అట్టడుగువర్గాలకు ముఖ్యంగా స్త్రీలకు ఉంటుం దని రచయిత చెప్పాడు.

బుచ్చిబాబు రాసిన *అరకులోయలో కూలిన శిఖరం* కథలో ఒక గిరిజన యువతికి ఒక సౌందర్యోపాసకుడికి మధ్య ఏర్పడ్డ సాన్నిహిత్యాన్ని చిత్రించాడు. మేడమెట్లు అనే కథలో నిమ్న స్థాయి లో ఉన్న ఒక పురుషుడికి ఉన్నతస్థాయిలో ఉన్న స్త్రీకి మధ్య అనురాగాన్ని ప్రతీకాత్మకంగా వర్ణించాడు.

గోపిచంద్ రాసిన కథల్లో *గడియపడని తలుపులు, ప్రఖ్యాతుని భార్య, అమలిన శృంగారం, పనిపిల్ల, ఆత్మహత్య, పెనుభూతం, విడాకులు*లాంటి వాటిల్లో స్త్రీ సమస్యల్ని చిత్రిం చాడు. *గడియపడని తలుపులు* కథ ద్వారా ఒక స్త్రీ భర్తని వదిలి పెట్టి ఒంటరిగా బతుకుతుంటే ఆమె ఎంత నీతిగా బతుకుతున్నా, సభ్యసమాజం మాత్రం ఆమెను అర్థం చేసుకోదనే విషయాన్ని స్పష్టం చేశాడు రచయిత.

మధురాంతకం రాజారాం ఎంత గొప్ప కథకుడో తెలిసిన విషయమే. ఆయన రాసిన కథల్లో *సర్కసుడేరా, నమ్మరాని వాడు, బ్రతుకుబాట, దాగుడుమూతలు, గాలిపటాలు గాజుదీపాలు* అనేవి స్త్రీ సమస్యలకు అద్దం పట్టాయి. *గాలిపటాలు గాజు దీపాలు* అనే కథలో భర్త తనతో అన్యోన్యంగా ఉండక పోయినా భర్త వేరేవాళ్ళను పెళ్లి చేసుకోవడమనే ఊహను కూడా భరించలేని స్త్రీ మనస్తత్వాన్ని కళ్ళకు కట్టించారు.

ఇలా రచయితలతోపాటు రచయిత్రులు కూడా స్త్రీని ఎన్నో కోణాల్లో తమ కథల్లో స్పృశించినవారున్నారు. యద్దనపూడి సులోచనారాణి, మాదిరెడ్డి సులోచన లాంటివారు ఎక్కువగా ధనిక వర్గానికి చెందిన స్త్రీ సమస్యలను చిత్రించారు. వాసిరెడ్డి సీతాదేవి, కె. రామలక్ష్మి, లత, తురగా జానకీరాణి, కోడూరి కౌసల్యాదేవి లాంటివారు అప్పటి సమాజంలోని స్త్రీ పురుష సంబంధాలు, భార్యాభర్తల మధ్య వచ్చే సమస్యలను చిత్రిం చారు. వీరందరూ ఎక్కువగా ఆనాటి స్త్రీ సంప్రదాయాలు, ఆచారాల మధ్య ఏవిధంగా నలిగిపోయింది, ఆ చట్రం నుండి బయటకు రాలేక, అలా అని సర్దుకుపోలేక పడ్డ అగచాట్లను చిత్రించారు.

సి. ఆనందారామంగారు రాసిన కథల్లో స్త్రీవాద ఛాయలు కనిపిస్తాయి. ఆవిడ రాసిన *దశావతారాలు* కథలో ప్రతి స్త్రీ తన భర్త సంస్కారవంతుడై ఉండాలి అనుకుంటుంది కానీ అది పెళ్ళైన మొదటిరోజే అది నిజం కాదనీ, మగాళ్ళు సంస్కారానికి విలువ నివ్వరని తెలిపే ప్రయత్నం చేశారు రచయిత్రి. ఈవిడే రాసిన *నువ్వు మాట్లాడేదేమిటి?* కథలో మాలతిని ఆడబిడ్డలిద్దరూ సూటిపోటి మాటలతో బాధిస్తుంటారు. భర్త మాలతి మాటలకు ఏ మాత్రం విలువ ఇవ్వకపోవడంతో ఆమె మంచుబొమ్మ అయి పోయింది.

ఇంకా ఆనందారామంగారు రాసిన *అందం, మరోకొత్త కథ, ఎంత పని జరిగింది, మాలాగా మారిపోవద్దు, సుదూరంలో వున్న శుభోదయం, మూర్ఖత్వమే వరమా?, న్యాయసూత్రం, విశ్వగీతి, విలువలు, పవిత్రమైన పెళ్లి* లాంటి తదితర కథల్లో స్త్రీని పలు కోణాల్లో స్పృశించారు.

డి. కామేశ్వరిగారు ఆధునిక స్త్రీ అనుభవించే మానసిక, శారీరక కష్టాలను చిత్రించారు. వీరి కథల్లో స్త్రీ ఇల్లాలిగా, తల్లిగా, చెల్లిగా, కోడలిగా, ఉద్యోగిగా ఎన్నో కోణాల్లో దర్శనమిస్తుంది. కార్యేషుమంత్రి పరాయి స్త్రీ వ్యామోహంలో పడ్డ భర్తను సరైన తోవకు తెచ్చిన భార్య కథ. చదువు లేకపోయినా, సంస్కారంతో సుమతి భర్తకు గుణపాఠం చెప్పేవిధానాన్ని కామేశ్వరిగారు వర్ణించారు. ఇంకా ఈవిడ కథలు *వంకర గీతలు, తాగితేవట్టు, దూరపుకొండలు, ది గేమ్, విపర్యాయాలు, ఇది జీవితం, కలియుగ సీత* లాంటి కథల్లో స్త్రీ జీవిత చిత్రణ కనిపిస్తుంది.

తమిరిశ జానకి రాసిన *వానలో మంట* కథలో వివాహ వ్యవస్థలో ఉన్న బాధ్యతలను చిత్రించడం కనిపిస్తుంది. పురుషుని వలె అంత సులభంగా స్త్రీ ఏ బంధాన్ని అంత సులభం గా తెంచుకోలేదని ఈ కథ ద్వారా తెలిపింది రచయిత్రి. ఇంకా *కీచురాళ్ళు, చుక్క, మనసుకీ మనసుకీ మధ్య, రాక్షసుడు, రాచపుండు* తదితర కథలు స్త్రీని కేంద్రీకృతం చేసుకొని రాసినవే.

అయితే పైన పేర్కొన్న కథలన్నీ స్త్రీవాద దృక్పథంతో రాసినవి కావు. స్త్రీవాదం బలపడక ముందు వచ్చినవి. అయితే స్త్రీవాదానికి ఒక సైద్ధాంతిక భూమికను ఏర్పరచిన కథలుగా వీటిని చెప్పవచ్చు. వీటిని స్త్రీవాద కథలు అనేకంటే స్త్రీలను కేంద్రీకృతం చేసికొని రాసిన కథలని చెప్పవచ్చు. గురజాడ మొదలు స్త్రీవాదం మొదలయ్యే వరకు అనేకమంది రచయితలు, రచయిత్రులు స్త్రీల సమస్యలను వారి కథల్లో చిత్రీకరించారు.

### స్త్రీవాద కథలు

సాంస్కృతికంగా, సామాజికంగా, సాహిత్యపరంగానూ వున్న పురుష స్వామ్యపు భావజాలం పోవాలని ఉద్యమిస్తూ సాగే సిద్ధాంతమే స్త్రీవాదం. ఈ నేపథ్యంలోనే వచ్చింది స్త్రీవాద సాహిత్యం. ఎక్కడ అయితే అణచివేత ఉంటుందో అక్కడ తిరుగుబాటు మొదలౌతుంది. అయితే స్త్రీవాదం మొదట కవితల్లో ప్రతిఫలించింది. ఆ తర్వాతే కథ, నవల రూపంలో వెలువడింది.

స్త్రీవాద సాహిత్యం తెలుగులో 1980లో ప్రారంభమై 85 నాటికి ఓ స్పష్టమైన రూపాన్ని పొందింది. ఈ నేపథ్యానికి అంత ర్జాతీయ స్త్రీవాద భావజాలం తోడైతే, తెలుగులో చలం, రంగ నాయకమ్మ రచనలు మరింత బలమైన పునాదులు వేశాయి. రంగనాయకమ్మ రాసిన కథలు పార్వతమ్మ, నన్నర్థం చేసుకోరూ, పెళ్ళానికి ప్రేమలేఖ, అన్నలు, ప్రేమ ప్రేమను ప్రేమిస్తుంది, తదితర కథల్లో స్త్రీ సమస్యల్ని చాలా విపులంగా చర్చించారు.

అయితే పూర్తి స్త్రీవాద భావజాలంతో వచ్చిన మల్లాది సుబ్బమ్మ *మాతృత్వానికి మరోముడి*, ఓల్గా *రాజకీయ కథలు*, పి. సత్యవతి *ఇల్లలకగానే* అనే కథా సంపుటాలు, సంకలనాలు స్త్రీ అస్తిత్వాన్ని, స్త్రీ ఉనికిని ప్రపంచానికి తెలియజేశాయి. పురుషాధిక్య ప్రపంచంలో స్త్రీలు ఎదుర్కొంటున్న ఇబ్బందులనూ, అవమానాలనూ, హింసలనూ, కుట్రలను, కుతంత్రా లను కళ్ళకు కట్టినట్లు రాశారు మల్లాది సుబ్బమ్మ.

*చెలియలికట్ట, ప్రతీకార వాంఛ* అనే కథల ద్వారా కుటుం బంలో స్త్రీలపై జరిగే లైంగిక అణచివేతను తెలిపారు. ఇందులో పేదలు, నిస్సహాయులైన స్త్రీలు కామాంధులకు బలైన తీరును చిత్రించారు. *మాతృత్వానికి మరోముడి* కథ ద్వారా పిల్లలు పుట్టకపోతే ఆ స్త్రీని గొడ్రాలిగా ముద్ర వేస్తారు. ఆ లోపం మగాళ్ళదే అయినా స్త్రీకి శిక్ష పడే వైనాన్ని రచయిత్రి ఈ కథలో ఖండించారు.

స్త్రీవాద భావజాలాన్ని గట్టిగా వినిపించిన రచయిత్రి ఓల్గా. ఓల్గా తన *రాజకీయ కథల* ద్వారా స్త్రీవాదాన్ని బలంగా వినిపిం చారు. ఆడవాళ్ళు వేసుకునే ఒక్క జడ విషయంలోనే ఎన్ని నిబంధనలు, ఎన్ని నిర్బంధాలు పెడతారో *సీతజడ* అనే కథ ద్వారా తెలియజేశారు. ఓల్గా రాసిన *ఆర్తి* కథ స్త్రీ చైతన్యానికి గుర్తుగా లేదా అస్థిత్వకాంక్షను వ్యక్తీకరించేదిగా ఉంటుంది. ఈ కథలోని ప్రధాన ఇతివృత్తం, సీత తన జీవితంలో ఏ విధంగా అణచివేతకి గురైంది, ఆమె ఏవిధమైన మానసిక సంఘర్షణకు లోనైయిందో వివరిస్తుంది. ఇందులోని వస్తువు ఆధునిక స్త్రీవాద భావాలకు అద్దం పట్టింది. ఇంకా ఓల్గా రాసిన *నోర్మూయ్, ముక్కుపుడక* లాంటి కథలు స్త్రీ అస్తిత్వానికి అద్దం పట్టాయి.

అబ్బూరి ఛాయాదేవి కథలు ప్రధానంగా స్త్రీ సమస్యలను కేంద్రీకృతం చేసుకుని ఉంటాయి. ఈవిడ కథలు ముఖ్యంగా స్త్రీల వివాహం, ఉద్యోగం, తీరుబాటు, వృద్ధాప్యంలో కొడుకుల నిరాదరణ, వివాహం తర్వాత తల్లిదండ్రులతో సంబంధం, ఉ ద్యోగంలో ఎదుర్కొనే సాధకబాధకాలు, స్త్రీలను చూసే దృష్టి, స్త్రీస్వేచ్ఛ, నమ్మకం, ఋతుస్రావం, మానభంగాలు లాంటి స్త్రీ సమస్యల చుట్టూ తిరుగుతాయి. ఈవిడ రాసిన కథ *బోన్సాయ్ బతుకులు* కథలో స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం లేకపోతే ఆమె జీవితం ఎలా ఉంటుందో వివరించారు. బోన్సాయ్ పద్ధతిలో పెంచే మొక్కలు ఏవిధంగానైతే ఇతరులకు నీడనివ్వవో, ఆర్థిక స్వాతం త్ర్యంలేని స్త్రీల జీవితం అంతేనని చెప్పారు. *ఎదురు తిరిగిన నిజం, ఎవర్ని చేసుకోను, ప్రయాణం, ఉపగ్రహం* లాంటి తదితర కథలన్నీ స్త్రీ చుట్టే తిరుగుతాయి.

కొండేపూడి నిర్మల రాసిన కథ *అతని భార్య* స్త్రీ అస్తిత్వానికి సంబంధించింది. వివాహానంతరం స్త్రీజీవితం ఎలా ఉంటుందో వివరించే కథ ఇది. ఈ కథ ద్వారా పితృస్వామ్యవ్యవస్థ కుట్ర తెలుస్తుంది. ప్రతి పురుషుని విజయం వెనుక ఒక స్త్రీ ఉంటుంది అనే సత్య వాక్యాన్ని నిజం చేసిన కథ ఇది.

*ఆమె ఇల్లు* అనే కథను కవనశర్మ రాశారు. ప్రతి స్త్రీ ఎదు ర్కొనే సమస్యల్లో తనకంటూ సొంత ఇల్లు లేకపోవడం ఒకటి. ఈ కథ ద్వారా స్త్రీకి సొంత ఆస్తి ఉండాలని లేకపోతే జీవితంలో భర్త నిరాదరణకి గురైనప్పుడు సమస్యల్లో చిక్కుకోవాల్సి వస్తుం దని తెలియజేశారు.

పి. సత్యవతి రాసిన *ఇల్లలకగానే పండగౌనా* కథ స్త్రీ అస్తిత్వానికి సంబంధించిన మౌలిక ప్రశ్నల్ని రేకెత్తించింది. స్త్రీ

పుట్టింది మొదలు మరణించేంత వరకు తన పేరుకు ఎలాంటి గుర్తింపు ఉండదు. ఈ కథ ద్వారా స్త్రీ తన అస్తిత్వాన్ని ఎలా కోల్పోయిందో వివరించే ప్రయత్నం చేశారు రచయిత్రి. *కనకదుర్గ*, *తొలినిర్ణయం*, ముదిగంటి సుజాతరెడ్డి *మోక్షం*, *విసుర్రాయి*, కుప్పిలి పద్మ *యిన్‌స్టంట్ లైఫ్*, వారాల కృష్ణమూర్తి, *రచయిత పెళ్ళాం*, ఎస్. జయ *రెక్కలున్న పిల్ల*, రంగనాయకమ్మ *మురళీ వాళ్ళమ్మ*, ఇసుకపల్లి సుజాత *వ్యక్తిత్వం*, ఇంకా మరికొన్ని కథలు స్త్రీవాద దృక్పథాన్ని బలంగా కలిగి ఉన్నాయి.

***తెలంగాణ కథలు***

తెలంగాణలో మొట్టమొదటి కథా రచయిత్రి జె. వనాంబ. ఈవిడ రాసిన కథ *సుగుణా ఈ పొరపాటు నాదే* (1934), ఇందులో స్త్రీ ప్రేమ వ్యక్తమైంది. ఆ తర్వాత పి. యశదారెడ్డి *విచ్చిన తామరలు* (1951), కథలు వచ్చాయి. ఇంకా సరోజిని *తీరని బాధ* (1954) కథ వచ్చింది. ఈ మూడు కథల్లో స్త్రీ ప్రేమనే వర్ణితమైంది. ఈ కథల్లో స్త్రీని ఉత్తగనే అవమానించి, చంపడం, పశ్చాత్తాపం లాంటివి కనిపిస్తాయి.

ఆ తర్వాత ముదిగంటి సుజాతారెడ్డి 1990ల నుండి స్త్రీల కథలు రాస్తున్నారు. ఆవిడ *విసుర్రాయి* అనే కథల సంపుటిని వెలువరించారు. ఇందులో అన్ని కథలూ స్త్రీల జీవితాన్ని చిత్రించాయి. ఈ సంపుటిలోని కథ *స్వేచ్ఛ* కథలో రిటైరైన లెక్చరర్ సరోజ జీవితమంతా త్యాగం చేసి పెంచిన కొడుకు తల్లి ఆనందంగా ఉండడాన్ని సహించలేకపోతాడు. స్నేహలతాదేవి *లేఖ* కథలో స్త్రీలు ఒంటరిగా బతకగలిగే సమాజ అవకాశాల్ని తెలుపుతుంది. *మోక్షం* కథలో ఉద్యోగం చేసే భార్య భర్తతో పడే అవస్థలు చిత్రించబడ్డాయి. *జవాబుల్లేని ప్రశ్నలు* కథలో రాజకీయ పార్టీల, సంస్థల దృక్పథాల్లో మగ దృక్పథం పేరుకు పోయిన వైనం కళ్ళకుకట్టారు. ఇంకా *ధర్మపత్ని*, *కబ్జా*, *దోపిడీ* లాంటి కథల్లో స్త్రీవాదం బలంగా కనబడుతుంది.

తెలంగాణా కథా సాహిత్యంలో కూడా కొందరు స్త్రీ వాదులు ఉద్యోగం చేసే స్త్రీల బాధలను, మధ్యతరగతి స్త్రీల బాధలను చెప్పారు, కానీ దొరల కుటుంబంలోని స్త్రీల బాగోగుల గురించి పట్టించుకోలేదు. అయితే కాలువ మల్లయ్య, భూస్వాముల, దొరల ఇళ్ళలోని స్త్రీల గురించి *గలుమ*, *నిరీక్షణ*, *ఎదురుచూపు*, *మురికి*, *చిందొర్సాని* లాంటి కథల్లో వివరించారు. ఇందులో పూర్తిగా అట్టడుగువర్గానికి చెందిన వారిని కూడా చిత్రించారు.

*గలుమ* కథ భూస్వామ్య, దొరల స్త్రీలు అనుభవించే బాధల గురించి తెలుపుతుంది. దొరల కుటుంబంలోని స్త్రీలకు ఎలాంటి స్వాతంత్ర్యం లేదు. దొరసాని అయినా సామాన్య స్త్రీకి వలె ఎన్నో అగచాట్లు తప్పలేదని ఈ కథ ద్వారా రచయిత తెలియజేశారు. తెలంగాణా ప్రాంతంలోని బహుజన వర్గాలనే గాక భూస్వామ్య, ఉన్నత వర్గాలలోని, దొరల కుటుంబాలలోని స్త్రీలు కూడా వంచనకు గురయ్యారు.

ముదిగంటి సుజాతారెడ్డి అన్నట్లుగా తెలంగాణలో రాడికల్ ఫెమినిజమ్ రాలేదుగానీ స్త్రీస్వేచ్ఛ సమానతలు సమానావకాశాలను కోరుతూ, స్త్రీల వ్యధలను శ్రమదోపిడీని చిత్రిస్తూ సుజాతా రెడ్డి, గీతాంజలి, అనిశెట్టి రజిత లాంటి వారు కథలు రాశారు. ఇంకా తెలంగాణలో బీడికార్మికుల కథలు, నేతకార్మికుల కథలు, సింగరేణి కథలు స్త్రీకోణంలో చాలానే వెలువడ్డాయి.

***దళిత కథలు***

1925లో శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి రాసిన *పుల్లంపురాజు* కథలో తొలిసారిగా దళితుల జీవితచిత్రణ కనిపిస్తోంది. అయితే దళిత సంవేదనను, ఆవేదనను, పోరాట చైతన్యాన్ని వర్ణించిన తొలి దళిత కథ కొలకలూరి ఇనాక్ రాసిన *ఊరబావి*. ఈ కథలో మాల మాదిగలందరికీ నీటి సమస్యను తీర్చడానికి ఒక దళిత స్త్రీ చూపిన సాహసంలో ధైర్యం ఉందని చూపారు. భార్గవీరావు సంకలనం *ఇంకానా ఇకపై సాగవు*, కె. లక్ష్మీనారాయణ, ఆర్. చంద్రశేఖర్ రెడ్డి సంకలనంలో వచ్చిన *దళిత కథలు*, గోగు శ్యామల, జూపాక సుభద్ర సంపాదకత్వంలో వచ్చిన *నల్లరేగడి సాల్లు* అనే కథలు దళిత స్త్రీల జీవితాలను అద్దం పట్టాయి. *నల్లరేగడి సాల్లు* కథల్లో మాదిగ ఉపకుల స్త్రీల జీవితాల్లోని కొత్త కోణాలు అవిష్కృతమయ్యాయి. బోయ జంగయ్య రాసిన *పనిష్మెంట్* కథలో అగ్రకుల ఎమ్.ఎల్.ఏ స్త్రీ శీలాన్ని దోచుకోవడం వర్ణించాడు. శరత్ జ్యోత్స్నారాణిగారి *బొమ్మల పెళ్ళి*, *మెట్లు* అనే కథల్లో స్త్రీ సమస్యల్ని వ్యక్తీకరిం చారు. డా॥ వి. చంద్రశేఖర్‌గారి *నలుపు*, సదానంద్ శారద, *ఉప్పు నీళ్ళు*, స్వామి హెచ్. సరస్వతి కథల్లో దళిత బాలికలు, స్త్రీలకు జరిగే అవమానాలు కళ్ళకు కట్టినట్లుంటాయి.

***మైనారిటీ కథలు***

మతమేదయినప్పటికీ అందులో స్త్రీపాత్ర నామమాత్రంగా ఉంటూ పురుషుని కన్నా తక్కువ స్థాయిని కలిగి ఉంటుంది. అయితే ఇంకా ఆధునిక ప్రభావం పడని ముస్లిం సమాజంలో స్త్రీల పరిస్థితి చాలా దైన్యంగా ఉంది. అయితే కొందరు ముస్లిం కథా రచయితలు ముస్లిం స్త్రీల జీవన నేపథ్యాలతో కథలు రాశారు.

ముస్లిం కథలు ప్రధానంగా బురఖా, తలాఖ్, ముతా, ఖులా పద్ధతి, ఉపాధి, సౌదీ వివాహం, ఆర్థిక సమస్యల చుట్టూ తిరుగుతాయి. తొలి తెలుగు ముస్లిం స్త్రీవాద కథ *వెధవ ఘోషా*. దీన్ని ఎస్.ఎమ్. అక్బర్ 1939లో రాశాడు. *వెధవ ఘోషా* కథ నేపథ్య వస్తువు బురఖా. సాంఘిక, మత, స్త్రీ ఆరోగ్య, పితృ స్వామ్యం కోణాల నుండి బురఖా వల్ల కలిగే దుష్పరిణామాలను రచయిత తెలియజేశాడు. *హరాం* అనే కథలో ఖాజా అనే వ్యక్తి బురఖా గురించి ఇలా అంటాడు. 'బురఖా ముస్లిం స్త్రీ శరీరాల్నే కాదు, వాళ్ళ కలల్నీ, రూపాన్నీ, వయసునీ ఒకటేంది వాళ్ళ అస్తిత్వాన్నే కంప్లీట్‌గా చెరిపేసి కాసింత పోగులేస్తుంది. బంధుత్వాలు బురఖాల ముందు ఓడిపోతాయి.' ఈ మాటలు అక్షరాల సత్యం.

ఇస్లాం సంప్రదాయంలో వివాహం, స్త్రీ, పురుషుల మధ్య ఒక ఒప్పందంలాంటిది అంతే. అయితే, ఈ వివాహాన్ని పురుషుడు తలాఖ్ ద్వారా, స్త్రీ ఖులా ద్వారా రద్దు చేసుకోవచ్చు. సత్యాగ్ని రాసిన *మతం* కథలో వరుసగా ముగ్గురు ఆడపిల్లల్ని కన్నందుకు భర్త తలాక్ చెప్తాడు. ఇంకా సలీం *తలాక్* కథలో, మరో కథ మెహర్‌లో ఈ సమస్యనే చెప్పాడు.

షాజహాన రాసిన *సిల్‌సిలా* కథ పేద ముస్లిం స్త్రీల దయ నీయమైన జీవితాలకు సజీవ చిత్రణ. ఈవిడే రాసిన మరో కథ *సండాస్.* ఇందులో ముస్లిం స్త్రీ పురుషుల్తో సమానంగా ఎంత దుర్భరమైన జీవితాన్ని గడుపుతుందో కళ్ళకు కట్టారు.

ఖదీర్ బాబు రాసిన *దర్గామిట్ట* కథలు, ముస్లింల జీవితా లకు దర్పణం పట్టాయి. ఇంకా రహ్మతుల్లా, నర్గీస్ కథ, సలీం, మంద, సత్యాగ్ని ముతా, సలీం ఆరో అల్లుడు, స్కైబాబా ఖిల్లా, ఎన్.ఎస్. ఖలందర్ పిల్లి మెడ *గంట*, గీతాంజలి కాలీ *బదరియా*, *దోఝక్, సబ్-సవేరా, జహనుమా*, ఇనయతుల్లా ఘోస్ లా, ఇబ్రహీం ఫతాస్ లాంటి తదితర కథలన్నీ ముస్లిం స్త్రీల దైన్యమైన స్థితిని ఎండగట్టాయి.

## కళింగాంధ్ర కథలు

సమాజం ఎన్ని మార్పులకు లోనైనప్పటికీ, స్త్రీల పట్ల సమాజానికున్న నైజం మాత్రం మారలేదు. అది ఏ మతంగానీ, ఏ ప్రాంతంగానీ అణచివేత అలాగే ఉంది. కళింగాంధ్ర కథల్లో బలివాడ కాంతారావు రాసిన *సృష్టి* కథలో వరలక్ష్మి సాంప్ర దాయాలను ఎదురించి పోరాడగల సమర్థవంతమైన స్త్రీగా, ఒక కుటుంబాన్ని ఆదుకునే స్త్రీగా కనిపిస్తుంది. స్త్రీజీవితంలో స్వతంత్రురాలిగా కన్పించడం ఈ కథలోని ప్రత్యేకత. స్త్రీ ఎదుర్కొంటున్న అరాచకత్వాన్ని తెలియజేస్తూ, స్త్రీ వాటిని ఏ విధంగా ఎదుర్కొందో తెలిపే కథ చుక్కమ్మ టీ కొట్టు.

## ప్రపంచీకరణ కథలు

ప్రపంచీకరణ ప్రభావం పడనటువంటి రంగంలేదు. అన్ని రంగాల్ని ప్రభావితం చేసింది. ప్రపంచీకరణ వల్ల సామాన్య జనుల జీవితాలు ఎలా అస్తవ్యస్తమయ్యాయో తెలుగు కథకులు చిత్రిం చారు. అయితే ప్రపంచీకరణ ప్రతిఫలనాలాలను చిత్రిం చడంలో వచనంలో కాస్త ఆలస్యంగానే వెలువడింది.

స్త్రీల మీద ప్రపంచీకరణ ప్రభావం ఎలా ఉందో కుప్పిలి పద్మ తన కథలు *యిన్‌స్టంట్ లైఫ్, ప్రకంపనం, సాలభంజిక, మంచుపూలవాన* లాంటి కథల్లో చిత్రించారు. ఓల్గా ఓ పెళ్ళి కథలో కూడా విశ్లేషించారు. అమెరికా సంబంధాల మాయలో పడి స్త్రీలు తమ జీవితాలను ఎలా నరకప్రాయం చేసుకుంటు న్నారో శరత్ జ్యోత్స్నారాణిగారు తన కథ బొమ్మల పెళ్లిలో చిత్రించారు. స్టేటస్ సింబల్ కోసం శరీరాన్ని లక్ష్యపెట్టక డబ్బు వ్యామోహంలో పడిన స్త్రీ పరిస్థితిని పి. సత్యవతి *సూపర్ మామ్ సింద్రోమ్* కథలో తెలిపారు. నల్లూరి రుక్మిణి *జీవన స్పర్శ* కథలో ఎయిడ్స్ వ్యాధికి గురైన వివాహితను గురించి వివరించారు. అబ్బూరి ఛాయాదేవి *అదొక సంస్కృతి* కథలో అమెరికా సంబం ధాలకు, ధన వ్యామోహాలకు చిక్కుకున్న స్త్రీ బతుకులను చిత్రీకరించారు.

## గిరిజన కథలు

గిరిజనుల గురించి మొట్టమొదట కథ రాసినవారు చింతా దీక్షితులు. ఈయన రాసిన *సుగాలీ కుటుంబం* కథలో అటవీ అధికారుల దౌర్జన్యానికి గురై ఒక సుగాలీ కుటుంబం ఎలా నిరాశ్రయమైందో తెలియజేశారు. వినోదిని రాసిన *బ్లాక్* కథలో లెట్రిన్లు కడిగే యానాది స్త్రీ జీవితాన్ని చాలా దైన్యంగా చిత్రిం చారు. ఇంకా యానాది స్త్రీల జీవితాలను పుప్పాల కృష్ణమూర్తి *ఒంటరి గుడిశలో*, జాతశ్రీ *అనివార్యం* కథలో చాలా ఆర్ద్రంగా చిత్రించారు.

జాతశ్రీ రాసిన మరో కథ *నల్లపూసలులో* ఆటవికుల్లో ఓలి ఆచారాలు, వాటి ఫలితంగా స్త్రీలు పడే కష్టాలను తెలిపారు. గోపి భాగ్యలక్ష్మి రాసిన *జంగుబాయి* కథలో మగవాడి చేతుల్లో అమా యకులైన ఆదివాసీ ఆడబిడ్డలు ఎలా మోసపోయారో తెలియ జేశారు. సాహు రాసిన *రక్తపింజరం* కథలో ఫారెస్టు సూపర్‌వైజర్ లను ఎదిరించే ధైర్యం లేక ఆకలితో, రాత్రి చలితో, భయంతో పనిలో మునిగి చివరికి పాముకాటు వల్ల మరణించిన గిరిజన స్త్రీ కథ అత్యంత దైన్యంగా వర్ణితమైంది. *కొండఫలం* కథ భూమి కోసం గిరిజన స్త్రీలను పెండ్లి చేసుకొని ఎలా మోసగిస్తారో తెలుపు తుంది. ఇంకా గిరిజన స్త్రీల జీవితాలను *అడవిలో వెన్నెల*, ఇప్ప పూలు లాంటి కథాసంకలనాలు అద్దం పట్టాయి.

## బహుజన కథలు

బహుజనులు నేడు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారు. అందులో బహుజన స్త్రీల గురించైతే చెప్పక్కర్లేదు. తెలుగులో బహుజనుల గురించి చిత్రిస్తూ కూడా చాలా కథలు వచ్చాయి. పి.వి. నరసింహారావు రాసిన గొల్ల రామవ్వ కథలో రామవ్వ తన మాటలతో రజాకార్లనే హడలగొట్టి పారిపోయేలా చేస్తుంది. ఉసుల్లు కథలో కె.వి. నరేందర్ లింగవ్వ, రాజవ్వ అనే చాకలి స్త్రీలను గురించి చిత్రించారు.

రామా చంద్రమౌళి రాసిన *అమ్మానాన్న* కథలో బీడి కార్మికుల జీవితాలను చిత్రించారు. సదానంద్ శారద *పందిరి మంచం* కథలో పనిమనిషిని బలవంతం చేసే పన్నాగాలను, వాటిని వ్యక్తిత్వంతో వమ్ముచేసి ఉన్నతంగా నిలిచిన స్త్రీని ఉ దాత్తంగా చిత్రీకరించారు. ఐతా చంద్రయ్య రాసిన *కలికి గాంధారి, విశారద* కథల్లో జోగినీవ్యవస్థను, మహిళల దయ నీయ జీవితాన్ని పేర్కొన్నారు. గూడ అంజయ్య రాసిన అమ్మక్క కథలో హోటల్లో పాలు అమ్మే అమ్మక్క అను లైంగికంగా వేధించే సంఘటనలను, మగదిక్కులేని స్త్రీలు ఎదుర్కొనే ప్రత్యేక సమస్యలను చిత్రీక రించారు.

## రాయలసీమ కథలు

రాయలసీమ కథల్లో స్త్రీవాద భావాలు అంతగా కనిపించవు. అక్కడ రాడికల్ ఫెమినిజమ్ రాలేదు. రాయలసీమ కథ అంటే కరువు చిత్రణ, భూమి సమస్యలు, ముఠాకక్షలు లాంటి సమస్యలు కనిపిస్తాయి. అయితే ఈ కథల్లోనే స్త్రీకోణం లోంచి పాత్ర చిత్రణలు ఉన్నాయి.

చక్రవేణు రాసిన కువైట్ సావిత్రమ్మ కథలో కరువు అనే భర్త లేని జీవితాన్ని, ఆమె ఎడల సమాజపు విధానాన్ని చిత్రించింది. భర్త చనిపోయి పిల్లలకు, తనకూ తిండిలేని స్థితిలో మానాన్ని అమ్ముకున్నందుకు వెలివేసిన సమాజం, డబ్బుకే విలువ ఉందని తెలుసుకుని పనిమనిషిగా కువైట్ వెళ్ళి ధన వంతురాలై వచ్చిన అదే సావిత్రమ్మను అదే సమాజం గౌరవంగా చూడటం ఎంత వింత ఇదే మన లోకనీతి అని తెలుపుతుంది ఈ కథ.

వి.ఆర్. రాసాని చింతచెట్టు కథలో రాయలసీమలో స్త్రీలు నీళ్ళకోసం ఎన్ని అగచాట్లు పడతారో చిత్రించారు. పి. రామ కృష్ణారెడ్డి రాసిన పూజ కథలో కష్టసుఖాల్లో పాలు పంచుకునే పశువుని పూజించే స్త్రీ కరువు కారణంగా పూజించిన ఆవును కోతకు అమ్ముకోవలసి వస్తే మానసికంగా ఆ స్త్రీ పడిన వేదనను వర్ణనాతీతంగా చిత్రించారు. ముఠాకక్షలలో భర్త చనిపోతే భార్య క్షోభించవలసిందిపోయి, 'ప్రత్యర్థి వర్గాన్ని నాశనం చేసేదాక నా పసుపు కుంకాల తీసేదిలేదని' శపథం చేసే స్త్రీలు సీమకథల్లో కనిపిస్తారు. వ్యక్తి తన ఆధిపత్యాన్ని నిలుపుకోవడానికై స్వంత కూతురి కాపురాన్ని కూల్చిన వైనాన్ని ఇసుక కథలో చూడవచ్చు. ఊరిలో ఆధిపత్యవర్గాల మధ్య నడిచే రాజకీయానికి ఆడ వ్యవహారం లేదా ఆడమనిషిని ముఠా నాయకులు ఎలా ఉపయోగించుకుంటారో సజీవంగా చిత్రించిన కథ ఇది. *



ప్రొ॥ శరత్ జ్యోత్స్నారాణి కాకినాడలో పుట్టి, నాగార్జున విశ్వవిద్యాలయంలో తెలుగులో ఎం.ఎ. చేశారు. ఉస్మానియా యూనివర్శిటీ నుండి పిహెచ్.డి. తీసుకున్నారు. కథలు, కవిత్వము, వ్యాసాలు- ఇలా వీరి కృషి బహుముఖాలుగా విస్తరించింది. అక్షర వసంతం మొదలైన ఆరు కవితాసంపుటాలు, రెండు కథాసంపుటాలతో సహా ఇరవై గ్రంథాలు ప్రచురించారు. ప్రస్తుతం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలోని ప్రాచీన తెలుగు అధ్యయన కేంద్రానికి కో-ఆర్డినేటర్. అనేక పురస్కారాలు పొందారు.

*This souvenir is designed by*

అక్షర క్రియేటర్స్

*AG-2, Mathrusri Apts., Hyderguda,*
*Hyderabad - 500 029.*
*Phone: 040 2324 4088*
*email: sakshara@gmail.com*



# 11వ శతాబ్దానికి పూర్వం తెలుగు భాషా సాహిత్యాలు

ఆచార్య షేక్ మస్తాన్

ధర్మతత్వజ్ఞులు ధర్మశాస్త్రంబని
        యధ్యాత్మ విదులు వేదాంతమనియు
నీతి విచక్షుణుల్ నీతి శాస్త్రంబని
        కవివృషభులు మహాకావ్యమనియు
లాక్షణికులు సర్వలక్ష్య సంగ్రహమని
        యైతిహాసికు లితహాసమనియు
పరమపౌరాణికుల్ బహుపురాణసముచ్ఛ
        యంబని మహిగొనియాడు చుండ

వివిధవేదతత్త్వవేది వేదవ్యాసు
డాదిముని పరాశరాత్మజుండు
విష్ణుసన్నిభుండు విశ్వజనీనమై
పరగుచుండ జేసి భారంతంబు

అని ఆదికవి, నన్నయ మహాభారత వైశిష్ట్యాన్ని తెలిపాడు. అంతటి మహోన్నత గ్రంథ రచన నన్నయ 11వ శ.లో రచించి తెలుగు ప్రజా బాహుళ్యానికి మహోపకారం చేశాడన్నది సకలజన విధితం. ఇంతటి ఉన్నతమైన, ఉత్కృష్టమైన గ్రంథరచనతో తెలుగు సాహిత్యచరిత్ర ఆరంభమయింది. అలాగని ఆంధ్ర మహాభారత రచనకు పూర్వం తెలుగు సాహిత్యం లేదని చెప్పలేము. క్రమబద్ధమైన గ్రంథ రూపంలో అలభ్యం. తెలుగు సాహిత్య 11 వ.శ.పూర్వం అంతో ఇంతో ఎంతో కొంత ఉండి ఉంటుందన్నది సత్యదూరం కాదు. ఆ విశేషాలను తెలియ చేయడమే ప్రకృత వ్యాస రచనోద్దేశం.

శాతవాహనులు (క్రీ.పూ.225 - క్రీ.శ.225) ఆంధ్రదేశాన్ని పరిపాలించిన మొదటి రాజన్యులు. ఆకాలంలో ప్రాకృత భాష రాజభాష కాగా, సంస్కృత భాష విద్వాంసులకే పరిమితమై తెలుగుభాష ప్రజాభాషగా వర్ధిల్లింది. క్రీ.శ.1 వ.శ. నాటి గుణాఢ్యుని బృహత్కథ, హాలుని గాథాసప్తశతి శాతవాహనుల కాలం నాటి ప్రాకృత గ్రంథాలు, గాథాసప్తశతి గ్రంథంలో అత్త, అమ్మి, పాడి (పడ్డ), పోట్టం (పొట్ట), కరణి (విధం), ఫలహి (ప్రత్తి) ఇత్యాది తెలుగు దేశ్య పదాలున్నట్లుగా భాషా పరిశోధకులు తెలిపారు. ఈ విషయంలోను అభిప్రాయభేదాలు లేకపోలేదు.

క్రీ.శ.1 వ.శ. నుండి తెలుగు భాష ఉన్నదని నిరూపించ డానికి శాసనాలు మాత్రమే. భగవంతుడికో, దేవాలయానికో, బ్రాహ్మణులకో, మతాచార్యులకో బహూకరించిన దానధర్మాలను ప్రస్తావించడానికి, వీరుల పరాక్రమాలను శ్లాఘించడానికి శాసనాలు లిఖించబడ్డాయి.

మొట్టమొదటి తెలుగుపదం 'నాగబు'. ఈ పదం క్రీ.శ.1 వ.శ.నాటి అమరావతి శిలాశాసనంలో ఉపలబ్ధం. ఈ 'నాగబు' పదమే శాసనాలలో లభించిన తొలిపదంగా పలువురు పండితులు అంగీకరించారు. కాని ఈ మధ్యకాలంలో ఎ.బి.కె. ప్రసాద్‌గారు క్రీ.పూ. 2 వ.శ.లోని విశాఖ జిల్లాలో ఎలమంచిలికి సమీపంలో

ఉన్న కొత్తూరులో లభించిన ప్రాకృత శాసనంలో 'తంబయ్య దానం' అనే తెలుగుమాట ఉన్నటు తెలియజేశారు. భాషా శాస్త్రవేత్తలు శోధించవలసిన విషయం.

రెండో శతాబ్దంనాటి వాసిష్ఠీపుత్ర పులోమావి జంగిలి గుండు శాసనంలో 'కుమారదతసగామే వేపురకే వథవేన... తళాకమ్ ఖానితమ్' అని ఉంది. అనగా కుమారదత్తుని వేపుర గ్రామంలో తటాకం త్రవ్వబడిందని అర్థం. వేపుర అనగా వేపూరు. ఇది తెలుగుపదంగా నిర్ధారించారు.

మూడో శతాబ్దం నుంచి ఆరవ శతాబ్దం వరకు లిఖించిన ప్రాకృత, సంస్కృత శాసనాలలో వేపూరు, తాన్టికొన్ద, చెంచెఱువు, కువాడ, విఱిపర, కుడూర, చిల్లరెక, కొండుకలాంటి గ్రామ నామాలు, గొల, కొట్ట, అతుక, కొట్టి లాంటి వ్యక్తినామాలు తెలుగు పదాలు. క్రీ.శ. 575-600 కాలం నాటి ధనుంజయుని కలమళ్ళశాసనం, ఎర్రగుడిపాడు శాసనం తెలుగులో లిఖించిన శాసనాలు.

### ఎర్రగుడిపాడు శాసనం

"స్వస్తి శ్రీ ఎరికల్ ముత్తురాజుల్ల కుణ్డి కాళ్ళు(ని) వఱుకాను ఇచ్చిన పన్నస. దుజయరాజుల ముత్తు రాజులు నవప్రియ ముత్తురాజులును వల్లవదుక రాజులు సక్షికాను ఇచ్చి(న) పన్నస కొట్టం బునపాఱక కుణ్డికాళ్ళు ఇచ్చిన పన్నస ఇరువదియాది నాల్కు మఱున్తుఋ నేల." అనగా దుజయ రాజుల ముత్తు రాజు, నవప్రియ ముత్తురాజు, పల్లవదుకరాజు (యువరాజు) ల సాక్షిగా ఎరికల్‌ముత్తు రాజు కుండికాలు(గారి) కు ఇరవైనాలుగు మరున్తుర్లు (భూమి కొలత) నేలను పన్ను లేని భూమిగా దానం ఇచ్చినది అని అర్థం.

### కలమళ్ల శాసనం

'...కల్ము (తు) రాజు ధనుంజయుఱ రేనాణ్డు ఏళనే చిఋమ్బూరి రేవణకాలు(పం) పుచెనూరు కాజు అతికశా(ఊ) రిణ్డవారు ఊరి. ...పఞ్చమహాపాతకసకు-' ఈ శాసనం 'ధనంజయుని కలమళ్ళ శాసనం ఎరికల్లు నేలే ముత్తురాజు ధనంజయుండు రేనాడును ఏలుచుండగా చిరంబూరుకు చెందిన రేవణకాలు అనే వ్యక్తి పంపున చెనూరి గ్రామాని చెందిన రాజు..." అనే వాక్యంతో అసంపూర్ణంగా ఉంది. చివరిలో పంచమహాపాతకుడగునని, ఈ ధర్మాన్ని చెడగొట్టే వారికి పాపం చెప్పబడినట్లుగా మిగిలిన అక్షరాలనుబట్టి తెలుస్తుంది.

ఈ విధంగా ఆరవ శతాబ్దం నుంచి తొమ్మిదో శతాబ్దం వరకు రేనాటి చోళులు, తూర్పు చాళుక్యులు మరియు తది తరులు వేయించిన శాసనాలు వచనంలో దర్శనమిస్తుంటాయి.

క్రీ.శ. 6 నుంచి 8 వరకు శాసనాలు తెలుగు గద్యంలో రచించినప్పటికి కొన్ని గద్యపద్యాత్మకమైన చంపూరచనలు కూడ ఉన్నట్లు గోచరమవుతుంది. పొట్లదుర్తి మాలెపాడు శాసనం (క్రీ.శ. 610)లో గద్యపద్యాత్మక రచన కన్పిస్తుంది. ఈ శాసనంలో "అణ పోతులు రేవణకాలు పుద్ధణకాలు ఇచ్చిన పన్నస పెన్బాటె ఇశెరే నికిన్" అనే పంక్తులలో 'ద్విరదగతి రగడ' లక్షణం గర్భితమై ఉన్నట్లుగా దేవరపల్లి వేంకట కృష్ణా రెడ్డిగారు తెలియజేశారు. కాని ఈ శాసనం గేయపద్ధతిలో రచించినట్లుగా టేకుమళ్ళ కామేశ్వర రావుగారి అభిప్రాయం. దొంగలసాని శాసనంలో 'మహాక్కర' రచన ఉన్నట్లుగా ముట్నూరి వెంకట రామయ్య గారి ఊహ. పైన ఉదాహరించిన శాసనాలాధారంగా శాసనాలలో గేయరచన చోటు చేసుకున్నట్లుగా భావించవచ్చు.

అయితే సలక్షణమైన ఛందోబద్ధమైన శాసనాలు తూర్పు చాళుక్యులైన గుణగ విజయాదిత్యుని సేనాని పండరగని అద్దంకి శాసనం (క్రీ.శ. 848) అభించిన శాసనాలలో ఒకటి. ఈ శాసన రచనలో ఒక తరువోజపద్యంతో పాటు నాలుగు పంక్తుల గద్యం కూడ ఉన్నది.

*పట్టంబుగట్టిన ప్రథమంబునేడు బలరవం*
*బొప్పగ బైలేచిసేన*
*పట్టంబుగట్టించి ప్రభు బండరంగు, భండనసమ*
*యుక్తు పదువతో బోయ*
*కొట్టముల్ పండ్రేండు (గొని) వేంగినాటి గొర్బి యద్రి*
*భువనామ్ శబాణనిల్పి*
*కట్టెపుదుర్గంబు కడుబయల్సేసి కన్దు కూర్బెజవాడ*
*గా పాచె మెచ్చి*

వచనం: "పాడరంగు పరమ మహేశ్వరుణ్డు ఆదిద్యభాట్టారనికి ఇచ్చిన ఎనుబది పుట్ల ఆడ్లపట్టునేల ధమ్మ పురంబున ధమ్ముపులు (వీని) రక్షించిన వారికి అశ్వమేథంబున ఫలంబు అగు" ఈ శాసనంలోని తరువోజ పద్యాన్ని బట్టి గుణగ విజయాదిత్యుడే ఆంధ్రభాషా పోషకులలో ఆద్యుడుగా భావించవచ్చు.

పండరంగని విజయపరంపరను వెలుగు జేసే క్రీ.శ. 848-49 నాటి కందుకూరు శాసనం కూడా పద్యశాసనమే. ఈ శాసనంలో సీసపద్యం ఉన్నట్లుగా కొమఋాజు లక్ష్మణరావుగారు గుర్తించారు.

*శ్రీనిరవ ద్యుండు చిత్తజాత సముండు శివపదవర*
*రాజ్య సేవితుండ*
*ఒకిలుడు నన్నృతరిపు బలుడు నాహవరావ దండ*
*మొద్యసి ఘాస నుండగణిత*
*దానమాన్యుండు దయా నిలయుండును భండన*
*సండన పండరంగు*
*...కోలడిలేని కొట్టము ల్వోడి చిగుణకనల్ల*
*...విభవ గొరవేంద్ర*

గుణగ విజయాదిత్యుని సోదరుడు విక్రమాదిత్యుని కుమారుడు చాళుక్య భీమరాజు ధర్మవరం శాసనం (క్రీ.శ. 897) లో సయితం సీసపద్య రచన కన్పిస్తుంది.

...నరరామ విబుతోడ నెడఱీన బోయల
నడలి జొన్పె
లో హసనం బెక్కిరాహనునొడిచిన వల్లభుకోల్వున
వెల్లనెఱుగ
కన్నారా భూపతి నెన్నాజిలీ జూచె సంకిలాండను ఉేని
ఖింకముడిచె
దండు ఖైవల్చిన బెండైన చోడని చేకొని కాచె భూలోక
మెఱుగ
కిరణపురము డహల నిరుతంబు దఱీనాడు
నచల పురము సొచ్చెన చలితుం
వల్లభుండు గుణక నల్లుండు పంచిన పండరంగు చూరె
పండరంగు

ఈ సీసపద్యానికి ముందు వెనుకలలో వచన భాగం కూడ కలదు.

పై శాసనం తర్వాత పద్యమయమైన శాసనం యుద్ధ ముల్లుని బెజవాడ శాసనం. తాత మనుమలైన ఇద్దరు యుద్ధ మల్లులు వ్రాయించిన రెండు శాసనాలుగా పరిశోధకులు నిర్ణయించారు. మొదటి శాసనం క్రీ.శ. 885 ప్రాంతంలోను, రెండోది క్రీ.శ. 930 ప్రాంతంలో వేయించినట్లుగా నిర్ణయించారు.

ఈ యుద్ధమల్లుడి బెజవాడ శాసనంలో ఐదు ముధ్యా క్కర పద్యాలతో పాటు వచన రచన కూడా లభ్యం.

1. స్వస్తినృపాంకు శాత్యంత వత్సల సత్యత్రినేత్ర
విస్తరశ్రీయుద్ధమల్లడనవద్య విఖ్యాత కీర్తి
ప్రస్తుత రాజాశ్రముండు త్రిభువ నాభఙుండు సకల
వస్తుసమేతండు రాజు సల్కి భూవల్లభుండర్థి
2. పరగంగ బెజవాడ గొమరు సామికి భక్తుడై గుడియు
నిరుపమ మతి నృపథాముడెత్తించె నెగిదీర్చి మఠము
గొరగల్గా కొరులిందు ఎడిపి బృందంబుగొనియుండు వాడ
పరిగానయవ్వారణాసి వ్రచ్చిన పాపంబుగొంద్రు
3. వెలయంగ నియ్యోట్టు డస్పిమలినురై విడిసిన బ్రోల
గల తనపతులును రాజు పట్టంబుగట్టిన పతియు
సలియపై వారల వెల్వరించిన నశ్వమేథంబు
ఫలమపేక్షించిన లింగ మడిసిన పాపంబు దమకు
4. జననుత చేబ్రోల నుండి బెడవాడ జాత్రకువచ్చి
త్రినయన సుతుడుండు సోటుమోర్చక తివిరి యిన్నెలవ
యనఘుండు సేకొని యిందు ప్రత్యక్షమైయున్న నిచ్చ
గని మల్లడెత్తించె గుడియు మఠమును గార్తికేయునకు
5. రమనతో బెజవాడ బెడంగును రక్షయుంగాను
స్థమతాత మల్లపరాజు వేఱెఱు దానుంగట్టించె
గ్రమబున దానిక కంశ బిడ్డట్లుగా మొగమూడు క్రో.శ్రీ
వమరంగ శ్రీయుద్ధమల్లుణ్దెత్తించె నమిత తేజుండు

క్రీ.శ. 9 శ. శాసనాలలో పద్యాలు జాతులు, ఉపజాతుల కోవకు చెందినవిగా ఉన్నాయి. క్రీ.శ. 848 నాటి సాతులూరు శాసనంలో ఒక చంపకమాల పద్యం లభ్యం.

అరి నృపవాజివారణ పదాతి మహోభ్రవిరామ మారుత:
వరకరికార సుస్థితసి భాప్రవినాశిత భాను సన్నిభ:
గురుతర దన భాగవత మనసమానిత కల్పపాదప:
వరి కరిగల్ల భూమిపభుజాసి రిహాజిభువి ప్రసాదితే

పై పద్య సంస్కృతంలో ఉన్నప్పటికి పద్యనాలుగు పాదాలలో ప్రాస పాటించబడింది. రెండు పాదాలలోనే యతి పాటించబడింది. ఈ యతిప్రాసల ప్రయోగాన్ని బట్టి అప్పటికే తెలుగు ఛందస్సులక్షణ సమన్విత మైన సంస్కృత వృత్తములను తెలుగులోనికి తెచ్చుకొనే ప్రయత్నం జరుగుతుండేదని భావించవచ్చు. క్రీ.శ1000 నాటి విరియాల కామసాని గూడూరు శాసనంలో మూడు చంపకమాలలు, రెండు ఉత్పలమాల పద్యాలున్నాయి. ఈ పద్యాలు నన్నయ పద్యాలను తలపిస్తా యని భావం పరిశీలకులలో ఉంది. మచ్చుకు.

చ. అనుపమ దుర్జయాన్వ యసుధాబ్ధిననేకులు
రాజనందనుల్
ననిన బొరంటి వెన్నడను సంభవుడయ్యెనతి ప్రసిద్ధుడై
వినుత విరోధి మండలికి వెన్నను వెన్నడువోలె వానికిన్
ఘనుడగు నెఱ్ఱ భూపతి జగద్వితుండాదయించె
గీర్తింతోన్

ఉ. కాలత్రి కాలుడై పడసె కాడయనాయకుజంపి సురడ
వ్వేలుపు గొండరవ్వ నృపువేలుపుగొండన నిల్చి వానిచే
మేలుగ మూడు ముప్పయిని మేలుగ నేరెడుబోదిపాడు
నుం
మేలుగ టేకు మావిడులు మేలుగ రెండయరాజు సంగ డై

పై పద్యాలు సంస్కృత వృత్తాల ఛాయలను సంతరించు కొన్న తెలుగు వృత్తాలు.

11 వ.శ. పూర్వం తెలుగులో దేశికవిత్వం ఉనికికి శాసనాల లోని తెలుగు పద్యాలే సాక్ష్యం. 11 వ.శ. పూర్వం శాసనాలు వ్యక్తులు వీరవిజయాలతో పాటు దానధర్మాలను వెలుగు చేసేవి మాత్రమే. శాసనాలలోని రచన విషయ ప్రదానమేకాని కవిత ప్రధానం కాదు. అయితే 9 వ.శ. నాటి చాళుక్య భీముడే కొరవి శాసనంలోని గద్యం, క్రీ.శ. 10 వ.శ. నాటి విరియాల కామసాని గూడూరు శాసనంలోని పద్యాలు పరికిస్తే 11 వ. శ. కాలానికి ముందున్న తెలుగు కవిత రూపు రేఖలు తెలుస్తాయి. ఈ గద్య పద్య రచనలాధారంగా 11వ శ.పూర్వం గ్రంథ రచన జరిగి ఉంటుందని నిర్ణయించవచ్చు.

### దేశికవిత

ఏ భాషలోనైనా జానపద సాహిత్యం మొదట జన్మ నిస్తుంది. జానపదసాహిత్యం మౌఖిక రూపంలోనే ఉంటుంది. పాటలు,

పదాలు ప్రజల జిహ్వాగ్రహాలపై జీవిస్తుంటాయి. 11 వ.శ. పూర్వ జానపద గేయాలున్నట్లుగా తెలుస్తుంది. ఊయల పాటలు, తుమ్మెదపదాలు, గొబ్బిపదాలు ఉన్నట్లుగా తెలుస్తుంది. నన్నయ భారతంలో 'నాగీ' గీతాలు పేర్కొన్నాడు. నన్నె చోడుడు తన 'కుమారసంభవం'లో ఊయల పాటలు, గౌడు గీతాలు దర్శన మిస్తుంటాయి. పాల్కురికి సోమన తుమ్మెద పదాలు, గొబ్బి పదాలు, వెన్నెల పదాలు, ఆనందగీతాలు పేర్కొన్నాడు. పదగేయ రూపమైన ఈ దేశికవితా ఉనికి నన్నయనాటికే ఉన్నట్లు తెలుస్తోంది.

నన్నయకు మందు అనగా 11వ.శ. ముందు మార్గపద్ధతికి చెందిన కవిత్వం కూడ ఉపలబ్ధం. నన్నెచోడుడు వాకృచ్చిన దానిని బట్టి పూర్వం మార్గకవిత్వం ఉండగా చాళుక్య రాజుల వల్ల దేశికవితకు ప్రోధి లభించిందని గ్రహించవచ్చు.

*మును మార్గకవిత లోకం*
*బున వెలయగ దేశికవిత బుట్టించి తెనుం*
*గున నిలిపి రంధ్ర విషయం*
*బున జన చాళుక్యరాజు మొదలుగ బలువుర్*

దీనిని బట్టి 11 వ.శ. పూర్వం తెలుగు కవిత్వం ఉన్నది. యతిప్రాసలతో కూడిన పద్యరచన సాగింది. పాటలు, పదాలు, రగడలు చోటు చేసుకున్నాయి. గద్యరచన మిక్కుటంగా సాగింది. అంతేకా కుండా 11 వ.శ. పూర్వం శ్రీపతి పండితుడు, అయ్యన భట్టు, చేతన భట్టు లాంటి శాసన కవులుండేవారు. పద్మకవి, సర్వదేవుడు తెలుగులో జైనమత రచనలు చేసినట్లు వెల్లడవుతుంది. *

*ప్రొ॥ షేక్ మస్తాన్ గుంటూరు జిల్లా ప్రత్తిపాడులో జన్మించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి ఎం.ఎ., నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి పిహెచ్.డి. చేశారు. తెలుగు సాహిత్యం-ముస్లిముల సేవ అనే విషయం పై వీరి పరిశోధన గ్రంథం ప్రశంసలు అందుకుంది. భాషాశాస్త్రంలోనూ ఎం.ఎ. చేశారు. దేశ విదేశాల్లోని అనేక సదస్సుల్లో తెలుగు భాష సాహిత్యం గురించి అనేక పత్రాలు సమర్పించారు. ప్రస్తుతం అలీఘడ్ ముస్లిం విశ్వవిద్యాలయంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ మోడరన్ ఇండియన్ లాంగ్వేజస్ - తెలుగు విభాగానికి ప్రొఫెసర్.*



***Photography by Sri Atluri***


Terra Fortune.com
Onestop Solution for your Real Estate Investment needs
Unlimited Property Search
Assisted Property Search Services
Legal Opinion in Real Estate Matters
Navyandhrapradesh Real Estate News, Trends & Updates
: +91 99590 21111
Phone : 040 - 4567 7777
+1 (551)-888-0099
Email : buy@terrafortune.com
www.terrafortune.com
Likes us on

Creating Wealth for all

# G&C Global Consortium

A Leading Real Estate Developer & Consultancy Firm of India



**A.V.R.Chowdary**
Founder Chairman

## RIGHT TIME TO INVEST IN INDIA'S GROWTH STORY

But, you need a reliable advisor to help you make safe and profitable investments in India.



Once you join the G&C family, you can kick back, relax and watch your family's wealth multiply!

### *3 Unique & Rare Investment Opportunities in India*

that are available ONLY to G&C patrons...

**High Monthly Income Asset**
**1st in India for 12% to 25% ROI p.a.**
Monthly Income of Rs.35,000 to Rs.90,000 on an investment of Rs.35 to 90 lakhs.

**Legally Guaranteed Returns**
**of 50% to 100% in 1.5 to 3 Years**
Buyback Offer for Legally Assured and Secured Capital Gains in 1.5 to 3 Years

**FREE Pre-EMI Scheme**
**Pay Only 20% & Nothing Else**
Pay just 20% of unit cost until project completion & earn 100% to 200% ROI.

G&C is your **ONE STOP SHOP** for all Real Estate Investments in India

- Average ROI of **100% to 300%** in 3 to 4 years time
- Home Loan Services + Taxation & Repatriation Services
- **No.1 in South India** & among the Top 3 in India in our field
- Extensive branch network of **14 offices** across India & abroad
- Developing close to **1000 Acres** in Bangalore & Andhra
- Relationship with over **750,000 patrons** across the globe
- Preferred partner of **top 5 to 10 builders** of all major cities
- **Rs.8000 crores** worth of deals facilitated in the last 11 years

**Jhashank Roy Chowdary** | M : +91 9900123737 | E : jhashank@gcglobal.in
**Divyendhu Roy Chowdary** | M : +91 9980319639 | E : adrc@gcglobal.in

**Our Branch Network** | Bangalore • Hyderabad • Chennai • Delhi • Mumbai • Pune • Cochin • Vizag • Vijayawada • Tirupati • Coimbatore • Hosur | USA • UK • Australia • Dubai • Singapore • Mauritius

www.gcglobal.in